సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 18
సంచిక: 120
సోమవారం 21-7-2025
SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు'


సెమీస్‌లో హంపి
చెస్ ప్రపంచకప్‌లో ముందంజ.. టైబ్రేక్‌లో హారిక, దివ్య 'ధీ' -12లో



చేతులు కాలతాయ్..
అన్నీ అనుకూలిస్తేనే అన్‌లిస్టెడ్ షేర్లలో లాభాలు.. తేడా వస్తే నష్టమే -13లో


22న అపాచీ హెలికాప్టర్ల రాక
అమెరికాకు చెందిన అపాచీ ఏహెచ్‌-64ఈ అటాక్ హెలికాప్టర్లు ఈ నెల 22న భారత సైన్యానికి అందనున్నాయి.
వివరాలు 6లో ▸



హెచ్‌-1బీకి కొలువుతో లింకు!
లాటరీ విధానానికి స్వస్తిపలికి ఉద్యోగి జీతం, హోదా, పొజిషన్ ఆధారంగా హెచ్‌-1బీ వీసాలు ఇవ్వాలని అమెరికా భావిస్తోంది.
వివరాలు 6లో ▸


మలేరియాకు దేశీయ టీకా
ప్రాణాంతక మలేరియాను అరికట్టడానికి భారత వైద్య పరిశోధన మండలి దేశీయ వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసింది.
వివరాలు 6లో ▸


అసెంబ్లీలో మంత్రి రమ్మీ ఆట
మహారాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి మాణిక్‌రావ్ అసెంబ్లీ సమావేశాల్లో ఫోన్‌లో రమ్మీ ఆడుతూ దొరికిపోయారు.
వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

మరో రెండు రోజులు వానలు



రాష్ట్రమంతటా మరో 2 రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే సూచనలున్నాయి. దక్షిణ కోస్తాలో అనేక చోట్ల భారీ వర్షాలు.. ఉత్తరాంధ్ర, రాయలసీమల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.
వివరాలు 14లో ▸

'కుబేర' తరహాలో టీడీపీ నేతల భారీ స్కామ్



టీడీపీ నేతలు, ఓ జర్నలిస్టు కలిసి గిరిజనులను అడ్డం పెట్టుకుని ప్రైవేటు బ్యాంకు నుంచి పెద్ద ఎత్తున రుణాలు తీసుకున్నారు. గిరిజనులను సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా చూపించి.. రూ.10.60 కోట్లు కాజేశారు. ఈ ఘటన నెల్లూరులో జరిగింది.
వివరాలు 5లో ▸

సాంకేతిక లోపంతో గాల్లో చక్కర్లు కొట్టిన విమానం



తిరుపతి విమానాశ్రయంలో 221 మంది ప్రయాణికులతో టేకాఫ్ అయిన ఇండిగో విమానం కొంతసేపటికే సాంకేతిక లోపంతో గాల్లో చక్కర్లు కొట్టింది. అధికారులు అప్రమత్తమై విమానాన్ని సురక్షితంగా తిరుపతి విమానాశ్రయంలో ల్యాండ్ చేశారు.
వివరాలు 14లో ▸

పక్కలోకి వస్తేనే సంతకం పెడతా!



రేషన్ కార్డులో పిల్లల పేర్లు నమోదు చేయాలని కోరిన ఓ వివాహితను వీఆర్వో లైంగిక వేధింపులకు గురిచేశాడు. తన కోరిక తీరిస్తేనే సంతకం పెడతానంటూ వేధించాడు. ఈ ఘటన పల్నాడు జిల్లా బెల్లంకొండ మండలంలో జరిగింది.
వివరాలు 10లో ▸

బాబు కుతంత్రం.. 'అప్రూవర్' తంత్రం

చార్జ్‌షీట్, రిమాండ్ నివేదికల సాక్షిగా మద్యం అక్రమ కేసులో కుట్ర బట్టబయలు

ఏ2 వాసుదేవరెడ్డి, ఏ3 సత్యప్రసాద్‌లను అప్రూవర్లుగా మార్చేందుకు కుట్ర

వారితో మరిన్ని అబద్ధపు వాంగ్మూలాల నమోదుకు పన్నాగం

- 'సిట్' కుట్ర ఫలించక అప్రూవర్ పిటిషన్లతో ఇద్దరూ తిరుగుముఖం
- అనంతరం ముందస్తు బెయిల్ పిటిషన్లు దాఖలు
- అభ్యంతరం చెప్పకుండా వారికి సహకరించేందుకు సిట్ సిద్ధం
- అసత్యాలు, వక్రీకరణలతోనే చార్జ్‌షీట్, రిమాండ్ నివేదిక
- నేరుగా ఒక్క సాక్ష్యం కూడా చూపకుండా మిథున్‌రెడ్డి అరెస్ట్
- సెల్ టవర్ లొకేషన్, కాల్ డేటాల వక్రీకరణ
- న్యాయస్థానాన్ని తప్పుదారి పట్టించే యత్నం

2లో



భయపెట్టి.. ప్రలోభపెట్టి.. మద్యం అక్రమ కేసులో తిమ్మినిబమ్మి చేసేందుకు కూటమి ప్రభుత్వం చేయని ప్రయత్నం లేదు. ఇంతా చేసి.. కోర్టుకు సమర్పించిన చార్జ్‌షీట్, రిమాండ్ రిపోర్ట్‌లో ఒక్క ఆధారమూ చూపలేదు. ఒకరిద్దరిని అప్రూవర్లుగా మార్చుకోవడమే తమ ముందున్న దారి అని చెప్పకనే చెప్పింది. ఫేక్ ఇన్వాయిస్‌లు అంటూ తనకు తానే స్వీయ ధ్రువీకరణ ఇచ్చుకుంది. ఫలానా సమయంలో ఫలానా సెల్ టవర్ పరిధిలో ఉండటమే ఆధారమని చెప్పకు రావడం విడ్డూరం. సిట్ దర్యాప్తు తీరు చూస్తుంటే సీఎం చంద్రబాబునాయుడు కక్ష సాధింపు తప్ప ఈ కేసులో మరేమీ లేదని తేటతెల్లమవుతోంది.

మద్యం అక్రమ కేసులో మిథున్‌రెడ్డికి రిమాండ్

- ఆగస్టు 1 వరకు రిమాండ్ విధిస్తూ ఏసీబీ కోర్టు ఉత్తర్వులు
- రాజమండ్రి కేంద్ర కారాగారానికి తరలించాలని ఆదేశం
- ఎంపీగా కల్పించే సౌకర్యాలన్నింటినీ మిథున్‌కి కల్పించండి
- వెంట మందులు తీసుకెళ్లేందుకు అనుమతించండి
- విజయవాడ ఏసీబీ ప్రత్యేక కోర్టు ఆదేశాలు
- రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే నాపై కేసు పెట్టారు
- నేను ఎలాంటి తప్పూ, నేరం చేయలేదు
- కోర్టుకు నివేదించిన ఎంపీ మిథున్‌రెడ్డి

2లో


ఎంపీ మిథున్‌రెడ్డిని కోర్టుకు తీసుకెళ్తున్న పోలీసులు

ప్రజల దృష్టి మళ్లించేందుకే అక్రమ కేసు



జరగని లిక్కర్ స్కామ్‌ను జరిగినట్లు చిత్రీకరిస్తున్నారు
ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం
సీఎం చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఆగ్రహం

- అబద్ధపు వాంగ్మూలాలతో మిథున్‌ను అక్రమంగా ఇరికించారు
- తీవ్రమైన అవినీతి కేసుల్లో నిందితుడైన చంద్రబాబు బెయిల్‌పై ఉన్నారు.. ఇదంతా ఆయనపై నమోదైన మద్యం స్కామ్ కేసును రద్దు చేసుకునేందుకే..
- టీడీపీ ప్రభుత్వ వైఫల్యాలు, మోసాలను కప్పిపుచ్చుకోవడానికే..
- 2014–19 మద్యం విధానాన్ని సమర్థించుకోవడానికే..
- మళ్లీ పర్మిట్ రూమ్‌లు, బెల్ట్ షాపులు, ఎమ్మార్పీ కంటే అధిక ధరలు
- మద్యం దుకాణాల లైసెన్స్‌లలో అవినీతి, అంతటా మాఫియా
- ప్రజల తరఫున పోరాడేవారి గొంతు నొక్కడానికి చేసిన కుట్ర
- అధికార దుర్వినియోగం ప్రజాస్వామ్యంపై నేర పూరిత దాడి
- పరిస్థితులు ఎంత తీవ్రంగా ఉన్నా ప్రజలతోనే వైఎస్సార్‌సీపీ

- వివరాలు 3లో

'సిందూర్'పై చర్చకు సై

కీలకాంశాలపై పార్లమెంట్‌లో చర్చిస్తాం: కేంద్రం

- నేటి నుంచే వర్షాకాల సమావేశాలు
- 8 కొత్త బిల్లులు ప్రవేశపెట్టనున్న కేంద్రం
- జస్టిస్ వర్మపై అభిశంసన తీర్మానం కూడా..
- సజావుగా సాగేందుకు సహకరించండి
- అఖిలపక్ష భేటీలో విపక్షాలకు కేంద్రం విజ్ఞప్తి

6లో





త్వరలో మానవ సహిత చంద్రయాన్ యాత్రలు

ఇస్రో చైర్మన్ నారాయణన్

చంద్రుడిపై విస్తృత పరిశోధనల కోసం త్వరలోనే మానవ సహిత చంద్రయాన్‌–4, 5 రాకెట్లను పంపేందుకు కృషి చేస్తున్నామని ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ చెప్పారు. అంగారక, శుక్ర గ్రహాలపైకి కూడా శాటిలైట్లను పంపి విస్తృత పరిశోధనలు చేస్తున్నామని, త్వరలోనే వాటిపై మానవుడితో కూడిన వాహనాన్ని పంపేందుకు ఆలోచనలు చేస్తున్నట్లు చెప్పారు. కర్నూలు ఐఐఐటీడీఎం ఏడో స్నాతకోత్సవంలో ఆయన పాల్గొన్నారు.
- వివరాలు 5లో

నేడు హైదరాబాద్‌కు ముద్రగడ

ఎయిర్ అంబులెన్స్‌లో తరలింపు • వైఎస్ జగన్ సూచనలతో ఏర్పాట్లు

- కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పిన వైఎస్సార్‌సీపీ అధినేత
- ముద్రగడ ఆరోగ్యం నిలకడగా ఉందన్న వైద్యులు

అనారోగ్యంతో అస్వస్థతకు గురైన మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభాన్ని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించనున్నారు. సోమవారం ఉదయం ఎయిర్ అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ఎయిర్ పోర్టు నుంచి హైదరాబాద్ తీసుకువెళ్తారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సూచనలతో పార్టీ నేతలు ఏర్పాట్లు చేశారు.

5లో



రెడ్‌బుక్ అరాచకాలను పార్లమెంట్‌లో ప్రస్తావిస్తాం

- ఏపీలో శాంతిభద్రతల వైఫల్యాన్ని సభ దృష్టికి తెస్తాం
- అక్రమ కేసులతో వైఎస్సార్‌సీపీ నేతల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారు
- అఖిలపక్ష భేటీ తర్వాత మీడియాతో వైఎస్సార్‌సీపీ ఎంపీలు గురుమూర్తి, తనూజరాణి, సుభాష్‌చంద్రబోస్

2లో


మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎంపీలు

పేట్రేగిన 'పచ్చ'మూకలు

- మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నేత రమేశ్‌కుమార్‌రెడ్డి రాజకీయ విమర్శలపై మంత్రి రాంప్రసాద్‌రెడ్డి బ్యాచ్ రగడ
- మంత్రి సోదరుడు నేతృత్వంలో ర్యాలీ.. స్టేషన్‌లో ఫిర్యాదు.. పోలీసుల అదుపులో వైఎస్సార్‌సీపీ నేత
- ఆయన్ను అనేక స్టేషన్లు తిప్పుతూ చివరికి మదనపల్లెకు తరలింపు


14లో

'సుహృద్భావం' క్లీన్‌బౌల్డ్

డీజీపీతో వేదిక పంచుకునేందుకు డీజీలు ససేమిరా

షాక్‌తో డుమ్మా కొట్టిన ముఖ్య అతిథులు సీఎస్, డీజీపీ

నిస్తేజంగా ముగిసిన క్రికెట్ మ్యాచ్

మ్యాచ్‌వైపు కన్నెత్తి చూడని సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు


క్రికెట్ మ్యాచ్ అనంతరం ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల గ్రూప్ ఫొటో

సాక్షి, అమరావతి: డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తాపై సీనియర్ ఐపీఎస్ అధికారుల తిరుగుబాటు బావుటా పోలీసు శాఖతోపాటు ఉన్నతస్థాయి అధికారవర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తూనే ఉంది. ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల మధ్య సుహృద్భావపూర్వకంగా నిర్వహించిన క్రికెట్ మ్యాచ్‌పై కూడా ఈ ఆధిపత్య పోరు ప్రభావం పడింది. డీజీపీ గుప్తాతో వేదిక పంచుకునేందుకు ఇతర డైరెక్టర్ జనరల్(డీజీ)లు ససేమిరా అనడం గమనార్హం. దీంతో క్రికెట్ మ్యాచ్ ముఖ్య అతిథులుగా హాజరవ్వాల్సిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కె.విజయానంద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా ముఖం చాటేయాల్సి వచ్చింది. పరిస్థితి తీవ్రతను గుర్తించిన సీనియర్ ఐఏఎస్, ఇతర ఐపీఎస్ అధికారులు ఎవరూ క్రికెట్ మ్యాచ్ వైపు తొంగి చూడనే లేదు. యావత్ ప్రభుత్వ అధికార యంత్రాంగంలో కలకలం రేపుతున్న ఈ తాజా పరిణామం ఇదిగో ఇలా ఉంది.. ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల మధ్య సుహృద్భావపూర్వక సంబంధాలు కొనసాగించేందుకు ఏటా క్రికెట్ మ్యాచ్ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రికెట్ మ్యాచ్‌కు సీఎస్, డీజీపీ ముఖ్య అతిథులుగా
మిగతా 5వ పేజీలో ▸

జన్ 'ధన్' ఔషధి.. దోపిడీకే ప్రా'ముఖ్య'ం

ఆస్పత్రులకు జన్ ఔషధి మందుల సరఫరా మాటున భారీ అవినీతి

టెండర్లు లేకుండా సీఎం సొంత జిల్లా వ్యక్తుల ద్వారా కొను'గోల్‌మాల్'

రూ.100 కోట్ల మందుల సరఫరాకు ఎంవోయూలు

అన్ని బోధనాస్పత్రుల్లో మందులు సరఫరా చేసేది తిరుపతికి చెందిన పయ్యావుల రవి, రాజశేఖర్‌లే

సకాలంలో సరఫరా చేయకపోతే చర్యలు తీసుకోవడానికి వీల్లేకుండా ఎంవోయూలు

- వివరాలు 5లో





సము'చీతా' స్థానం

- చీతాల రక్షణ కోసం కొత్త ఆవాసం
- కునో నేషనల్ పార్కుకు ప్రత్యామ్నాయంగా గుజరాత్ బన్నీ గడ్డి మైదానాలు
- కచ్ జిల్లాలో సిద్ధం చేస్తున్న ఆ రాష్ట్ర అటవీ శాఖ
- కునో నేషనల్ పార్క్‌లో చీతాల మృత్యువాతతో మారిన ప్రణాళిక
- దేశంలో అంతరించిపోయిన చీతాల సంతతి వృద్ధే లక్ష్యంగా అడుగులు

14లో

ఇదండీ సంగతి



మీరు మమ్మల్ని రష్యా మీదికి ఉసిగొల్పారా? లేక రష్యాను మా మీదికి ఉసిగొల్పారా అని ఉక్రెయిన్ అంటోంది సార్!

ప్రశ్నించే గొంతులను నొక్కడం దుర్మార్గం



కూటమి సర్కారు సంక్షేమాన్ని విస్మరించి, ప్రతిపక్ష నేతలపై కక్ష సాధింపులకు పాల్పడుతోంది. ప్రశ్నించే గొంతులను నొక్కాలని చూడటం అత్యంత దుర్మార్గం. అరెస్టులు చేసి జైల్లో వేయించడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. రాజకీయ కక్షతో మిథున్ రెడ్డిని అక్రమంగా అరెస్టు చేశారు. రెడ్‌బుక్ రాజ్యాంగం ఇలాగే కొనసాగితే ప్రజలు రోడ్డెక్కడం ఖాయం.

– తమ్మినేని సీతారాం, మాజీ స్పీకర్

పిచ్చోడి చేతిలో రాయిలా బాబు పాలన



కూటమి పాలన పిచ్చోడి చేతిలో రాయిలా ఉంది. ఇచ్చిన హామీలు అమలు చేయలేక చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్‌కి తెరతీశారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న ఆరాచకాలన్నింటినీ ప్రజలు చూస్తున్నారు. చంద్రబాబు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు.

– ఆకేపాటి అమరనాథరెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే

ప్రజాప్రతినిధుల స్వేచ్ఛను హరించడమే



అక్రమ అరెస్టులు ప్రజాస్వామ్యానికి పూర్తిగా విరుద్ధం. ప్రజాప్రతినిధుల స్వేచ్ఛను హరించాలనే కూటమి కుటిల చర్యలను ఖండిస్తున్నాం. రాజకీయ కుట్రతో లిక్కర్ స్కాం అనే బోగస్ ఆరోపణలతో ఎంపీ మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గం. ప్రభుత్వ అరాచకాలను ప్రజాస్వామ్యవాదులందరూ ఖండించాలి.

– రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ

ఇదంతా డైవర్షన్‌కే



రాజకీయ కక్ష సాధింపు చర్య ల్లో భాగంగానే ఎంపీ మిథున్ రెడ్డిని అరెస్టు చేశారు. కూటమి ప్రభుత్వం దుర్మార్గపు చర్యలను ప్రజలు గమనిస్తున్నారు. సూపర్‌సిక్స్ నెరవేర్చలేక చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరతీశారు. తప్పుడు కేసులతో ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేస్తున్నారు. లిక్కర్ స్కామ్ ఓ ఫాల్స్ కేసు.

– రమేష్ యాదవ్, ఎమ్మెల్సీ

రాజకీయ కక్ష సాధింపే



రాజకీయ కక్ష సాధింపు కోసమే ఎంపీ మిథున్ రెడ్డిని కూటమి ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసింది. వైఎస్సార్ సీపీలో ఉన్న కొందరు ముఖ్య నాయకులను అణచి మాజీ సీఎం వైఎస్ జగన్‌ను దెబ్బతీయాలని సీఎం చంద్రబాబు యత్నిస్తున్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగంపై రాష్ట్ర ప్రజలు తిరగబడే సమయం ఆసన్నమైంది.

– బి.విరూపాక్షి, ఆలూరు ఎమ్మెల్యే

రాజకీయ దురుద్దేశంతోనే అక్రమ అరెస్టు



వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయించి, అరెస్టులు చేసి జైలుకు పంపించి ఈ ప్రభుత్వం శునకానందం పొందుతోంది. పాలన మరచి ప్రతిపక్షం గొంతునొక్కే ప్రయత్నం చేస్తోంది. రాజకీయ దురుద్దేశంతో లేని లిక్కర్ స్కాంను సృష్టించి అరెస్టులు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి.

– రేగం మత్స్యలింగం, అరకు ఎమ్మెల్యే

అక్రమ అరెస్టులతో ప్రజాస్వామ్యం ఖూనీ



రాష్ట్రంలో పాలన వ్యవస్థ పూర్తిగా గాడి తప్పింది. పారదర్శకంగా జరిగిన మద్యం విధానాన్ని కుంభకోణంగా చిత్రీకరించి రెడ్ బుక్ రాజ్యాంగంతో అక్రమ అరెస్టులు చేస్తున్నారు. ఎన్ని కుయుక్తులు పన్నినా వైఎస్సార్‌సీపీ శ్రేణుల మనోధైర్యాన్ని తగ్గించలేరు. నిత్యం ప్రజలతో ఉంటూ ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తూనే ఉంటాం. కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజాక్షేత్రంలో ఎండగడతాం.

– మత్స్యరాస విశ్వేశ్వరరాజు, ఎమ్మెల్యే

బాబు కుతంత్రం.. 'అప్రూవర్' తంత్రం

చార్జ్‌షీట్, రిమాండ్ నివేదికల సాక్షిగా మద్యం అక్రమ కేసులో కుట్ర బట్టబయలు

సాక్షి, అమరావతి: చంద్రబాబు ప్రభుత్వ కుట్ర మరోసారి బట్టబయలైంది. బెదిరించి, వేధించి అబద్ధపు వాంగ్మూలాలు, తప్పుడు సాక్ష్యాలతో సాగిస్తున్న అక్రమ కేసు కుతంత్రాన్ని టీడీపీ కూటమి ప్రభుత్వమే మరోసారి బయట పెట్టుకుంది. చంద్రబాబు ప్రభుత్వం రచించిన 'అప్రూవర్ కుట్ర' తాజాగా వెలుగులోకి వచ్చింది. ఈ అక్రమ కేసులో బెవరేజెస్ కార్పొరేషన్ పూర్వ ఎండీ వాసుదేవరెడ్డి, పూర్వ ఉద్యోగి సత్య ప్రసాద్‌ను ఇప్పటికే తీవ్రంగా వేధించి, మరీ అబద్ధపు వాంగ్మూలం నమోదు చేయించిన కూటమి ప్రభుత్వం.. తాజాగా వారి ద్వారా అప్రూవర్ కుట్రకు తెగబడేందుకు యత్నించడం గమనార్హం. ప్రభుత్వ పెద్దల డైరెక్షన్‌లో సిట్ అధికారులు గుట్టుచప్పుడు కాకుండా ఈ కుతంత్రాన్ని చక్కబెట్టేందుకు యత్నించిన వ్యవహారం బయటపడింది. తద్వారా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పారదర్శకంగా మద్యం విధానాన్ని అమలు చేసినట్టు చంద్రబాబు ప్రభుత్వం పరోక్షంగా అంగీకరించింది. లేని కుంభకోణం ఉన్నట్టుగా చూపించేందుకు తాము అబద్ధపు వాంగ్మూలాలపైనే ఆధారపడ్డామని నిస్సిగ్గుగా వెల్లడించింది.

ఆ ఇద్దరూ సిట్ చీఫ్‌తో భేటీ

రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారాలతోగానీ, మద్యం విధానంతో గానీ ఏమాత్రం సంబంధం లేని వారిని కూడా ప్రభుత్వ పెద్దల సూచనల మేరకు ఏ30 నుంచి ఏ40 వరకు నిందితులుగా పేర్కొని సిట్ అరెస్టు చేసింది. వారిలో ప్రపంచ స్థాయి సిమెంట్ దిగ్గజ సంస్థ వికాట్ కంపెనీ డైరెక్టర్ బాలాజీ గోవిందప్పతోపాటు పలువురు ఉన్నారు. ఇదే కేసులో నిందితులైన వాసుదేవరెడ్డి(ఏ2), సత్య ప్రసాద్(ఏ3)లను బెదిరించి, అప్రూవర్లుగా మారేందుకు అనుమతించాలని, వారిద్దరితో విజయవాడ ఏసీబీ న్యాయస్థానంలో పిటిషన్ వేయించాలని పన్నాగం పన్నింది. ఇందులో భాగంగా శనివారం వారు విజయవాడ ఏసీబీ న్యాయస్థానానికి వచ్చారు. ముందుగా సిట్ కార్యాలయానికి వెళ్లారు. సిట్ చీఫ్ ఎస్వీ రాజశేఖర్‌బాబుతోపాటు ఇతర అధికారులతో సమావేశమయ్యారు. అనంతరం కొందరు సిట్ అధికారులతో కలసి న్యాయస్థానంలో అప్రూవర్ పిటిషన్ దాఖలు చేసేందుకు వెళ్లారు. ఇలా వారిద్దరితో మరిన్ని అబద్ధపు వాంగ్మూలాలు న్యాయస్థానంలో నమోదు చేయించాలన్నది ప్రభుత్వ పెద్దల ఎత్తుగడగా స్పష్టమైంది. అయితే న్యాయ వర్గాలతో చర్చించిన వారు అప్రూవర్ పిటిషన్ దాఖలు చేయకుండా వెనక్కి తీసుకుని వెళ్లిపోయారు.



ముందస్తు బెయిల్ పిటిషన్ నాటకం

వాసుదేవరెడ్డి, సత్య ప్రసాద్ అప్రూవర్ పిటిషన్లు వేయకుండా వెనుదిరగడంపై సిట్ అధికారులు ఆందోళనకు గురైనట్లు సమాచారం. వీరిద్దరూ ఎదురు తిరిగితే ఈ అక్రమ కేసు పూర్తిగా నీరుగారి పోతుందని బెంబేలెత్తిన సిట్ అధికారులు ఈ విషయాన్ని ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్లారు. వారి ఆదేశాలతో కొత్త ఎత్తుగడ వేశారు. వాసుదేవరెడ్డి, సత్య ప్రసాద్‌తో హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్లు దాఖలు చేయించారు. ఆ ముందస్తు బెయిల్ పిటిషన్లను న్యాయస్థానంలో వ్యతిరేకించకుండా సహకరిస్తామని సిట్ అధికారులు వారికి చెప్పినట్టు సమచారం. కాగా హడావుడిగా అప్పటికప్పుడు దాఖలు చేసిన ఆ పిటిషన్లకు తగిన పత్రాలు జతపరచ లేదు. దాంతో సాంకేతిక కారణాలతో న్యాయస్థానం ఆ పిటిషన్లను వెనక్కి పంపింది.

అబద్ధపు వాంగ్మూలాలు ఇలా...

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మద్యం విధానం పూర్తి పారదర్శకంగా అమలైందని చంద్రబాబు ప్రభుత్వమే పరోక్షంగా అంగీకరించినట్లయిందని ఈ తాజా పరిణామాలు మరోసారి స్పష్టం చేశాయి. రెడ్‌బుక్ కక్ష సాధింపు కోసం తాము నమోదు చేసిన అక్రమ కేసు దర్యాప్తు కోసం పూర్తిగా అబద్ధపు వాంగ్మూలాలు, తప్పుడు సాక్ష్యాలపైనే ఆధార పడ్డామని ప్రభుత్వమే బయట పెట్టుకుంది.
- బెవరేజెస్ కార్పొరేషన్ పూర్వ ఎండీ వాసుదేవరెడ్డితో పాటు ఇప్పటి వరకు ఇతర అధికారులు, సాక్షులతో తాము నమోదు చేయించినవన్నీ అబద్ధపు వాంగ్మూలాలే అన్నది స్పష్టమైంది. వాసుదేవరెడ్డిని అబద్ధపు వాంగ్మూలం ఇవ్వాలని సిట్ అధికారులు వేధించారు. సిట్ వేధింపులపై ఆయన మూడుసార్లు హైకోర్టును ఆశ్రయించారు. అయినా సరే ప్రభుత్వం ఆయన్ను వెంటాడి వేధించింది. డెప్యుటేషన్ ముగిసినా రిలీవ్ చేయకుండా అడ్డుకుంది. కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురి చేసింది. దీంతో చివరికి సిట్ చెప్పినట్టుగా ఆయన అబద్ధపు వాంగ్మూలం ఇచ్చారు. ఆ వెంటనే వాసుదేవరెడ్డిని రిలీవ్ చేసి కేంద్ర సర్వీసులకు వెళ్లేందుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది.
- బెవరేజెస్ కార్పొరేషన్ పూర్వ ఉద్యోగులు సత్య ప్రసాద్, అనూషలను వేధించి అబద్ధపు వాంగ్మూలాలు నమోదు చేయించింది. అబద్ధపు వాంగ్మూలాలు ఇచ్చేందుకు సమ్మతించని వారిపై సిట్ తన ప్రతాపం చూపించింది. కొన్ని డిస్టిలరీల ప్రతినిధులు వృద్ధులని కూడా చూడకుండా విచారణ పేరుతో హైదరాబాద్ నుంచి విజయవాడ తీసుకువచ్చి వేధించింది. దాంతో వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దాంతో వారిని హైదరాబాద్‌లోని వారి నివాసంలోనే విచారించాలని న్యాయస్థానం ఆదేశించింది.
- ఈ కేసుతో ఏమాత్రం సంబంధం లేని రాజ్ కేసిరెడ్డి తండ్రిని బలవంతంగా తీసుకువచ్చి విచారణ పేరుతో వేధించింది. మరో నిందితుడి తండ్రి, రిటైర్డ్ కానిస్టేబుల్‌ను అక్రమంగా నిర్బంధించి మరీ వేధించడంతో ఆ కుటుంబం హైకోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది.
- చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వద్ద గతంలో గన్‌మెన్‌గా పని చేసిన గిరి, మదన్ రెడ్డిలను అక్రమంగా నిర్బంధించి అబద్ధపు వాంగ్మూలం కోసం వేధించారు. బెంబేలెత్తిన గిరి సిట్ అధికారులు చెప్పినట్టు అబద్ధపు వాంగ్మూలం ఇచ్చారు. అందుకు సమ్మతించని మదన్ రెడ్డిపై సిట్ అధికారులు థర్డ్ డిగ్రీ ప్రయోగించడం విభ్రాంతి కలిగించింది. సిట్ అధికారులు తనపై భౌతికంగా దాడి చేశారని ఆయన న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు కూడా.
- అబద్ధపు వాంగ్మూలం ఇస్తే నామినేటెడ్ పదవి ఇవ్వడంతోపాటు రూ.2 కోట్లు ఇస్తామని ప్రభుత్వ పెద్దలు సిట్ అధికారుల ద్వారా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి స్నేహితుడు వెంకటేశ నాయుడు దంపతులను ప్రలోభ పెట్టారు. అందుకు వారు తిరస్కరించడంతోనే ఈ కేసులో ఆయన్ను అరెస్టు చేశారు. ప్రభుత్వ పెద్దల అండతో ఈ అక్రమ కేసు దర్యాప్తు పేరిట సిట్ బరితెగించి సాగిస్తున్న అధికారిక గూండాగిరీకి ఈ పరిణామాలే నిదర్శనం.

అబద్ధాలూ.. వక్రీకరణలే

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మద్యం విధానంపై నమోదు చేసిన అక్రమ కేసు కుట్రలో ప్రభుత్వం తన కుతంత్రాలకు మరింతగా పదును పెడుతోంది. పూర్తిగా అవాస్తవాలు, వక్రీకరణలతో నిబంధనలను ఉల్లంఘిస్తోంది. సిట్ దాఖలు చేసిన చార్జ్‌షీట్, ఎంపీ మిథున్ రెడ్డి రిమాండ్ నివేదికలే ఆ విషయాన్ని మరోసారి బయటపెట్టాయి. లేని కుంభకోణం ఉన్నట్టుగా చూపించేందుకు సిట్ యత్నిస్తోందని ఎంపీ మిథున్ రెడ్డి రిమాండ్ నివేదిక వెల్లడించింది. ఆయనకు వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలు సృష్టించలేకపోయిన సిట్ అధికారులు వక్రభాష్యాలతో కనికట్టు చేసేందుకు యత్నించారు. ఈ కేసులో ఇతర నిందితులతోపాటు ఎంపీ మిథున్ రెడ్డి సమావేశమై అక్రమాలకు కుట్ర పన్నారని సిట్ రిమాండ్ నివేదికలో పేర్కొంది. అందుకు సిట్ చూపించిన ఆధారం ఏమిటో తెలుసా.. సెల్‌టవర్ లొకేషన్! హైదరాబాద్‌లో సమావేశం జరిగిందని చెబుతున్న రోజున ఎంపీ మిథున్ రెడ్డి, ఇతర నిందితుల సెల్ ఫోన్లు అన్నీ ఒకే చోట ఉన్నట్టు సెల్ టవర్ లొకేషన్ ద్వారా తెలుసుకున్నామని సిట్ పేర్కొనడం విడ్డూరంగా ఉంది. ఎందుకంటే సెల్ టవర్ పరిధి 200 చ.మీటర్లు ఉంటుంది. అంత పరిధిలో హైదరాబాద్ వంటి కాంక్రీట్ జంగిల్ వంటి మహానగరంలో వేలాది సెల్ ఫోన్లు ఉంటాయి. అంత మాత్రాన ఆ వేలాది మంది కూడా ఒక గదిలో సమావేశమైనట్టు భావించాలా?

ఎక్కడ న్యాయం? ఎక్కడ ధర్మం?

ఎంపీ మిథున్ రెడ్డి ఈ కేసుకు సంబంధించిన పలువురితో సెల్ ఫోన్‌లో మాట్లాడినట్టు కాల్ డేటా వివరాలు వెల్లడిస్తున్నాయని సిట్ అధికారులు రిమాండ్ నివేదికలో పేర్కొనడం విడ్డూరంగా ఉంది. 40 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్న కుటుంబం నుంచి వచ్చిన ఆయన ఎంపీ. లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ నేతగా కీలక బాధ్యతల్లో ఉన్నారు. అటువంటి క్రియాశీల ప్రజాప్రతినిధి రోజూ ఎందరో నేతలు, కార్యకర్తలు, వివిధ వర్గాల ప్రజలతో ఫోన్లో మాట్లాడుతునే ఉంటారు. అంత మాత్రాన వారిందరితో కలసి కుట్ర పన్నినట్టు ఎలా భావిస్తారు? ఎలాంటి ఆధారాలు లేనందునే సిట్ అధికారులు సెల్ టవర్ లొకేషన్, కాల్ డేటాలను వక్రీకరిస్తూ న్యాయస్థానాన్ని తప్పుదారి పట్టించేందుకు యత్నించారన్నది స్పష్టమవుతోంది. దర్యాప్తు పేరిట సిట్ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని చార్జ్‌షీట్ వెల్లడిస్తోంది. కేంద్ర జీఎస్టీ చట్టాన్ని ఉల్లంఘిస్తూ మరీ సిట్ అధికారులు తమ పరిధిని అతిక్రమించారు. మద్యం సరఫరా చేయకుండానే చేసినట్టు ఫేక్ ఇన్వాయిస్‌లు సమర్పించినట్టు తమ దర్యాప్తులో వెల్లడైనట్టు సిట్ అధికారులు చార్జ్‌షీట్‌లో పేర్కొన్నారు. అవి ఫేక్ ఇన్వాయిస్‌లని ఎలా గుర్తించారో మాత్రం వెల్లడించనే లేదు. కేంద్ర జీఎస్టీ అధికారులు నిర్ధారించకుండా అవి ఫేక్ ఇన్వాయిస్‌లనీ సిట్ అధికారులు ఏకపక్షంగా ఎలా తుది నిర్ణయానికి వచ్చారో అర్థం కావడం లేదు. అంటే లేని ఆధారాలు ఉన్నట్టుగా సిట్ అధికారులు న్యాయస్థానాన్నే తప్పుదారి పట్టించేందుకు తెగిస్తున్నారన్నది స్పష్టమవుతోంది. కుట్రపూరితంగానే కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఈ కేసులో సిట్ దాఖలు చేసిన చార్జ్‌షీట్ ఆధారంగానే నిగ్గు తేలింది. ఈ లెక్కన ఈ కేసులో ఎక్కడ న్యాయం ఉన్నట్టు? ఎక్కడ ధర్మం ఉన్నట్టు? ప్రభుత్వం కుట్రతోనే వ్యవహరిస్తున్నదని అడుగడుగునా స్పష్టమవుతోంది.

మద్యం అక్రమ కేసులో మిథున్‌రెడ్డికి రిమాండ్

ఆగస్టు 1 వరకు రిమాండ్ విధిస్తూ ఏసీబీ కోర్టు ఉత్తర్వులు

- రాజమండ్రి కేంద్ర కారాగారానికి తరలించాలని ఆదేశం
- ఎంపీగా కల్పించే సౌకర్యాలన్నింటినీ మిథున్‌రెడ్డికి కల్పించండి
- విజయవాడ ఏసీబీ ప్రత్యేక కోర్టు ఆదేశాలు



ఎంపీ మిథున్‌రెడ్డిని సిట్ కార్యాలయం నుంచి ప్రభుత్వాస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

సాక్షి, అమరావతి: మద్యం అక్రమ కేసులో అరెస్టయిన రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డిని సిట్ అధికారులు ఆదివారం విజయవాడ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ప్రత్యేక న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. కోర్టు ఆయనకు ఆగస్టు 1 వరకు రిమాండ్ విధించింది. మిథున్‌రెడ్డిని రాజమండ్రి కేంద్ర కారాగారానికి తరలించాలని ఆదేశించింది. ఓ పార్లమెంట్ సభ్యుడికి నిబంధనల ప్రకారం జైలులో ఏ విధమైన సౌకర్యాలు కల్పిస్తారో వాటన్నింటినీ మిథున్‌రెడ్డికి కల్పించాలని జైలు అధికారులను ఆదేశించింది. వెంట మందులు తీసుకెళ్లేందుకు మిథున్‌రెడ్డికి అనుమతినిచ్చింది. ఈ మేరకు న్యాయాధికారి పి.భాస్కరరావు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. మద్యం అక్రమ కేసులో నాలుగో నిందితునిగా ఉన్న మిథున్‌రెడ్డిని సిట్ అధికారులు సుదీర్ఘ విచారణ తరువాత శనివారం రాత్రి అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఆదివారం కోర్టు ఎదుట హాజరుపరిచే ముందు మిథున్‌రెడ్డిని విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ఆయనకు ఈసీజీ, బీపీ, షుగర్ వంటి వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఆయనను ఏసీబీ కోర్టు ముందు హాజరుపరిచారు.

రాజకీయ కక్ష సాధింపుతో నాపై కేసు పెట్టారు

ఈ సందర్భంగా మిథున్‌రెడ్డితో న్యాయాధికారి మాట్లాడారు. ఊరు, పేరు, తల్లిదండ్రుల పేర్లు, కుటుంబంలో ఎంత మంది ఉంటారు.. వంటి వివరాలు అడిగారు. వాటన్నింటికీ మిథున్‌రెడ్డి సమాధానం చెప్పారు. తనపై దురుద్దేశాలతో, రాజకీయ కారణాలతో ఈ కేసు నమోదు చేశారని మిథున్‌రెడ్డి కోర్టుకు నివేదించారు. తానెలాంటి తప్పు గానీ, నేరం గానీ చేయలేదన్నారు. కోర్టు ముందు హాజరుపరిచే ముందు వైద్యులు తనకు రెండుసార్లు ఈసీజీ పరీక్షలు నిర్వహించారని, రెండింటికీ తేడాలు ఉన్నాయని తెలిపారు. అందువల్ల తనకు పూర్తిస్థాయి వైద్య పరీక్షలు నిర్వహించాల్సిన అవసరం ఉందని ఆయన కోర్టుకు నివేదించారు.

ప్రత్యేక సౌకర్యాలు కల్పించండి..

ఆ తర్వాత మిథున్‌రెడ్డి తరపు న్యాయవాది తప్పెట నాగార్జునరెడ్డి వాదనలు వినిపించారు. మిథున్‌రెడ్డి మూడు పర్యాయాల నుంచి ఎంపీగా ఉన్నారని తెలిపారు. ఆయన లోక్‌సభ ప్రొటెం స్పీకర్‌గా కూడా వ్యవహరించారని వివరించారు. ఆయన కున్న ప్రాణహాని దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం ఆయనకు వై కేటగిరి భద్రత కల్పించిందని నాగార్జునరెడ్డి వివరించారు. ఈ నేపథ్యంలో జైలులో ఆయనకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అలాగే వెంట మందులు తీసుకెళ్లేందుకు అనుమతినివ్వాలని కోరారు. పిటిషనర్‌కు రిమాండ్ విధిస్తే తగిన సౌకర్యాలు ఉన్న నెల్లూరు కేంద్ర కారాగారానికి గానీ, రాజమండ్రి కేంద్ర కారాగారానికి గానీ పంపాలని కోరారు. జైలులో వీఐపీ బ్యారెక్ కేటాయించాలని అభ్యర్థించారు. కుటుంబ సభ్యులు కలుసుకునేందుకు వీలుగా జైలులో ఎక్కువ ములాఖాత్‌లను మంజూరు చేయాలని కోర్టును కోరారు. ప్రైవేటు ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించేలా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సిట్ తరపున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపిస్తూ మద్యం విధానంలో మిథున్‌రెడ్డిది కీలక పాత్ర అని తెలిపారు. ఇందుకు ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని చెప్పారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని మిథున్‌రెడ్డికి జ్యుడీషియల్ రిమాండ్ విధించాలని కోరారు. నెల్లూరు, రాజమండ్రి కేంద్ర కారాగారాలకు కాకుండా, విజయవాడ లేదా గుంటూరు జైలుకు తరలించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న ఏసీబీ కోర్టు మిథున్‌రెడ్డికి ఆగస్టు 1 వరకు జుడీషియల్ రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనను రాజమండ్రి కేంద్ర కారాగారానికి తరలించాలని ఆదేశించింది.

రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్‌కు మిథున్‌రెడ్డి

- జైలు వద్దకు భారీగా చేరుకున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులతో పోలీసుల వాగ్వాదం

సాక్షి, రాజమహేంద్రవరం/కంబాలచెరువు: వైఎస్సార్ సీపీ ఎంపీ మిథున్‌రెడ్డిని పోలీసులు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. విజయవాడ ఏసీబీ కోర్టు నుంచి నేరుగా రాజమండ్రి సెంట్రల్ జైలుకు రాత్రి 8.38 గంటలకు తీసుకొచ్చారు. జైలు అధికారుల ఫార్మాలిటీస్ పూర్తయ్యాక ఆయనకు కేటాయించిన బ్యారక్‌లోకి తీసుకెళ్లారు. పోలీసులు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు వద్ద భారీ భద్రత ఏర్పాట్లు చేశారు. కాకినాడ వెళ్లే రోడ్డును బారికేడ్లతో మూసివేశారు. 144 సెక్షన్, 30 సెక్షన్లు అమలు చేశారు.

మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టుపై వైఎస్సార్ సీపీ శ్రేణులు నిరసన తెలిపాయి. ఆయనకు మద్దతుగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు భారీ స్థాయిలో తరలి వచ్చారు. మాజీ సీఎం వైఎస్ జగన్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి తదితరులు సెంట్రల్ జైలు వద్దకు చేరుకున్నారు. పార్టీ నేతలు జైలు వద్ద నిరసనకు దిగారు. జైలు గేటు ఎదురుగా వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ బైఠాయించి, నిరసన తెలిపారు. వీరిని పోలీసులు అడ్డుకున్నారు. పార్టీ నేతలు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.

రెడ్‌బుక్ అరాచకాలను పార్లమెంట్‌లో ప్రస్తావిస్తాం

వైఎస్సార్‌సీపీ ఎంపీల స్పష్టీకరణ

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీలో శాంతిభద్రతలు కరువయ్యాయని వైఎస్సార్‌సీపీ ఎంపీలు డాక్టర్ మద్దిల గురుమూర్తి, డాక్టర్ తనూజరాణి, పిల్లి సుభాష్‌చంద్రబోస్ మండిపడ్డారు. ఏపీలో అంబేడ్కర్ రాజ్యాంగం అమలు కావడం లేదని, నారా వారి రెడ్‌బుక్ రాజ్యాంగం రాజ్యమేలుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ప్రారంభమయ్యే పార్లమెంట్ సమావేశాల్లో వైఎస్సార్‌సీపీ ఈ విషయాలను సాక్ష్యాలతో కేంద్రం దృష్టికి తీసుకువెళ్లనున్నట్టు చెప్పారు. ఆదివారం జరిగిన పార్లమెంట్ అఖిలపక్ష భేటీకి వైఎస్సార్‌సీపీ నుంచి ఎంపీలు మద్దిల గురుమూర్తి, తనూజరాణి, పిల్లి సుభాష్‌చంద్రబోస్ హాజరయ్యారు. అనంతరం వీరు మీడియాతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ నేతల్ని లక్ష్యంగా చేసుకుని అరాచకాలు సాగిస్తోందని విమర్శించారు. తమ ప్రభుత్వ హయాంలో కుంభకోణాలు జరిగాయంటూ రోజుకో కొత్త డ్రామాతో పబ్బం గడుపుకుంటున్నారని మండిపడ్డారు. సూపర్ సిక్స్, వందకు పైగా హామీలు వంటి వాటన్నిటిపై వైఎస్సార్‌సీపీ ప్రశ్నిస్తుందనే భయంతోనే దాడులకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు.

జగన్ పేరు ప్రస్తావించడం హేయం

అసలు ఎటువంటి స్కీమే లేకుండా మద్యం విధానంలో స్కామ్ ఎలా జరుగుతుందో చెప్పాలని కూటమి ప్రభుత్వాన్ని ఎంపీలు నిలదీశారు. కింది స్థాయి ఉద్యోగులను బెదిరించి వారికి అనుకూలమైన స్టేట్‌మెంట్లు తీసుకుని అవే ఆధారాలంటూ ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్టు చేశారని మండిపడ్డారు. ఏ ఆధారం, స్కామ్ లేకుండానే మాజీ సీఎం వైఎస్ జగన్ పేరును చార్జ్‌షీట్‌లో పెట్టడం అత్యంత దుర్మార్గమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల రైతులను పరామర్శించేందుకు వెళ్లిన అధినేత వైఎస్ జగన్ పర్యటనల్లో పోలీసుల వైఫల్యం స్పష్టంగా తెలుస్తోందన్నారు. ఈ వైఫల్యానికి కారణం రాష్ట్ర ప్రభుత్వమేనని మండిపడ్డారు. ఈవిషయాలన్నీ సాక్ష్యాధారాలతో సహా పార్లమెంట్‌లో వివరిస్తామన్నారు.

కనీస మద్దతు ధర ఇవ్వలేని ప్రభుత్వం

ధాన్యం, మిర్చి, మామిడి, పొగాకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ తెలిపారు. వీరిని ఆదుకోవడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. ఈ సమస్యలపై ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతల్ని అరెస్టులతో వేధింపులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. రైతు సమస్యలపై రాజ్యసభలో ప్రశ్నిస్తానని ఎంపీ చెప్పారు.

మహిళలపై జరుగుతున్న దాడులపై ప్రశ్నిస్తా

కూటమి అధికారంలోకి వచ్చిన నాటినుంచి నిత్యం మహిళలపై దాడులు జరుగుతూనే ఉన్నాయని ఎంపీ తనూజరాణి పేర్కొన్నారు. ఇటీవల కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై దాడిచేశారని, మాజీ ఎమ్మెల్యే రోజా, ఇతర మహిళా నేతలపై టీడీపీ నేతలు జుగుప్సాకరమైన వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. ఈ విషయాలన్నీ లోక్‌సభలో ప్రస్తావిస్తానని తెలిపారు.

పోలీసుల ఓవరాక్షన్

సిట్ కార్యాలయం, ఆస్పత్రి, కోర్టు పరిసరాల్లో కర్ఫ్యూ వాతావరణం

సాక్షి, ప్రతినిధి, విజయవాడ/ గాంధీనగర్ (విజయవాడసెంట్రల్): మద్యం అక్రమ కేసులో చంద్రబాబు ప్రభుత్వం బరితెగిస్తోంది. వైఎస్సార్‌సీపీ లోక్‌సభాపక్షనేత, ఎంపీ మిథున్‌రెడ్డిని విజయవాడలోని సిట్ కార్యాలయం నుంచి కోర్టుకు తరలించే సమయంలో పోలీసులు ఓవర్ యాక్షన్ చేశారు. సిట్, ఆస్పత్రి, కోర్టు వద్ద కర్ఫ్యూ వాతావరణాన్ని తలపించేలా బారికేడ్లు ఏర్పాటు చేసి, వైఎస్సార్‌సీపీ నేతలు, లాయర్లు, పార్టీ శ్రేణులను అడ్డుకున్నారు. పోలీసుల ఓవరాక్షన్‌పై లాయర్లు న్యాయమూర్తికి ఫిర్యాదు చేశారు. ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు వార్త తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నేతలు, పార్టీ శ్రేణులు ఆదివారం ఉదయం పెద్ద ఎత్తున సిట్ కార్యాలయానికి తరలి వచ్చారు. అయితే ఉదయం నుంచే కార్యాలయం వద్ద పోలీసులు భారీ సంఖ్యలో మోహరించారు. 100 మీటర్లకు ముందే సిట్ కార్యాలయం వద్దకు వచ్చే రహదారిలో రెండు వైపులా బారికేడ్లు ఏర్పాటు చేసి.. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలను అడ్డుకున్నారు. వాహనాల రాకపోకలను నిలిపివేశారు. మీడియాపైనా ఆంక్షలు విధించారు. విజయవాడ జీజీహెచ్‌లో ఎంపీ మిథున్‌రెడ్డికి వైద్య పరీక్షలు నిర్వహించే సమయంలోనూ ఆస్పత్రి ప్రాంగణంలోకి ఎవరినీ అనుమతించలేదు. మిథున్‌రెడ్డిని రాజమండ్రి జైలుకు తరలించే సమయంలో వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతలు కాన్వాయ్ వెంట వెళ్లే ప్రయత్నం చేశారు. అయితే ఎంపీ మిథున్‌రెడ్డి తీసుకెళ్తున్న వాహనంతో పాటు, ఎస్కార్ట్ వాహనాలను మాత్రం అనుమతించి, మిగతా వాహనాలను పోలీసులు అడ్డుకున్నారు. విజయవాడ నుంచి రాజమండ్రి సెంట్రల్ జైలు వద్దకు ఎమ్మెల్సీ తలశిల రఘురాం, లేళ్ల అప్పిరెడ్డి, కుటుంబ సభ్యులు వెళ్లారు.



కోర్టులోకి వెళ్లకుండా లాయర్లను అడ్డుకుంటున్న పోలీసులు

నేతల సంఘీభావం

సిట్, ఆస్పత్రి, కోర్టు వద్దకు పెద్ద ఎత్తున నాయకులు, వేలాదిగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తరలి వచ్చి ఎంపీ మిథున్‌రెడ్డికి సంఘీభావం తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, లేళ్ల అప్పిరెడ్డి, రమేష్‌యాదవ్, భరత్, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథరెడ్డి, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, మాజీ మంత్రి జోగి రమేష్, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, మాజీ ఎంపీ నందిగం సురేష్, పెడన, మదనపల్లి, కదిరి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు ఉప్పాల రాము, షాజహాన్ బాషా, మగ్దుల్ బాషా, పార్టీ నేతలు పోతిన మహేష్ తోపాటు, పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలి వచ్చారు.

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్ దారుణం

- చంద్రబాబు మెప్పు కోసమే అచ్చెన్నాయుడు 'పోస్టులు'
- మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు



శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వైఎస్సార్‌సీపీ నేత, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేయడం దారుణమని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ డాక్టర్స్‌సెల్ అధ్యక్షుడు సీదిరి అప్పలరాజు మండిపడ్డారు. ఆదివారం శ్రీకాకుళంలో మీడియాతో మాట్లాడుతూ.. రూ.30 వేల కోట్ల స్కామ్ అని మొదలుపెట్టిన పాలకులు దానిని ఇప్పటికి రూ.2 వేల కోట్లకు వారే తగ్గించారని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ హయాంలో దశలవారీగా మద్య నిషేధం చేయాలన్న ఆలోచనతోనే ప్రభుత్వమే షాపులు నడిపిందని, అప్పుడు స్కామ్ ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. పారదర్శకంగా అమలు చేసిన మద్యం విధానంపై అక్రమ కేసు నమోదు చేయడమంటే రెడ్‌బుక్ కుట్రేనన్నారు. బాబు స్క్రిప్ట్ భేతాళ కుట్ర అని, చంద్రబాబు డైరెక్షన్‌లో సాగుతున్న కుట్ర కేసులో సిట్ దర్యాప్తు పేరిట బరి తెగిస్తోందన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయడం చేతకాక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ ప్రజల్ని తప్పుదోవ పట్టించాలనుకోవడం భ్రమ మాత్రమేనన్నారు. బిగ్ బాస్ అంటూ ఎల్లోమీడియా జగన్‌పై తప్పుడు రాతలు రాస్తే నిజాలైపోవన్నారు. అచ్చెన్నాయుడుకి మంత్రి పదవి తీసేస్తారని తెలియడంతో చంద్రబాబు మెప్పు కోసం మద్యంలో అవినీతి జరిగిపోయిందని 'ఎక్స్'లో పోస్టులు చేస్తున్నారని ధ్వజమెత్తారు.

ఇది చంద్రబాబు కుట్ర

ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు బి.కరుణాకర్‌రెడ్డి ఆగ్రహం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని రెడ్డి సామాజిక వర్గాన్ని రాజకీయంగా, ఆర్థికంగా అణచివేసేందుకు సీఎం చంద్రబాబు భారీ కుట్ర పన్నారని ఓసీ సంక్షేమం సంఘం జాతీయ అధ్యక్షుడు బి.కరుణాకర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడాది క్రితం అధికారం చేపట్టిన చంద్రబాబు అన్ని రంగాల్లోనూ రెడ్లను అణచివేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆదివారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. అందులో భాగంగానే వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డిపై అక్రమ కేసు బనాయించి.. అరెస్టు చేయించారని విమర్శించారు. రెడ్డి సామాజికవర్గానికి చెందిన మిథున్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డితో పాటు ఐపీఎస్ అధికారులపైనా అక్రమ కేసులు బనాయించారని మండిపడ్డారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి డీఎస్పీ, ఆర్డీవో పోస్టుల్లో సైతం సమర్థులైన రెడ్డి అధికారులను నియమించకుండా వివక్ష చూపిస్తున్నారని దుయ్యబట్టారు.

మిథున్ అరెస్టు కూటమి పార్టీల కుట్రే

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు కల్లూరి చెంగయ్య



సాక్షి, అమరావతి: కుట్రలో భాగంగానే కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేసిందని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు కల్లూరి చెంగయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నో హామీలు ఇచ్చి..ఇప్పుడు వాటిని అమలు పరచకుండా ప్రజలను కూటమి ప్రభుత్వం మోసం చేస్తోందని మండిపడ్డారు. హామీల అమలుపై ప్రభుత్వాన్ని వైఎస్సార్‌సీపీ నిలదీస్తుండటంతో ఏం చేయాలో తోచక ప్రభుత్వం ఇలా అక్రమ అరెస్టులకు పాల్పడుతోందని విమర్శించారు.

ప్రజల దృష్టి మళ్లించేందుకే అక్రమ కేసు

మద్యం అంశానికి సంబంధించి సమగ్ర వివరాల కోసం క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయగలరు

జరగని లిక్కర్ స్కామ్‌ను జరిగినట్లు చిత్రీకరిస్తున్నారు
ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం
సీఎం చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఆగ్రహం

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ లోక్‌సభ పక్ష నేత, ఎంపీ పీవీ మిథున్ రెడ్డి అక్రమ అరెస్టును వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. టీడీపీ ప్రభుత్వ వైఫల్యాలు, మోసాలను కప్పిపుచ్చుకోవడానికి, వాటి నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి.. జరగని లిక్కర్ స్కామ్ జరిగినట్లు చిత్రీకరిస్తూ.. వైఎస్సార్‌సీపీ నాయకులపై తప్పుడు వాంగ్మూలాలతో అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ కక్ష సాధింపు చర్యలకు సీఎం చంద్రబాబు రాష్ట్ర సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు. 2014–19 మధ్య జరిగిన అనేక కుంభకోణాల్లో.. తీవ్రమైన అవినీతి కేసుల్లో నిందితుడైన చంద్రబాబు ప్రస్తుతం బెయిల్‌పై ఉన్నారని గుర్తు చేశారు. ఆ కేసుల్లో ఆయనతో పాటు ఆయన సన్నిహితులపై దర్యాప్తు నిలిపేయించుకున్న చంద్రబాబు.. వాటి నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే వైఎస్సార్‌సీపీ నేతలపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ మేరకు మద్యం అంశానికి సంబంధించి వాస్తవాలతో కూడిన సమగ్ర నివేదికను జత చేస్తూ 'ఎక్స్'లో ఆదివారం పోస్టు చేశారు. ఆ పోస్టులో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..



చంద్రబాబు బెయిల్‌పై ఉన్నారనేది తిరుగులేని సాక్ష్యం

'వైఎస్సార్‌సీపీ లోక్‌సభ సభ్యుడు పీవీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇది పూర్తిగా అక్రమ కేసు. ప్రజల తరపున పోరాడేవారి గొంతు నొక్కేయడానికి రూపొందించిన కుట్ర తప్ప మరొకటి కాదు. వరుసగా మూడుసార్లు పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికైన మిథున్ రెడ్డిని బెదిరించి బలవంతంగా సేకరించిన అబద్ధపు వాంగ్మూలాలతో కేసులో అక్రమంగా ఇరికించారు. టీడీపీ ప్రభుత్వ మోసాలు, వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేశారు. ఇది రాజకీయ కక్ష సాధింపు చర్య. జరగని మద్యం స్కామ్‌ను జరిగినట్లుగా చిత్రీకరించడం కేవలం మీడియా నాటకాల కోసం.. నిజమైన సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి సృష్టించిన కల్పిత కథనం తప్ప మరొకటి కాదు. ఈ కుంభకోణం మొత్తం కేసు ఒత్తిడి, బెదిరింపులు, థర్డ్–డిగ్రీ హింస, లంచాలు, ప్రలోభాలాల ద్వారా సేకరించిన తప్పుడు వాంగ్మూలాలపై సృష్టించిందే. 2014–19 మధ్య కాలంలో మద్యం విధానానికి సంబంధించి అక్రమాలపై కేసులో చంద్రబాబు స్వయంగా బెయిల్‌పై ఉన్నాడనే వాస్తవం.. ఆయన ఇప్పుడు ఎందుకు ఇంత దిగజారిపోయాడనేదానికి తిరుగులేని సాక్ష్యం. 2014–19 మధ్య కాలంలో ఆయనపై నమోదైన మద్యం కుంభకోణం కేసును రద్దు చేసుకోవడానికి.. ఇప్పుడు 2024–29 మద్యం విధానాన్ని సమర్థించుకోవడానికి.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూపొందించిన విధానాన్ని చంద్రబాబు తప్పుపడుతున్నారన్నది వాస్తవం.

ఇలాంటి కుట్రలను ధైర్యంగా ఎదుర్కొన్నాం

వైఎస్సార్‌సీపీని అణచి వేయడానికి ఇలాంటి కుట్రలు జరిగిన ప్రతిసారి మేము ధైర్యంగా ఎదుర్కొన్నాం. ప్రజలతో నిలబడి వారి పక్షాన ప్రశ్నించడం, పోరాడటం ద్వారా మేము ఎదిగాము. అన్యాయాలపై రాజీలేని పోరాటాలు చేయడం ద్వారా వైఎస్సార్‌సీపీ ప్రజల హృదయాల్లో పదిలమైన స్థానాన్ని సంపాదించుకుంది. పైన వివరించిన విధంగా టీడీపీ అధికార దుర్వినియోగం ప్రజాస్వామ్యంపై జరిగిన నేరపూరిత దాడి కంటే తక్కువ కాదు. పరిస్థితులు ఎంత తీవ్రంగా ఉన్నా, వైఎస్సార్‌సీపీ ప్రజలతో నిలుస్తుందని, వారి గొంతుకగా, కవచంగా ఉంటుందని నేను ప్రజలకు హామీ ఇస్తున్నాను. మద్యం అంశానికి సంబంధించి సమగ్ర నివేదికను మీ పరిశీలన కోసం జత చేస్తున్నాను.'

గత ప్రభుత్వ విజయాలు అపహాస్యం

మద్యం కుంభకోణం విషయంలో వైఎస్సార్‌సీపీ నాయకులపై తప్పుడు ఆరోపణలు చేస్తూనే.. ప్రస్తుత టీడీపీ కూటమి సర్కార్ వైఎస్సార్‌సీపీ రద్దు చేసిన మద్యం అవినీతి పద్ధతులను పునరుద్ధరిస్తోంది. బెల్ట్ షాపులు, పర్మిట్ రూమ్‌ల పేరుతో మద్యం దుకాణాలు తిరిగి వచ్చాయి. వేలాది బెల్ట్ షాపులు, పర్మిట్ రూమ్‌లను మూసి వేయడం, మద్యం దుకాణాలను గణనీయంగా తగ్గించడం వంటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రస్తుత కూటమి సర్కార్ అపహాస్యం చేస్తూ మళ్లీ పర్మిట్ రూమ్‌లు, బెల్ట్ షాపులు, ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు బ్యాక్ డోర్ మద్యం అమ్మకాలను ప్రోత్సహిస్తోంది. మద్యం నియంత్రణను బలహీన పరుస్తోంది. మద్యం దుకాణాల లైసెన్స్‌లలో మళ్లీ అవినీతి, మాఫియా ప్రవేశించాయి. ఎంపిక చేసిన డిస్టిలరీలకు ఆర్డర్లు ఇవ్వడం ద్వారా 2019లో మేము అమలులోకి తెచ్చిన పారదర్శక ప్రభుత్వ దుకాణాల వ్యవస్థను రద్దు చేసింది.

ఇది రాజకీయ ప్రేరేపిత కేసు

చంద్రబాబు నాయుడు రాజకీయ కక్ష సాధింపు చర్యలకు రాష్ట్ర సంస్థలను, ఎల్లో మీడియాను దుర్వినియోగం చేస్తున్నారు. అనేక తీవ్రమైన అవినీతి కేసుల్లో నిందితుడిగా ఉన్న చంద్రబాబునాయుడు ప్రస్తుతం బెయిల్‌పై ఉన్నారు. ఆయన బెయిల్‌పై ఉన్న కేసుల్లో 2014–19 మధ్య టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు జరిగిన మద్యం కుంభకోణం కూడా ఉంది. అప్పట్లో మద్యం సిండికేటు మాఫియాను పెంచి పోషించి అవినీతిని వ్యవస్థీకరించారు. అధికారంలోకి వచ్చాక, చంద్రబాబునాయుడు తనపై, తన సన్నిహితులపై ఉన్న ఆ తీవ్రమైన అవినీతి కేసుల దర్యాప్తును నిలిపి వేశారు. వాటి నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి, జవాబుదారీతనం నుంచి తప్పించుకోవడానికి వైఎస్సార్‌సీపీ నాయకులను లక్ష్యంగా చేసుకుని రాజకీయంగా ప్రేరేపితమైన మద్యం కేసును రూపొందించడానికి చంద్రబాబు కుట్ర పన్నాడు.

ప్రజల హృదయాల్లో పాతుకుపోతున్నారని..

టీడీపీ నిజమైన ఎజెండా ఇప్పుడు స్పష్టంగా ఉంది. దర్యాప్తు ముసుగులో వైఎస్సార్‌సీపీ నాయకులను అరెస్టు చేయడానికి, వారిని నిరవధికంగా జైలులో ఉంచడానికి చట్టపరమైన ప్రక్రియను లాగడానికి వారు సిట్‌ను ఉపయోగించాలనుకుంటున్నారు. కానీ.. విచారణ ప్రారంభమైన తర్వాత అసలు నిజం బయట పడుతుంది. ఇది పూర్తిగా చట్టపరమైన అర్హత లేని నిరాధారమైన, రాజకీయంగా ప్రేరేపితమైన కేసు. వైఎస్సార్‌సీపీ నాయకులను అరెస్టు చేస్తున్నది వారు దోషులు కాబట్టి కాదు.. ప్రజల హృదయాల్లో లోతుగా పాతుకుపోతున్నారు కాబట్టి. ఇది చట్టపరమైన ప్రక్రియ కాదు. ఇది బలమైన ప్రతిపక్షాన్ని అస్థిర పరచడానికి ఉద్దేశించి సాగిస్తున్న రాజకీయ వేట.

లిక్కర్ స్కాం కేసులన్నీ భోగస్

ఈ కుంభకోణంలో ఆధారాల్లేవని 'సిట్' అంగీకరిస్తోంది

- ఇప్పటివరకు ఒక్క ఆధారం కూడా చూపలేకపోయింది
- వేధింపుల కోసమే ఈ తప్పుడు అరెస్టులు
- వీటి ఉసురు బాబుకు తగులుతుంది
- చంద్రబాబుకు ధైర్యముంటే ఆయన హయాంలో లిక్కర్ స్కాంపై కేంద్ర దర్యాప్తు కోరాలి
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి ఫైర్

సాక్షి ప్రతినిధి, విజయవాడ: సీఎం చంద్రబాబుకు అక్రమ కేసుల ఉసురు తగులుతుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం లిక్కర్ స్కాం పేరుతో చేస్తున్న అరెస్టులన్నీ అక్రమమేనన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ఏసీబీ కోర్టు బయట సజ్జల ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. కేవలం వైఎస్సార్‌సీపీని వేధించేందుకే లేని లిక్కర్ స్కాంను సృష్టించారని ఆరోపించారు. ఇందులో ఒక్క ఆధారాన్ని కూడా గుర్తించలేకపోయామని స్వయంగా 'సిట్' బృందమే అంగీకరిస్తోందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో మద్యం కుంభకోణంలో ఆధారాలతో సహా అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబు ఆ కక్షతోనే ఈ కేసులు పెట్టిస్తున్నారని ఫైర్ అయ్యారు. సజ్జల ఇంకా ఏమన్నారంటే..



వైఎస్ జగన్ హయాంలో మద్యం విక్రయాలను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోంచి తీసుకుని ప్రభుత్వమే నిర్వహించింది. ఇందులో కుంభకోణం ఎలా జరుగుతుంది? అంతకుముందు మద్యం విచ్చలవిడిగా ఏరులైపారుతున్న పరిస్థితిని నిర్మూలించి, నిర్దిష్టమైన వేళల్లో మాత్రమే, ప్రభుత్వం ఏర్పాటుచేసిన షాపుల్లోనే మద్యం లభించేలా చర్యలు తీసుకుంది. దీనివల్ల దాదాపు 20 వేల మందికి ఉపాధి కూడా కల్పించాం. ప్రతి మద్యం బాటిల్ వినియోగదారులు కొనుగోలు చేసిన తరువాత మాత్రమే ఆ చెల్లింపు డిస్టిలరీకి వెళ్లే విధానం అమలుచేశాం. డిస్టిలరీలకు ఎక్కువ ఆర్డర్లు వస్తేనే, వారికి లాభాలొస్తాయి. అప్పుడే వారు ఎవరికైనా లంచాలు ఇచ్చేందుకు అవకాశం ఉంటుంది. మా ప్రభుత్వం మద్యం ఆర్డర్లను తక్కువగా ఇవ్వడంవల్ల డిస్టిలరీలకు ఆదాయం తగ్గిపోయింది. అలాంటప్పుడు వారు లంచాలిచ్చే స్థాయిలో ఉంటారా?

ప్రతిఫలం అనుభవించక తప్పదు..

కూటమి పేరుతో అధికారంలోకి వచ్చాక సీఎంగా చంద్రబాబు తాను ఇచ్చిన హామీలను గాలికొదిలేసి వేధింపులకు దిగారు. మద్యం స్కాంలో చార్జిషీట్ వేసి 90 రోజులైంది. ఒక్క ఆధారం కూడా చూపించలేకపోయారు. పైగా సమయం కావాలంటున్నారు. ఈ చార్జిషీట్‌లో వైఎస్ జగన్ పేరు పెట్టడం కుట్ర కాదా? గతంలో చంద్రబాబు చేసిన అవినీతికి అన్ని ఆధారాలున్నాయి. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో ఫైళ్లపై చంద్రబాబు సిఫార్సులు, సంతకాలున్నాయి. ఇప్పుడు వారంటున్న లిక్కర్ స్కాంలో ఇలా ఏదైనా ప్రాథమిక ఆధారాలు చూపగలరా? లిక్కర్ స్కాం ముసుగులో చంద్రబాబు చేస్తున్న ఈ దాడికి ఆయన, ఆయన పార్టీ ప్రతిఫలం అనుభవించక తప్పదు. న్యాయ ప్రక్రియ ద్వారా వారిపై చర్యలు తీసుకుంటాం. చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే ఆయన హయాంలో జరిగిన లిక్కర్ స్కాం, మా హయాంలో జరిగిన లిక్కర్ స్కాంపై ఆరోపణలను కేంద్ర సంస్థలకు ఇచ్చి రెండింటిపైనా విచారణ చేయమని అడగాలి.

నోటికి ఏదొస్తే అది..

మద్యం స్కాం పేరుతో మొదట్లో రూ.50 వేల కోట్లు, ఆ తరువాత రూ.30 వేల కోట్లు, మళ్లీ రూ.18 వేల కోట్లు, ఇప్పుడు రూ.3 వేల కోట్ల అవినీతి అంటున్నారు. అంటే.. అసలు నిజంగా ఈ స్కాం జరిగి ఉంటే ఎంత అవినీతి జరిగిందో మీ వద్దే సరైన ఆధారాల్లేవు. కేవలం ఏదో ఒకరకంగా దీనిని స్కాం అని చూపించేందుకు ఇలా రూ.50 వేల కోట్ల నుంచి రూ.3వేల కోట్లకు లెక్కలను మార్చుకుంటూ వచ్చారు. దీనినిబట్టే ఇదంతా అబద్ధమని తేలిపోతోంది. ఇక ఈ మద్యం డబ్బును ఎన్నికల్లో ఖర్చుపెట్టారని, ఆస్తులు కొన్నారని, దుబాయ్, ఆఫ్రికా దేశాల్లో పెట్టుబడులు పెట్టారని.. సినిమాలు తీశారని.. బంగారం కొన్నారని ఇలా నోటికేది వస్తే అది మాట్లాడారు. అంటే.. అసలేమీలేని దానిని, ఏదో ఉందని సృష్టించే ప్రయత్నం చేస్తున్నారనేందుకు మీరు చేస్తున్న ఈ హంగామానే నిదర్శనం.

అక్రమ కేసులకు భయపడం

- గతంలోనూ మా కుటుంబంపై కేసులు
- కుట్రపూరిత రాజకీయాలపై మాజీ మంత్రి పెద్దిరెడ్డి ఫైర్
- రానున్న రోజుల్లో జగన్ గెలుపును ఎవరూ ఆపలేరని వ్యాఖ్య

తిరుపతి మంగళం: వైఎస్సార్‌సీపీకి పట్టుకొమ్మల్లా, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సన్నిహితులుగా ఉన్న వారిపై చంద్రబాబు, లోకేశ్ అక్రమ కేసులు బనాయించి జైళ్లకు పంపుతున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతిలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చంద్రబాబు, లోకేశ్, పవన్‌కళ్యాణ్ పాలనను పక్కన పెట్టి కక్షపూరిత రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. దేశ రాజకీయాల్లోనే జనాదరణ కలిగిన నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, ఆయనను నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారన్నారు. 'ఎన్ని కుట్రలు పన్నినా.. బంగారుపాళ్యం మార్కెట్‌యార్డ్ వద్ద ముగ్గురు ఎస్పీలను పెట్టి 1,600 మంది పోలీసులతో రైతులు, పార్టీ నేతలు, అభిమానులను ఎక్కడికక్కడ నిర్బంధించాలని చూసినా ఎగిసిపడిన జనప్రభంజనాన్ని చూశారు కదా చంద్రబాబూ. రాబోయే రోజుల్లో జగన్ గెలుపును ఎవరూ ఆపలేరు. ప్రజలే మీకు తగిన బుద్ధిచెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయి' అని పేర్కొన్నారు.

ఒక్క హామీ కూడా నెరవేర్చని దుర్మార్గుడు చంద్రబాబు

అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ప్రజలకిచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చని దుర్మార్గుడు చంద్రబాబు అని పెద్దిరెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలపై చంద్రబాబు చేయిస్తున్న దాడులు, అరాచకాలు, అక్రమ అరెస్టులను ప్రజలు గ్రహిస్తున్నారని, త్వరలోనే తగిన బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు. గిట్టుబాటు ధరలు, ప్రభుత్వ నుంచి రుణసాయం అందక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే.. అవేమీ పట్టించుకోకుండా వైఎస్సార్‌సీపీ నేతలపై కక్షపూరిత రాజకీయాలు చేయడం ప్రజలంతా గ్రహిస్తున్నారన్నారు. లిక్కర్‌స్కామ్ పేరుతో అక్రమ కేసులు బనాయించి తమ పార్టీ నేతలను జైళ్లకు పంపడం చంద్రబాబు నీచరాజకీయాలకు నిదర్శనమన్నారు. చంద్రబాబు మొదటినుంచీ తమ కుటుంబంపై కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని.. గతంలో ఎయిర్‌పోర్ట్ మేనేజర్‌ను కొట్టారంటూ మిథున్‌రెడ్డిపై తప్పుడు కేసు పెట్టి అరెస్ట్ చేయించారని గుర్తు చేశారు. ఆ తర్వాత కేసు నిలబడలేదన్నారు. మదనపల్లిలో ఫైల్స్ దగ్ధం అంటూ కేసులు పెట్టించారని, అందులో తమ ప్రమేయం లేదన్న విషయం నిరూపితమైందని గుర్తు చేశారు. దాంతో దిక్కుతోచక ప్రభుత్వ భూములు, ఫారెస్ట్ భూములు ఆక్రమించారంటూ వేధింపులకు గురి చేశారన్నారని చెప్పారు. అక్కడ కూడా తామేమీ చేయలేదని తేలడంతో తన కుమారుడు మిథున్‌రెడ్డిపై తప్పుడు కేసులను బనాయించి అరెస్ట్ చేయడం వారి కక్షపూరిత రాజకీయాలకు నిదర్శనమన్నారు. మీ కేసులకు, బెదిరింపులకు బెదిరే వాళ్లెవరూ వైఎస్సార్‌సీపీలో లేరన్నారు. ఎన్ని కేసులు పెట్టినా మిథున్‌రెడ్డితో పాటు తమ పార్టీ నేతలంతా కడిగిన ముత్యాల్లా బయటకు వస్తారని స్పష్టం చేశారు.



లేని స్కామ్ సృష్టించి అరెస్టులా?

- అబద్ధపు వాంగ్మూలాలు తప్ప ఆధారాల్లేవు
- మాజీమంత్రి అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్ర ఎక్సైజ్ శాఖతో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి ఏం సంబంధం ఉందని ఆయనను అరెస్ట్ చేశారని మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ పీఏసీ మెంబర్ అనిల్‌కుమార్ యాదవ్ నిలదీశారు. కూటమి ప్రభుత్వం లేని లిక్కర్ స్కామ్‌ను సృష్టించి కుట్ర పూరితంగా ఎంపీ మిథున్‌రెడ్డిని ఇరికించి, అక్రమంగా అరెస్ట్ చేయించిందని మండిపడ్డారు. ఆదివారం నెల్లూరులో మీడియాతో మాట్లాడుతూ.. జరగని కుంభకోణంలో ఆధారాలు ఎలా సృష్టించాలో అర్థంకాక సిట్ అధికారులే తలలు పట్టుకుంటున్నారన్నారు. ఒక పథకం ప్రకారం స్టేట్‌మెంట్ల ఆధారంగా ఈ లిక్కర్ స్కామ్‌ను టీవీ సీరియల్ మాదిరిగా అల్లుకుంటూ వస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ కేసులతో వైఎస్సార్‌సీపీని అడ్డుకోవాలని అనుకోవడం చంద్రబాబు, లోకేశ్ తెలివి తక్కువ తనమన్నారు.

అబద్ధపు వాంగ్మూలాలు తప్ప ఆధారాలేవి?

రూ.50 వేల కోట్ల కుంభకోణం జరిగిందని ప్రచారం చేసిన చంద్రబాబు, ఎల్లో మీడియా ఆ తర్వాత అంచలంచెలుగా రూ.30 వేల కోట్లు, రూ. 20 వేల కోట్లు, రూ.5 వేల కోట్లు, రూ.3 వేల కోట్లంటూ తగ్గించుకుంటూ వస్తున్నారని, ప్రస్తుతం రూ.2 వేల కోట్ల లిక్కర్ కుంభకోణం జరిగిందని ప్రచారం చేసుకుంటున్నారని అనిల్‌కుమార్ ఎద్దేవా చేశారు. కొందరు అధికారులను బెదిరించి తీసుకున్న అబద్ధపు వాంగ్మూలాలు తప్ప లిక్కర్ కుంభకోణం జరిగినట్టు ఆధారాలు ఒక్కటి కూడా లేదన్నారు.



కుంభకోణం జరిగిందనే ప్రచారాన్ని నమ్మించేందుకే ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారన్నారు. ఈ శాఖతో ఎంపీ మిథున్‌రెడ్డికి కానీ, ఆయన తండ్రి మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి కానీ ఏం సంబంధం లేదన్నారు. లిక్కర్ కుంభకోణంలో మిథున్‌రెడ్డి పాత్ర ఉన్నట్టు నిరూపించే ఒక్క ఆధారం కూడా పోలీసుల వద్ద లేదన్నారు. పెద్దిరెడ్డి కుటుంబం వైఎస్ జగన్‌కు అండగా ఉంటుందన్న కారణంతోనే కుట్ర పూరితంగా అక్రమ కేసులు బనాయించి అరెస్ట్ చేశారని పేర్కొన్నారు. 2017లో మిథున్‌రెడ్డిని అక్రమ కేసులో చంద్రబాబు అరెస్ట్ చేయించినా చివరకు ప్రభుత్వమే తప్పు ఒప్పుకుని విడుదల చేయాల్సి వచ్చిందన్నారు. ఇప్పుడూ అదే జరుగుతుందన్నారు.

దర్యాప్తు చేసేది ఎల్లో మీడియానా?

లిక్కర్ స్కామ్ దర్యాప్తును కూడా పోలీసులు చేయడం లేదని, సుప్రీంకోర్టు నుంచి ఒక లాయర్‌ను పిలిపించుకుని ఆయన సలహా, మార్గదర్శకాలతో వైఎస్సార్‌సీపీ నాయకులే టార్గెట్‌గా కట్టుకథలు అల్లి అరెస్టులు చేస్తున్నారని అనిల్‌కుమార్ పేర్కొన్నారు. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ అనేది లేనట్టు.. తామే దర్యాప్తు చేసినట్టు ఎల్లో మీడియా కథనాలు రాస్తోందన్నారు. ఎవరెవర్ని అరెస్టు చేస్తారో కూడా ముందే కథనాలను వండి వారుస్తోందన్నారు. ఎస్పీ స్థాయి అధికారులు సైతం ఈ ప్రభుత్వంలో పనిచేయలేక రాజీనామా చేసి వెళ్లిపోతున్నారంటే పాలన ఎంత దారుణంగా ఉందో అర్థమైపోతుందన్నారు.

బాబును మించిన నేరగాడు లేడు

- ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్ దుర్మార్గం
- చంద్రబాబు, లోకేశ్ సిట్‌ను కూర్చోబెట్టి ఆడిస్తున్నారు
- మాజీమంత్రి అంబటి రాంబాబు



నగరంపాలెం (గుంటూరు వెస్ట్): వైఎస్సార్‌సీపీ ఎంపీ, పార్లమెంటులో పార్టీ ఫ్లోర్ లీడర్ పి.మిథున్‌రెడ్డిని లిక్కర్ అక్రమ కేసులో కూటమి ప్రభుత్వం అరెస్ట్ చేయడం దుర్మార్గమని మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు అన్నారు. ఆదివారం గుంటూరులో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. ఢిల్లీ రాజకీయాల్లో మాజీ సీఎం వైఎస్ జగన్‌కు మిథున్‌రెడ్డి తోడుగా ఉంటున్నారనే దుగ్ధతో కుట్రకు పాల్పడ్డారని ఆరోపించారు. ఎలాగైనా మాజీ సీఎం వైఎస్ జగన్, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబాన్ని ఇబ్బంది పెట్టాలనేది చంద్రబాబు నైజమని విమర్శించారు. దర్యాప్తునకు ఎంపీ మిథున్‌రెడ్డి సహకరించడం లేదని సిట్ వ్యాఖ్యానించడం సరికాదన్నారు. చంద్రబాబు, లోకేశ్ సిట్‌ను సిట్ అంటూ కూర్చోబెట్టి అంతా వారే నడుపుతున్నారని ధ్వజమెత్తారు. వందలాది మందిని అరెస్ట్ చేసినా.. జైళ్లకు పంపినా, వైఎస్సార్‌సీపీని అణచివేయలేరనేది చంద్రబాబు తెలుసుకోవాలన్నారు. సిట్ చార్జిషీట్‌లో ఏం ఉందనేది ఈనాడు రాస్తోందని, ఆ తర్వాత ఆంధ్రజ్యోతి రాస్తోందని మండిపడ్డారు. విచారణ అంతా ఈటీవీ, ఏబీఎన్, టీవీ–5, టీం ఆఫ్ చంద్రబాబు, లోకేశ్ ఆధ్వర్యంలో నడుస్తోందన్నారు. ఈ కుట్రలను రాష్ట్ర ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని చెప్పారు.

చంద్రబాబు కంటే కుంభకోణాలు ఎవరూ చేయలేదు..

చంద్రబాబును మించిన నేరగాడు దేశంలో ఎక్కడా లేరని, చంద్రబాబు కంటే మద్యం కుంభకోణాలు చేసేవారు కూడా ఎవరూ లేరని అంబటి స్పష్టం చేశారు. ఎమ్మెల్సీని కొనేందుకు డబ్బులిచ్చి పంపించి, మలినమైన రాజకీయం నడిపింది చంద్రబాబు కాదా అని ప్రశ్నించారు. వ్యవస్థలను మేనేజ్ చేయడంలో చంద్రబాబు దిట్ట అని ఆరోపించారు. స్కిల్ డెవలప్‌మెంట్, ఇతరత్రా కేసుల్లోనూ చంద్రబాబు బెయిల్‌పై ఉన్నారని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు, కార్యకర్తలపై చంద్రబాబు పెట్టిన కేసులన్నీ పేక మేడల్లా కూలిపోతాయని, ప్రతి ఒక్కరూ క్లీన్‌చిట్‌తో బయటకు వస్తారని స్పష్టం చేశారు.

మిథున్‌రెడ్డి అరెస్ట్‌పై పుత్తూరులో నిరసన

పుత్తూరు: చంద్రబాబు, లోకేశ్ కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతున్నారని మాజీ మంత్రి రోజా, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి విమర్శించారు. ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టును నిరసిస్తూ ఆదివారం వారు పుత్తూరులోని వైఎస్సార్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అక్రమ అరెస్టులు చేస్తున్న కూటమి ప్రభుత్వం నశించాలంటూ నినాదాలు చేశారు. అనంతరం రోజా మాట్లాడుతూ లిక్కర్ స్కామ్ ఒక అభూతకల్పన అని స్పష్టం చేశారు. పెద్దిరెడ్డి కుటుంబాన్ని ఇబ్బంది పెట్టడం ద్వారా పార్టీ శ్రేణుల్లో భయభ్రాంతులు సృష్టించాలని చూస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీలో ఇలాంటి అక్రమ అరెస్టులకు, కేసులకు భయపడేవారెవరూ లేరని స్పష్టం చేశారు.



నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, పార్టీ నాయకులు



ప్రపంచం జటిలమైన సమస్యలను ఎదుర్కొంటోంది. రకరకాల సమస్యల మధ్యలో ఉంటూ తనలోని ప్రశాంతతను నిలుపుకోవటం ధ్యానం ద్వారానే నేర్చుకోగలరు.
– సయాజీ ఊ బా ఖీన్

సాక్షి
సోమవారం, 21 జూలై 2025

కృత్రిమ రచన

ఆత్మ అనేది కేవలం స్వర్గలోక సంబంధి కాదు. దానికి భౌతిక ఉనికి లేనంతమాత్రాన అది భావవాదులకు మాత్రమే చెందినది కాదు. అదేంటో చూపలేకపోయినా, అది లేకపోవడమంటే ఏమిటో మనకు తెలుసు. ఈ మెటీరియలిస్టు ప్రపంచంలో ఆత్మగల్ల మనుషులను వెతికే ప్రయత్నం కాదిది. కృత్రిమ మేధ (ఏఐ) సందర్భంలో ఆత్మ ప్రాధాన్యతను అర్థం చేయించాలన్న ఆరాటం. మానవీయ సహజ మేధనూ, యాంత్రిక కృత్రిమ మేధనూ విడదీస్తున్నది ముఖ్యంగా ఆ ఒక్కటే!

'ఈ కంప్యూటర్ కాలంలో' అని చెప్పడం నుంచి, 'ఈ కృత్రిమ మేధ కాలంలో' అనడం వరకు పయనించాం. మానవ నాగరికత ఒక క్రమ పరిణామమే అయినా, అది ఒక్కోసారి పెద్ద అంగ వేస్తుంది. నిప్పును పుట్టించడం, విద్యుత్‌ను కనుగొనడం, ఇంటర్నెట్ లాంటి మరో విప్లవాత్మకమైన మార్పు కృత్రిమ మేధ అని పండితులు అంటున్నారు. మనిషి తాను ఎదిగే క్రమంలో ఎన్నో ఉపకరణాలనూ, సాంకేతిక పరిజ్ఞానాలనూ రూపొందించుకున్నాడు. ఆ ఉపకరణాలు, పరిజ్ఞానాల ఊతంగా మరింత ఎదిగాడు. కానీ ఏఐ కేవలం మనిషి చేతిలో మరో పనిముట్టు కాదు, మరో అదనపు పరిజ్ఞానం అంతకన్నా కాదు. అంతకు మించి! పర్యావరణ పరిష్కారాలు సూచిస్తుందంటున్న ఏఐ టెక్నాలజీ నిజానికి అత్యధిక కార్బన్ ఫుట్‌ప్రింట్స్‌కు కారణమవుతోందనీ, జలవనరులను విపరీతంగా తోడేస్తోందనీ పర్యావరణవేత్తలు ఇప్పటికే ఆందోళన చెందుతున్నారు. కానీ ఇవేవీ ఏఐని వ్యతిరేకించడానికి తక్షణ కారణాలు కాదు. ఇతర పరిజ్ఞానాలు కనీసం మన అంచనాలో మనిషిని సుఖపెట్టడానికి రూపొందినవి. కానీ ఏఐ ఏం చేయనుందో మనకు ఏ అంచనా లేదు!

సాహిత్య ప్రపంచంలో కొంతకాలంగా ఉన్న భయం ఈ మధ్య ఒక 'ఓపెన్ లెటర్' రూపం దాల్చింది. యంత్రాలు సృష్టించిన పుస్తకాలను విడుదల చేయకూడదంటూ ఈ జూన్ నెలలో పదుల కొద్దీ రచయితలు అమెరికాలోని పెంగ్విన్ రాండమ్‌హౌజ్, హార్పర్ కొలిన్స్ లాంటి ప్రచురణకర్తలకు బహిరంగ లేఖ రాశారు. ఏఐ–కల్పిత పుస్తకాలను విడుదల చేయడానికి 'రచయితల'ను సృష్టించబోమనీ, ఒకవేళ మానవ రచయితలే అలాంటివి కల్పిస్తే వాటిని 'మారుపేర్ల'తో అనుమతించబోమనీ, ఈ 'దొంగతనానికి' ఏ విధంగానూ మద్దతివ్వబోమనీ ప్రచురణకర్తలు ప్రతిన బూనాలని వారు కోరారు. ఒక పుస్తకం తుదిరూపు వరకు భాగమయ్యే మనుషుల ఉద్యోగాలను ఏఐ టూల్స్‌కు బలిపెట్టకూడదనీ అడిగారు. ఘంటాలను దాటి, పెన్నుకు బదులుగా టైప్ రైటర్‌నో, కంప్యూటర్‌నో వాడటం లాంటి పరిణామం కాదిది. ఏకంగా రచయితనే పక్కకు తప్పించేది! అందుకే రచయితల అనుమతి లేకుండా, రాయల్టీలు చెల్లించకుండా రూపొందిన కృత్రిమ మేధను ప్రచురణకర్తలు వాడకూడదనే విన్నపం కూడా వీటిల్లో ఉంది. ఎటూ 'దోపిడీ'కి గురవుతున్న శ్రమకు పరిహారం కోరుకోవడం ఇది!

సాహిత్యం అంటేనే మానవ అనుభవం. లోలోపలి తరంగం, అంతరంగ జ్వలనం, ఆనంద చలనం. అవేమీ లేని ఏఐ ఎలా రాస్తుంది? 'ఎలక్ట్రిక్ గొర్రెలను కలగంటుందా ఏఐ?' అని అడుగుతాడు కవి డేవిడ్ స్టీర్. 'ఒక రచన చేస్తున్నప్పుడు రచయిత రాస్తున్న ప్రతి పదాన్నీ తెలిసో, తెలియకో ఎంపిక చేసుకుంటాడు. పది వేల పదాల కథకు పది వేల ఎంపికలు. అలాంటి స్పృహ లేనందువల్ల కృత్రిమ మేధ 'కళ'ను సృష్టించలేదంటాడు అమెరికన్ సైన్స్ ఫిక్షన్ రచయిత టెడ్ చియాంగ్. ''ఒక మనిషి మీకు 'ఐ యామ్ సారీ' అని చెప్పినప్పుడు, గతంలో ఇతర జనాలు క్షమాపణ కోరుకున్నారన్నది విషయం కాదు; 'ఐ యామ్ సారీ' అనేది పరిగణించాల్సినంతటి అసాధారణమైన పదబంధం కాదన్నది విషయం కాదు. ఒకవేళ ఒకరు నిజాయితీగా చెబితే, ఆ క్షమాపణ విలువైనదీ, అర్థవంతమైనదీ అవుతుంది; అలాంటి క్షమాపణలు గతంలో చెప్పివున్నప్పటికీ.'' ఒక రచయిత రాసేది అతడిదైన లోలోపలి వాక్యం. అది అతడికి మాత్రమే ప్రత్యేకం. అతడి అనుభవమే ఆ వాక్యం రాయడానికి పురిగొల్పుతుంది. యజమానిని చూడగానే కుక్క ప్రేమగా తోక ఊపుతుంది. దాని అన్ని కండరాలూ సంతోషంతో నర్తించడాన్ని ఆ తోక ఊపు సంకేతిస్తుంది. ఇలాంటి చిరు ఉద్వేగపు అనుభవం కూడా ఉండని ఏఐ ఏం రాయగలదు? ప్రదేశాలు, వస్తువులు మనిషి ఉనికితో ముడిపడి ప్రత్యేకమవుతాయి. ఏఐకి లేనిదే ఆ మహత్తర మానవీయ స్పర్శ. కేవలం అన్నింటినీ రుబ్బి, 'అలాగరిథమ్' వండివార్చే రచనలో ఆత్మ ఎలా ఉంటుంది? మరి, ఎటూ కళ కాకుండాపోయే ఆ ఏఐ కల్పిత కృత్రిమ రచనల పట్ల భయం దేనికి అనేది ప్రశ్న. సగటు పాఠకుడికి ఆ మీడియోకర్ రచనే బాగుందనిపించొచ్చు. ఇక అదే ప్రమాణం అయ్యి, 'అసలు'ది తీర్పునకు లోనవుతుందేమోనని ఒక సృజనాత్మక భయం!

త్రిపురనేని గోపీచంద్ నవల 'పండిత పరమేశ్వర శాస్త్రి'లో ఒక పాత్రను 'సజ్జలు సజ్జలు' అని వెక్కిరిస్తారు అతడి సాహిత్య మిత్రులు. కోడి సజ్జలు తిని సజ్జలు విసర్జిస్తుంది, ఏమీ జీర్ణం చేసుకోకుండానే. ఎంతో మేధావిగా కనబడే ఆ రచయిత, ఏదీ తనలోకి ఇంకించుకోకుండానే మాటలు వల్లెవేస్తుంటాడని వారి ఉద్దేశం అనుకోవాలి. ఏఐ రచనలకు ఈ ఉదాహరణ బాగా పనికొస్తుంది. అయితే, అసలు ఇప్పుడు ఉన్నది ఇంకా 'ఆదిమ' ఏఐ మాత్రమేననీ, ముమ్ముందు ఇంకా ఆధునికం అవుతుందనీ చెబుతున్నారు. అప్పుడు అది ఏ రూపం తీసుకుంటుందో! ప్రస్తుత భయం రచయితను పక్కనపెట్టడం గురించే. ముమ్ముందు మనిషినే పక్కన పెట్టడం అవుతుందేమో! అప్పుడు సమస్త మానవాళి మరొక బహిరంగ లేఖ రాసుకోవాల్సి ఉంటుంది!

అత్యున్నత గౌరవానికి అర్హులు కాదా?

కామెంట్



కరణ్ థాపర్

భారత దేశపు అత్యున్నత పురస్కారం 'భారత రత్న' అనేది తెలిసిన విషయమే. ఎన్నో చర్చలు జరిపి, ఎంతో పరిశీలన చేసి, ఆ తర్వాతే ఈ అవార్డు ఎవరికి ఇవ్వాలో నిర్ణయించాల్సి ఉంటుంది. సంబరాల్లో చమ్కీల్లా వెదజల్లితే ('పందుల ముందు ముత్యాలు పోసినట్లు' అని ఇంగ్లీష్ వాళ్లంటారు, నేను ఆ సామెత ఉపయోగించడం లేదు) దాని విలువ క్షీణిస్తుంది. ఆ పురస్కారం అభాసుపాలు అవుతుంది. ఏమైనా ఈ అవార్డు ఇస్తున్న తీరుపై చర్చ జరగాల్సిందే. వాస్తవాలు మీ ముందుంచుతాను, పరిశీలించండి.

1954లో పద్మ అవార్డులు ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు 53 మందికి భారత రత్న ప్రదానం చేశారు. వీరిలో నా లెక్క ప్రకారం 31 మంది రాజకీయ నాయకులు. అంటే దాదాపు 60 శాతం. ఈ గణాంకాలు పరికిస్తే, ప్రతిభా పాటవాల గుర్తింపుగా కాకుండా వ్యూహాత్మక రాజకీయ ప్రయోజనాలు ఆశించి ఈ అవార్డు ఇస్తున్నట్లు అనిపించడం లేదా? కొన్ని సందర్భాల్లో కాంగ్రెస్ నాయకులకు పార్టీలోని వారి సహచరులు ఈ పురస్కారం ప్రకటించి తమ భక్తిని చాటుకున్నారు. అది అవార్డు ఔన్నత్యాన్ని దిగజార్చడం కాదా? కచ్చితంగా అంతే.


బతికున్నప్పుడు కదా గుర్తించాలి!

మరో కలవరపరిచే వాస్తవం ఏమిటంటే, 18 మంది తమ మరణానంతరమే భారత రత్నకు ఎంపికయ్యారు. బతికున్నప్పుడు వారిని గుర్తించకపోవడం అలక్ష్యం చేసినట్లే అనుకోవాలి. అలా అని మరణానంతరం దశాబ్దాలు గడిచిన తర్వాత ఆ తప్పిదం సరి చేద్దామనుకోవడం కూడా కరెక్టు కాదు. అది అవమానం కాకపోవచ్చుగానీ అవివేకం అవుతుంది. వల్లభ్ భాయ్ పటేల్‌నే తీసుకోండి... మరణానంతరం 41 ఏళ్లకు ఆయన ఈ పురస్కార గ్రహీత అయ్యారు. వాస్తవానికి భారత రత్న ప్రవేశపెట్టక మునుపే ఆయన చనిపోయారు. బి.ఆర్.అంబేడ్కర్, మౌలానా అజాద్ తమ మరణానంతరం 34 ఏళ్లకు ఈ గౌరవం పొందారు. కర్పూరీ ఠాకూర్ చనిపోయిన 36 ఏళ్లకు ఆయనకు ఈ అవార్డు ప్రకటించారు. మదన్ మోహన్ మాలవీయకు అయితే 69 సంవత్సరాల తర్వాత ఇచ్చారు. నిజానికి ఆయన ఇండియాకు స్వతంత్రం రాక మునుపే కన్ను మూశారు. ఈ అర్హులందరకూ ఇవ్వగా లేనిది మహాత్మా గాంధీని మాత్రం ఎందుకు విస్మరించాలి?

ఇక ఈ 53 మందిలో ఎంతమంది ఈ ఇండియా అత్యున్నత పురస్కారానికి అర్హులు? మీరు నాతో ఏకీభవించకపోవచ్చు. మనందరికీ ఎవరి అభిప్రాయలు వారికి ఉంటాయి. నా అంచనా ప్రకారం కనీసం 14 మంది గ్రహీతలకు ఈ అవార్డు పొందే అర్హత లేదు. గోవింద్ బల్లభ్ పంత్, జాకీర్ హుస్సేన్, వి.వి. గిరి, కె.కామరాజ్, ఎం.జి.రామచంద్రన్, రాజీవ్ గాంధీ, మొరార్జీ దేశాయి, గుల్జారీలాల్ నందా, గోపీనాథ్ బోర్డోలాయి, ప్రణబ్ ముఖర్జీ, నానాజీ దేశ్ ముఖ్, కర్పూరీ ఠాకూర్, లాల్ కృష్ణ అద్వానీ, చౌధరీ చరణ్ సింగ్... వీరందరికీ భారత్ రత్న ఇచ్చి ఉండాల్సిందేనా?



సామ్ మానెక్‌శా



దలై లామా



అమితాబ్ బచ్చన్

◆ 1954లో పద్మ అవార్డులు ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకు 53 మందికి భారత రత్న ప్రదానం చేశారు. వీరిలో 31 మంది రాజకీయ నాయకులు. అంటే దాదాపు 60 శాతం. ఈ గణాంకాలు పరికిస్తే, వ్యూహాత్మక రాజకీయ ప్రయోజనాలు ఆశించి ఈ అవార్డు ఇస్తున్నట్లు అనిపించడం లేదా?

ఈ ముగ్గురూ అర్హులే!

ఈ అవార్డుకు తగినవారు లేరని కాదు. తప్పకుండా ఉంటారు. అలాంటి వారిలో కనీసం ఇద్దరి పేర్లు నేను చెప్పగలను. మొదటి వ్యక్తి 'ఫీల్డ్ మార్షల్' ఎస్.హెచ్.ఎఫ్.జె.మానెక్‌శా. ఆయన నిస్సందేహంగా దేశం గర్వించదగిన మిలిటరీ హీరో. మనం తిరుగులేని విధంగా గెలిచిన ఏకైక యుద్ధాన్ని (1971 బంగ్లాదేశ్ విమోచన యుద్ధం) నడిపింది ఆయనే. ఫీల్డ్ మార్షల్ ర్యాంకు ఇచ్చిన మాట నాకు తెలుసు. కానీ మానెక్‌శా వంటి వ్యక్తికి భారత రత్న కూడా ఇచ్చి ఉండాల్సింది. ఆయన ఇప్పుడు లేరు కదా అనే వాదన చెల్లదు. అలా చెప్పి నిరాకరిస్తే, అది ద్వంద్వ ప్రమాణాలు పాటించడం, కపటత్వం అవుతుంది.

నేను చెప్పబోయే రెండో వ్యక్తి కూడా ఈ అత్యున్నత పురస్కారం ప్రదానం చేయదగిన వ్యక్తే. మరి మన ప్రభుత్వానికి అంతటి దార్శనికత, వివేకం ఉన్నాయా? నేను ప్రస్తావిస్తున్న ఆ వ్యక్తి దలై లామా. ఈ దేశంలోనే ఉంటున్న దలై లామా తనను తాను భారత పుత్రుడిగా భావిస్తారు. ఆయన ఔన్నత్యాన్ని ప్రపంచం గుర్తించినా, మనం మాత్రం గుర్తించలేక పోతున్నాం. లేదంటే చైనాను నొప్పించడం మనకు ఇష్టం లేదా?

1989లో ఆయనకు నోబెల్ శాంతి బహుమతి లభించింది. అంటే మనం ఇప్పటికే 36 ఏళ్లు వెనుకబడ్డాం. వాస్తవానికి, నోబెల్ కమిటీ కంటే ముందే మనం ఆయన్ను ఈ అవార్డుతో సత్కరించి ఉండాల్సింది. దలై లామా ఇటీవలే తన 90వ పుట్టిన రోజు జరుపుకొన్నారు. ఇదొక మైలురాయి వంటిది. కనీసం దీన్నయినా ఒక అవకాశంగా మార్చుకుని ఆయనకు భారత రత్న ప్రకటించాలి. తద్వారా మన పొరబాటును దిద్దుకోవచ్చు. మీరేమంటారు? దలై లామాకు ప్రదానం చేయడం ద్వారా భారత రత్న ఔన్నత్యం పెంచినట్లు కూడా అవుతుంది.

మనం ఈ పురస్కారానికి పరిశీలించవలసిన వ్యక్తి మరొకరు కూడా ఉన్నారు. ఆయన అమితాబ్ బచ్చన్. ఆయన కంటే ముందు కూడా గొప్ప నటీనటులు ఉన్నారన్న వాస్తవాన్ని నేను కాదనడం లేదు. వారు ఈ గౌరవం పొందకుండానే పరమపదించారు. బచ్చన్ నేటికీ మన మధ్యే ఉన్నారు. ఆయన లెజెండ్‌లా భాసించారు. చాలా మంది దృష్టిలో ఇప్పటికీ కూడా లెజెండే. 1992లో భారత రత్న వరించిన సత్యజిత్ రాయ్, లేదా 2001లో ఈ సత్కారం పొందిన లతా మంగేష్కర్ అంత గొప్పవాడు. ఆయనకు భారత రత్న ఎందుకు ఇవ్వకూడదు? నటనలో ఇప్పటి వరకు ఎవరికీ ఈ అవార్డు లభించలేదు. ఆ చరిత్ర సృష్టించిన తొలి వ్యక్తి అమితాబ్ బచ్చన్ ఎందుక్కాకూడదు?

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

మారిన శాతాలు



పదిహేనేళ్ల క్రితం, అన్ని పన్నుల్లో కార్పొరేట్లు దాదాపు 70 శాతం చెల్లించేవి. మన వినియోగదారుల వాటా మిగతాది. ఇప్పుడు మనం దాదాపు 60 శాతం చెల్లిస్తున్నాం. కార్పొరేట్లు మిగతాది. కార్పొరేట్ల పన్నుల్లోకి కార్పొరేట్ ట్యాక్స్, కస్టమ్స్, ఎక్సైజ్ డ్యూటీ; వినియోగదారుల పన్నుల్లోకి ఆదాయ పన్ను, జీఎస్టీ(గతంలో సేల్స్ ట్యాక్స్, సర్వీస్ ట్యాక్స్) లెక్కించాను.

– అనింద్యో చక్రవర్తి, ఫైనాన్స్ జర్నలిస్ట్

మితమే హితం



మామూలుగా ఆరోగ్యకరమైనదే అయినప్పటికీ, అందులో 30–50 శాతం తక్కువ తినడం ద్వారా జీవులు సుదీర్ఘంగా బతుకుతాయనీ, వయసు పెరిగినా ఆరోగ్యంగా ఉంటాయనీ అధ్యయనాలు చెబుతున్నాయి. అందుకే డైటింగ్ చేయనక్కర్లేకుండానే తక్కువ తినేలా మన శరీరాన్ని 'మోసపుచ్చే' మిశ్రమాల కోసం పరిశోధకులు శోధిస్తున్నారు.

– ఫ్రాంక్ లిప్‌మాన్, ఫంక్షనల్ మెడిసిన్ డాక్టర్

ఐదు బహుమానాలు



మొదటి బహుమానం జీవితం. రెండో బహుమానం ఆరోగ్యం. మూడో బహుమానం ప్రేమించడం, ప్రేమను పొందడం. నాలుగో బహుమానం మనశ్శాంతి. ఐదో బహుమానం దేన్ని ఎక్కువగా ప్రశంసించాలో తెలిసే వివేకం. ఇంతకంటే పట్టించుకోవాల్సిన బహుమానాలు మరేమీ లేవు.

– వాలా అఫ్షార్, డిజిటల్ ఇవాంజెలిస్ట్

విలువలు తారుమారు



ఆధునిక విశ్వవిద్యాలయం ఎలాంటిదంటే, గట్టి ప్రశ్నలు అడిగే సైంటిస్టును ప్రమాదకారిగానూ, నిజాన్ని దాచిపెట్టే అడ్మినిస్ట్రేటర్‌ను నాయకుడిగానూ చూస్తుంది.

– జేసన్ లోకాసలే, శాస్త్రవేత్త

పాక్ కీలుబొమ్మ



బంగ్లాదేశ్ సైన్యాన్ని ఇప్పుడు ఐఎస్ఐ నియంత్రిస్తోంది. వాళ్ల సైన్యం నుంచి శిక్షణ తీసుకోవడానికి బంగ్లాదేశ్ సైన్యం పాకిస్తాన్‌కు వెళ్తోంది. దాని ఫలితంగా, ఆర్మీ బస్సులను పాకిస్తాన్‌కు నచ్చే జమాత్–ఎ–ఇస్లామీ బృంద కార్యక్రమాల కోసం వాడుతున్నారు. బంగ్లాదేశ్ ఎంతగా రాజీ పడిపోయిందో అర్థంకానివాళ్లు ఇంకా ఎవరైనా ఉన్నారా?

– ఆసిఫుర్ రహమాన్ చౌధురీ, యాక్టివిస్ట్

సైకిల్ డేస్



నేను ఐదో తరగతిలో ఒక చిన్న దుకాణం నుండి సైకిల్‌ను అద్దెకు తీసుకునేవాడిని. ఆ దుకాణదారు చాలా మంచాయన. గంటకు యాభై పైసలకే హెర్క్యులస్ సైకిల్‌ను నాకు కిరాయికి ఇచ్చేవాడు. అవి అమాయక కాలపు స్వచ్ఛమైన ఆనందకర రోజులు. ఇవ్వాళ దాదాపు 40 ఏళ్ల తర్వాత, నేను ఆయన్ని మళ్లీ కలిశాను – కిరాయి సైకిళ్ల ఓనర్‌గా కాదు, నా పేషెంట్‌గా. ఆయన వెంటనే నన్ను గుర్తుపట్టాడు. మాటల్లో మేము మళ్లీ ఆ పాతరోజులకు రవాణా అయిపోయాం. జీవితం ఒక పూర్తి చక్రం తిరిగిన క్షణాలవి!

– పి.కామత్, ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్

ఇన్ బాక్స్

విప్లవ వీరుడి ప్రయాణం

బ్రిటిష్ నిరంకుశ పాలనలో గిరిజనులు అనుభవిస్తున్న దయనీయ పరిస్థితిని తొలగించి, గిరిజనుల జీవితాలలో వెలుగు నింపడానికి అల్లూరి సీతారామరాజుతో కలసి బ్రిటిష్ వారి గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన ఆదివాసీ వీరుడు గాం మల్లుదొర. 1922 నుంచి 1924 వరకు సాగిన మన్యం విప్లవంలో ముఖ్యుడు. అల్లూరి సైన్యంలో ఎంతో పేరు పొందిన గాం సోదరుల్లో ఒకరు.



గాం మల్లుదొర

అప్పట్లో నర్సీపట్నం నుండి లంబసింగి వరకు రోడ్డు నిర్మాణం జరుగుతుండేది. ఆ పనికి కూలీలుగా వచ్చిన ఆది వాసీలకు కూలీ డబ్బులు సరిగా ఇచ్చేవారు కాదు. అప్పటికే బ్రిటిష్ ప్రభుత్వం ఆంక్షల వల్ల ఆదివాసీలు సంప్రదాయ సేద్యానికీ, ఇతర అటవీ జీవన విధానానికీ దూరం కావలసి వస్తోంది. మన్యం ప్రాంతంలో తిరుగుతూ ఆదివాసీల్లో చైతన్యం తెచ్చేందుకు ప్రయత్నిస్తున్న సీతారామరాజును కలిసిన గాం మల్లు దొర, గంటం దొర ఆయనతో చేతులు కలిపి మన్యం విప్లవానికి తెరలేపారు.

1923 సెప్టెంబర్ 17న మల్లు దొర నడింపాలెం అనే ఊళ్లో ఉన్నాడనే సమాచారంతో బ్రిటిష్‌వాళ్లు ఆయన్ని అరెస్టు చేశారు. వాల్తేరు ఏజెన్సీ జడ్జి 1924 అక్టోబర్ 23న మల్లు దొరకు మరణశిక్ష విధించారు. మద్రాస్ హైకోర్టుకు అప్పీలు చేయడంతో కింది కోర్టు ఇచ్చిన తీర్పును రద్దుచేస్తూ జీవిత కాలపు శిక్షగా మార్పుచేసింది. దీంతో ఆయన్ని అండమాన్ సెల్యులార్ జైలుకు పంపారు. 13 సంవత్సరాల 6 నెలలు దుర్భర కారాగార జీవితం అనుభవించారు.

స్వాతంత్ర్యం అనంతరం 1952లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో విశాఖపట్నం ఎస్టీ రిజర్వుడు స్థానం నుండి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి గెలిచారు. పార్లమెంట్‌లో తన తొలి ప్రసంగంలో అల్లూరి సీతారామరాజు నాయకత్వంలో జరిగిన స్వాతంత్ర్య పోరాటం గురించి వివరించారు. ఆయన ప్రసంగం ముగిసిన తర్వాత ప్రధాని నెహ్రూ సహా సభ్యులందరూ లేచి చప్పట్లు కొడుతూ అభినందించారు. అలాగే అప్పటి రాష్ట్రపతి డా॥ రాజేంద్ర ప్రసాద్ మల్లుదొరతో ప్రత్యేకంగా సమావేశ మయ్యారు. ప్రధాని నెహ్రూతో ఉన్న సాన్నిహిత్యం వల్ల కాంగ్రెస్ పార్టీలో చేరారు. 1957 పార్లమెంట్ ఎన్నికల్లో కొత్తగా ఏర్పడ్డ గొలుగొండ పార్లమెంట్ సీటును ఆశించినా కాంగ్రెస్ నిరాకరించింది. దీంతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. తన స్వగ్రామం అయిన లంకవీధి గ్రామంలో నివాసం ఉంటూ తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో జీవనం సాగించారు. అప్పటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి మల్లుదొర దైన్య స్థితిని తెలుసుకుని కొంత ఆర్థిక సాయం అందించారు. చివరి రోజుల్లో తీవ్ర అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటూ 1969 జూలై 21న తుదిశ్వాస విడిచారు.

– ఎన్. సీతారామయ్య, పాడేరు । 94409 72048

(జూలై 21న మన్యం విప్లవ వీరుడు గాం మల్లుదొర వర్ధంతి)

టెక్నాలజీతో మేలెంత? కీడెంత?

విశ్లేషణ



బి.టి. గోవిందరెడ్డి

రోజుకో కొత్త ఏఐ టూల్ అందుబాటులోకి వస్తున్న కాలమిది. విద్య, వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయం, తయారీ రంగం ... ఇలా అన్ని చోట్లా కృత్రిమ మేధ విస్తరిస్తోంది కూడా. అయితే... నిత్యజీవితంలోకి చొచ్చుకొచ్చేస్తున్న కృత్రిమ మేధ, ఆధునిక సాంకేతికత మన ఆలోచనా శక్తిపై చూపుతున్న ప్రభావం ఏంటి? వీటిపై ఆధారపడుతూ మనం మెదళ్లతో ఆలోచించడం తగ్గించేస్తున్నామా? తార్కికత, జ్ఞాపకశక్తి, హేతుబద్ధత వంటి మన మేధోశక్తులను టెక్నాలజీ కోసం చేజేతులా వదులుకుంటున్నామా?

టెక్నాలజీ ప్రభావం మనపై ఎలా ఉంటుందో సులువుగా అర్థం చేసుకోవాలంటే... మొబైల్ అప్లికేషన్ల వాడకాన్ని గమనించండి. సోషల్ మీడియాలో రెండు, మూడు నిమిషాలుండే షార్ట్ వీడియోలు, రీల్స్‌కు కొన్ని కోట్ల మంది బానిసలైపోయారంటే అతిశయోక్తి కాదు. గంటల కొద్దీ పొట్టి వీడియోలు చూస్తుండటం తెలిసిందే. ఈ వ్యసనంలో మన మెదడుకు పనేమీ లేదు. చకచక కనిపిస్తున్న సమాచారాన్ని స్వీకరించడం మినహా. అయితే ఇలా చేయడం వల్ల మన మెదడు చాలా వేగంగా వినోదం అనే అనుభూతిని పొందుతుంది. ఇలా రోజూ గంటల తరబడి చూడటం అలవాటైన తర్వాత మన ఏకాగ్రత దెబ్బతింటుంది. డిజిటల్ డివైసెస్ స్క్రీన్ల ముందు ఎక్కువ సమయం గడిపితే మన మెదడులోని నాడీ మార్గా(న్యూరల్ పాథ్‌వే)లలో మార్పులు జరుగుతాయని ఇప్పటికే జరిగిన కొన్ని అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి.

డిజిటల్ టూల్స్ జ్ఞాపకశక్తితో పని లేకుండా చేయడమే కాకుండా... సంక్లిష్టమైన పనులను కూడా సులువుగా అర్థమయ్యేలా చేయడం ద్వారా ఆలోచించే అవసరం లేకుండా చేస్తాయి. ఇంకో మాటలో, నేర్చుకునేందుకు నేరుగా అవకాశం కల్పించకుండా విషయాలను అరటిపండు ఒలిచినట్టు ఒలిచి పెడతాయన్న మాట.

అయితే ఆన్‌లైన్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్స్ డిజైన్ బాగా ఉంటే మనకు మేలే జరుగుతుంది. ఆటో కంప్లీట్, డిజిటల్ కాలిక్యులేటర్లు, వ్యాకరణాన్ని సరిచేసే టూల్స్ వంటివి మన పనిని సులువు చేయడంతోపాటు ఈ పనులపై పెట్టాల్సిన శ్రమను తగ్గిస్తాయి. ఇంటర్నెట్, డిజిటల్ టూల్స్‌ను తగిన రీతిలో వాడుకుంటే మన మెదడు సమాచారాన్ని మరింత సమర్థంగా ప్రాసెస్ చేయగలదు. అవసరమైన విషయాలను జ్ఞాపకాల పొరల్లోంచి మెరుగ్గా అందివ్వగలదు. తద్వారా మన మేధాశక్తి మెరుగవుతుంది.

ఇంటర్నెట్ ద్వారా మన మేధకు ఎదురయ్యే సవాళ్లు ఎన్నో ఉన్నాయి. ప్రధానంగా అతిగా



◆ డిజిటల్ సాధనాలపై అధికంగా ఆధారపడటం వల్ల మెదడుకు పని తగ్గిపోతుంది. ఆలోచనా సామర్థ్యం దెబ్బతింటుంది. రోజూ గంటల తరబడి పొట్టి వీడియోలు, రీల్స్ చూడటం అలవాటైన తర్వాత ఏకాగ్రత దెబ్బతింటుంది. డిజిటల్ డివైసెస్ స్క్రీన్ల ముందు ఎక్కువ సమయం గడిపితే మన మెదడులోని నాడీ మార్గా (న్యూరల్ పాథ్ వే)లలో మార్పులు జరుగుతాయి.

సమాచారం అందడం వల్ల మెదడు దేనిని గ్రహించాలో తెలియక ఒత్తిడికి గురవుతుంది. ఫలితంగా నేర్చుకునే సామర్థ్యం తగ్గుతోంది. అధిక సమాచారం మన నిర్ణయ సామర్థ్యంపై ప్రభావం చూపుతుందనీ, మేధపై ఒత్తిడిని పెంచుతుందనీ... ఫలితంగా నేర్చుకున్నది మనకు గుర్తుండే అవకాశాలు తగ్గిపోతాయనీ ఇప్పటికే జరిగిన పలు పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి.

తగిన రీతిలో మన మెదడును వాడుకోకపోతే కాలక్రమంలో దీని నిర్మాణంలోనూ తేడాలొస్తాయి. అయితే టెక్నాలజీ నేరుగా మెదడు కుంచించుకుపోయేలా చేస్తుంది అనేందుకు ప్రస్తుతానికి స్పష్టమైన రుజువుల్లేవు. మన మెదడులోని న్యూరాన్లు అవసరానికీ, కొత్త పరిస్థితులకూ, టూల్స్‌కూ తగ్గట్టుగా తమని తాము మార్చుకోగలవు. తగిన విధంగా వాడుకోకపోవడం వల్ల మెదడు చేసే కొన్ని పనుల సామర్థ్యం తగ్గవచ్చునేమో కానీ... టెక్నాలజీ ద్వారా కొన్నింటిని పెంచుకోవచ్చు కూడా. వీడియో గేమ్‌లను ఉదాహరణగా తీసుకుంటే... వీటితో ప్రాదేశిక తార్కికత (స్పేషియల్ రీజనింగ్), మల్టీటాస్కింగ్ సామర్థ్యాలు పెరుగుతాయని పరిశోధనలు చెబుతున్నాయి.


అధిగమించడమెలా?

డిజిటల్ టెక్నాలజీల ద్వారా వస్తున్న మేధో సంబంధిత సమస్యలను అధిగమించేందుకు: సోషల్ మీడియా బ్రౌజింగ్ లేదా ఇతర డిజిటల్ అలవాట్లను రోజులో నిర్దిష్ట సమయానికి పరిమితం చేయాలి. వారంలో ఒక రోజు స్మార్ట్ ఫోన్ లేదా కంప్యూటర్‌లో షార్ట్స్, రీల్స్‌ను చూడకుండా నియంత్రించుకోవాలి. ఏకాగ్రతను, వాస్తవికంలో ఉండేట్టు చేసే 'మైండ్‌ఫుల్‌నెస్ టెక్నిక్'లను ఉపయోగించాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం మన మేధాశక్తికి బలం చేకూరుస్తుందనీ, జ్ఞాపకశక్తిని పెంచడంతోపాటు ఇతర లాభాలు చేకూరుస్తుందనీ పరిశోధనలు చెబుతున్నాయి. పుస్తకాలు చదవడం మన ఏకాగ్రతను పెంచేందుకు మంచి మార్గం. ఈ మధ్యకాలంలో బాగా ప్రాచుర్యంలోకి వచ్చిన 'డిజిటల్ డీటాక్స్'ను మొదలు పెట్టాలి. సోషల్ మీడియా, డిజిటల్ కంటెంట్‌ను నిర్దిష్ట సమయం పాటు దూరంగా ఉండే ఈ డిజిటల్ డీటాక్స్ వల్ల టెక్నాలజీపై ఆధారపడే అలవాటు తగ్గుతుంది. అలాగే ప్రకృతికి దగ్గరగా జీవించడం, కళల పట్ల అభిరుచిని పెంచుకోవడం వంటివి సత్ఫలితాలను ఇస్తాయి. రోజూ తగినంత సమయం నిద్రపోవడం కూడా మన జ్ఞాపకశక్తి బలపడేందుకు, మేధోశక్తి పెరిగేందుకు దోహదపడుతుంది. ఈ పద్ధతులు అన్నింటినీ పాటించడం ద్వారా టెక్నాలజీ సవాళ్లను అధిగమించవచ్చు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సత్పురుషుల లక్షణం

పురాణ, ఇతిహాసాల్లో పేర్కొన్న దేవతల చర్యలలో ఏదో ఒక సందేశం తప్పక ఇమిడి ఉంటుంది. మనుషులు అలా ప్రవర్తించాలి అనే హితబోధ ఉంటుంది. రావణ సంహారానంతరం, హనుమంతుడు సీతాదేవికి ఆ విజయ వార్త వినిపించి, ''ఈ అశోక వనంలో భర్త ఎడబాటుతో నువ్వింత దుఃఖంలో ఉన్నప్పుడు ఈ రాక్షస స్త్రీలు నిన్ను తమ మాటలతో దారుణంగా హింసించారు. నీకు అప్రియం చేసిన వీళ్ళను వివిధ విధాలుగా పీడిస్తాను. అనుమతిని''మ్మని ప్రార్థిస్తాడు.



జ్యోతిర్మయం

అప్పుడు జానకి ''వీరంతా రావణుని ఆజ్ఞకు బద్ధులు. వీళ్లపై కోపం ఎందుకు? ఈ కష్టం అంతా నా పూర్వ కర్మఫలం అని నమ్ముతున్నాను. వీళ్ళ దోషం లేదు. నేను వీళ్ళను మన్నిస్తున్నాను. ఒకవేళ వీళ్ళు స్వతంత్రులుగా నన్ను బాధ పెట్టినా వీళ్లను మన్నిస్తాను'' అంటూ ఒక కథ చెప్పింది.

''ఒక అడవిలో వేటగాణ్ణి పెద్దపులి తరుముకు వస్తే అతడు చెట్టు ఎక్కుతాడు. చెట్టుపై ఎలుగుబంటి ఉంది. పులి దానితో 'ఈ చెట్టు ఎక్కిన మానవుడు మనకు శత్రువు, ఇతణ్ణి కిందకి తోసేయ'మంటుంది. ఎలుగుబంటి 'శత్రువు నైనా దగ్గరకు వస్తే కాపాడటం నా ధర్మం' అంటుంది. తర్వాత ఎలుగుబంటి నిద్రపోయింది. పులి కోపంతో వేటగానితో 'నిన్ను వదిలేస్తాను, నువ్వు ఈ ఎలుగుబంటిని కిందకు తోసేయ'మంటుంది. ఆ వ్యక్తి అలా చేయగానే, ఎలుగుబంటికి మెలకువ వచ్చి, పడిపోకుండా ఇంకో కొమ్మను పట్టుకుంటుంది.

అప్పుడు పులి, ఎలుగుబంటితో 'నీలాంటి ఉపకారికి ఈ మానవుడు అపకారం చేశాడు చూశావా? ఇప్పటికైనా అతణ్ణి కింద పడేయ'మంటుంది. అప్పుడు ఎలుగుబంటి, 'అపకారికి ఉపకారం చేయటం మంచి లక్షణం. ఇతనికి నేను అపకారం చేయను' అంటుంది. కాబట్టి, ఎదుటివారు పాపకర్ములు అయినా వారిని క్షమించటమే సత్పురుషుల లక్షణం' అని సీతాదేవి పలుకుతుంది.

ఇది విన్న హనుమంతుడు 'రాముని తగిన ధర్మపత్నివి' అని నమస్కరిస్తాడు.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** బ.ఏకాదశి ఉ.8.36 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** రోహిణి రా.9.04 వరకు, తదుపరి మృగశిర, **వర్జ్యం:** ప.1.34 నుండి 3.04 వరకు, తదుపరి రా.2.21 నుండి 3.51 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.31 నుండి 1.23 వరకు, తదుపరి ప.3.07 నుండి 3.59 వరకు, **అమృతఘడియలు:** సా.6.04 నుండి 7.35 వరకు, మతత్రయ ఏకాదశి; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.38, **సూర్యాస్తమయం:** 6.33.

క్లుప్తంగా...

పచ్చని పంట పొలాలను ధ్వంసం చేయొద్దు

మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు



నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): అభివృద్ధి పేరుతో వేలాది ఎకరాల పచ్చని పంట పొలాలను ధ్వంసం చేయాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వర రావు డిమాండ్ చేశారు. ఆదివారం గుంటూరులో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. కరేడు ప్రాంతంలోని వేలాది ఎకరాల పచ్చని పంట పొలాలను పరిశ్రమల పేరుతో ధ్వంసం చేయాలనే కుటిల ప్రయత్నాన్ని రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కరేడు ప్రాంత రైతులు వేలాది మంది ఏకతాటిపైకి వచ్చి తమ భూములను రక్షించుకోవడానికి పోరాటం చేయడం అభినందనీయమన్నారు. అమరావతిలో 1,500 ఎకరాల్లో రైల్వేస్టేషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించడం అవివేకమన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా 140 మీటర్ల వెడల్పుతో 189 కి.మీ. పొడవైన ఔటర్ రింగ్ రోడ్ నిర్మిస్తామని చెబుతూ.. దీనికోసం 8,500 ఎకరాల భూమిని సేకరిస్తామనడం దుర్మార్గమన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీకి నాయకత్వ లోపం

రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ఆవేదన



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీకి నాయకత్వ లోపం ఉందని, దానిని సరిదిద్దేందుకు శాయశక్తులా కృషి చేస్తానని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. రాష్ట్రంలో పార్టీకి బలమైన కేడర్ ఉన్నా, క్షేత్ర స్థాయిలో లీడర్లే లేరన్నారు. కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న తమ పార్టీకి కొన్ని పదవులు ఇస్తామన్నా, వాటిని తీసుకునేందుకు అర్హులైన నాయకులే లేరని వాపోయారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కార లక్ష్యంగా ఈ నెల 27న కడప నుంచి రాష్ట్ర వ్యాప్త పర్యటనను ప్రారంభించనున్నట్లు తెలిపారు. సంచార జాతుల దినోత్సవాన్ని ఈనెల 31న విజయవాడ కేంద్రంగా ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు.

జేసీ ప్రభాకర్ రెడ్డిపై కేసు నమోదు చేయాలి

కాకర్ల వెంకటరామి రెడ్డి డిమాండ్

సాక్షి, అమరావతి: అనంతపురం డీపీఓ నాగరాజు నాయుడును తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి నీచమైన భాషలో తిట్టడం దారుణమని, ఇందుకు సంబంధించి కేసు నమోదు చేయాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య చైర్మన్ కాకర్ల వెంకటరామి రెడ్డి ఆదివారం ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులపై రాజకీయ నాయకుల దౌర్జన్యాలు, దాడులు పెరిగిపోయాయని ఆవేదన వెలిబుచ్చారు. ఉద్యోగులపై అధికార పార్టీ నాయకులు దాడులు చేస్తుంటే కేసులు నమోదు చేయకుండా ఉన్నతాధికారులు దగ్గరుండి మరీ రాజీ చేస్తున్నారని విమర్శించారు.

చంద్రబాబు, లోకేశ్ ఆటలు మా దగ్గర సాగవు

కర్ణాటక సీఎం సిద్ధరామయ్య

మైసూరు: పరిశ్రమలకు స్థలాలు ఇవ్వబోమని తామెప్పుడూ చెప్పలేదని.. ఏపీ సీఎం చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేశ్ ఎన్ని రాజకీయాలు చేసినా కర్ణాటక నుంచి ఒక్క పరిశ్రమ కూడా బయటకు వెళ్లదని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అన్నారు. ఆదివారం మైసూరు జిల్లా హెచ్‌డీ కోటె తాలూకా బీచనహళ్లిలో ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు, లోకేశ్ రాజకీయాలు తమ దగ్గర పనిచేయవని అన్నారు.

త్వరలో మానవ సహిత చంద్రయాన్ యాత్రలు

- అంగారకుడు, శుక్రుడిపైకి కూడా మనుషుల్ని పంపిస్తాం
- ఇస్రో చైర్మన్ నారాయణన్

కర్నూలు (సెంట్రల్): చంద్రుడిపై విస్తృత పరిశోధనల కోసం త్వరలోనే మానవ సహిత చంద్రయాన్‌–4, 5 రాకెట్లను పంపేందుకు కృషి చేస్తున్నామని ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ చెప్పారు. చంద్రుడి అంతర్భాగంలోకి 20 నుంచి 30 ఏళ్లలోపు మానవుడిని పంపి పరిశోధనలు చేసేలా ఇస్రో తీవ్ర ప్రయత్నాలు చేస్తోందన్నారు. ఆదివారం కర్నూలు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్స్ అండ్ మ్యానిఫ్యాక్చరింగ్ (ఐఐఐటీడీఎం) ఏడో స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ఇస్రో చైర్మన్ నారాయణన్, ఐఐఐటీడీఎం బోర్డు ఆఫ్ గవర్నర్స్ చైర్మన్ పద్మశ్రీ విజయలక్ష్మీ దేశ్‌మానే, డైరెక్టర్ బీఎస్ మూర్తి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గ్రాడ్యుయేట్లకు మాస్టర్ ఆఫ్ ఫిలాసఫీ, మాస్టర్ ఆఫ్ డిగ్రీ, బ్యాచిలర్ డిగ్రీలను ప్రదానం చేశారు.
ఈ సందర్భంగా ఇస్రో చైర్మన్ మాట్లాడుతూ.. నాటి రాకేష్‌శర్మ నుంచి నేటి శుభాన్షు శుక్లా వరకు దేశం గర్వించదగ్గ అంతర్జాతీయ ఆస్ట్రోనాట్స్ భారతదేశంలో ఎంతో మంది ఉన్నారన్నారు. అంగారకుడు (వీనస్), శుక్రుడు (మార్స్) గ్రహాలపైకి కూడా శాటిలైట్లను పంపి విస్తృత పరిశోధనలు చేస్తున్నామని, త్వరలోనే వాటిపై మానవుడితో కూడిన వాహనాన్ని పంపేందుకు ఆలోచనలు చేస్తున్నట్లు చెప్పారు.

జన్ 'ధన్' ఔషధి

దోపిడీకే ప్రా'ముఖ్య'ం

ఆస్పత్రులకు జన్ ఔషధి మందుల సరఫరా మాటున భారీ అవినీతి

సాక్షి, అమరావతి: ప్రజాధనాన్ని అడ్డగోలుగా కొల్లగొట్టడమే పనిగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పెద్దలు రెచ్చిపోతున్నారు. కోట్ల రూపాయలను దోచుకోవడమే లక్ష్యంగా ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. పెద్దాస్పత్రుల్లో పేద ప్రజలకు అందించే ఉచిత మందుల సరఫరాలోనూ 'ముఖ్య'నేత కనుసన్నల్లో భారీ అవినీతికి తెరలేపారు. ప్రభుత్వాస్పత్రులకు జన్ ఔషధి మందుల సరఫరా పేరిట ఏకంగా రూ.100 కోట్లకు పైగా మందులు, సర్జికల్స్ సరఫరా బాధ్యతను టెండర్లతో పనిలేకుండా పెద్ద మొత్తంలో కమిషన్లు ముట్టజెబుతామన్న వారికి కట్టబెట్టేశారని వైద్య శాఖలో దుమారం రేగుతోంది. సీఎం సొంత జిల్లాకు చెందిన ఇద్దరు వ్యక్తులతో రాష్ట్రంలోని అన్ని బోధనాస్పత్రులకు జన్ ఔషధీ మందులు సరఫరా పేరిట ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆ ఇద్దరి స్టోర్ల నుంచే..

బోధనాస్పత్రులకు మందులు, సర్జికల్స్ కొనుగోలు కోసం కేటాయించే మొత్తం బడ్జెట్‌లో 80శాతం సెంట్రలైజ్డ్, 20శాతం డీసెంట్రలైజ్డ్‌గా ఉంటుంది. 80 శాతం బడ్జెట్‌తో సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ విధానంలో ఏపీఎంఎస్ఐడీసీ ఆస్పత్రులకు మందులు, సర్జికల్స్ సరఫరా చేస్తుంది. మిగిలిన 20శాతం డీసెంట్రలైజ్డ్ బడ్జెట్‌తో అత్యవసర మందులు, సర్జికల్స్ స్థానికంగానే కొనుగోలు చేస్తుంటారు. కాగా, డీసెంట్రలైజ్డ్‌తోపాటు సెంట్రలైజ్డ్ బడ్జెట్ కింద ఏపీఎంఎస్ఐడీసీ నుంచి సరఫరా కాని మందులు, సర్జికల్స్ కొనుగోళ్లలో జన్ ఔషధికే ప్రాధాన్యం ఇవ్వాలనే విధానాన్ని గతేడాది ప్రవేశపెట్టారు. దీంతో తక్కువ ధరలకే ఆస్పత్రులకు మందులు సరఫరా అవుతాయని అందరూ భావించారు. రాష్ట్రంలో ప్రధానమంత్రి భారతీయ జన్ ఔషధీ కేంద్ర(పీఎంబీజేకే) స్టోర్స్ 300 వరకు ఉన్నాయి. కానీ, అనంతపురం, కర్నూలు, ఒంగోలు, గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, విశాఖ.. ఇలా శ్రీకాకుళం వరకు అన్ని పెద్దాస్పత్రుల్లో మందుల కొనుగోలు కోసం తిరుపతికి చెందిన పయ్యావుల రవికుమార్, పయ్యావుల రాజశేఖర్‌లే ఎంవోయూ కుదుర్చుకోవడం విశేషం. కేవలం ఈ ఇద్దరి స్టోర్ల నుంచే రాష్ట్రం మొత్తం మందులు కొనుగోలు చేస్తుండటం వెనుక అవినీతి బాగోతం ఉందని ఆరోపణలున్నాయి.



INDIA NON JUDICIAL
Government of Andhra Pradesh
e-Stamp

MEMORANDUM OF UNDERSTANDING

A Memorandum of Understanding (MOU) between PRADHAN MANTRI BHARTIYA JANAUSHADHI KENDRA, Platform No. 01, Concourse Area, Anantapur Railway Station Campus, Anantapur – 515001, Represented by its proprietor Mr. Ravikumar Payyavula and Government General Hospital, Ananthapuramu, Represented by The Superintendent (the hospital signing authority), for the supply of janaushadhi medicines and janaushadhi surgicals based on the Reference File No. ... dated ... subject DME, AP-SP-Pharmacy-Procurement of Medicines & Surgicals Under decentralized budget-Certain Guidelines-issued comes into the force from 04/03/2025(Date).

1. Parties Involved:

- First Party Government General Hospital, Ananthapuramu, Represented by TheSuperintendent (the hospital signing authority) herein after.
- Second Party PRADHAN MANTRI BHARTIYA JANAUSHADHI KENDRA, Platform No 01, Concourse Area, Anantapur Railway Station Campus, Anantapur – 515001, Represented by the proprietor Mr. Ravikumar Payyavula herein after.

0001447289

పయ్యావుల రవికుమార్‌తో అనంతపురం జీజీహెచ్‌లో ఎంఓయూ చేసుకున్న ధ్రువపత్రం

పయ్యావుల రవికుమార్, రాజశేఖర్‌లకు రాయలసీమలోని వివిధ ప్రాంతాల్లో జన్ ఔషధి స్టోర్లు ఉన్నాయి. ప్రభుత్వాస్పత్రులకు మందుల సరఫరా రూపంలో పెద్ద ఎత్తున వ్యాపారం పొందేలా వీరు ప్రభుత్వ పెద్దలతో డీల్ కుదుర్చుకున్నట్టు సమాచారం. డీల్ ప్రకారం వీరికే సరఫరా బాధ్యతలు కట్టబెట్టేలా ఓ అమాత్యుడు కథ నడిపారు. దీంతో అవినీతి ప్రణాళికలో భాగంగా ఆస్పత్రుల్లో మందుల కొనుగోళ్లలో జన్ఔషధీ మందులకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలంటూ గతేడాది నవంబర్ 8న వైద్య శాఖ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ఉత్తర్వులు వచ్చిన వెంటనే ఇదే నెల 25వ తేదీ, డిసెంబర్ 05న మందుల సరఫరా చేస్తానంటూ పయ్యావుల రవికుమార్ వైద్య శాఖకు వినతులు పెట్టుకున్నారు. ఈ వినతులను కోట్ చేస్తూ డిసెంబర్ 12న పీఎంబీజేకే–జన ఔషధీ మందుల కొనుగోళ్లు చేసుకోడంటూ డీఎంఈ అందరూ సూపరింటెండెంట్‌లకు మార్గదర్శకాలు జారీ చేశారు. దీంతో మాతో ఎంవోయూ చేసుకోండంటూ పలు ఆస్పత్రులకు పయ్యావుల సోదరులు వెళ్లగా, మీతోనే ఎంవోయూ చేసుకోమని మాకెక్కడా క్లియర్ కట్ ఆదేశాలు లేవని సూపరింటెండెంట్‌లు బదులిచ్చారు. ఈ క్రమంలో ఆ సోదరులిద్దరు అమాత్యుడికి జరిగిన విషయం చెప్పారు. వెంటనే సదరు వ్యక్తులతోనే ఎంవోయూ చేసుకోవాలని ఆదేశాలివ్వాలంటూ ఉన్నతాధికారులపై అమాత్యుడు ఒత్తిడి తేగా, అలా చేస్తే మేం ఇరుక్కుంటాం అని అధికారులు వెల్లడించినట్టు సమాచారం. అయినప్పటికీ అమాత్యుడు వెనక్కు తగ్గకుండా ఒత్తిడి పెంచడంతో చేసేదేమీ లేక మార్గదర్శకాల్లో మెలికలు పెడుతూ మళ్లీ ఉత్తర్వులు ఇచ్చారు. ఇలా ఈ ఏడాది జనవరి 23న, 28న డీఎంఈ ఆ ఉత్తర్వుల్లో మార్పులు చేశారు. జనవరి 23న ఇచ్చిన ఉత్తర్వుల్లో ఒక ఏడాది కాలపరిమితికి ఎంవోయూ చేసుకోవాలని ఆదేశించారు. ఆ ఉత్తర్వుల్లోనూ పయ్యావుల వినతి పత్రాలిచ్చారని కోట్ చేసి, వారితోనే ఎంవోయూ చేసుకోవాలంటూ చెప్పకనే చెప్పడంతో చేసేదేమీ లేక ఎంవోయూ చేసుకున్నామని సూపరింటెండెంట్‌లు వాపోయారు.

పక్కా పథకం ప్రకారం దరఖాస్తు.. ఉత్తర్వుల్లో పలు మార్లు సవరణలు

ఎంవోయూ నిబంధనల ప్రకారం పీఎంబీజేకే జన్ ఔషధి మందులనే వీరు ఆస్పత్రులకు సరఫరా చేయాలి. అయితే పీఎంబీజేకే మందులు కాకుండా ఇతర మందులను వీరు సరఫరా చేస్తున్నారు. జనరిక్ మందులను సరఫరా చేసి పీఎంబీజేకే రేట్లను దండుకుంటున్నారని వెల్లడైంది. నిబంధనలకు విరుద్ధంగా వీరు సరఫరా చేస్తున్న మందుల ధరలు, పీఎంబీజేకే మందుల ధరలతో పోలిస్తే చాలా తేడా ఉంటోందని ఫార్మాసిస్ట్‌లు చర్చించుకుంటున్నారు. పీఎంబీజేకే అనేది కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యక్రమం. ఇందులో సరఫరా చేసే మందులకు నాణ్యత పరీక్షల అనంతరం బ్రాండింగ్ చేస్తారు. కాగా, ప్రస్తుతం సరఫరా చేస్తున్న మందులకు పీఎంబీజేకే బ్రాండింగ్ కూడా ఉండటం లేదు. ఉన్నతాధికారులతోపాటు, ఆస్పత్రుల సూపరింటెండెంట్‌లను సైతం వీరు మేనేజ్ చేసుకోవడంతో అందరూ చూసీచూడనట్టు వదిలేస్తున్నారు. డీఎంఈ ఇచ్చిన మార్గదర్శకాల్లో ఎమర్జెన్సీ మందులైతే 24 గంటల్లో, తక్కువ మొత్తంలో అయితే మందుల ఇండెంట్ పెట్టిన మూడు రోజుల్లో, పెద్ద ఎత్తున మందులు వారం రోజుల్లో సరఫరా చేయాల్సి ఉంటుందని మార్గదర్శకాలు రూపొందించారు. నిర్దేశించిన సమయంలోగా మందులు సరఫరా చేయని పక్షంలో సదరు సంస్థకు పెనాల్టీలు విధించేలా ఎంవోయూ నిబంధనలు ఉండాలని ప్రభుత్వం సూచించనేలేదు. డీఎంఈ ఇచ్చిన ఉత్తర్వుల్లో ఎక్కడా మందుల సరఫరాలో ఆలస్యం చేస్తే జరిమానా విధించేలా కనీస నిబంధన కూడా లేకపోవడం గమనార్హం.

నిబంధనలు అతిక్రమించినా గప్‌చిప్

నేడు హైదరాబాద్‌కు ముద్రగడ

ఎయిర్ అంబులెన్స్‌లో తరలింపు • వైఎస్ జగన్ సూచనలతో ఏర్పాట్లు పూర్తి



సాక్షి ప్రతినిధి, కాకినాడ: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభంను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించనున్నారు. సోమవారం ఉదయం ఎయిర్ అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ఎయిర్ పోర్టు నుంచి హైదరాబాద్ తీసుకువెళ్తారు. అనారోగ్యంతో అస్వస్థతకు గురైన పద్మనాభంకు రెండు రోజులుగా కాకినాడ మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉంది. ముద్రగడ అస్వస్థతకు గురైన విషయం తెలుసుకుని పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదివారం ముద్రగడ తనయుడు, పార్టీ ప్రత్తిపాడు కో ఆర్డినేటర్ గిరిబాబుతో ఫోన్‌లో మాట్లాడారు. పద్మనాభం ఆరోగ్య పరిస్థితి, కాకినాడ ఆస్పత్రిలో అందుతున్న వైద్యం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం కోసం అవసరమైతే ఎయిర్ అంబులెన్స్‌లో హైదరాబాద్ తరలించేందుకు ఏర్పాటు చేస్తామని, ఆందోళన చెందవద్దని ధైర్యం చెప్పారు. ఈ క్రమంలో కాకినాడ వైద్యులు ముద్రగడను హైదరాబాద్ తీసుకువెళ్లడం మంచిదని, అయితే రోడ్డుమార్గం అంత శ్రేయస్కరం కాదని చెప్పారు. ఈ విషయాన్ని తెలుసుకున్న జగన్‌మోహన్‌రెడ్డి సాధ్యమైనంత త్వరగా ముద్రగడను ఎయిర్ అంబులెన్స్‌లో తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని పార్టీనేతలకు సూచించారు. ఆదివారం రాత్రి తరలించేందుకు సాంకేతికంగా ఇబ్బంది ఉండటంతో సోమవారం ఉదయం హైదరాబాద్ యశోద హాస్పిటల్‌కు తరలించేందుకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయి.

తెగబడిన ఇసుక మాఫియా

ఇసుక అక్రమ తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్తులపై దాడి

- అడ్డుకుంటే తంతామని హెచ్చరిక
- పోలీసుల ముందే దాడులు



పాత నిమ్మతొర్లువాడలో అలజడి

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : శ్రీకాకుళం జిల్లాలో ఇసుక మాఫియా చెలరేగిపోతోంది. అక్రమ తవ్వకాలు జరపడమే కాకుండా దాడులకు తెగబడుతోంది. తాజాగా ఆమదాలవలస మండలం పాత నిమ్మతొర్లువాడలో ఇసుక అక్రమ తవ్వకాలను గ్రామస్తులు కొంతమంది ఆదివారం అడ్డుకున్నారు. ఎక్కడికక్కడ ఇసుక తవ్వేస్తుండటం వల్ల నదిలో పెద్ద పెద్ద గోతులు కావడంతో పశువులు పడి చనిపోతున్నాయి. కొన్ని గాయపడుతున్నాయి. అలాగే శ్మశాన వాటికలోనూ, గోవులు మేసే స్థలంలోనూ తవ్వకాలు జరుపుతున్నారు. వందల లారీలతో ఇసుక తరలిస్తుండటంతో నదితోపాటు రోడ్లూ ధ్వంసమవుతున్నాయి. ఇసుక అక్రమార్కుల అరాచకాలు చూసి ఆందోళన చెందిన గ్రామస్తులు, మహిళలు, విద్యార్థులు ఇసుక తవ్వకాల నిర్వాహకులను నిలదీయడమే కాకుండా ఇసుక లారీలను, తవ్వకాలు జరిపే జేసీబీలను అడ్డుకున్నారు. నిరసన తెలిపిన వారు వారి ఇళ్లకు వెళ్లాక శ్రీకాకుళం తదితర ప్రాంతాల నుంచి సుమారు 100 మంది వరకు వచ్చి దాడి చేశారు. కొందరిని తీవ్రంగా కొట్టారు. పోలీసులు వచ్చినా కూడా ఆగకుండా దాడి చేశారు. దీంతో పాత నిమ్మతొర్లువాడలో ఉద్రిక్తత నెలకొంది.

గతంలోనూ దాడులు

ఆమదాలవలస నియోజకవర్గంలో ఇసుక మాఫియా దాడులు కొత్తకాదు. గతంలోనూ గూండాలతో దాడులు చేయించి, ఇసుక అక్రమాలకు అడ్డురాకుండా బెదిరించారు. కర్రలు తదితర వాటితో దాడి చేయించారు. బూర్జ మండలం నారాయణపురం, పొందూరు మండలం బొడ్డేపల్లిలో, ఆమదాలవలస మండలం దూసి వద్ద ఇదే రకంగా గతంలో దౌర్జన్యంతో దాడులు చేశారు. అదే ఆమదాలవలస ఇసుక మాఫియా శ్రీకాకుళం నగరంలో కూడా సనపల సురేష్ అనే వ్యక్తిపై నడి రోడ్డు మీద దాడి చేసి గాయపరిచింది. తాజాగా ఆమదాలవలస మండలం పాత నిమ్మ తొర్లువాడలో కూడా ఇసుక తవ్వకాలు అడ్డుకున్నారని ఏకంగా గ్రామస్తులపైనే విరుచుకుపడ్డారు. దొరికిన వాళ్లందరినీ చావ బాదారు. ఈ ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. తీవ్రంగా గాయ పడిన వారిలో వండాన వైకుంఠరావు, ఇప్పిలి రాజేష్, బోనేల ఈశ్వరరావు ఉన్నారు. పోలీసుల ఎదుటే దాడికి పాల్పడడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

దుండగులు దాడికి తెగబడిన వీడియో కోసం క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

'సుహృద్భావం' క్లీన్‌బౌల్డ్

▶ మొదటి పేజీ తరువాయి

హాజరవుతారు. క్రికెట్ మ్యాచ్ ఆడే అధికారులే కాకుండా సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు కుటుంబాలతోసహా వచ్చి మ్యాచ్‌ను వీక్షిస్తారు. కోవిడ్ వ్యాప్తితో 2020, 2021లో ఈ క్రికెట్ మ్యాచ్ నిర్వహించ లేదు. అనంతరం మూడేళ్లపాటు వివిధ కారణాలతో క్రికెట్ మ్యాచ్ నిర్వహించ లేకపోయారు. దీంతో ఈ ఏడాదికిగాను ఆదివారం క్రికెట్ మ్యాచ్ ఘనంగా నిర్వహించాలని ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల ఉమ్మడిగా నిర్ణయించారు. ఆదివారం మూలపాడు స్టేడియంలో మ్యాచ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లూ చేశారు. సీఎస్ విజయానంద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా ముఖ్య అతిథులుగా హాజరవుతారని కూడా షెడ్యూల్ ప్రకటించారు. ఇరుజట్ల తరఫున క్రికెట్ మ్యాచ్ ఆడే 11 మంది చొప్పున అధికారులతోపాటు ఇతర సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఈ మ్యాచ్‌ను తిలకించేందుకు హాజరవుతామని చెప్పారు.

డీజీపీతో వేదిక పంచుకునేదే లేదన్న డీజీలు

కాగా రాష్ట్ర ప్రభుత్వం, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా ఒంటెత్తు పోకడలపై డీజీలు తీవ్ర ఆగ్రహంగా ఉన్న విషయం తెలిసిందే. అసలు పోలీసు శాఖలో ఉన్నతస్థాయి అధికారుల మధ్యే ఎలాంటి సహృద్భావం లేనప్పుడు ఈ క్రికెట్ మ్యాచ్ ఎందుకని వారు తేల్చి చెప్పారు. మనసులో సామరస్య భావన లేకుండా కేవలం ముఖస్తుతి కోసం తాము వచ్చి మ్యాచ్‌ను వీక్షించలేమని స్పష్టం చేశారు.

ముఖం చాటేసిన సీఎస్, డీజీపీ

డీజీల నిర్ణయంతో సీఎస్ విజయానంద్, డీజీపీ గుప్తా కంగు తిన్నారు. పరిస్థితిని సర్దుబాటు చేసేందుకు సీఎస్ చేసిన యత్నాలను డీజీలు ఇప్పటికే తోసిపుచ్చారు. ఈ నేపథ్యంలో డీజీలు హాజరుకాని క్రికెట్ మ్యాచ్ వీక్షించేందుకు తాను వెళితే వారు మరింత అవమానంగా భావించే అవకాశం ఉంటుందని సీఎస్ భావించారు. అందుకే తాను క్రికెట్ మ్యాచ్ వీక్షించేందుకు రావడం లేదని కబురు పంపారు. సీఎస్ రానప్పుడు తాను మాత్రం ఎందుకు వెళ్లడమని డీజీపీ గుప్తా భావించారు. తన ఉనికే డీజీలకు గిట్టనప్పుడు తానెందుకు మ్యాచ్‌కు వెళ్లడమని ఆయన భావించినట్టు పోలీసు వర్గాలు చెబుతున్నాయి. దీంతో తాను కూడా మ్యాచ్‌కు రావడం లేదని గుప్తా సమాచారం ఇచ్చినట్టు తెలుస్తోంది.

స్టేడియంవైపు తొంగి చూడని ఇతర ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు

సీఎస్, డీజీలే రాలేమన్న క్రికెట్ మ్యాచ్‌కు తామెందుకు వెళ్లాలని ఇతర సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు భావించారు. ఈ ఆధిపత్య పోరు పరిస్థితుల నేపథ్యంలో క్రికెట్ మ్యాచ్‌కు దూరంగా ఉండటమే సరైందని వారు నిర్ణయానికి వచ్చారు. దీంతో ముఖ్య కార్యదర్శి స్థాయి ఐఏఎస్ అధికారులు, ఇతర సీనియర్ ఐపీఎస్ అధికారులు ఎవరూ కూడా మూలపాడు స్టేడియం వైపు ఆదివారం కనీసం తొంగి చూడనే లేదు. ముందుగా ప్రకటించాం తప్పదు కాబట్టి కేవలం ఇరు జట్ల ఆటగాళ్లు మాత్రమే తూతూ మంత్రంగా క్రికెట్ మ్యాచ్ ఆడారు. మొత్తం ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, వారి కుటుంబ సభ్యులు వీక్షిస్తుండగా కోలాహలంగా నిర్వహించాల్సిన క్రికెట్ మ్యాచ్ కాస్త ... పోలీసు శాఖలో ఆధిపత్య పోరుతో నిస్తేజంగా ముగిసింది.

'యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్‌పై అప్రమత్తత అవశ్యం'

గుంటూరు మెడికల్: యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్(ఏఎంఆర్) ప్రపంచ వ్యాప్తంగా ఆందోళన కలిగిస్తోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఈ సమస్యపై అవగాహన, అప్రమత్తత అవసరమన్నారు. నిరంతర వైద్య విద్య కార్యక్రమంలో భాగంగా గుంటూరులో ఆదివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఏపీ చాప్టర్, క్లినికల్ ఇన్ఫెక్షన్ డిసీజెస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో 'ఏఎంఆర్ విత్ అవేర్‌నెస్ అండ్ మెడికల్ రెస్పాన్సిబులిటీ' అనే అంశంపై చర్చ జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి హాజరై మాట్లాడారు. కాగా, ఏఎంఆర్‌ను తగ్గించాలనే లక్ష్యంతో అమెరికా టెక్సాస్‌కు చెందిన సైంటిస్ట్ సందీప్‌తో ఐఎంఏ, ఐసీడీఎస్ ప్రతినిధులు మంత్రి సమక్షంలో ఒప్పందం చేసుకున్నారు.

'కుబేర' తరహాలో

టీడీపీ నేతల భారీ స్కామ్

గిరిజనుల్ని మోసగించి రూ.10.60 కోట్లను బొక్కేసిన కేటుగాళ్లు

- 56 మంది గిరిజనులను సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా చూపి బ్యాంక్ నుంచి రుణాలు
- నెల్లూరులో వెలుగులోకి వచ్చిన కుంభకోణం
- నిందితుల్లో టీడీపీ నేతలు, ఆ పార్టీ సానుభూతిపరుడైన జర్నలిస్ట్
- అసలు పాత్రధారులెవరో బయటకు పొక్కనివ్వకుండా జాగ్రత్తలు
- యాక్సిస్ బ్యాంక్ అధికారుల పాత్రపైనా అనుమానాలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కొందరు టీడీపీ నేతలు, ఆ పార్టీ సానుభూతిపరుడైన ఓ జర్నలిస్టు కలిసి గిరిజనులను అడ్డం పెట్టుకుని ప్రైవేటు బ్యాంకు నుంచి పెద్దఎత్తున రుణాలు తీసుకుని మోసగించిన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఇటీవల విడుదలైన కుబేర సినిమాను తలపించే రీతిలో ఈ భారీ స్కామ్ జరిగింది. నెల్లూరు జిల్లాకు చెందిన 56 మంది గిరిజనుల పేరిట రూ.10.60 కోట్లను టీడీపీ నేతలు కాజేసినట్టు వెలుగులోకి రాగా.. ఈ మొత్తం దాదాపు రూ.20 కోట్లపైనే ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. నెల్లూరులోని యాక్సిస్ బ్యాంక్ ద్వారా జరిగిన ఈ కుంభకోణంలో బ్యాంక్ అధికారుల పాత్రపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



బాధితులకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి తరహాలో జీతాలు చెల్లించినట్టుగా బ్యాంక్ లావాదేవీలు

గిరిజనుల్ని సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా చూపి..

యాక్సిస్ బ్యాంక్‌కు నెల్లూరు, ముత్తుకూరులో బ్రాంచ్‌లు ఉన్నాయి. వివిధ ప్రాంతాల్లో నిరక్షరాస్యులైన వారిని, కూలి పనులు చేసుకునే వారిని, పశువుల కాపరులను టీడీపీ నేతలు, ఆ పార్టీ సానుభూతిపరుడైన ఓ జర్నలిస్టు జాలి వాసుదేవనాయుడు, అల్లాభక్షు, శివ, వెంకట్, తదితరులు కలిసి బ్యాంక్ రుణాలు ఇప్పిస్తామని నమ్మించారు. వారి నుంచి ఆధార్ కార్డులు, ఫొటోలు తీసుకుని బ్యాంక్‌లో ఖాతాలు తెరిపించారు. ఇలా 100 మంది నిరక్షరాస్యులు, అమాయకుల రికార్డులు సేకరించినట్టు తెలుస్తోంది. మరోవైపు నెట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ఎంఆర్ ఇన్‌ఫ్రా లైన్, గ్లోబల్ సొల్యూషన్, క్యాపిటల్ ట్రీ సాఫ్ట్‌వేర్ పేర్లతో నకిలీ కంపెనీలను సృష్టించారు. కూలీలను, పశువుల కాపరులను ఆ కంపెనీల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా చూపించారు. వీళ్లంతా గిరిజనులే. ఒక్కొక్కరికి రూ.75 వేల నుంచి రూ.లక్షకు పైగా జీతాలు ఇస్తున్నట్టు రికార్డులు, పే స్లిప్పులు తయారు చేశారు. వారందరికీ 6 నెలల పాటు జీతాలు చెల్లించినట్టు బ్యాంక్ స్టేట్‌మెంట్లు కూడా సృష్టించారు. వీటిని యాక్సిస్ బ్యాంక్‌కు సమర్పించి ఒక్కొక్కరి పేరిట రూ.15 లక్షల చొప్పున బ్యాంక్ నుంచి రుణం పొందారు. ఈ మొత్తం వ్యవహారంలో బ్యాంక్ సిబ్బంది ఏ ఒక్క లబ్ధిదారుడితోను నేరుగా మాట్లాడడం, కలవడం, రికార్డులు పరిశీలించడం వంటివేమీ లేకుండానే రుణాలిచ్చేశారు. ఈ విషయాలేవీ లబ్ధిదారులకు తెలియకుండా టీడీపీ నేతలు జాగ్రత్తపడ్డారు. 4 నెలల పాటు బ్యాంక్ వాయిదాలు చెల్లించిన నకిలీ కంపెనీలు ఆ తర్వాత చెల్లింపులు నిలిపివేశాయి. రుణం వస్తుందని ఎదురుచూస్తున్న నిజమైన లబ్ధిదారులకు బకాయిలు చెల్లించాలని నోటీసులు అందడంతో వారు దిగ్భ్రాంతికి గురయ్యారు.



మోసానికి పాల్పడిన అల్లాబక్షు (టీడీపీ నేత)



మోసానికి పాల్పడిన వాసుదేవ నాయుడు సీఎం చంద్రబాబుతో.. (ఫైల్)

8 నెలల క్రితమే ఫిర్యాదు అందినా..

ఈ లావాదేవీలపై అనుమానం రావడంతో నెల్లూరు యాక్సిస్ బ్యాంక్ మేనేజర్ మదన్‌మోహన్‌రావు 2024 డిసెంబర్ 12న ముత్తుకూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమ బ్యాంక్‌లో 56 మంది పేరిట రూ.10.60 కోట్లు రుణాలు పొందినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసినా దర్యాప్తు మాత్రం ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. బ్యాంక్ ఉన్నతాధికారులు కూడా ఈ వ్యవహారంపై స్పందించకపోవడం అనుమానాలకు దారి తీస్తోంది. దీనిపై బ్యాంక్ ఇంతవరకు విచారణ జరపలేదు. 56 మంది పేరిట రూ.10.60 కోట్ల రుణం కాజేసినట్టు ప్రాథమికంగా బయటకు వచ్చినా.. నిందితులు 100 మంది పేరిట రూ.20 కోట్లకు పైగా కాజేసి ఉంటారని అంచనా వేస్తున్నారు. ఈ కుంభకోణం వెనుక అసలు పాత్రధారులెవరో బయటకు పొక్కనివ్వకుండా టీడీపీ పెద్దలు చర్యలు తీసుకున్నట్టు సమాచారం.

మీడియా ముందుకొచ్చిన బాధితులు

మోసపోయిన బాధిత గిరిజనులు ఆదివారం మీడియా ముందుకొచ్చారు. సుమారు 60 మంది తమకు జరిగిన మోసాన్ని యానాదుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసీ పెంచలయ్య, జిల్లా సంఘం చైర్మన్ రాపూరు కృష్ణయ్య, జిల్లా అధ్యక్షుడు మానికల మురళి, ప్రధాన కార్యదర్శి మాకాని రవీంద్ర, మహిళ అధ్యక్షురాలు చెంబేటి ఉషతో కలిసి మీడియాకు వివరించారు.

పైసా కూడా తీసుకోలేదు

నాకు బ్యాంకుల సంగతి తెలియదు. ఇప్పుడు లోన్ కట్టాలని బ్యాంకు వాళ్లు చెన్నై నుంచి లాయర్ నోటీసులు పంపించారు. కొన్ని నెలల కిందట కొందరు వ్యక్తులు మాకు రుణాలు ఇప్పిస్తామని ఆధార్ కార్డులు తీసుకున్నారు. కానీ, ఏమైందో తెలియదు. ఏనాడూ బ్యాంక్‌కు వెళ్లలేదు. ఇప్పుడు రూ.15 లక్షలు రుణం తీసుకున్నారంటూ మాకు నోటీసులు పంపారు.

– చలంచర్ల లక్ష్మీనారాయణ, గిరిజనుడు, చౌకిచర్ల, విడవలూరు మండలం

కఠిన చర్యలు తీసుకోవాలి

యాక్సిస్ బ్యాంక్ కుంభకోణంపై సీఐడీ విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలి. మా జాతి ప్రజలను మోసం చేసిన జాలి వాసుదేవనాయుడు, అల్లాభక్షు, శివ, వెంకట్‌లను వెంటనే అరెస్ట్ చేయాలి. ఫేక్ కంపెనీలను సృష్టించి ఎస్సీ, ఎస్టీలను సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా చూపించి మోసం చేశారు. ఈ మోసం వెనుక ఉన్న అసలు మోసగాళ్లను పోలీసులు వెంటనే అరెస్ట్ చేయాలి. బాధితులకు న్యాయం చేయాలి.

– కేసీ పెంచలయ్య, అధ్యక్షుడు, యానాదుల సంక్షేమ సంఘం

హెచ్‌-1బీ వీసాకు కొలువుతో లింకు!

పాత విధానం తెచ్చేందుకు ట్రంప్‌ సర్కార్‌ యత్నం ● హోంల్యాండ్‌ సెక్యూరిటీ విభాగం ప్రతిపాదన

వాషింగ్టన్‌: డొనాల్డ్‌ ట్రంప్‌ తొలిసారిగా అధ్యక్షునిగా పాలించిన కాలంలో అమలై తర్వాత బైడెన్‌ హయాంలో బుట్టదాఖలైన ఒక విధానాన్ని మళ్లీ ప్రవేశపెట్టాలని ఉవ్విళ్లూరుతున్నారు. ట్రంప్‌ తొలి విడత అమెరికా అధ్యక్షునిగా పరిపాలించిన కాలంలో హెచ్‌–1బీ వీసాల కోసం లాటరీ విధానాన్ని పక్కనబెట్టి ఆయా కంపెనీలు ఉద్యోగానికి ఇచ్చే జీతభత్యాల ఆధారంగా వీసాలను జారీచేయాలని నిర్ణయించారు. ఆ విధానాన్నే ఆనాడు అమలుచేశారు. దీంతో కంపెనీలు మరింత మంది ఉద్యోగులను ఉన్నత ఉద్యోగాలకు తీసుకుంటాయని, తక్కువ స్థాయి ఉద్యోగాలు అమెరికన్లకే దక్కుతాయని ట్రంప్‌ సర్కార్‌ భావించింది. అయితే విదేశాల నుంచి వచ్చే నిపుణులైన ఉద్యోగులకు అన్ని స్థాయిల ఉద్యోగాలు దక్కాలనే ఉద్దేశంతో జో బైడెన్‌



సర్కార్‌ ఈ విధానాన్ని రద్దుచేసి మళ్లీ లాటరీ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ఇప్పుడు మళ్లీ ఈ లాటరీ విధానానికి స్వస్తిపలికి ఉద్యోగి జీతం, హోదా, పొజిషన్‌ ఆధారంగా హెచ్‌–1బీ వీసాలు ఇవ్వాలని అమెరికా హోంల్యాండ్‌ సెక్యూరిటీ విభాగం భావిస్తోంది. ఇందులోభాగంగా సంబంధిత ప్రతిపాదనను సమీక్షించాలంటూ శ్వేతసౌధంలోని ఇన్ఫర్మేషన్‌ అండ్‌ రెగ్యులేటరీ అఫైర్స్‌ ఫర్‌ రివ్యూ విభాగానికి తన ప్రతిపాదనలను పంపింది. వాస్తవానికి ప్రతి సంవత్సరం ఎన్ని హెచ్‌–1బీ వీసాలు జారీ చేయాలనే పరిమితిని అమెరికా కాంగ్రెస్‌(పార్లమెంట్‌) నిర్ణయిస్తుంది. ప్రస్తుతం ప్రతి సంవత్సరం 85,000 హెచ్‌–1బీ వీసాలను జారీచేస్తున్నారు. వీటిలో 20,000 వీసాలను మాస్టర్స్‌ డిగ్రీ పట్టా ఉన్న ఉద్యోగులు ప్రత్యేకంగా కేటాయించారు. వీటిలో అత్యధికం అమెజాన్‌, మెటా, మైక్రోసాఫ్ట్‌ వంటి పెద్ద కంపెనీలే సాధిస్తున్నాయి. ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు చేసి తమ ఉద్యోగుల్లో ఎక్కువ మందికి వీసా దక్కేలా చేస్తున్నాయి. ఇక ఎలాంటి పరిమితి లేని వీసాలను విశ్వవిద్యాలయాల్లోని పరిశోధన విభాగాల కోసం కేటాయించారు. 2026 ఏడాదికి జారీచేయాల్సిన వీసాల కోసం స్వీకరించాల్సిన దరఖాస్తులు సరిపడా రావడంతో వాటి ప్రాసెస్‌ను నిలిపివేశారు. అమెరికా సిటిజన్‌షిప్‌ అండ్‌ ఇమిగ్రేషన్‌ సర్వీసెస్‌ విభాగం శుక్రవారం ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ లెక్కన 2026 సంవత్సరానికి లాటరీ విధానం ఉండకపోవచ్చని స్పష్టమైంది. పొజిషన్‌ ఆధారంగా వీసాల జారీ ప్రక్రియలను అమెరికాలోని ఆర్థికరంగ నిపుణులు స్వాగతిస్తున్నారు. అత్యధిక వృత్తి నైపుణ్యాలున్న వ్యక్తులకే అత్యధికంగా హెచ్‌–1బీ వీసాలు దక్కే అవకాశం ఉండటంతో వారి కృషి, పని ద్వారా అమెరికా ఆర్థికవ్యవస్థ మరింత మెరుగుపడుతుందని వారు ఆశిస్తున్నారు.

22న అపాచీ హెలికాప్టర్ల రాక

మొదటి దశలో మూడింటి అప్పగింత

న్యూఢిల్లీ: భారత సైన్యం అమ్ములపొదిలోకి అమెరికాకు చెందిన అత్యాధునిక అపాచీ ఏహెచ్‌–64ఈ అటాక్‌ హెలికాప్టర్లు చేరనున్నాయి. ఈ నెల 22న అవి సైన్యానికి అందబోతున్నాయి. ఈ ప్రక్రియ ఇప్పటికే 15 నెలలు ఆలస్యమైంది. మొదటి దశ హెలికాప్టర్లు అందించేందుకు ఏర్పాట్లు పూర్తయినట్లు అధికారులు చెప్పారు. మొదట మూడు హెలికాప్టర్లను మంగళవారం ఇండియన్‌ ఆర్మీకి చెందిన ఏవియేషన్‌ విభాగానికి అప్పగించబోతున్నారు. మొత్తం ఆరు హెలికాప్టర్ల కొనుగోలుకు 2020లో అమెరికాతో ఒప్పందం కుదిరింది. ఈ డీల్‌ విలువ 600 మిలియన్‌ డాలర్లు(రూ.5,171 కోట్లు). 2024 జూన్‌ నెలలో మొదటి దశ హెలికాప్టర్లను అప్పగించాల్సి ఉండగా, కొన్ని సాంకేతిక కారణాలతో జాప్యం జరిగింది. మొదటి దశ హెలికాప్టర్లు మంగళవారం రానుండగా, రెండో దశ హెలికాప్టర్లు ఈ ఏడాది ఆఖరు నాటికి రాబోతున్నాయి.



అపాచీ ఏహెచ్‌–64ఈ హెలికాప్టర్లు భారత వైమానిక దళంలో కీలకం కాబోతున్నాయి. ఇవి శక్తివంతమైనవిగా పేరొందాయి. పాకిస్తాన్‌ సరిహద్దుల్లో వీటిని మోహరించబోతున్నారు. 2015లో కుదిరిన మరో ఒప్పందం కింద భారత సైన్యం ఇప్పటికే 22 అపాచీ హెలికాప్టర్లను సమకూర్చుకుంది. ఏహెచ్‌–64ఈ అటాక్‌ హెలికాప్టర్లు వాటి కంటే అత్యాధునికం అని చెబుతున్నారు.

మలేరియా నివారణకు
దేశీయ టీకా
అభివృద్ధి చేసిన ఐసీఎంఆర్‌



న్యూఢిల్లీ: దోమకాటు ద్వారా సోకే మలేరియా వ్యాధితో దేశవ్యాప్తంగా ప్రతిఏటా వేలాది మంది మరణిస్తున్నారు. ప్రాణాంతక మలేరియాను అరికట్టడానికి భారత వైద్య పరిశోధన మండలి(ఐసీఎంఆర్‌) దేశీయ వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసింది. భువనేశ్వర్‌లోని రీజినల్‌ మెడికల్‌ రీసెర్చ్‌ సెంటర్‌, నేషనల్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ మలేరియా రీసెర్చ్‌(ఎన్‌ఐఎంఆర్‌), నేషనల్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ ఇమ్యూనాలజీకి చెందిన డిపార్ట్‌మెంట్‌ ఆఫ్‌ బయోటెక్నాలజీ భాగస్వామ్యంతో 'అడ్‌ఫాల్సి వ్యాక్స్‌' పేరిట పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో ఈ టీకాను అభివృద్ధి చేసింది.మలేరియా వ్యతిరేక పోరాటంలో ఈ టీకా కీలక అస్త్రం అవుతుందని పరిశోధకులు చెబుతున్నారు. ఇది రీకాంబినెంట్‌ మల్టీస్టేజ్‌ వ్యాక్సిన్‌ అని అంటున్నారు. ఇప్పటిదాకా నిర్వహించిన క్లినికల్‌ ప్రయోగాల్లో ఆశించిన ఫలితాలు లభించాయి. టీకా తీసుకున్న వారికి మలేరియా నుంచి పూర్తి రక్షణ లభించడంతోపాటు రోగ నిరోధక శక్తి తగ్గే ముప్పును ఇది గణనీయంగా నివారిస్తున్నట్లు తేలింది. మనుషుల్లో ప్లాస్మోడియం ఫాల్సిపరమ్‌ ఇన్ఫెక్షన్‌ను సమర్థంగా అడ్డుకుంటున్నట్లు వెల్లడయ్యింది. 'అడ్‌ఫాల్సివ్యాక్స్‌' తయారీ, విక్రయం కోసం అర్హత కలిగిన కంపెనీలకు లైసెన్స్‌లు ఇవ్వాలని నిర్ణయించినట్లు ఐసీఎంఆర్‌ ప్రకటించింది. ఆయా కంపెనీల నుంచి ఆసక్తి వ్యక్తీకరణ(ఈఓఐ) దరఖాస్తులను ఆహ్వానించింది.

సిందూర్‌పై చర్చకు సై

కీలకాంశాలపై పార్లమెంట్‌లో చర్చిస్తాం: కేంద్రం
నేటి నుంచే వర్షాకాల సమావేశాలు

సాక్షి, న్యూఢిల్లీ: పాకిస్తాన్‌ ఉగ్రవాదుల భరతం పట్టేందుకు భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్‌ సిందూర్‌ సహా కీలక అంశాలపై పార్లమెంట్‌ వర్షాకాల సమావేశాల్లో చర్చించడానికి సిద్ధంగా ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వం స్పష్టంచేసింది. పార్లమెంట్‌ వర్షాకాల సమావేశాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. ఆగస్టు 21వ తేదీ వరకు కొనసాగుతాయి. పహల్గాం ఉగ్ర దాడి, ఆపరేషన్‌ సిందూర్‌, బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ తర్వాత జరుగుతున్న ఈ సమావేశాలు వాడీవేడీగా సాగే అవకాశం కనిపిస్తోంది. పార్లమెంట్‌ లేవనెత్తాల్సిన కీలక అంశాలపై విపక్షాలు కసరత్తు పూర్తిచేశాయి. నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సిద్ధమయ్యాయి. అలహాబాద్‌ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ యశ్వంత్‌ వర్మ అభిశంసనపై వర్షాకాల సమావేశాల్లో తీర్మానం ప్రవేశపెట్టబోతున్నారు.

నిర్మాణాత్మక చర్చలకు సహకరించాలి

వర్షాకాల సమావేశాలు సజావుగా సాగేందుకు, ఉభయ సభల్లో నిర్మాణాత్మక చర్చలు జరిగేందుకు ప్రతిపక్షాలు సహకరించాలని కేంద్రం విజ్ఞప్తి చేసింది. కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా అధ్యక్షతన ఆదివారం జరిగిన అఖిలపక్ష సమావేశంలో కేంద్ర మంత్రులు కిరణ్‌ రిజిజు, అర్జున్‌రామ్‌ మేఘ్వాల్‌, మురుగన్‌తోపాటు కాంగ్రెస్‌ ఆర్జేడీ, జేడీ(యూ), సమాజ్‌వాదీ పార్టీ, వైఎస్సార్‌సీపీ, డీఎంకే, నేషనల్‌ కాన్ఫరెన్స్‌, టీఎంసీ, బీఆర్‌ఎస్‌, శివసేన(షిండే), ఆమ్‌ ఆద్మీ తదితర పార్టీల సభ్యులు హాజరయ్యారు. విపక్షాలు తమ ఎజెండాను ప్రస్తావించాయి. బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికల ముందు ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, పహల్గాం ఉగ్రవాద దాడి, భారత్‌–పాక్‌ ఘర్షణపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ ట్రంప్‌ చేస్తున్న వ్యాఖ్యలను లేవనెత్తాయి. పొరుగు దేశాలతో విదేశాంగ విధానం, తాజా పరిస్థితులపై పార్లమెంట్‌లో ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటన చేయాలని డిమాండ్‌ చేశాయి. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, రైతుల కష్టాలు, దేశ ఆర్థిక వ్యవస్థ, మణిపూర్‌ అంశాలపై పూర్తిస్థాయిలో చర్చించాలని కోరాయి. అసెంబ్లీ, పార్లమెంట్‌ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై చర్చ చేపట్టాలని డీఎంకే అభ్యర్థించింది. అఖిలపక్ష భేటీ అనంతరం కాంగ్రెస్‌ ఎంపీ గౌరవ్‌ గొగోయ్‌ మీడియాతో మాట్లాడారు. భారత్‌–పాక్‌ మధ్య యుద్ధం ఆపేశానంటూ ట్రంప్‌ చేస్తున్న వ్యాఖ్యలు, పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దుశ్చర్యకు దారితీసిన భద్రతా లోపాలు, బిహార్‌లో ఓట్ల జాబితా సవరణపై ప్రధాని మోదీ మాట్లాడాలని కోరినట్లు తెలిపారు.



అఖిలపక్ష భేటీ నుంచి వస్తున్న కేంద్ర మంత్రులు కిరణ్‌ రిజిజు, జేపీ నడ్డా, ఎంపీలు జైరాం రమేశ్‌ తదితరులు

కొత్త బిల్లులు

వర్షాకాల సమావేశాల్లో కేంద్రం 8 కొత్త బిల్లులను ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది. మణిపూర్‌ వస్తువులు, సేవల పన్ను(సవరణ) బిల్లు, జన్‌ విశ్వాస్‌(నిబంధనల సవరణ) బిల్లు, ఇండియన్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ మేనేజ్‌మెంట్‌(సవరణ) బిల్లు, పన్నుల చట్టాలు(సవరణ) బిల్లులతో పాటు జియోహెరిటేజ్‌ సైట్స్‌, జియో–రెలిక్స్‌(సంరక్షణ), జాతీయ క్రీడా పాలన బిల్లు, జాతీయ డోపింగ్‌ నిరోధక(సవరణ) బిల్లులను ప్రవేశపెట్టనుంది. మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను పొడిగించడానికి ప్రభుత్వం పార్లమెంట్‌ ఆమోదం కోరనుంది. వీటితోపాటు పెండింగ్‌లో ఉన్న సముద్ర వస్తువుల రవాణా బిల్లు, కోస్టల్‌ షిప్పింగ్‌ బిల్లు, మర్చంట్‌ షిప్పింగ్‌ బిల్లు, ఓడరేవుల బిల్లులపై చర్చించి, ఆమోదం తెలిపే అవకాశాలున్నాయి.

చర్చకు వెనుకాడం
కేంద్ర మంత్రి కిరణ్‌ రిజిజు

ఆపరేషన్‌ సిందూర్‌ సహా జాతీయ స్థాయిలో ప్రాముఖ్యత కలిగిన కీలక అంశాలపై పార్లమెంట్‌లో చర్చకు వెనుకంజ వేసే ప్రసక్తే లేదని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్‌ రిజిజు చెప్పారు. విపక్షాల ప్రశ్నలకు సమాధానం ఇస్తామన్నారు. అఖిలపక్ష భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పార్లమెంట్‌ సమావేశాలు ఎలాంటి అంతరాయాలు లేకుండా సజావుగా కొనసాగేందుకు అధికార, విపక్ష సభ్యులు కలిసికట్టుగా పని చేయాలన్నారు. వర్షాకాల సమావేశాలు ఫలవంతం కావాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. పార్టీలకు, కూటములకు వేర్వేరు సిద్ధాంతాలు ఉన్నప్పటికీ పార్లమెంట్‌ కార్యకలాపాలకు సహకరించాల్సిన బాధ్యత అన్ని పక్షాలపైనా ఉందన్నారు. ఉభయ సభల్లో మాట్లాడేందుకు ఎక్కువ సమయం ఇవ్వాలని చిన్న పార్టీల ఎంపీలు కోరారని, అందుకోసం ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని రాజ్యసభ చైర్మన్‌, లోక్‌సభ స్పీకర్‌ దృష్టికి తీసుకెళ్తామన్నారు. చిన్న ఎంపీలకు తగినంత సమయం ఇవ్వాలన్నదే తమ ఉద్దేశమని వివరించారు. విదేశీ పర్యటనలో ఉన్నప్పుడు మినహా మిగతా సమయంలో ప్రధాని మోదీ పార్లమెంట్‌ సమావేశాలకు హాజరవుతారని కిరణ్‌ రిజిజు వెల్లడించారు. విపక్షాలు లేవనెత్తే అంశాలపై సంబంధిత కేబినెట్‌ మంత్రులు సమాధానం ఇస్తారని స్పష్టంచేశారు. 17 బిల్లులు ప్రవేశపెట్టబోతున్నామని, వాటి వివరాలు త్వరలో వెల్లడిస్తామని చెప్పారు.

అసెంబ్లీలో రమ్మీ ఆడిన మంత్రి

వీడియో విడుదల చేసిన ప్రతిపక్ష ఎన్సీపీ

ముంబై: మహారాష్ట్రలో అధికార ఎన్సీపీ నేత, వ్యవసాయ శాఖ మంత్రి మాణిక్‌రావ్‌ కొకటే మరో వివాదంలో చిక్కుకున్నారు. అసెంబ్లీ సమావేశాల సమయంలో సెల్‌ఫోన్‌లో రమ్మీ ఆడుతూ దొరికిపోయారు. ఇందుకు సంబంధించిన వీడియోను ప్రతిపక్ష ఎన్సీపీ(ఎస్పీ) ఎమ్మెల్యే రోహిత్‌ పవార్‌ ఎక్స్‌లో పోస్ట్‌ చేయడంతో గందరగోళం మొదలైంది. బీజేపీని సంప్రదించకుండా ఎన్సీపీ పక్షం ఏపనీ చేయలేకపోతోంది. దీంతో, పనిలేక ఆ పార్టీ మంత్రులు మొబైల్‌ గేమ్స్‌ ఆడుకుంటున్నారని ఆరోపించారు. అన్నదాతల సమస్యల పరిష్కారంపై అధికార పక్షానికి శ్రద్ధ లేదని కాంగ్రెస్‌ నేత విజయ్‌ వడెట్టివార్‌ మండిపడ్డారు. విమర్శలపై కొకటే స్పందించారు. 'అసెంబ్లీ సమావేశాల తీరును తెల్సుకునేం



దుకు నా సెల్‌ఫోన్‌ను తీశా. అయితే, అప్పటికే డౌన్‌లోడ్‌ చేసిన గేమ్‌ సడన్‌గా ఓపెనైంది. దాన్ని క్లోజ్‌ చేశాను. ఇదంతా కేవలం 5, 10 సెకన్లలోనే జరిగిపోయింది. అంతేతప్ప, గేమ్‌ను ఆడటానికి ఓపెన్‌ చేయలేదు'అని వివరణ ఇచ్చుకున్నారు. కాగా, కొకటే ఏప్రిల్‌లోనూ ఓ వివాదంలో చిక్కుకున్నారు. రైతులు ప్రభుత్వ వ్యవసాయ పథకాల ద్వారా అందిన డబ్బును వివాహాలకే ఖర్చు చేస్తున్నారంటూ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. దీంతో, ఆయన క్షమాపణ చెప్పాల్సి వచ్చింది.

పాప్‌కార్న్‌ రోబోలు వచ్చేస్తున్నాయ్‌

త్వరలో అందుబాటులోకి టెస్లా ఆప్టిమస్‌ హ్యూమనాయిడ్‌ రోబో ● వివరాలు వెల్లడించిన ఎలాన్‌ మస్క్‌

లాస్‌ ఏంజెలెస్‌: వేడివేడి పాప్‌కార్న్‌ కావాలంటే చెఫ్‌కే చెప్పనక్కర్లేదు. తమ హ్యూమనాయిడ్‌ రోబోట్‌కు చెప్పినా చకచకా చేసి ఇచ్చేస్తుందని ప్రపంచ కుబేరుడు ఎలాన్‌ మస్క్‌ చెప్పారు. తమ 'టెస్లా' సంస్థ అభివృద్ధిచేస్తున్న హ్యూమనాయిడ్‌ రోబో త్వరలోనే అందరికీ అందుబాటులోకి వస్తుందని మస్క్‌ ప్రకటించారు. లాస్‌ఏంజెలెస్‌ నగరంలోని ప్రఖ్యాత హాలీవుడ్‌ ప్రాంతంలో టెస్లా కొత్తగా 'డిన్నర్‌, సూపర్‌చార్జర్‌' అనే రెస్టారెంట్‌, చార్జింగ్‌ స్టేషన్‌ను ఏర్పాటుచేస్తోంది. ఇందులో ఆప్టిమస్‌ పేరిట ఒక రోబోట్‌ను అందుబాటులోకి తేనున్నారు. ఇది పాప్‌కార్న్‌ను ఎప్పటికప్పుడు తాజాగా తయారుచేసి అతిథులు, వినియోగదారులకు అందిస్తుంది. సంబంధిత వీడియోను మస్క్‌ తన



'ఎక్స్‌'ఖాతాలో పోస్ట్‌చేశారు. అడిగిందే తడవుగా కస్టమర్‌కు కవర్‌లో పాప్‌కార్న్‌ను సర్వ్‌చేయడం, ప్రతిగా ధన్యవాదాలు తెలిపిన కస్టమర్‌కు రోబోట్‌ చేయి ఊపుతూ అభివాదంచేయడం ఆ వీడియోలో ఉంది. ''ఈరోజు ఇంటర్నెట్‌లో చూడదగ్గ వీడియో ఉందంటే అది ఇదే. కస్టమర్‌కు ఆప్టిమస్‌ ఎంత చక్కగా, పద్ధతిగా, మర్యాదగా సర్వ్‌ చేస్తోందో చూడండి. ఇదంతా త్వరలో సర్వసాధారణ విషయంగా మారబోతోంది'' అని మస్క్‌ 'ఎక్స్‌'లో క్యాప్షన్‌ పెట్టారు. హాలీవుడ్‌లోని శాంటామోనికా బోల్వార్డ్‌ ప్రాంతంలో ఈ అధునాతన డిన్నర్‌, సూపర్‌చార్జర్‌ రెస్టారెంట్‌, చార్జింగ్‌ స్టేషన్‌ను నిర్మిస్తున్నారు. ''భవిష్యత్తులో ఈ రోబోలు మన దైనందిన జీవిత పనులన్నీ చేస్తూ మనకు సాయంగా ఉంటాయి. మనం కూర్చున్న చోటుకే వచ్చి మనకు కూల్‌డ్రింక్స్‌ అందిస్తాయి. పెంపుడు శునకాన్ని అలా బయట వాకింగ్‌కు తీసుకెళ్తాయి. పిల్లలను ఆడిస్తాయి'' అని గతేడాది అక్టోబర్‌లో జరిగిన రోబోల సంబంధ 'మనం' కార్యక్రమంలో మస్క్‌ వ్యాఖ్యానించారు.

అన్నార్తులపై ఇజ్రాయెల్‌ సైన్యం కాల్పులు
గాజాలో 85 మంది మృతి



గాజా: గాజా స్ట్రిప్‌లో మారణహోమం కొనసాగుతూనే ఉంది. ఆహారం, మానవతా సాయం కోసం అల్లాడుతున్న సామాన్య పాలస్తీనా పౌరులను ఇజ్రాయెల్‌ సైన్యం లక్ష్యంగా చేసుకుంటోంది. ఆదివారం ఇజ్రాయెల్‌ జవాన్ల కాల్పుల్లో కనీసం 85 మంది మరణించారు. ఇజ్రాయెల్‌ భూభాగం నుంచి జికిమ్‌ క్రాసింగ్‌ ద్వారా ఉత్తర గాజాలోకి ప్రవేశించిన వాహనాల వద్దకు జనం పరుగెత్తుకొని వస్తుండగా ఇజ్రాయెల్‌ సైనికులు విచక్షణారహితంగా కాల్పులు జరిపినట్లు ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు. ఈ ఘటనలో 79 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 150 మంది గాయపడ్డారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. వాహనాల్లో చేరవేస్తున్న ఆహారం కోసం జనం ఆరాటపడగా, చివరకు ప్రాణాలే పోయాయి. దక్షిణ గాజాలో జరిగిన కాల్పుల్లో మరో ఆరుగురు బలయ్యారు. సెంట్రల్‌ గాజా నుంచి జనం బయటకు వెళ్లిపోవాలంటూ ఇజ్రాయెల్‌ మిలటరీ ఆదివారం హెచ్చరికలు జారీ చేసింది. ఒకవైపు కాల్పుల విరమణ కోసం ఇజ్రాయెల్‌, హమాస్‌ మధ్య ఖతార్‌లో చర్చలు కొనసాగుతుండగానే ఈ హెచ్చరికలు వెలువడడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ చర్చల్లో పెద్దగా పురోగతి కనిపించడం లేదని మధ్యవర్తులు చెబుతున్నారు.

కోరిక తీరిస్తేనే
మందుల చీటీ
అమెరికాలో భారత వైద్యుని నిర్వాకం

న్యూయార్క్‌: వైద్యో నారాయణో హరి అన్న వాక్యాలను కించపరిచేలా భారతీయ మూలాలున్న అమెరికా వైద్యుడొకరు తన దగ్గరకొచ్చే రోగుల పట్ల అత్యంత నిర్దయగా ప్రవర్తించాడు. అనారోగ్యం బారినపడిన రోగులకు అత్యంత శక్తివంతమైన ఔషధాలు ఇస్తూ, వాటికి అలవాటు పడ్డాక వారిని లైంగికంగా వేధిస్తున్న రితేశ్‌ కల్రా అనే 51 ఏళ్ల వైద్యుడిని అమెరికా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం గృహనిర్బంధంలో ఉంచి ప్రశ్నిస్తున్నారు. ఈయన తన క్లినిక్‌ను 'మాత్రల కర్మాగారం'గా మార్చేశారని న్యూజెర్సీ జిల్లా అటార్నీ వ్యాఖ్యానించారు.

వాట్సాప్‌ స్టేటస్‌లో ప్రకటనలు!



వాషింగ్టన్‌: మనిషి చేతికి ఆరు వేలిగా స్మార్ట్‌ ఫోన్‌ తిష్ట వేస్తే, అందులో అత్యంత ఎక్కువగా వాడుతున్న యాప్‌గా వాట్సాప్‌ నిలిచింది. అందులో కొత్త ఫీచర్‌ జోడించడం ద్వారా లాభాల పంట పండించుకోవాలని దాని మాతృ సంస్థ 'మెటా' భావిస్తోంది. వాట్సాప్‌ వినియోగదారులు తాము వాట్సాప్‌లో స్టేటస్‌గా వాక్యాలు, ఫొటోలు, వీడియోలు, లింక్‌లు పెడితే అవతలి వాళ్లు చూడాలంటే తొలుత వాణిజ్య ప్రకటనలు దర్శనమివ్వనున్నాయి. అన్నిరకాల వ్యాపార సంస్థల నుంచి వచ్చే ఈ అడ్వర్‌టైజ్‌మెంట్‌ల ద్వారా ఆదాయాన్ని పొందాలని మెటా ఆశిస్తోంది. స్మార్ట్‌ఫోన్‌ వినియోగదారులు తమ దైనందిన జీవిత విశేషాలను తరచూ వాట్సాప్‌లో స్టేటస్‌లో పెట్టుకోవడం సర్వసాధారణమైంది. తొలుత ఎంపికచేసిన కొద్ది మంది యూజర్లు, టెస్టర్లకు మాత్రమే ఈ ఆండ్రాయిడ్‌ బీటా వెర్షన్‌ ఫీచర్‌ను అందుబాటులోకి తేనుంది. స్టేటస్‌ యాడ్స్‌తో పాటు ప్రమోటెడ్‌ ఛానళ్లను అందుబాటులోకి తేవాలని భావిస్తోంది.

ఏమిటీ స్టేటస్‌ యాడ్స్‌?

ఇన్‌స్టా గ్రామ్‌లో స్టోరీస్‌ యాడ్స్‌ మాదిరే ఇవి కూడా వినియోగదారులు ఏవైనా స్టేటస్‌ పెడితే వాటి మధ్యలో ఇకపై వాణిజ్య ప్రకటనలు దర్శనమిస్తాయి. మధ్యలో కనిపించేవి కేవలం యాడ్స్‌ మాత్రమే అని ప్రత్యేకంగా తెలిసేలా వాటికి 'స్పాన్సర్డ్‌' అనే మార్క్‌ను పెడతారు. తద్వారా వాణిజ్య ప్రకటనలకు, వ్యక్తిగత స్టేటస్‌ అప్‌డేట్స్‌కు మధ్య తేడాను అవతలి బంధువులు, స్నేహితులు సులభంగా తెల్సుకోగల్గుతారు. ఒకవేళ యూజర్లు ఈ యాడ్స్‌ను చూడొద్దనుకుంటే బ్లాక్‌ చేయొచ్చు. భవిష్యత్‌లో కనిపించకుండా పాప్‌అప్‌ను బ్లాక్‌ కూడా చేయొచ్చు. స్టేటస్‌తోపాటు కల్సిపోయినంత మాత్రాన యూజర్ల స్టేటస్‌ డేటా అనేది వ్యాపారసంస్థలకు వెళ్లదు. యూజర్ల వ్యక్తిగత గోప్యతకు ఎలాంటి భంగం వాటిల్లదని మెటా చెబుతోంది. యాడ్స్‌ ప్రసారం ద్వారా టిక్‌టాక్‌, యూట్యూబ్‌, ఇన్‌స్టా గ్రామ్‌ భారీ లాభాలు సాధిస్తున్న వేళ వాట్సాప్‌ సైతం అదే బాటలోకి నెమ్మదిగా వస్తోంది.

దేశం కోసం మాట్లాడితే నమ్మకద్రోహమా: థరూర్‌

కొచ్చి: ఆపరేషన్‌ సిందూర్‌, దేశ రక్షణకు మోదీ ప్రభుత్వం తీసుకున్న చర్యలను తాను సమర్థించడం సరైన నిర్ణయమేనని కాంగ్రెస్‌ నేత శశిథరూర్‌ పునరుద్ఘాటించారు. శనివారం ఆయన కొచ్చిలో మాట్లాడారు. ''నాది నమ్మకద్రోహమంటూ ఎంతోమంది విమర్శించారు. అయినా నేను దానికే కట్టుబడి ఉన్నా. దేశ ప్రయోజనాలను కాపాడుకునే విషయంలో ఇతర పార్టీలతోనూ సహకరించుకోల్సిన అవసరం ఉంటుంది. ఈ వైఖరి కొందరికి రుచించదు. అవిధేయత, నమ్మకద్రోహమంటూ అనుమానిస్తుంటారు' అని థరూర్‌ అన్నారు. ఈ వ్యాఖ్యలపై కేరళ కాంగ్రెస్‌ సీనియర్‌ నేత మురళీధరన్‌ విమర్శలు గుప్పించారు. థరూర్‌ ఇంకెంతమాత్రమూ కాంగ్రెస్‌ నేత కాదని వ్యాఖ్యానించారు.

ఎన్నికల్లో ఇషిబాకు ఎదురుదెబ్బ?

టోక్యో: జపాన్‌ ప్రధాని షిగెరు ఇషిబా సారథ్యంలో అధికార కూటమికి ఆదివారం జరిగిన ఎన్నికల్లో ఎదురుదెబ్బ తగులుతుందని ఎగ్జిట్‌ పోల్స్‌ తేల్చాయి. పార్లమెంట్‌ ఎగువసభలోని 248 సీట్లకు గాను ఆదివారం సగం సీట్లకు ఎన్నికలు జరిగాయి. ఇప్పటికే ఎగువసభలో అధికార పక్షానికి 75 సీట్లుండగా తాజా ఎన్నికల్లో మరో 50 సీట్లు నెగ్గాల్సి ఉంది. మెజారిటీ ఎగ్జిట్‌ పోల్స్‌ మాత్రం ఇషిబాకు 32 నుంచి 51 వరకు సీట్లు మాత్రమే దక్కవచ్చని చెబుతున్నాయి. ఎగువ సభలో మెజారిటీ లేకుంటే ఇషిబా సర్కారుకు ప్రస్తుతానికి ఎలాంటి ముప్పు ఉండదు. కానీ, ఈ ప్రభావం దేశాన్ని రాజకీయ అస్థిరతకు గురి చేసే అవకాశాలున్నాయంటున్నారు. సంకీర్ణ పక్షాలు ఇషిబాను గద్దె దిగాలని కోరవచ్చు. ఈ పరిస్థితుల్లో ఇషిబా కొత్త భాగస్వామ్యపార్టీని వెతుక్కోవాల్సిన అవసరం ఏర్పడుతుంది. అంతిమంగా, ఈ పరిణామాలు దేశంలో రాజకీయ అస్థిరతకు దారి తీసే ప్రమాదముందని పరిశీలకులు భావిస్తున్నారు. అసలే అవినీతి ఆరోపణలతో ఉక్కిరిబిక్కిరవుతున్న అధికార పక్షాన్ని నిత్యావసరాల ధరల పెరుగుదల, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ నుంచి ఎదురవుతున్న ఒత్తిళ్లు ప్రజాదరణను దూరం చేశాయని భావిస్తున్నారు.

కుంచించుకుపోతున్న బుల్లి గ్రహం

వయసు కేవలం 80 లక్షల ఏళ్లు ● నక్షత్ర తీక్షణ రేడియేషనే కారణం: నాసా

వాషింగ్టన్‌: అప్పుడే పుట్టిన బిడ్డ అనుకోని అనారోగ్య సమస్యతో అల్లాడుతుంటే అయ్యో అంటాం. ఇప్పుడు అంతరిక్షంలోనూ ఇలా తన ఉపరితల వాతావరణాన్ని కోల్పోతూ త్వరలో ఒట్టి శిలాగ్రహంగా మిగిలిపోనున్న ఒక నవజాత గ్రహాన్ని నాసా ఖగోళవేత్తలు తాజాగా గుర్తించారు. మన పుడమి పుట్టి 500 కోట్ల ఏళ్లు. భూమి వయసుతో పోలిస్తే కేవలం 80 లక్షల ఏళ్ల వయసున్న బుల్లి గ్రహం జాడను నాసా శాస్త్రవేత్తలు తాజాగా కనిపెట్టారు. కేవలం 80 లక్షల ఏళ్ల వయస్సున్న ఈ చిన్న గ్రహానికి 'టీఓఐ 1227–బీ'అని నామకరణంచేశారు. ఇలా నామకరణం చేశారో అలా అది కుంచించుకుపోవడం చూసి ఆశ్చర్యపోయారు. పాత సినిమాల్లో దేవతల తీక్షణమైన చూపునకు రాక్షసులు కాలి భస్మమైపోయినట్లు ఇప్పుడు బుల్లి గ్రహం సైతం తన పుట్టుకకు కారణమైన నక్షత్రం నుంచి వెలువడే అత్యంత శక్తివంతమైన ఎక్స్‌–రే కిరణాల ధాటికి నాశనమవుతోంది. గ్రహం తన ఉపరితల వాతావరణాన్ని కోల్పోతోంది. వాతావరణాన్ని కోల్పోతూ అది కుంచించుకుపోతోందని శాస్త్రవేత్తల పరిశోధనలో తేలింది. నాసా చంద్ర ఎక్స్‌–రే అబ్జర్వేటరీ ద్వారా ఈ బుల్లి గ్రహం కుంచించుకుపోతున్న వైనాన్ని ఖగోళవేత్తలు గమనించారు. ఈ వివరాలు ఆస్ట్రోఫిజిక్స్‌ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

అత్యంత సమీపంగా పరిభ్రమణం

సూర్యుడు– బుధగ్రహం మధ్య ఉండే దూరంతో పోలిస్తే ఐదోవంతు దూరంలోనే ఈ బుల్లిగ్రహం తన పేరెంట్‌ నక్షత్రం చుట్టూ పరిభ్రమిస్తోంది. ఇంత దగ్గరగా పరిభ్రమిస్తుండటంతో ఆ నక్షత్రం నుంచి వెలువ



దుతున్న అత్యంత తీవ్రస్థాయి రేడియేషన్‌ ఈ గ్రహంపై పడుతోంది. ''ఆ నక్షత్రం నుంచి వెలువడే భారీ రేడియేషన్‌ ధాటికి ఈ గ్రహంపై వాతావరణం త్వరలో పూర్తిగా ఆవిరైపోతుంది. ఈ రేడియేషన్‌ను గ్రహం చాక గ్రహం సైతం రేడియేషన్‌ను వెదజల్లుతోంది''అని పరిశోధనలో ప్రధాన రచయిత, రోచెస్టర్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీలో పీహెచ్‌డీ విద్యార్థి అత్తిల వర్గా చెప్పారు. ఈ గ్రహం మన భూమికి రెండు రెట్లు బరువుంది. విశ్వంలో భిన్న పరిస్థితులు ఎలాగైతే ఇలాంటి బుల్లి గ్రహాలకు పురుడుపోస్తాయో, మళ్లీ అవే భిన్న పరిస్థితులు ఆ గ్రహాల మీది వాతావరణాన్ని అంతర్ధానంచేస్తాయనే విషయాన్ని మరింత లోతుగా తెల్సుకునేందుకు 'టీఓఐ 1227బీ గ్రహం'అక్కరకొస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

జస్టిస్‌ వర్మ అభిశంసనకు 100 మంది సంతకాలు: రిజిజు

న్యూఢిల్లీ: జస్టిస్‌ యశ్వంత్‌ వర్మకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే తీర్మానం నోటీసుపై 100 మందికిపైగా ఎంపీలు సంతకాలు చేశారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్‌ రిజిజు వెల్లడించారు. లోక్‌సభలో ఇందుకు సంబంధించిన తీర్మానానికి అవసరమైన ఎంపీల కనీస సంఖ్య ఇప్పటి వరకు 100కు పైగా సంతకాలు లభించాయన్నారు. సంతకాల సేకరణ కొనసాగుతున్నందున మద్దతు తెలిపే ఎంపీల సంఖ్య పెరిగే అవకాశముందని వివరించారు. తీర్మానం ఎప్పుడు ప్రవేశపెట్టేదీ బిజినెస్‌ అడ్వైజరీ కమిటీ నిర్ణయించాల్సి ఉందన్నారు. ఉన్నత న్యాయస్థానాల్లోని న్యాయమూర్తులను అభిశంసన తీర్మానానికి లోక్‌సభలో కనీసం 100 మంది, రాజ్యసభలో 50 మంది ఎంపీలు సంతకాలు చేయాల్సి ఉంటుంది. ఢిల్లీ హైకోర్టులో న్యాయమూర్తిగా పనిచేస్తున్న సమయంలో జస్టిస్‌ వర్మ ఇంట్లో జరిగిన అగ్ని ప్రమాదం సమయంలో సగం కాలిన నోట్ల కట్టలు కనిపించాయన్న వార్తలు తీవ్ర సంచలనానికి కారణమయ్యాయి. దీంతో జస్టిస్‌ వర్మపై వర్షాకాల సమావేశాల్లో అభిశంసన ప్రవేశపెడతామని ప్రభుత్వం ప్రకటించడం తెల్సిందే.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
సోమవారం । 21 । జూలై । 2025



భక్తిశ్రద్ధలతో సూర్యోపాసన సేవ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): భక్తజనులందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని కాంక్షిస్తూ ఆదివారం దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ నిర్వహించారు.



తిరుపతమ్మ సేవలో..

పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మవారిని ఆదివారం స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్(ఎస్‌సీఈఆర్‌టీ) డైరెక్టర్ ఎంవీ కృష్ణారెడ్డి దంపతులు దర్శించుకుని పూజలు చేశారు.

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10 గంటలకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ ఒక ప్రకటనలో తెలిపారు.



న్యూస్‌రీల్

హారిక దంపతులపై దాడి నీచమైన చర్య



పెడన: కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, బీసీ మహిళా అయినటువంటి ఉప్పాల హారిక, వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రాములపై టీడీపీ, జనసేన గుండాలు చేసిన దాడి చాలా నీచమైందని, హేయమైన చర్య అని ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా పోలీసులు పటిష్ట చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నూజివీడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ఆదివారం ఆయన పెడన మండలం కృష్ణాపురంలోని హారిక, రాముల నివాసానికి వెళ్లి వారిని పరామర్శించారు. ఈ నెల 12న గుడివాడలో జరిగిన దాడి సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. విలేకరులతో మాట్లాడుతూ పోలీసుల సమక్షంలో దాడి జరిగితే అండగా ఉండకుండా నిందితులకు వత్తాసు పలకడం దారుణమన్నారు ప్రజాస్వామ్యంలో ఇటువంటి పరిస్థితి రానీయకుండా పోలీసులు నడుచుకోవాల్సిన అవశ్యకత ఉందన్నారు. ఆయనతో పాటు కృష్ణాజిల్లా పరిషత్ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, వైఎస్సార్ సీపీ నూజివీడు అధ్యక్షుడు శివ తదితరులున్నారు.

జీతాల సమస్యలు పరిష్కరించండి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): బదిలీ అయిన ఉపాధ్యాయుల జీతాలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ డిమాండ్ చేశారు. యూటీఎఫ్ ఎన్టీఆర్ జిల్లా కార్యవర్గ సమావేశం ఆ సంఘ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ప్రసాద్ మాట్లాడుతూ 2024, 2025 సంవత్సరాల్లో ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు కరువు భత్యాలు, ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ సుందరయ్య మాట్లాడుతూ బోధనేతర పనుల నుంచి, యాప్‌ల నుంచి ఉపాధ్యాయులకి మినహాయింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు కె. శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఎం. కృష్ణయ్య, పి. లీల, పి. నాగేశ్వరరావు, మహేశ్వర వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుల సంఘ జిల్లా కార్యవర్గం ఎన్నిక



తిరువూరు: ఏపీ ప్రధానోపాధ్యాయుల సంఘ ఎన్టీఆర్ జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం తిరువూరు శ్రీవాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగింది. సంఘ నూతన కార్యవర్గాన్ని ఈ సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆర్. రాంబాబు నాయక్ (వత్సవాయి), ప్రధాన కార్యదర్శిగా ఈఎల్‌సీ కేశవరావు(ఏకొండూరు), కోశాధికారిగా సీహెచ్ వెంకటనారాయణ (కొండపల్లి), గౌరవాధ్యక్షుడిగా పీఎస్ఎన్ రాజు (తిరువూరు), రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఈ సుధాకర్ (విస్సన్నపేట), ఏ రాంబాబు (రుద్రవరం), సీహెచ్‌వీ సుబ్రహ్మణ్యం (విజయవాడ), కేంద్ర కార్యదర్శిగా ఆర్. విజయ రామారావు(విజయవాడ) ఎన్నికయ్యారు. సమావేశం ప్రధానోపాధ్యాయుల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెలమల శ్రీనివాసరావు, కృష్ణా జిల్లా సంఘ ప్రధాన కార్యదర్శి కొమ్మా విజయ్ ఆధ్వర్యంలో జరిగింది.

ప్రశాంతంగా ఏపీపీఎస్సీ పరీక్షలు

మచిలీపట్నంఅర్బన్: ఏపీపీఎస్సీ ప్రభుత్వ డిగ్రీ, జూనియర్, పాలిటెక్నిక్ కాలేజీల లెక్చరర్ పోస్టులకు కంప్యూటర్ ఆధారిత పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. జిల్లా రెవెన్యూ అధికారి కె. చంద్రశేఖరరావు కానూరులోని పరీక్ష కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. కృష్ణాజిల్లాలోని నాలుగు పరీక్ష కేంద్రాలలో నిర్వహించిన పరీక్షకు ఉదయం సెషన్లో 200 మంది అభ్యర్థుల్లో 133 మంది హాజరవ్వగా, 67 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్న సెషన్లో 873 మంది అభ్యర్థుల్లో 359 మంది మాత్రమే హాజరవ్వగా, 514 మంది గైర్హాజరైనట్లు డీఆర్‌ఓ తెలిపారు.

అప్రజాస్వామికం

ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టును ఖండించిన వైఎస్సార్ సీపీ నేతలు

- ఆధారాల్లేని కేసులో ఎన్ని అరెస్టులు చేస్తారంటూ నిలదీత
- విజయవాడకు తరలివచ్చిన అభిమానులు, పార్టీ నేతలు
- ఖర్ఫ్యూ వాతావరణం సృష్టించిన పోలీసులు
- అడుగడుగునా ఆంక్షలతో అణచివేసే కుట్ర



విజయవాడలోని సిట్ కార్యాలయం వద్ద బారికేడ్లు పెట్టి వైఎస్సార్ సీపీ నాయకులను, కార్యకర్తలను అడ్డుకుంటున్న పోలీసులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): వైఎస్సార్ సీపీ పార్లమెంటు సభ్యుడు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి సంఘీభావంగా రాష్ట్రం నలుమూలల నుంచి నేతలు, అభిమానులు నగరానికి తరలివచ్చారు. లిక్కర్ స్కామ్ పేరుతో కట్టుకథలు అల్లుతూ.. ఎలాంటి ఆధారాలు లేకుండా.. అక్రమ కేసులో అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. కూటమి ప్రభుత్వం తీరును, పోలీసులు వ్యవహరిస్తున్న వైనాన్ని ప్రతి ఒక్కరూ తప్పుపట్టారు. వైఎస్సార్ సీపీ నేతలు, మిథున్ అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావడంతో సిట్ కార్యాలయం, పరిసర ప్రాంతాల్లో జనసందోహంగా మారాయి. ఆధారాలు లేని కేసులో ఎంత మందిని అరెస్టు చేసుకుంటూ వెళ్తారంటూ మీడియా వేదికగా మండిపడ్డారు. ప్రజల్లో విశ్వాసం కోల్పోయిన కూటమి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని ఆరోపించారు.

కర్ఫ్యూ వాతావరణం..

వైఎస్సార్ సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి విచారణకు హాజరైన దగ్గర నుంచి అరెస్టు, కోర్టులో హాజరు పరిచే సమయంలో పోలీసులు వ్యవహరించిన తీరుపై పలువురు మండిపడుతున్నారు. సిట్ కార్యాలయం వద్ద వందలాది మంది పోలీసులతో బందోబస్తు పెట్టి, రాకపోకలను నిషేధిస్తూ బారికేడ్లు ఏర్పాటు చేసి కర్ఫ్యూ వాతావరణాన్ని తలపించేలా చేశారంటున్నారు. అంతేకాకుండా వైద్య పరీక్షల కోసం తీసుకెళ్లిన ప్రభుత్వాస్పత్రి వద్ద, అనంతరం సివిల్ కోర్టుల వద్ద పోలీసుల తీరు అలాగే ఉండటంపై విమర్శలు గుప్పిస్తున్నారు. ఆయన సమీపానికి సైతం ఎవరినీ రాకుండా అడ్డుకోవడంపై మండిపడుతున్నారు. ఇలాంటి చర్యలతో అణచివేయాలని చూస్తే రెట్టింపు ఉత్సాహంగా పైకి లేస్తామని నాయకులు, కార్యకర్తలు స్పష్టం చేశారు.



కోర్టు బయట వేచి ఉన్న తలశిల రఘురాం, దేవినేని అవినాష్



బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏకే బాషాను కోర్టులోనికి వెళ్లకుండా అడ్డుకుంటున్న పోలీసులు



కోర్టు వద్ద వేచి ఉన్న జోగి రమేష్, మల్లాది విష్ణు

ప్రజలంతా చూస్తున్నారు..

కూటమి ప్రభుత్వం ఏడాదిగా చేస్తున్న అరాచకాలను ప్రజలు చూస్తున్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారు. మిథున్‌రెడ్డి కడిగిన ముత్యంలా బయటకు వస్తారు. ఇది కుట్రపూరితంగా పెట్టిన అక్రమ కేసు. ఎన్ని కుట్రలు చేసినా, కేసులు పెట్టినా న్యాయపరంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం. – భరత్, ఎమ్మెల్సీ, కుప్పం

ఎమర్జెన్సీని తలపించేలా..



అక్రమ కేసులో ఎంపీ మిథున్ రెడ్డిని అరెస్టు చేయడమే కాకుండా రెండు రోజుల పాటు పోలీసులు ఎమర్జెన్సీ వాతావరణాన్ని తలపించేలా ప్రవర్తించారు. సిట్ కార్యాలయం వద్ద, కోర్టు వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి, ఎవరినీ లోపలికి వెళ్లకుండా అడ్డుకోవడం దేనికి సంకేతం? వేలాది మంది వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివస్తే, వారి పట్ల పోలీసులు చాలా దుర్మార్గంగా వ్యవహరిస్తూ ఎమర్జెన్సీ వాతావరణం కల్పించారు.

– దేవినేని అవినాష్, వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు

ఆధారాలు లేకుండా అక్రమ అరెస్టులు



లిక్కర్ స్కామ్ పేరుతో ఎలాంటి ఆధారాలు లేకుండా అక్రమ అరెస్టులకు పాల్పడటం చాలా దుర్మార్గం. వైఎస్సార్ సీపీలో కీలకంగా ఉన్న నేతలందరిపై ఏదోరకంగా కేసులు పెట్టడమే కూటమి ప్రభుత్వం పనిగా పెట్టుకుంది. సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయక పోవడంతో ప్రజల్లో వ్యతిరేకత రావడంతో ఇలాంటి కుట్రలు పన్నుతున్నారు. ఏడాదిలో కూటమి ప్రభుత్వం ప్రజల మద్దతు కోల్పోయింది.

– కైలే అనిల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే

అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారు..



కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోంది. విద్య, వైద్య రంగాలను గాలికొదిలేసి, ప్రతిపక్ష పార్టీ వారిపై అక్రమ కేసులు, అరెస్టులు చేయడంపైనే దృష్టి పెట్టింది. వైద్య కళాశాలలను నిర్వీర్యం చేసింది. విద్యా వ్యవస్థను నాశనం చేసి, వైఎస్సార్ సీపీ ముఖ్యనేతలను అరెస్టులు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోంది.

– ఎ.రవిచంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్, వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం

నీచమైన రాజకీయాలు..



రాష్ట్రంలో కూటమి పాలకులు చాలా నీచమైన రాజకీయాలు చేస్తున్నారు. వైఎస్సార్ సీపీలో కీలకంగా ఉన్న ప్రతి ఒక్కరినీ ఏదోరకంగా ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారు. వాళ్ల చరిత్ర తెలుసుకోవాలి. ఎంత అణిచివేస్తే, రెట్టింపు ఉత్సాహంగా పైకి లేస్తారు. ఈ రోజు అధికారం ఉందని అరెస్టులు చేయొచ్చు. ఈ అక్రమ కేసులు ఏమీ చేయలేవు. మిథున్‌రెడ్డి క్లీన్ చిట్‌తో బయటకు వస్తారు. న్యాయ వ్యవస్థపై మాకు పూర్తి నమ్మకం ఉంది.

– నిస్సార్ అహ్మద్, మదనపల్లి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి

చాలా దుర్మార్గపు చర్య..



మిథున్‌రెడ్డిని ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతోనే అరెస్టు చేశారు. పెద్దిరెడ్డి కుటుంబంపై చంద్రబాబుకు ఎప్పటి నుంచో కోపం ఉంది. చదువుకునే రోజుల్లోనే చెంపపై కొట్టాడని ఇప్పుడు కక్ష తీర్చుకుంటున్నారు. వారు ఈవీఎంలతో ప్రభుత్వం ఏర్పాటు చేశారు. ప్రజలకిచ్చిన హామీలన్నీ వదిలేశారు. ప్రజలు ప్రశ్నిస్తారని డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారు. వారి కుట్రలు అన్నీ ప్రజలు గమనిస్తున్నారు. న్యాయ వ్యవస్థపై మాకు నమ్మకం ఉంది.

– మఖ్బూల్ బాషా, కదిరి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి

కట్టుకథలు అల్లుతున్నారు..



కూటమి ప్రభుత్వం వైఎస్సార్ సీపీ నేతలను టార్గెట్ చేసి కట్టు కథలు అల్లుతూ అక్రమ కేసులు బనాయించి లోపల వేస్తోంది. నాకు ఏమాత్రం ప్రమేయం లేని, ఎప్పుడో జరిగినా కేసులో నన్ను కూడా అరెస్టు చేస్తే 35 రోజులు రాజమండ్రి జైలులో ఉంచారు. నేడు డాక్టర్‌గా సమాజానికి సేవలు అందిస్తూ నాన్న స్ఫూర్తితో రాజకీయాల్లోకి వస్తే నన్ను కూడా టార్గెట్ చేశారు. ఈ అరాచక ప్రభుత్వానికి ముగింపు పలికేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు.

– డాక్టర్ పినిపే శ్రీకాంత్, అమలాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి

దుర్గగుడికి పలువురు భక్తుల విరాళాలు



నిత్యాన్నదానానికి విరాళం అందజేస్తున్న దాతలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన భక్తులు ఆదివారం రూ. లక్ష విరాళాన్ని అందజేశారు. భవానీపురానికి చెందిన కేసరి శ్రీనివాసరెడ్డి, విజయలక్ష్మి తమ కుమార్తె నీవిద, తల్లిదండ్రులు సుబ్బారెడ్డి, రాజేశ్వరిల పేరిట నిత్యాన్నదానానికి రూ. 1,01,116 విరాళాన్ని ఆలయ ఏఈవో ఎన్. రమేష్‌బాబుకు అందజేశారు.

ఉచిత ప్రసాదం పథకానికి..

అమ్మవారి సన్నిధిలో ప్రతి నిత్యం జరిగే ఉచిత ప్రసాద వితరణకు గుంటూరు భక్తులు రూ. లక్ష విరాళాన్ని అందజేశారు. చంద్రమౌళినగర్‌కు చెందిన శ్రీమోహన్‌సాయి, లక్ష్మీనారాయణ, రజనీ, డాక్టర్ అనులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. శివశంకర్, పద్మ పేరిట ఉచిత ప్రసాద వితరణకు రూ.లక్ష విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు.

గోసంరక్షణకు రూ. లక్ష..

దుర్గమ్మ సన్నిధిలోని గోసేవ పథకానికి గుంటూరుకు చెందిన భక్తులు రూ. లక్ష విరాళాన్ని అందజేశారు. గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన జి.రంగలక్ష్మి, సూర్యనారాయణ దంపతులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ ఈవో శీనానాయక్‌ను కలిసి గోసంరక్షణ నిధికి రూ.1,01,116 విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. దర్శనానంతరం వేద పండితుల ఆశీర్వచనం అందజేయగా, ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను బహూకరించారు.

ఉద్యోగ విరమణ చేసిన అధికారులకు సత్కారం



రిటైర్ అయిన వైద్యశాఖ మీడియా అధికారులను సత్కరిస్తున్న దృశ్యం

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైద్య ఆరోగ్యశాఖలో హెల్త్ ఎడ్యుకేషన్ మీడియా అధికారులుగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన పలువురికి ఏపీ హెల్త్ ఎడ్యుకేషన్, మీడియా అధికారుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఎంజీ రోడ్డులోని ఓ హోటల్‌లో అసోసియేషన్ ఉమ్మడి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ నాగేశ్వరరావు, మురళీధర్‌ల నేతృత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. తొలుత సంఘం సాధించిన ప్రగతి కార్యకలాపాలపై చర్చించారు. సంఘ సభ్యుల అభ్యున్నతికై పలు తీర్మానాలు చేశారు. రాష్ట్ర ఆరోగ్యశాఖ కమిషనర్ కార్యాలయంలో పనిచేసిన ఆర్. రాజేశ్వరితో పాటు, జె.రఘురామ్, వి.సుభావతి, పి.రత్నకుమారి, ఎస్. భానుమూర్తి, వసంతరావును సత్కరించారు. ఈ సదస్సులో తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షుడు రామాంజనేయులు, తెలంగాణ వైద్యశాఖ మీడియా అధికారుల సంఘం అధ్యక్షుడు కొప్పు ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ సంఘ కోశాధికారి నరేంద్ర శేషు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె. ప్రభాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కవులు, రచయితల శక్తి అసామాన్యమైనది

ప్రణామం కవి సమ్మేళనంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



కలెక్టర్‌ను సత్కరిస్తున్న మల్లెతీగ సేవా సంస్థ ప్రతినిధులు

విజయవాడ కల్చరల్/గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): కవులు, రచయితలకు ఉన్న శక్తి అసామాన్యమైనదని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. వారి కలం నుంచి జాలువారిన అక్షర శక్తి ముందు తూటా శక్తి కూడా నిలువలేదని చెప్పారు. విజయవాడ బందరురోడ్డులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనం ఆవరణలో ఆదివారం మల్లెతీగ సాహిత్యసేవా సంస్థ ఆధ్వర్యంలో 'ప్రణామం' కవి సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ అర్థవంతమైన రచనలు సమాజ దిశను దశను మార్చుతాయని, సమాజంలోఎన్నో విప్లవాత్మక మార్పులకు కలం, గళమే కారణమన్నారు. కార్యక్రమాన్ని చొప్పా రాఘవేంద్ర శేఖర్ పర్యవేక్షించగా రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన 80 మంది కవులు తెలుగు భాష, ప్రపంచశాంతి, పర్యావరణం, దేశభక్తి, సామాజిక చైతన్యం అంశాలపై కవితాగానం చేశారు. అంబేడ్కర్ విగ్రహం సాక్షిగా కవులు ప్రమాణం చేశారు. సుప్రసిద్ధ కవులు శ్రీరామకవచం సాగర్, డాక్టర్ ఎం.ప్రభాకర్, వ్యాఖ్యాన శిరోమణి వేముల హజరత్తయ్య గుప్తా, సీనియర్ జర్నలిస్టు ఘంటా విజయ్‌కుమార్, మల్లెతీగ కలిమిశ్రీ, బుక్ ఆఫ్ భారత్ రికార్డ్స్ డాక్టర్ ఎస్. దుర్గాకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బారులు తీరి.. సారెనిచ్చి..

- ఆషాఢ మాసం ఆఖరి ఆదివారం రికార్డు స్థాయిలో భక్తులు
- సారె సమర్పణకు 2 గంటల సమయం
- రాత్రి వరకూ కొనసాగిన రద్దీ



ముఖమండపం వద్ద భక్తుల రద్దీ, (ఇన్‌సెట్‌లో) దుర్గమ్మవారు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఆషాఢ మాసం ఆఖరి ఆదివారం నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు రికార్డు స్థాయిలో భక్త బృందాలు సారెను సమర్పించాయి. ఆదివారం తెల్లవారుజామున ఆరు గంటలకు ప్రారంభమైన భక్తుల రద్దీ రాత్రి 10 గంటల వరకు కొనసాగింది. ఆదివారం ఒక్క రోజే సుమారు 80 వేలకు పైబడి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రద్దీ నేపథ్యంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అన్ని దర్శన టికెట్ల విక్రయాలను నిలిపివేసి, భక్తులందరిని అన్ని టికెట్ల క్యూలైన్‌లోకి ఉచితంగా అనుమతించి అమ్మవారి దర్శనం కల్పించారు. అమ్మవారిని దర్శించుకున్న వంద మంది భక్తులలో దాదాపు 80 మంది చేతిలో అమ్మవారి సారె ఉండటం విశేషం. అమ్మవారికి సారెను సమర్పించేందుకు విచ్చేసిన భక్తులతో మహా మండపం 5వ అంతస్తు వరకు క్యూలైన్లు కిటకిటలాడాయి. మధ్యాహ్నం అమ్మవారికి మహా నివేదన సమర్పించేందుకు గాను అరగంట పాటు అన్ని దర్శనాలు నిలిపివేశారు. మహానివేదన అనంతరం తిరిగి దర్శనాలు ప్రారంభం కాగా క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా త్వరితగతిన దర్శనం అయ్యేలా ఆలయ ఏఈవోలు, సూపరింటెండెంట్లు సమన్వయంతో చర్యలు తీసుకున్నారు.

కిటకిటలాడిన ఆరో అంతస్తు..

మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తికి సారెను చూపేందుకు భక్త బృందాలు క్యూ కట్టాయి. ఉదయం 10 గంటల తర్వాత భక్త బృందాలతో ఆరో అంతస్తు కిటకిటలాడింది. అమ్మవారికి సారెను చూపేందుకు రెండు గంటలకు పైగా సమయం పట్టింది. మహా మండపం లిఫ్టు, మెట్లమార్గంతో పాటు ఘాట్‌రోడ్డు, పాత మెట్ల మార్గం ద్వారా భక్తులు కొండపైకి చేరుకున్నారు. ప్రధాన ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌ను దర్శించుకున్న అనంతరం ఆరో అంతస్తుకు చేరి సారెను సమర్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగున ఉన్న తమిళనాడు, కర్ణాటక, ఒడిశాల నుంచి కూడా భక్తులు అమ్మవారికి సారె సమర్పించారు.

అంతరాలయ దర్శనం రద్దు..

ఆదివారం ఉదయం నుంచే అంతరాలయ దర్శనాలను ఆలయ ఈవో శీనానాయక్ రద్దు చేశారు. ఉదయం 10 గంటల తర్వాత వీఐపీ దర్శనాలను సైతం నిలిపివేసి, బంగారు వాకిలి దర్శనం కల్పించారు. మధ్యాహ్నం వరకు ఇదే పరిస్థితి కనిపించింది. మహా మండపం లిఫ్టు మార్గం ద్వారా కేవలం వికలాంగులు, వృద్ధులు, చంటి పిల్లల తల్లులు, నడవలేని వారికి మాత్రమే కొండపైకి తీసుకెళ్లారు. దర్శనం ముగించుకుని తిరుగు ప్రయాణం అయిన వారిని మల్లేశ్వరాలయం, మహామండపం మెట్ల మార్గం ద్వారా కొండ దిగువకు పంపేలా ఏర్పాట్లు చేశారు.

దర్శనానంతరం ఇబ్బందులు..



బస్సు కోసం పోటీ పడుతున్న భక్తులు

అమ్మవారి దర్శనమైన తర్వాత దేవస్థాన బస్సులలో కొండ దిగువకు చేరేందుకు భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. బస్టాప్ అరకొర సదుపాయాలతో ఉండటం, ఎండ వేడిలో ఆరు బయటే పిల్లా పాపలతో నిల్చోవాల్సి వస్తుందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు భక్తులు బస్సు దిగక ముందే బస్సులోకి ఎక్కేందుకు ప్రయత్నించడంతో బ్యాగులలోని సెల్‌ఫోన్లు, ఇతర వస్తువులు చోరీకి గురవుతున్నాయి.





పగలంతా ఎండ.. సాయంత్రమైతే ఆకాశం మేఘావృతం.. రాత్రయితే భారీ వర్షం.. ఇదీ గత రెండు రోజులుగా విజయవాడలో పరిస్థితి. ఆదివారం కూడా ఇదే తరహాలో రాత్రి 7 గంటల తర్వాత కుండపోతగా వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. వర్షం, గాలుల ధాటికి బందరు రోడ్డులోని ఓ పెట్రోల్ బంకులో పై రేకు ఊడి పడింది. నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో జనాలు భానుడి తాపం నుంచి ఉపశమనం పొందుతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

క్లుప్తంగా

యనమలకుదురు లాకుల వద్ద గుర్తు తెలియని మృతదేహం


పెనమలూరు: యనమలకుదురు లాకుల వద్ద గుర్తు తెలియని మృతదేహం కొట్టుకు రావడంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు లాకుల వద్ద పురుష మృతదేహం నీటిలో కొట్టుకు వచ్చింది. మృతుడి వయస్సు 45 నుంచి 50 మధ్య ఉంటుంది. మృతదేహం కుళ్లి పోయి కనిపిస్తోంది. మృతుడి శరీరంపై చొక్కా, చిరిగిన ప్యాంట్ ఉంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి వివరాలు తెలిసిన వారు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

అదృశ్యమైన వృద్ధురాలు శవమై కనిపించారు


రాంప్రసాదం (ఫైల్)

కోడూరు: అదృశ్యమైన వృద్ధురాలు చెరువులో పడి మృతిచెందిన ఘటన కోడూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌చార్జి ఎస్‌ఐ రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన చందన రాంప్రసాదం (90) శుక్రవారం రాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లింది. ఆమె తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద వెదికారు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం ఉదయం గ్రామంలోని చెరువులో మృతదేహం ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని పరిశీలించగా రాంప్రసాదంగా గుర్తించినట్లు ఎస్‌ఐ చెప్పారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు తెలిపారు. మృతురాలి మనవడు మనోజ్ ఫిర్యాదు మేరకు ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.


566.70 అడుగులకు చేరిన సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 566.70 అడుగులకు చేరింది. ఇది 248.2946 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 67,556 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

కనులపండువగా..

- శాకంబరీ అలంకారంలో శ్రీవల్లీ దేవసేన అమ్మవార్లు
- మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరుడి ఆలయానికి పండ్లు, కూరగాయలతో అలంకరణ


మోపిదేవిలో శాకంబరిగా దర్శనమిచ్చిన అమ్మవారు


పలురకాల కూరగాయలు, పండ్లతో సుబ్రహ్మణ్యేశ్వరుడి ఆలయ ప్రాంగణం

మోపిదేవి: ప్రసిద్ధ పుణ్య క్షేత్రం మోపిదేవి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో ఆషాఢ కృత్తిక (ఆడికృత్తిక)స్వామివారి జన్మనక్షత్రం సందర్భంగా ఆదివారం అమ్మవార్లను శాకంబరీదేవిగా అలంకరించారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాద రావు ఆధ్వర్యంలో ప్రధానార్చకుడు బుద్దు పవన్ కుమార్ శర్మ, ఆలయ ఘనాపాటి నౌడూరి సుబ్రహ్మణ్య శర్మ బ్రహ్మత్వంలో ఉదయం 7 గంటలకు తీర్థపు బిందె, ధ్వజస్తంభ పూజ, నందీశ్వరపూజ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రీవల్లీ దేవసేన అమ్మవార్లను వివిధ రకాల పండ్లు, కూరగాయలతో శాకంబరీగా అలంకరించారు. ఉదయం కలశాభిషేకం, పంచామృతాలు, వివిధ రకాల పండ్ల రసాలతో శ్రీ వల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్లకు ఏకాదశ రుద్రాభిషేకం, శాకంబరీ అలంకారం చేశారు. లక్షబిల్వార్చన, శాంతి కల్యాణం, మహా నివేదన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. అనంతరం వారు అన్న ప్రసాదం స్వీకరించారు.

భక్తిశ్రద్ధలతో కావడిసేవ


కాసాని గూడెం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం ఆధ్వర్యాన కావడి సేవ

మచిలీపట్నంటౌన్: నగరంలోని కాసానిగూడెంలో శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సుబ్బారాయుడి ఆడి ఆషాఢ కృత్తిక మహోత్సవంలో భాగంగా ఆదివారం నగరంలో కావడి సేవ అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ నెల 18వ తేదీ శుక్రవారం ప్రారంభమైన ఉత్సవాల్లో భాగంగా చివరి రోజైన ఆదివారం కావడి సేవ చేశారు. మూడు స్తంభాల సెంటర్‌లోని విజయగణపతి ఆలయం వద్ద ప్రారంభమైన ఈ కావడిసేవ వాయిద్యాల నడుమ నగరంలోని ప్రధాన రహదారుల మీదుగా సాగింది. ఈ సందర్భంగా అన్నాభిషేకం జరిగింది. అనంతరం ఆలయంలో పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి శ్రీ బాలస్వామీజీ ప్రవచన కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం సుబ్రహ్మణ్యేశ్వరుడు ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులకు అన్న సమారాధన జరిగింది. స్థానిక మేకవానిపాలెంలో వేంచేస్తున్న నాగేంద్ర స్వామి ఆలయం ఆధ్వర్యంలో ఆడి కృత్తిక కావడి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు కావళ్లు ఎత్తారు.

బందరు సబ్-డివిజన్‌లో 30 పోలీస్‌యాక్ట్ అమలు

కోనేరుసెంటర్: బందరు సబ్ డివిజన్‌లో సోమవారం నుంచి 30 పోలీస్‌యాక్ట్ అమలులో ఉన్నట్లు బందరు డీఎస్పీ సీహెచ్ రాజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్-డివిజన్ పరిధిలోని బందరుతో పాటు పెడన, గూడూరు, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లో ఏ ఒక్కరూ ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించకూడదని పేర్కొన్నారు. అలాంటి కార్యక్రమాలు నిర్వహించాల్సి వస్తే పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని స్పష్టం చేశారు. పోలీసుల అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ధర్నాలు నిర్వహిస్తే చట్టప్రకారం సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దేవరకొండలో నీట మునిగిన పొలాలు

- అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం
- గుండేరు డ్రెయిన్ వద్ద రైతుల ధర్నా


దేవరకొండలో గుండేరు డ్రెయిన్ వంతెన వద్ద ధర్నా చేస్తున్న రైతులు

దేవరకోట(ఘంటసాల): అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా ఆకుమడులు, నాట్లు వేసిన పొలాలు నీట మునిగాయని నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని ఏపీ బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అందె జగదీష్ డిమాండ్ చేశారు. ఘంటసాల మండలం దేవరకోటలోని ఘంటసాల - రామానగరం ప్రధాన రహదారి గుండేరు డ్రెయిన్ వద్ద ఉన్న వంతెనపై జగదీష్ ఆధ్వర్యంలో సన్న, చిన్న కారు రైతులు ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ గుండేరు డ్రెయిన్‌లో గుర్రపు డెక్క, తూటుకాడ భారీగా పేరుకుపోయిందన్నారు. మూడు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి మురుగు కాలువ ప్రవహించే పరిస్థితి లేదన్నారు. దీంతో నీరు ఎగతట్టి దిగువ బాగంలో ఉన్న దిబ్బ చేలు, మూలగొంది పొలాలు, చిట్టూర్పు పొలాలు, ఇతరప్రాంతాల్లో ఆకుమడులు, నాట్లు వేసిన సుమారు 300 ఎకరాల్లో పొలాలు పూర్తిగా నీట మునిగాయని చెప్పారు. దీనిపై రెండు మూడు రోజులుగా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నా అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం బాధాకరమన్నారు. ఒక్కో రైతు ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు నష్టపోయిన పరిస్థితి నెలకొందన్నారు. తక్షణమే ప్రభుత్వ యంత్రాంగం స్పందించి గుండేరు పరివాహక ప్రాంతంలో ఉన్న వంతెనల వద్ద పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూటు కాడ, మొదలగు వ్యర్థాలను మిషన్ల ద్వారా తొలగించాలన్నారు. రైతులు, కౌలు రైతులు జాస్తి రామచంద్రబాబు, కొప్పుల వెంకటేశ్వరరావు, అజయ్ కుమార్, సన్న, చిన్న కారు రైతులు పాల్గొన్నారు.

సైబర్ వలలో చిక్కిన న్యాయవాది

పెనమలూరు: సైబర్ నేరగాళ్లు ఏకంగా ఒక న్యాయవాదిని మోసం చేసి సొమ్ము కాజేసిన ఘటనపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం కానూరు పిన్నమనేని టీచర్స్‌కాలనీకి చెందిన న్యాయవాదికి కొన్ని నెలల క్రితం తన వాట్సాప్‌నకు ఐసీఐసీఐ స్టాక్ ఎక్స్ఛేంజ్ పేరుతో లింక్ వచ్చింది. ఆ గ్రూప్ బ్యాంక్‌కు చెందినదిగా భావించిన అతను దానిలో చేరాడు. గ్రూప్ అడ్మిన్‌లుగా అశ్విన్‌పరేక్, వినీత్‌పటోడాయా ఉన్నారు. గ్రూప్ అడ్మిన్లు కోరిన విధంగా కేవైసీ వివరాలు న్యాయవాది ఇచ్చారు. ఆ తర్వాత న్యాయవాది స్టాక్ మార్కెట్‌లో లావాదేవీలకు రూ.13,30,500 సొమ్ము బదిలీ చేశాడు. ఆ తర్వాత రూ. 10 లక్షలు తిరిగి విత్ డ్రా చేయటానికి యత్నించగా సొమ్ము రాలేదు. దీనిపై గ్రూప్ అడ్మిన్‌లను అడగ్గా మరో రూ.20 లక్షలు చెల్లిస్తే మొత్తం సొమ్ము విత్ డ్రా చేసుకోవచ్చని సూచించారు. దీంతో జరిగిన మోసాన్ని తెలుసుకున్న న్యాయవాది పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

బెజవాడలో మరో దారుణ హత్య?

- గంజాయి బ్యాచ్ సభ్యులు హత్య చేసి ఉంటారనే అనుమానాలు
- భార్య వివాహేతర సంబంధంపై మృతుడి బంధువుల ఆరోపణ
- మృతుడి భార్య, గంజాయి బ్యాచ్ సభ్యులను అదుపులోకి తీసుకున్న పోలీసులు


మధురానగర్ వంతెన వద్ద తలపగిలి రక్తపు మడుగులో సాధిక్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): విజయవాడలో జరిగిన జంట హత్యల ఘటనను మరువక ముందే మధురానగర్ వంతెన వద్ద మరో వ్యక్తి దారుణ హత్యకు గురైన ఘటన అజిత్‌సింగ్‌నగర్ పీఎస్ పరిధిలో ఆదివారం వెలుగు చూసింది. గవర్నర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 16వ తేదీన ఓ రౌడీషీటర్ రెచ్చిపోయి ఇద్దరు వ్యక్తులను కిరాతకంగా హత్యచేసిన విషయం విదితమే. ఐదు రోజుల వ్యవధిలోనే మరో వ్యక్తి అదే విధంగా నడిరోడ్డుపై రక్తపు మడుగులో మృతిచెందాడు. వరుస ఘటనలతో ప్రజలు హడలిపోతున్నారు.

రెండు రోజుల్లో ఇంటికొస్తానని చెప్పి.. మృత్యుఒడిలోకి...

గుంటూరు జిల్లా మొగలాయిపాలెం గ్రామానికి చెందిన షేక్ సాధిక్ (28)కు నగరంలోని వాంబేకాలనీ ప్రాంతానికి చెందిన కరిష్మతో 2019లో వివాహమైంది. వీరికి ఒక కుమార్తె ఉంది. అతను పెయింటింగ్ పనులు చేస్తుంటాడు. భార్యతో విభేదాల కారణంగా కొన్నేళ్ల నుంచి ఆమెకు దూరంగా జీవిస్తున్నాడు. వారిద్దరూ విడాకులకు కూడా ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఇలాంటి పరిస్థితుల్లో అతను మద్యానికి, చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. అతను గుంటూరులోని తల్లివద్దే ఉంటున్నాడు. ఈ నెల 16వ తేదీన విజయవాడ వెళ్లివస్తానని చెప్పి గుంటూరు నుంచి బయలుదేరాడు. సాధిక్ 19వ తేదీ తన తల్లి రిహానాకు ఫోను చేసి రెండు రోజుల్లో ఇంటికి వచ్చేస్తానని చెప్పాడు. అయితే 20వ తేదీ తెల్లవారుజామున రక్తపు మడుగుల్లో శవమై కనిపించాడు.

భార్య, అనుమానితులను విచారణ చేస్తున్న పోలీసులు

సాధిక్ భార్య కరిష్మతో పాటు ఘటన జరిగిన ప్రాంతంలో అనుమానితులుగా కనిపించిన గంజాయి బ్యాచ్ సభ్యులను కూడా పోలీసులు విచారణ చేస్తున్నట్లు సమాచారం. కరిష్మ తన భర్త అసలు ఇంటికే రాలేదని పోలీసులకు స్పష్టం చేసింది. ఘటనా స్థలంలో సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. సాధిక్, కరిష్మల ఫోన్ డేటాలను కూడా సేకరిస్తున్నారు. సాధిక్ తల్లి రిహానా ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించామని, ఆ రిపోర్టు ఆధారంగా సాధిక్ హత్యకు కారణాలు తెలుసుకొని పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని పోలీసులు చెబుతున్నారు.

గంజాయి బ్యాచ్ పనా? వివాహేతర సంబంధం కారణమా?

భార్యను కలుద్దామని నగరానికి వచ్చిన సాధిక్ వాంబేకాలనీలో ఉన్న తన భార్య కరిష్మను కలిశాడో లేదో తెలియడం లేదు. వాంబేకాలనీ నుంచి మధురానగర్ వైపు ఉన్న ట్రెండ్ సెట్ మార్గంలో అక్కడే బస్‌స్టాప్ వద్ద రెండు రోజుల నుంచి అతను తిరుగుతూ ఉన్నట్లు తెలిసింది. తమ కోడలు కరిష్మకు వివాహేతర సంబంధం ఉందని, వారే తన కొడుకును హతమార్చి ఉండొచ్చని సాధిక్ కుటుంబ సభ్యులు ఆరోపణలు చేస్తున్నారు. సాధిక్ మరణించిన సమయంలో అతని శరీరంపై దుస్తులు లేకపోవడం, అతను మధురానగర్ వంతెన వద్ద తల పగిలి తీవ్ర రక్తస్రావంలో పడిఉండటం వారి అనుమానాలకు మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి. సాధిక్ బ్యాగులో గంజాయి కూడా పోలీసులకు లభించినట్లు తెలిసింది. గంజాయి మత్తులో గంజాయి బ్యాచ్ సభ్యులకు అతనికి ఏమైనా గొడవ జరిగి ఉంటుందా? గంజాయి బ్యాచ్ సభ్యులు ఎవరైనా అతన్ని హత్య చేసి ఉంటారా? లేక ఏదైనా వాహనం ఢీకొని మరణించి ఉంటాడే అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

విద్యకు పేదరికం అడ్డు కాకూడదు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ


ఉపకార వేతనాలను అందిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, అమ్మ సభ్యులు

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): విద్యకు పేదరికం అడ్డుకాకూడదనే ఉద్దేశంతో ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ (అమ్మ) ఏటా విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేయడం అభినందనీయమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ చెప్పారు. స్థానిక సున్నపుబట్టీల సెంటర్‌లో ఉన్న 'అమ్మ' ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమం అమ్మ హాలులో ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథి లక్ష్మీశ విద్యార్థులకు నోటు పుస్తకాలు, ఉపకార వేతనాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికం లేని సమాజ నిర్మాణానికి ప్రభుత్వం పీ-4 విధానాన్ని తీసుకొచ్చిందని, దాదాపుగా 300 బంగారు కుటుంబాలకు ఆంధ్రామోటార్ మర్చంట్స్ అసోసియేషన్ (అమ్మ) మార్గదర్శకులుగా వ్యవహరించి ఆ కుటుంబాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి ముందుకురావడం అభినందనీయమన్నారు. మాదకద్రవ్యాల వినియోగం, ప్లాస్టిక్ వినియోగానికి వ్యతిరేకంగా కూడా అమ్మ ఆధ్వర్యంలో ప్రచారం చేయాలన్నారు.

వృద్ధులకు ఆశ్రయం

అమ్మ అధ్యక్షుడు గారపాటి సతీష్‌బాబు మాట్లాడుతూ ఈ ఏడాది 408 మంది విద్యార్థులకు రూ.16 లక్షలను ఉపకార వేతనాలుగా అందచేస్తున్నామని చెప్పారు. కానూరులో తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమాన్ని నిర్మించి వృద్ధులకు ఆశ్రయం కల్పిస్తున్నామని చెప్పారు. సంఘం సభ్యులు జీవీ సుబ్బారావు, దుర్గాప్రసాద్, చంద్రశేఖర్‌తో, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'హిందూస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్' కార్యవర్గ ప్రమాణ స్వీకారం


హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ నూతన కార్యవర్గం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్) : హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ రాష్ట్ర నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ఓ హోటల్లో జరిగింది. అసోసియేషన్ అధ్యక్షుడు సింగూరు మోహన్‌రావు, కార్యదర్శి బానా నాగేశ్వరరెడ్డి, చీఫ్ కమిషనర్ చింటు మురళీనాయుడు, చైర్మన్ పుల్లూరు దయాకర్, కోశాధికారి బీఎస్ చంద్రమౌళీశ్వరరావు, జాయింట్ సెక్రటరీ సిడగ రోహిణి, ఉపాధ్యక్షులు పి.మునిశేఖర్, నాగవాసవి, నాగేశమ్మ, పి.వెంకటరమణ, జి.జితేంద్ర, కడప నర్సింహులు, తుంగ శ్రీకాంత్, ఆర్గనైజింగ్ కమిషనర్లు బి.సుజాతరెడ్డి, దుంపల వెంకటప్పలనాయుడులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కమిటీ 2028 వరకు పదవిలో ఉంటుందని అధ్యక్షుడు సింగూరు మోహన్‌రావు తెలిపారు.

అమ్మవారికి బోనాలు



దుగ్గిరాల: దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరు గ్రామంలోని శ్రీ మహంకాళీ అమ్మవారి దేవస్థానంలో ఆషాఢమాసం చివరి ఆదివారం సందర్భంగా అమ్మవారు పూల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మ వారికి 1000 మంది మహిళలు బోనాలు సమర్పించారు. భక్తులకు ఎటువంటి ఆటంకం కలగకుండా ఈఓ కె.సునీల్‌కుమార్ పర్యవేక్షించారు.

శాకంబరిగా భ్రమరాంబ అమ్మవారు

పెదకాకాని: శివాలయంలో భ్రమరాంబ అమ్మవారిని శాకంబరీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పెదకాకాని శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఆషాఢ మాసం పురస్కరించుకుని శ్రీ భ్రమరాంబ అమ్మవారిని కూరగాయలు, ఆకు కూరలు, పండ్లు, డ్రైఫ్రూట్స్, సుగంధ ద్రవ్యాలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణం, ధ్వజస్తంభం వద్ద ఆకుకూరలు, కూరగాయల తోరణాలతో అలంకరించారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్ పర్యవేక్షణలో అర్చకులు, వేదపండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. విఘ్నేశ్వరుణ్ణి, నందీశ్వరుడిని, ప్రసన్నాంజనేయస్వామిని, శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామిని కూడా అలంకరించారు. ప్రత్యేక దర్శనం, అన్న ప్రసాదం ఏర్పాట్లు చేసినట్లు డీసీ తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ దంపతులు ఆషాఢ సారె సమర్పించి, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్థానిక గ్రామ పెద్దలు, భక్తులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు. సోమవారం కూడా అమ్మవారు భక్తులకు శాకంబరిగా దర్శనమివ్వనున్నారు.

'మెడికల్ ఎంప్లాయీస్' ఎన్టీఆర్ జిల్లా కార్యవర్గం ఎంపిక


ప్రమాణ స్వీకారం చేయిస్తున్న అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి గిరిబాబు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రభుత్వ గుర్తింపు సంఘం ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ ఎన్టీఆర్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విజయవాడలోని ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాలలో జరిగిన ఎన్నికల్లో అన్ని పోస్టులకు సింగిల్ నామినేషన్‌లు దాఖలు కావడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి కె.శేషయ్య ప్రకటించారు.

కార్యవర్గం వీరే

జిల్లా అధ్యక్షుడుగా వై.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా ఎ.నిర్మలరత్నకుమారి, టి.విజయకుమార్, ఆర్.నల్లయ్య, ఎం.సుధాకర్‌బాబు, డాక్టర్ జి.ప్రవీణ్‌కుమార్‌ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా పి.నాగరాజు, డిప్యూటీ సెక్రటరీగా టి.సాంబయ్య తదితరులు ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షుడిగా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ డీఎం ప్రసాద్ వ్యవహరించనున్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులతో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాయి సత్యనారాయణ, గిరిబాబు ప్రమాణ స్వీకారం చేయించారు.

సమస్యలపరిష్కారానికి సిద్ధంకండి

ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగుల సమస్యల సాధనకు ఉద్యోగులు ఐక్యంగా పోరాటం చేయాలని నిర్ణయించింది. భవిష్యత్తులో పోరాటాలు చేయాల్సి ఉంటుందని సంఘ రాష్ట్ర నాయకులు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్సీ కమిటీ వేసి 36 శాతం ఐఆర్ చెల్లించాలని, సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనాలు చెల్లించాని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఎన్నికల సహాయ అధికారిగా ఎ.రాధ వ్యవహరించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు కోటేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నక్క రమేష్, మెడికల్ కాలేజీ గౌరవ అధ్యక్షులు రాముడు తదితరులు పాల్గొన్నారు.



స్కూలు బ్యాగులు.. నాణ్యత నిల్

ఎన్డీయే కూటమి గొప్పగా చెప్పుకుంటున్న విద్యార్థులకు అందజేసిన స్కూలు కిట్లలోని బ్యాగులను చూస్తే నాణ్యతా ప్రమాణాలు ఏ పాటివో తేటతెల్లమవుతున్నాయి. పాఠశాలలు తెరిచే నాటికి అందజేశామని పేర్కొంటున్నా బడులు తెరిచి నెల రోజులు కూడా పూర్తికాకుండానే అవి తెగిపోవడం, జిప్పులు ఊడిపోవడం వంటివి జరుగుతున్నాయి. దీంతో విద్యార్థులు వాటిని వారి తల్లిదండ్రులకు అప్పగించడం, వారు సంబంధిత టైలర్ వద్దకు తీసుకువచ్చి బాగు చేయించడం పరిపాటిగా మారింది. బ్యాగు చినుగును, జిప్పు లూడిన వాటిని బట్టి రూ.50 నుంచి రూ.150 వరకు చార్జి వసూళ్లు చేస్తున్నారు. ఉచితం మాటున చేతి చమురు వదులుతోందని పెడనలో పలువురు తల్లిదండ్రులు పేర్కొనడం గమనార్హం.

– పెడన

క్లుప్తంగా

కూటమికి వణుకు పుడుతోంది

వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్

లబ్బీపేట(విజయవాడతూర్పు): పార్లమెంటు సభ్యుడు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అరెస్టు రాజకీయ కక్ష సాధింపేనని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ అన్నారు. ఆయన ఆదివారం విజయవాడలో మీడియాతో మాట్లాడారు. పెద్దిరెడ్డి కుటుంబాన్ని, వైఎస్సార్ సీపీని ఇబ్బంది పెట్టడమే కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. అందులో భాగంగానే అక్రమ కేసులు, లేని లిక్కర్ స్కామ్‌ను సృష్టించి అరెస్టులు చేస్తోందని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో అమలు చేస్తున్న రెడ్ బుక్ రాజ్యాంగాన్ని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఈ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులకు, వైఎస్సార్ సీపీ నాయకులకు పార్టీ పూర్తిగా అండగా ఉంటుందన్నారు. చంద్రబాబు ప్రభుత్వం కేవలం వైఎస్సార్ సీపీ నాయకులపై కక్షలు తీర్చుకోవడానికే అధికారంలోకి వచ్చినట్లు ఉందన్నారు. ఈ 13 నెలల్లో వైఎస్సార్‌సీపీ చేస్తున్న ప్రజా పోరాటాలు చూసి కూటమి ప్రభుత్వ నాయకులకు భయం పట్టుకుందన్నారు. లిక్కర్ స్కామ్‌లో ఎలాంటి ఆధారాలు లేకుండా అక్రమంగా అరెస్టులు చేస్తున్నారని దేవినేని అవినాష్ పేర్కొన్నారు. కేవలం ముగ్గురు ఉద్యోగులను బెదిరించి కట్టుకథలు అల్లి కుట్రపూరితంగా కేసులు పెట్టారన్నారు. చంద్రబాబు అతని మీడియా కలిసి డ్రామా చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పక్కన ఉండే బలమైన వ్యక్తుల మీద కక్ష తీర్చుకోవడానికే అక్రమ కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఎన్ని కుట్రలు పన్నితే, వైఎస్సార్ సీపీ అంతగా బలపడుతుందన్నారు. అధికారం శాశ్వతం కాదని, వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని తేల్చిచెప్పారు.

నేడు వీఎంసీ పీజీఆర్ఎస్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర వాసులకు వీఎంసీ కల్పించే మౌలిక వసతుల్లో నెలకొనే సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదులు-పరిష్కార కార్యక్రమం(పీజీఆర్ఎస్) వీఎంసీ ప్రధాన కార్యాలయంతోపాటు నగరంలోని మూడు సర్కిళ్లలోనూ నిర్వహిస్తున్నామని కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. చిట్టినగర్‌లోని సర్కిల్-1 కార్యాలయంలో, సత్యనారాయణపురంలోని సర్కిల్-2 కార్యాలయంలో, పటమటలోని సర్కిల్-3 కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వినతులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఆయా కార్యాలయాల్లో జోనల్ కమిషనర్లు, ఇతర విభాగాల అధికారులు పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారని చెప్పారు. నగర వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జీవీ పూర్ణచందుకు సాహితీ పురస్కారం



విజయవాడ కల్చరల్: ప్రముఖ సాహితీవేత్త, కృష్ణాజిల్లా రచయితల సంఘం, ప్రపంచ తెలుగు రచయితల సంఘం ప్రధానకార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచందుకు విశాలాక్షి సాహితీ పురస్కారం లభించింది. విశాలాక్షి సాహిత్య పత్రిక వార్షికోత్సవం సందర్భంగా నెల్లూరు పురమందిరంలో ఆదివారం జరిగిన సభలో ఈ పురస్కారాన్ని అందజేశారు. సాహిత్యరంగంలో విశేషమైన సేవలను అందించిన వారికి ఈ పురస్కారాన్ని అందజేస్తారు. పురస్కారగ్రహీత జీవీ పూర్ణచందు మాట్లాడుతూ నెల్లూరులో తిక్కన విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని తెలుగుభాషా వికాసానికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ప్రపంచ తెలుగు రచయితల సంఘం గౌరవాధ్యక్షుడు మండలి బుద్ధప్రసాద్, విశాలాక్షి సాహిత్య పత్రిక సంపాదకుడు సుబ్బారావు, ఆనం రమణారెడ్డి, కోసూరు రత్నం పూర్ణచందును అభినందించారు.

క్షీణించిన పారిశుద్ధ్యం

- డివిజన్లలో అధ్వానంగా పరిసరాలు
- రోడ్లపై దర్శనమిస్తున్న చెత్తకుప్పలు
- అపరిశుభ్ర వాతావరణంలో రోడ్లు
- దుర్గంధంతో అవస్థలు పడుతున్న ప్రజలు
- వ్యాధులు ప్రబలుతాయని ఆందోళన



22వ డివిజన్‌లో స్వర్గపురి రోడ్డులో పేరుకుపోయిన చెత్తా చెదారం



సుబ్బరాయనగర్‌లో రోడ్డుపై చెత్త కుప్పలు



పద్మావతి ఘాట్ సమీపంలో పేరుకుపోయిన చెత్త

కృష్ణలంక(విజయవాడతూర్పు): నగరంలో గత వారం రోజులుగా నగర పాలక సంస్థలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు సమ్మె చేస్తుండడంతో పారిశుద్ధ్యం రోజురోజుకు క్షీణిస్తుంది. ఏ వీధిలో చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. తూర్పు నియోజకవర్గంలోని కృష్ణలంకలో 20, 21,22 డివిజన్లు, రాణిగారితోటలోని 17, 18 డివిజన్లలో చెత్త సేకరణ నిలిచిపోవడంతో వీధుల్లో చెత్త నిల్వలు పెరిగిపోయాయి. రోడ్లన్నీ చెత్తమయంగా మారాయి. చెత్త కుప్పలు పెరిగిపోయి రోజుల తరబడి నిల్వ ఉండడంతో దుర్వాసన వస్తుంది. దీంతో అంటువ్యాధులు ప్రబలుతాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రతిరోజు సుమారు 28 నుంచి 32 మంది వరకు పారిశుద్ధ్య కార్మికులు పని చేసేవారు. వారిలో కొంతమంది కార్మికులు ప్రతి వీధులోని ఇంటింటికి వెళ్లి క్లాప్ వాహనం, ట్రాక్టర్ల ద్వారా చెత్తను సేకరించేవారు. మరికొంత మంది రోడ్లను శుభ్రం చేసి చెత్తను తోపుడు బండ్ల ద్వారా లోడర్‌పాయింట్ల వద్దకు తరలిస్తుంటారు. అయితే సమస్యల పరిష్కారం కోసం పారిశుద్ధ్య కార్మికులు సమ్మెలోకి వెళ్లడంతో ఇంటింటి చెత్త సేకరణ నిలిచిపోయింది. రోడ్లు ఊడ్చే వారు కరువయ్యారు. దీంతో ఇళ్లల్లో వచ్చిన వ్యర్థాలు, చెత్తను రోడ్డు పక్కన, సైడు కాలువలు, ఖాళీ ప్రదేశాల్లో పడేస్తున్నారు. ఎక్కడిపడితే అక్కడ చెత్తను పడేయడంతో చెత్త నిల్వలు పేరుకుపోతున్నాయి. చెత్త కుప్పలను పశువులు, వీధికుక్కలు కలియబెడుతుండడంతో చెత్త రోడ్డంతా విస్తరిస్తుంది. దీంతో ఆయా వీధులలో రాకపోకల సమయంలో దుర్గాంధాన్ని భరించలేక ముక్కు మూసుకుని వెళ్లాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. కొన్ని వీధుల్లో వారం రోజుల క్రితం సైడు కాలువల్లో పూడికలు తీసి ఇళ్ల ముందే కుప్పలుగా వేశారు. రోజులు గడుస్తున్న వాటిని తొలగించకపోవడంతో రాకపోకలకు అడ్డంకిగా మారాయి.

బయటకు రావాలంటేనే భయం....

దీంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతుండడంతో ప్రజలు బయటకు రావాలంటేనే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చెత్త కుప్పలకు తోడు యూజీడీ మ్యాన్‌హోల్స్ పొంగి వ్యర్థాలతో కూడిన మురుగునీరు రోడ్డు మీద ప్రవహిస్తుండడంతో సమస్య మరింత తీవ్రంగా మారింది. ఆయా డివిజన్ల శానిటరీ ఇన్‌స్పెక్టర్లు అక్కడ పనిచేస్తున్న ఒకరిద్దరు శాశ్వత సిబ్బందితో పాటు బయట నుంచి ముగ్గురు, నలుగురు రోజువారీ కూలీలను తెచ్చుకుని వారితో పారిశుద్ధ్య నిర్వహణ చేయిస్తూ ప్రధాన వీధుల్లో మాత్రమే కొద్ది మేరకే చెత్తను ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. అంతర్గత వీధుల్లో చెత్త కుప్పలు అలాగే నిల్వ ఉంటున్నాయి. రోడ్లను ఊడ్చకపోవడంతో ఏ రోడ్డు చూసిన చెత్తతో నిండిపోయి అధ్వానంగా కనిపిస్తున్నాయి. పలు వీధుల్లో వారం రోజుల్లో ఒక్కసారి కూడా చెత్తను తొలగించకపోవడంతో కుళ్లిపోయి భరించలేని దుర్వాసన వెదజల్లుతుందని, దోమలు, పెరిగి పోయి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలం ప్రారంభమవడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, మరికొన్ని రోజులు ఇలాగే ఉంటే పరిస్థితి మరీదారుణంగా తయారవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుద్ధ్య కార్మికుల సమ్మె ముగిసే వరకు ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేసుకుని అన్ని వీధుల్లో పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఇళ్ల పట్టాలు సాధించేందుకు పోరాటం

కృష్ణా కరకట్ట పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ప్రచార యాత్ర



ఇళ్లకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ప్రచార యాత్రలో పాల్గొన్న సీపీఎం నాయకులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణలంక, 21వ డివిజన్‌లోని రణదీవెనగర్ కృష్ణా కరకట్ట ప్రాంతంలోని ఇళ్లకు రిజిస్ట్రేషన్‌తో కూడిన పట్టాలు ఇవ్వాలని, ఇళ్ల పైకప్పు మార్చుకునేందుకు అవకాశం ఇవ్వాలని, అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ కృష్ణాకరకట్ట పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రచార యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు మాట్లాడుతూ రణదీవెనగర్ ప్రాంతంలో గత 40 ఏళ్లుగా సొంత ఖర్చులతో ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్న పేదలకు పట్టాలు ఇచ్చి ఆ స్థలంపై శాశ్వత హక్కు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని చెప్పారు. కానీ పట్టాలు ఇచ్చేందుకు కుదరదు అంటున్నారని తెలిపారు. పట్టాలు ఇచ్చి బందరు కాలువపై పది అంతస్తుల్లో లెమన్ ట్రీ హోటల్ కట్టడానికి మాత్రం ఏ విధంగా అనుమతి ఇచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. మరోపక్క రైవస్ కాలువ పక్కనే ఉన్న పాత బస్టాండ్ స్థలాన్ని బడా కార్పొరేట్ కంపెనీకి ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైందన్నారు. మరో వైపు బృందావన్ కాలనీలో ఉన్న రూ.30 కోట్ల విలువైన మున్సిపల్ స్థలాన్ని రాఘవేంద్ర మఠానికి ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందన్నారు. ఎక్కడో ఉన్న పెద్ద పెద్ద కంపెనీలకు, కార్పొరేట్ భవనాలకు స్థలాలు ఇస్తున్నారే కానీ ఇక్కడ ఏళ్ల తరబడి నివసిస్తున్న ప్రజలకు మాత్రం ఇళ్లపై హక్కు కల్పించడం లేదని తెలిపారు. కరకట్ట వాసులకు ఇళ్లపై కప్పు మార్చుకునేందుకు అనుమతి లేనప్పుడు వారికి ఎలా అనుమతులు ఇస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. దీనిపై స్థానిక ప్రజా ప్రతినిధులు కూడా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రిజిస్ట్రేషన్‌తో కూడిన పట్టాలు ఇచ్చేలా చూడాలని, ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తయి రెండేళ్ళు అవుతున్నా ఇప్పటికీ అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మాణం చేపట్టలేదని పేర్కొన్నారు. దోమలు తీవ్రత విపరీతంగా పెరిగిపోయిందని పేర్కొన్నారు. ఈ సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు కృష్ణాకరకట్ట పరిరక్షణ కమిటీతో పాటు సీపీఎం కూడా పోరాటం చేస్తుందన్నారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాలను కూడా ప్రజా పోరాటాల ద్వారానే సాధించేందుకు ఈ ప్రచార యాత్రకు మద్దతు ఇస్తున్నామన్నారు. ఈ నెల 28వ తేదీన తలపెట్టిన కలెక్టర్‌కు వినతిపత్రాలు, అర్జీల కార్యక్రమం జయప్రదం చేయాలని, పెద్ద ఎత్తున పాల్గొని పట్టాలు సాధించుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం తూర్పు నగర కార్యదర్శి పుప్పాల కృష్ణ, కృష్ణాకరకట్ట పరిరక్షణ కమిటీ నాయకులు కోటేశ్వరరావు, కోరాడ రమణ, కుమార్, శ్రీరాములు, గోపి, తాడి రమణ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాణిగారితోట, తారకరామనగర్‌లోని ఇళ్ల పట్టాల సాధనకు ఇళ్ల పట్టాల సాధన కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రచార యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం తూర్పు నగర కార్యదర్శి పుప్పాల కృష్ణ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పేదలు తారకరామ నగర్ కరకట్ట ప్రాంతంలో వరద ముంపు సంభవించిన అనేక ఇబ్బందులు పడుతూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. రిటైనింగ్ వాల్‌పూర్తయి రెండేళ్లు అయినప్పటికీ ఇళ్ల పట్టాల ఊసేలేదన్నారు. ప్రభుత్వం వెంటనే రిజిస్ట్రేషన్‌తో కూడిన పట్టాను ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. లేనిచో అన్ని వర్గాల వారిని కలుపుకుని ప్రజా పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు చంద్రశేఖర్, వరప్రసాద్, వై.కృష్ణ, అడపా కోటిరెడ్డి, ఆదాం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలు కార్పొరేట్లకు కట్టబెట్టడం తగదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడలోని పాత బస్టాండ్(గవర్నర్‌పేట-2) స్థలాన్ని లులూ కంపెనీకి కట్టబెట్టడం వెనుక పెద్ద కుట్ర, కుంభకోణం దాగి ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శిర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు ఆరోపించారు. ఏపీఎస్ఆర్టీసీకి చెందిన వందలాది కోట్ల రూపాయల విలువైన స్థలాన్ని బడాకంపెనీలకు కట్టబెట్టడానికి వీల్లేదని, ఆభూమి పరిరక్షణకు రాజకీయాలకు అతీతంగా ఉద్యమిస్తామని పేర్కొన్నారు. ఆర్టీసీ పాతబస్టాండ్ స్థలాన్ని లులూ కంపెనీకి ఇవ్వొద్దని.. ప్రజా ప్రయోజనాలకే వినియోగించాలని కోరుతూ పాతబస్టాండ్ వద్ద ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. కార్పొరేట్ కంపెనీ లులూకు విలువైన ఆర్టీసీ స్థలాలను కట్టబెట్టవద్దని, ప్రజాప్రయోజనాలకు వినియోగించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం డౌన్ డౌన్ అంటూ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈసందర్భంగా బాబూరావు మాట్లాడుతూ విజయవాడ నగరంలో అత్యంత విలువైన పాతబస్టాండ్, విద్యాధరపురం ఆర్టీసీ స్థలాలను లులూ కంపెనీకి కట్టబెట్టాలన్న నిర్ణయంపై కూటమి ప్రభుత్వం పునరాలోచించాలని డిమాండ్ చేశారు. స్థలాన్ని లులూకు కేటాయించకుండా నగరానికి చెందిన ఎంపీ, ఎమ్మెల్యేలు స్పందించాలని కోరారు. విలువైన స్థలాలను దారాదత్తం చేస్తుంటే ప్రజాప్రతినిధులు నోరు మూసుకొని ఉండడం సరికాదన్నారు. ప్రజల తరపున తమవాణి వినిపించాలని డిమాండ్ చేశారు. రూ.400 కోట్ల విలువైన స్థలాన్ని బడాకంపెనీలకు సీఎం చంద్రబాబు కట్టబెట్టడంలో పెద్ద కుట్ర దాగి ఉందని మండిపడ్డారు. విజయవాడలో ఒక వైపు మెట్రో రైలు వేస్తాం...ప్రజారవాణా వ్యవస్థను మెరుగుపరుస్తామంటూ ప్రైవేటు భూములను తీసుకునేందుకు యత్నిస్తున్న కూటమిప్రభుత్వం, ప్రభుత్వ భూములను అత్యంత కారుచౌకగా ప్రవేటు సంస్థలకు ఎలా కట్టబెడుతుందని ప్రశ్నించారు. విలువైన స్థలాలను కార్పొరేట్లకు కట్టబెట్టే నైతికహక్కు కూటమి ప్రభుత్వానికి ఎక్కడ ఉందని ప్రశ్నించారు. బస్టాండ్‌లు, డిపోలను మూసివేసి బడా కంపెనీలకు ఎలా ఇస్తారన్నారు. ఇదేనా పీ4 అంటే అంటూ ఆయన నిలదీశారు.

కాపు కల్యాణ మండపాన్ని నిర్మించాలి



లక్ష్మీకాంత్‌కు నియామకపు పత్రాన్ని అభినందిస్తున్న అంజిబాబు

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): తూర్పు నియోజకవర్గంలో కాపు కల్యాణ మండపాన్ని ప్రభుత్వం నిర్మించాలని ప్రజాకాపునాడు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు తెలిపారు. మొగల్రాజపురం హోటల్‌లో ప్రజాకాపునాడు సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం ఆదివారం జరిగింది. అంజిబాబు మాట్లాడుతూ కాపుల్లో చాలా మంది ఆర్థికంగా అట్టడుగు స్థాయిలో ఉన్నారని వారి కోసం రిజర్వేషన్లు కల్పించాలని, పేద కాపు మహిళలకు పెళ్లి కానుక పథకాన్ని ప్రవేశపెట్టాలని కోరారు. ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం తూర్పు నియోజకవర్గ అధ్యక్షుడిగా అమృతం లక్ష్మీకాంత్‌ను నియమిస్తున్నట్టుగా ప్రకటించి నియామకపు పత్రాన్ని అంజిబాబు అందచేశారు. లక్ష్మీకాంత్ మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలోని కాపుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి వాటిని పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలో కాపు కళ్యాణ మండపాన్ని నిర్మాణం చేసేలా చూస్తానని చెప్పారు. సంఘం తూర్పు నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమితులైన లక్ష్మీకాంత్‌ను ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శులు గణప రాము, పసుపులేటి రాజశేఖర్, సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జి జస్వంత్‌కుమార్, సెంట్రల్ నియోజకవర్గ మహిళా విభాగం ఇన్‌చార్జి విస్సంశెట్టి ఉషా జ్యోతితో పాటుగా సంఘం సభ్యులు పాల్గొని లక్ష్మీకాంత్‌ను అభినందించారు.

మొల్ల రామాయణ పద్య కావ్యం అజరామరం

మొల్ల విగ్రహాన్ని ఆవిష్కరించిన ఐలాపురం వెంకయ్య



మొల్ల విగ్రహాన్ని ఆవిష్కరించిన ఐలాపురం వెంకయ్య



విగ్రహావిష్కరణలో డీసీపీ సరిత తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): సహజ పాండిత్యంతో మొల్లమాంబ రచించిన మొల్ల రామాయణం పద్య కావ్యం చరిత్రలో అజరామరంగా నిలిచిపోయిందని మాజీ శాసనమండలి సభ్యులు ఐలాపురం వెంకయ్య తెలిపారు. విద్యాధరపురం శాలివాహన సంఘం ఆధ్వర్యంలో స్థానిక రామమందిరం సెంటర్‌లో ఏర్పాటు చేసిన రచయిత్రి, కవి ఆతుకూరి మొల్లమాంబ విగ్రహాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ తమ కుల ఆడపడుచు మొల్లమాంబ విగ్రహాన్ని ఆవిష్కరించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. మొల్లమాంబ తన రచన ద్వారా తెలుగు కుటుంబాన్ని రామాయణానికి అన్వయించారని చెప్పారు. అందులోని భాష తెలుగుదనంతో నిండి ఉంటుందని తెలిపారు. తెలుగు కావ్య క్షేత్రంలో తొలి పద్య కవయిత్రి ఆతుకూరి మొల్ల అన్నారు. విజయవాడ డీసీపీ (అడ్మిన్) కేజీవీ సరిత మాట్లాడుతూ భారతీయ సంస్కృతికి, ధార్మిక జీవన విధానానికి దర్పణంగా నిలిచిన వాల్మీకి విరచితమైన శ్రీమద్రామాయణాన్ని ఆధారంగా చేసుకుని తేట తెనుగులో రాయబడిన పద్య కావ్యం మొల్ల రామాయణమన్నారు. అందులోని గద్యపద్యాలలోని భాషా సాహిత్య సౌరభాన్ని ఆఘ్రాణిస్తే దేశీ పదసంపదకు సంస్కృత పాటవాన్ని మేళవించిన విషయం అర్థమవుతుందని వివరించారు. మొల్ల రామాయణంలోని సమాజ చిత్రణ చాలా వరకు తెలుగు లోగిళ్లలోని సహజ స్థితిని తెలియ చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపీ శాలివాహన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఐలాపురం భాస్కర శ్రీనివాస్, సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ ఐలాపురం రాజా, శాలివాహన సంఘం జిల్లా అధ్యక్షులు బొమ్మిన శ్రీనివాసరావు, నగర అధ్యక్షులు భర్తవరపు దుర్గాప్రసాద్, ఏపీ కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ పేరేపి ఈశ్వర్, విగ్రహ దాత పి.కరుణాకర్ వడయార్, బాడిశ రూపేష్, బాడిశ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

కుండపోత వర్షం!





బెజవాడలో ఆదివారం రాత్రి కుండపోతగా వర్షం కురిసింది. సాయంత్రం నుంచి వాతావరణం చల్లబడి ఆకాశం మేఘావృతమైంది. సాయంత్రం ఏడు గంటల సమయం నుంచి ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. వానతో నగరంలో పలువురు అసౌకర్యానికి గురయ్యారు. కొన్ని ప్రాంతాల్లో మోకాలిలోతులో నీళ్లు నిలిచాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



అమ్మవారికి సారె తీసుకెళుతున్న భక్తులు



ఆలయం ఎదుట సారె తెచ్చిన భక్త బృందాల సభ్యులు

కొండపై భక్తజన సందడి



ఆలయంలో లోపల భక్తుల రద్దీ

ఆషాఢ మాసం ఆఖరి ఆదివారం కావడంతో ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధి వేలాది మంది భక్తులతో సందడిగా మారింది. దుర్గమ్మ దర్శనం కోసం వచ్చిన భక్తులతో క్యూలైన్లు కిటకిటలాడాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్త బృందాలు ఎంతో భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించాయి. తమిళనాడు, కర్ణాటక, ఒరిస్సాల నుంచి సైతం భక్తులు తరలివచ్చి అమ్మవారికి సారె సమర్పించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



సారె తెచ్చిన భక్త బృందాల సభ్యులు

శ్రావణంలో నిత్య కుంకుమార్చన

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): 25వ తేదీ నుంచి ప్రారంభమయ్యే శ్రావణ మాసంలో నిత్యం కొత్త అమ్మవారికి కుంకుమార్చనలు జరుగుతాయని ఆలయ కార్యదర్శి మరుపిళ్ళ హనుమంతరావు, కోశాధికారి పిల్లా శ్రీనివాసరావు తెలిపారు. చిట్టినగర్‌లోని కొత్త అమ్మవారి దేవస్థానంలో 25వ తేదీ నుంచి ఆగస్టు 23వ తేదీ వరకు శ్రావణ మాసోత్సవాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

శ్రావణ మాసం వచ్చేస్తోంది..

ఈనెల 25 నుంచి ఆరంభం

- భాద్రపద మాసం మినహా నవంబరు వరకు ముహూర్తాలే ముహూర్తాలు
- ఈసారి ఘనంగా మోగనున్న పెళ్లిబాజాలు
- అమ్మవారి ఆలయాలూ ముస్తాబు
- వ్యాపారులు, రైతులు, పురోహితుల్లో ఆశలు
- మళ్లీ డిసెంబరు 8 నుంచి ఫిబ్రవరి 6 వరకు ముహూర్తాల్లేవు

సాక్షి, అమలాపురం: శుభకార్యాలకు నెలవైన శ్రావణ మాసం వచ్చేస్తోంది. ఈనెల 25 నుంచి ఆరంభం కాబోతోంది. ముహూర్తాలు కూడా బాగా ఉండడంతో ఈసారి పెళ్లిబాజాలు ఘనంగా మోగనున్నాయి. అమ్మవారి ఆలయాలను సైతం ముస్తాబు చేస్తున్నారు. మహిళలు పూజలకు సిద్ధమవుతున్నారు. ఆషాడం వీడి శ్రావణం మొదలుకానుండడంతో వ్యాపారులు, రైతులు మార్కెట్‌పై కొత్త ఆశలు పెట్టుకున్నారు. ఈ సీజన్‌లో వస్త్రాలు, పూలు, పండ్లు, స్వీట్లు, బంగారం, వెండి వస్తువులకు డిమాండ్ పెరగనుంది. వచ్చే శుక్రవారం నుంచే శ్రావణమాసం మొదలుకానుండడంతో శుభ ముహూర్తాల సీజన్ మొదలవుతుంది. నవంబరు వరకూ ఈ సుముహూర్తాల సీజన్ కొనసాగనుంది. ఇక ఈసారి భాద్రపద మాసం మినహా శ్రావణ మాసం మొదలు నవంబరు వరకు ప్రతినెలా ముహూర్తాలు ఉండటం విశేషం.



ముహూర్తాల తేదీలు ఇవే..

ఈ నెలలో 26, 30, 31 తేదీల్లోను, ఆగస్టులో 1, 3, 5, 7, 8, 9, 10, 11, 12, 13, 14, 17 తేదీల్లో ముహూర్తాలున్నాయి. ఆగస్టు 21 నుంచి సెప్టెంబరు 21 వరకూ భాద్రపద మాసం. ఇది శూన్యమాసం కావడంతో ముహూర్తాలు లేవు. ఆ తర్వాత సెప్టెంబరులో 23 నుంచి ప్రారంభమై 24, 26, 27, 28 తేదీల్లో.. అనంతరం అక్టోబరు, నవంబరు నెలల్లో కూడా ముహూర్తాలు రికార్డు స్థాయిలో ఉన్నాయి. ఈ మాసాల్లో ఏకంగా 13 రోజుల చొప్పున శుభ ముహూర్తాలు ఉండటం విశేషం. అక్టోబరులో 1, 2, 3, 4, 8, 10, 11, 12, 22, 24, 29, 30, 31 తేదీలు.. నవంబరులో 1, 2, 7, 8, 12, 13, 15, 22, 23, 26, 27, 29, 30 తేదీల్లో శుభ ఘడియలున్నాయి. అనంతరం.. డిసెంబరు 8 నుంచి ఫిబ్రవరి ఆరో తేదీ వరకూ ఇంచుమించు రెండు నెలలపాటు ముహూర్తాలు లేవు.

పురోహితులు, రైతులు, వ్యాపారుల్లో ఆశలు..

ఈ సంవత్సరం జూన్ 10 నుంచి ఈనెల 8 వరకూ గురు మౌఢ్యమి కావడంతో పెళ్లిళ్లు, గృహ ప్రవేశాలు, ప్రారంభోత్సవాల వంటి ముహూర్తాల్లేవు. ఈనెల 31న పెద్ద ముహూర్తం కావడంతో పెళ్లిళ్లు పెద్ద సంఖ్యలో జరగనున్నాయి. గత రెండు నెలలుగా శుభ కార్యక్రమాల్లేక ఇబ్బందిపడుతున్న పురోహితులతో పాటు వారికి అనుబంధంగా ఉపాధి పొందేవారికీ రానున్న కాలం కొత్త ఆశలు రేకెత్తిస్తోంది. ఇదే సమయంలో శ్రావణ మాసంపై రాష్ట్రవ్యాప్తంగా రైతులు, వ్యాపారులు పెద్ద ఆశలే పెట్టుకున్నారు. మరీ ముఖ్యంగా ధరలేక నష్టపోతున్న అరటి రైతులు ఈ మాసంలోనైనా ధర పెరుగుతుందని ఆశగా ఎదురుచూస్తున్నారు. ఎందుకంటే.. అరటి గెలల ధరలు సగానికి పడిపోయి రైతులు ఇబ్బందిపడుతున్నారు. మే నెలలో కర్పూరం రకం అరటి గెల గరిష్ట ధర రూ.500 కాగా, ఇప్పుడు రూ.100 నుంచి రూ.300 మధ్యలో ఉండటంతో నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని రావులపాలెం, కొత్తపేట, ఆలమూరు, మండపేట, పి.గన్నవరం, సిద్ధాంతం, పెరవలి ప్రాంతాల్లో సుమారు 30,870 ఎకరాల్లో రైతులు అరటి సాగుచేస్తున్నారు. ఈ ఏడాది అరటి సాగు రైతులకు పెద్దగా గిట్టుబాటు కాలేదు. వీరంతా శ్రావణ మార్కెట్‌పై ఆశలు పెంచుకున్నారు. ఇక కొబ్బరికి ప్రస్తుతం రికార్డు స్థాయి ధర ఉంది. పచ్చి కొబ్బరి వెయ్యి కాయల ధర రూ.19 వేల నుంచి రూ.21 వేల వరకూ ఉంది. ఈ నేపథ్యంలో.. దేశీయంగా శ్రావణ మాసంలో కొబ్బరికాయ వినియోగం పెరిగి, ధర మరింత పెరుగుతుందని రైతులు, వ్యాపారులు అంచనా వేస్తున్నారు.

రెండు నెలల తరువాత సీజన్..



ఇంచుమించు రెండు నెలల తరువాత ముహూర్తాల సీజన్ మొదలైంది. ఈనెల 31న గోదావరి జిల్లాల్లో అధిక సంఖ్యలో పెళ్లిళ్లు జరగనున్నాయి. నవంబరు వరకూ ముహూర్తాలకు కొదవలేదు. అయితే, గురు మౌఢ్యమి కారణంగా మళ్లీ వచ్చే డిసెంబరు 8 నుంచి ఫిబ్రవరి 6 వరకూ ముహూర్తాల్లేవు.

– ఉపద్రష్ట నాగ ఆదిత్యన్, ప్రముఖ పురోహితుడు, అమలాపురం

క్లుప్తంగా...

పక్కలోకి వస్తేనే సంతకం పెడతా

- వివాహితపై వీఆర్వో లైంగిక వేధింపులు
- పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు

బెల్లంకొండ: రేషన్ కార్డులో పిల్లల పేర్లు నమోదు చేయాలంటూ వచ్చిన ఓ వివాహితను వీఆర్వో లైంగిక వేధింపులకు గురి చేశాడు. ఈ ఘటన పల్నాడు జిల్లా బెల్లంకొండ మండలంలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. రేషన్ కార్డులో పేర్ల మార్పు చేర్పుల కోసం వివాహిత కొద్ది రోజుల క్రితం దరఖాస్తు చేసింది. వీఆర్వో వెంకయ్య నాగిరెడ్డిపాలెం గ్రామంలో కొన్నేళ్లుగా ఒక గది అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. ఆఫీసుకు వెళ్లి వచ్చిన తర్వాత ఆ గదిలోనే ఉంటూ అర్జీదారులను అక్కడికే పిలిపించుకుంటూ కార్యకలాపాలు సాగిస్తుంటాడు. వారం రోజుల నుంచి వివాహిత వీఆర్వో వద్దకు వస్తుండగా కాలయాపన చేస్తూ పలుమార్లు తిప్పాడు. తన కోరిక తీరిస్తేనే సంతకం పెడతానంటూ ఆమెను వేధించాడు. దీంతో 2 రోజుల క్రితం వీఆర్వో ఉంటున్న గది వద్దకు వివాహిత వెళ్లి ఆయన వేధింపులను సెల్‌ఫోన్లో వీడియో తీసి, శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు వీఆర్వోపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై తహశీల్దార్ టీ.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ..ఈ ఘటనను ఉన్నతాధికారులకు తెలియజేసి, వీఆర్వోపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

29న గరుడ పంచమి



తిరుమల: తిరుమలలో జూలై 29న గరుడ పంచమి పర్వదినం జరగనుంది. ఆ రోజు రాత్రి 7 నుంచి 9 గంటల వరకు మలయప్ప స్వామివారు తనకు ఇష్టవాహనమైన గరుడుడిపై తిరుమాడ వీధులలో ఊరేగి భక్తులను అనుగ్రహించనున్నారు.

'రిచ్మండ్'లో టాప్ డెంటిస్ట్‌గా భారతీయ వైద్యుడు

ఘనత సాధించిన అద్దంకి మండల వాసి నవీన్



అద్దంకి: భారత్‌కు చెందిన ఎంతోమంది విశిష్ట సేవలు అందిస్తూ విదేశాల్లో గుర్తింపు పొంది స్వదేశానికి ఖ్యాతి తెస్తున్నారు. ఆ కోవలో బాపట్ల జిల్లా అద్దంకి మండలం చెరువుకొమ్ముపాలేనికి చెందిన నవీన్ అనే వైద్యుడు ఉన్నారు. కుగ్రామంలోని చెన్నుపాటి రామాంజనేయులు (రచయిత) కుమారుడైన ఇతను మైసూర్ జేఎస్ఎస్ డెంటల్ కళాశాలలో బీడీఎస్ పూర్తి చేశాడు. ఆ తరువాత అమెరికాలోని కొలంబియా వర్సిటీలో డీడీఎస్ డిగ్రీ పూర్తి చేసి వర్జీనియా రాష్ట్రంలో రిచ్మండ్ నగరంలో బెస్ట్ స్మైల్స్ పేరుతో ఆరు బ్రాంచీలు స్థాపించారు. 2025 సంవత్సరానికి ఆ నగరంలో నిర్వహించిన సర్వేలో టాప్ డెంటిస్ట్‌గా ఎన్నికైనట్లు నవీన్ తండ్రి రామాంజనేయులు తెలిపారు.

బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా క్రాంతికుమార్



నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కుమ్మర క్రాంతికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం గుంటూరులో జరిగిన బీసీ సంఘాల సమావేశంలో ఆయనకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు నియామక పత్రాన్ని అందజేశారు. కేసన శంకరరావు మాట్లాడుతూ సంఘం రాష్ట్రవ్యాప్తంగా బలోపేతమవుతూ రాజకీయ పార్టీలకు అతీతంగా బీసీ అభ్యున్నతికి పనిచేస్తుందన్నారు.

ఆశలు వదులుకున్నారు.. ఆశ్చర్యంగా తిరిగొచ్చాడు!



శ్రీనివాసరావు

అద్దంకి: ఏడేళ్ల క్రితం ఇంటి నుంచి ఎటో వెళ్లిపోయిన వ్యక్తి ఆకస్మికంగా తిరుపతిలో కనిపించాడు. బాపట్ల జిల్లా అద్దంకి మండలంలోని రామాయపాలెం గ్రామానికి చెందిన రాయ శ్రీనివాసరావు అలియాస్ బుల్లోడు వ్యవసాయం చేసేవాడు. కుటుంబ కలహాలతో ఏడేళ్ల క్రితం ఇంటి నుంచి ఎటో వెళ్లిపోయాడు. ఎంత వెతికినా ఆచూకీ దొరక్కపోవడంతో బంధువులు, భార్య ఆశలు వదులుకున్నారు. ఈ క్రమంలో 2 రోజుల క్రితం అద్దంకి నుంచి తిరుపతి వెళ్లిన ఓ వ్యక్తి అక్కడ యాచకునిగా కనిపించిన రాయ శ్రీనివాసరావును గుర్తించి అతడి వివరాలను ఆరా తీశాడు. తొలుత శ్రీనివాసరావు బుకాయించినా.. ఆ తరువాత తానే శ్రీనివాసరావు అని ఒప్పుకున్నాడు. దీంతో ఆ సమాచారం, అతడి ఫొటోలను శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు సదరు వ్యక్తి చేరవేశాడు. దీంతో శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు శనివారం తిరుపతికి వెళ్లి అతడిని ఆదివారం ఇంటికి తీసుకువచ్చారు. కాగా, శ్రీనివాసరావు తిరుపతిలోని ఓ కళాశాలలో వాచ్‌మెన్‌గా పనిచేశాడు. షుగర్ వ్యాధితో కాలు తొలగించడంతో ఆ ఉద్యోగం నుంచి తీసేశారు. దీంతో తిరుపతి వీధుల్లో యాచిస్తూ జీవిస్తున్నాడు.

సామూహిక అత్యాచార బాధితురాలికి ఏం న్యాయం చేశారు?

- ఇప్పటిదాకా ఏ ఒక్కరైనా పరామర్శించారా?
- నేటి హోంమంత్రి పర్యటనను అడ్డుకుంటాం
- వైఎస్సార్‌సీపీ యువజన, ఎస్సీ విభాగాల నాయకుల హెచ్చరిక



ఎస్సీ సెల్ నేతలను అరెస్టు చేస్తున్న పోలీసులు

అనంతపురం ఎడ్యుకేషన్: 'శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లిలో దళితురాలైన మైనర్ బాలికపై 14మంది టీడీపీ కార్యకర్తలు అత్యంత క్రూరంగా అత్యాచారం చేశారు. దీంతో ఆ బాలిక గర్భం దాల్చి బిడ్డకు జన్మనిచ్చింది. మహిళలు, ఆడపిల్లల రక్షణ కోసం చర్యలు తీసుకుంటున్నామని గొప్పలు చెప్పుకునే కూటమి ప్రభుత్వం ఇప్పటిదాకా బాధితురాలిని ఎందుకు పరామర్శించలేదు?' అని వైఎస్సార్‌సీపీ యువజన, ఎస్సీ విభాగాల నాయకులు నిలదీశారు. అనంతపురం సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సామూహిక అత్యాచార బాధిత బాలిక ఇటీవల ప్రసవించిన సంగతి విదితమే. వైఎస్సార్‌సీపీ యువజన, ఎస్సీ విభాగాల నాయకులు ఆదివారం ఆమెను పరామర్శించేందుకు వెళ్లగా.. అప్పటికే మోహరించిన పలువురు పోలీసులు వారిని ఆస్పత్రి గేటు వద్దే అడ్డుకున్నారు. దీంతో అక్కడే బైఠాయించి ఆందోళన చేపట్టారు. జిల్లాలోని ఇద్దరు దళిత ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, బండారు శ్రావణికి ఇప్పటిదాకా బాధితురాలిని పరామర్శించే తీరిక లేకపోయిందని విమర్శించారు.

హోంమంత్రి పర్యటనను అడ్డుకుంటాం..

బాధితురాలి గ్రామానికి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తోంది ఓ మహిళ అని, శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ మహిళ అని, రాష్ట్ర హోంశాఖ మంత్రి దళిత మహిళ అయి ఉండి కూడా బాలికకు న్యాయం జరగలేదని వైఎస్సార్‌సీపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తల్లికి న్యాయం చేయలేని ప్రభుత్వం బిడ్డకు ఎలాంటి న్యాయం చేస్తుందని ప్రశ్నించారు. ఇటీవల అనంతపురం నగరానికి చెందిన గిరిజన బాలికను అత్యాచారం చేసి అత్యంత దారుణంగా హత్య చేస్తే కనీస చర్యల్లేవని మండిపడ్డారు. సోమవారం జిల్లా పర్యటనకు వస్తున్న హోంమంత్రిని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం, ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో అడ్డుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఆందోళనకారులను పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేసి స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

వినాయకస్వామి సేవలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి



కాణిపాకంలో జస్టిస్ రవి నాథ్ తిల్హరికి స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో

కాణిపాకం/చంద్రగిరి: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవి నాథ్ తిల్హరి కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయాధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వేదాశీర్వచన మండపంలోని పండితులు ఆశీర్వచనాలను, స్వామివారి ప్రసాదం, చిత్రపటాన్ని ఆలయ ఈవో పెంచల కిషోర్ అందజేశారు. అలాగే, తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని కూడా జస్టిస్ రవి నాథ్ తిల్హరి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.

బతుకుదెరువుపై 'పచ్చ' పగ

పేదల దుకాణాలను ధ్వంసం చేసిన టీడీపీ వర్గీయులు



చారుపల్లిలో దుకాణాలు ధ్వంసం చేస్తున్న టీడీపీ వర్గీయులు

నల్లమాడ: శ్రీసత్యసాయి జిల్లాలో టీడీపీ నేతల ఆగడాలు శృతిమించాయి. పేదలు, చిరు వ్యాపారులపైనా ప్రతాపం చూపుతున్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలోని నల్లమాడ మండలం చారుపల్లి ప్రధాన కూడలిలో గ్రామానికి చెందిన కుళ్లాయమ్మ, బాబాఫకృద్దీన్, అనసూయమ్మ నిర్వహిస్తోన్న టీ స్టాళ్లు, చిల్లర దుకాణాలకు చెందిన స్థలం తమదంటూ టీడీపీకి చెందిన శ్రీరాములు మరికొంతమంది దౌర్జన్యం చేసి..ఆపై వాటిని ధ్వంసం చేశారు. దీంతో బాధితులు నల్లమాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 203-2లో 40 ఏళ్ల క్రితమే అప్పటి ప్రభుత్వం తమకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసిందని, వాటిలోనే తాము దుకాణాలు ఏర్పాటు చేసుకున్నామని బాధితులు తెలిపారు. కానీ ఇప్పుడు టీడీపీ వర్గీయులు తమ దుకాణాలను ధ్వంసం చేసి బతుకుదెరువును దెబ్బతీశారని వాపోయారు.

తిరువూరు ఇరిగేషన్ ఏఈ ఆచూకీ లభ్యం

రాజమండ్రి నుంచి తీసుకొచ్చిన పోలీసులు



తిరువూరు పోలీసుస్టేషన్లో ఏఈ కిశోర్‌ను ఆయన మామకు అప్పగిస్తున్న పోలీసులు

తిరువూరు: మూడురోజుల క్రితం అదృశ్యమైన ఎన్టీఆర్ జిల్లా తిరువూరు జలవనరుల శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు వి.కిషోర్ ఆచూకీ శనివారం అర్ధరాత్రి లభ్యమైంది. కిశోర్‌కు తిరువూరు నుంచి నెల కిందట గౌరవరం బదిలీ అయ్యింది. అయినా ఆయన్ను విధుల నుంచి రిలీవ్ చేయలేదు. దీంతో ఉన్నతాధికారులను పలుమార్లు సంప్రదించినా ఫలితం లేకపోవడంతో, తనను రాజకీయ కారణాలతో రిలీవ్ చేయకుండా ఉన్నతాధికారులు వేధిస్తున్నారని, ఆత్మహత్య చేసుకుంటున్నానని లేఖ రాసి ఈ నెల 18న కిశోర్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఆయన ఆచూకీ కోసం కుటుంబసభ్యులు, పోలీసులు విస్తృతంగా గాలించగా రాజమండ్రిలో ఉన్నట్లు గుర్తించారు. తిరువూరు పోలీసులు కిశోర్‌ను ఆదివారం ఉదయం స్థానిక పోలీసుస్టేషనుకు తీసుకువచ్చి కుటుంబసభ్యులకు అప్పగించారు. దీనితో మూడురోజులుగా ఏఈ అదృశ్యంపై ఏర్పడిన ఉత్కంఠకు తెరపడింది.

ప్రణాళికతో సివిల్స్ సాధించవచ్చు

ఆలిండియా 11వ ర్యాంకర్, ట్రిపుల్ ఐటీ గ్రాడ్యుయేట్ సాయిశివాని



సాయి శివానిని మెమెంటోతో సత్కరిస్తున్న డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్

నూజివీడు: నిరంతర శ్రమ, అకుంఠిత పట్టుదల ఉంటే సివిల్స్ లో విజయం సాధించొచ్చని 2024 సివిల్స్ 11వ ర్యాంకర్, ఒంగోలు ట్రిపుల్ ఐటీలో బీటెక్ చదువుకున్న ఇ.సాయి శివాని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్‌ఐటీలో ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్, నూజివీడు డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్ర కుమార్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన 'యూపీఎస్సీ ప్రేరణ - వ్యూహ శిబిరం' అనే కార్యక్రమానికి సాయి శివాని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లక్ష్యంపై దృష్టి సారిస్తే ఐఏఎస్ కావడం కష్టమేమీ కాదన్నారు. ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల్లోని ప్రాథమిక అంశాల నుంచి పై తరగతుల పాఠ్యాంశాలపై క్షుణ్ణంగా అధ్యయనం అవసరమన్నారు. సామాజిక మాధ్యమాలను అవసరాలకు మాత్రమే ఉపయోగించుకోవాలని సూచించారు. అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలంటే కొన్ని త్యాగాలు చేయాలని, అధిక సమయం పుస్తక పఠనం, పాఠ్యాంశాల పునశ్చరణకే గడపాలన్నారు. ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్, నూజివీడు డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్ర కుమార్ మాట్లాడుతూ సాయిశివాని సివిల్స్‌లో జాతీయ స్థాయిలో 11వ ర్యాంక్ సాధించడం విశ్వవిద్యాలయానికి గర్వకారణమన్నారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు లక్ష్యంపై దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



నాడు రేషన్ సరుకుల పంపిణీ.. నేడు కూలీల రవాణా

వైఎస్సార్‌సీపీ హయాంలో రేషన్ సరుకులను ఇంటింటికీ పంపిణీ చేస్తూ జీతం తీసుకుని వ్యానుకు చెల్లించాల్సిన రుణాన్ని చెల్లిస్తూ వచ్చిన రేషన్ వాహనాల డ్రైవర్లు..ఇప్పుడు ఆ రుణాల్ని చెల్లించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ పంపిణీని నిలిపివేసిన విషయం తెలిసిందే. దీంతో తమ రుణాలను తీర్చడానికిగాను వాహనాలను వ్యవసాయ కూలీలను తరలించేందుకు ఉపయోగిస్తున్నారు. అలా తరలించగా వచ్చిన సొమ్ముతో రుణాల్ని చెల్లించుకుంటూ తమ జీవనాన్ని తీవ్ర ఇబ్బందుల మధ్య వెళ్లదీస్తున్నారు. కృష్ణా జిల్లా పెడన నుంచి ఆదివారం వ్యవసాయ కూలీలను వ్యానులో తరలిస్తున్న దృశ్యమిది. – పెడన

ఇష్టంలేని కోర్సు చదవమన్నారని..

విద్యార్థి బలవన్మరణం



అంజనీకమల్ (ఫైల్)

కంభం: ఇష్టం లేని కోర్సు చదవమనడంతో మనస్తాపానికి గురైన ఓ విద్యార్థి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం రాత్రి ప్రకాశం జిల్లా కంభంలో జరిగినది. ఎస్సై నరసింహారావు తెలిపిన వివరాల మేరకు..స్థానిక రహమత్ నగర్‌లో ఉంటున్న కుంచాల అంజనీ కమల్ (17) గిద్దలూరులో పదో తరగతి పూర్తి చేశాడు. పదో తరగతిలో 529 మార్కులు సాధించాడు. మహారాష్ట్రలో పాలిటెక్నిక్ డిప్లొమాలో సీటు వచ్చింది. కాగా అందులో చేరడం ఇష్టం లేదని, ఇంటర్ చేస్తానని పట్టుబట్టాడు. దానికి తల్లి ఒప్పుకోకపోవడంతో నిరాశకు గురైన కమల్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కూటమి ప్రభుత్వానికి మా భూములివ్వం

తేల్చిచెప్పిన అనకాపల్లి జిల్లా జానకయ్యపేట రైతులు



జానకయ్యపేటలో నిరసన తెలుపుతున్న రైతులు

నక్కపల్లి (అనకాపల్లి జిల్లా): కూటమి ప్రభుత్వానికి ఎట్టి పరిస్థితిలోనూ భూములివ్వబోమని అనకాపల్లి జిల్లా జానకయ్యపేట రైతులు తేల్చిచెప్పారు. బల్క్‌డ్రగ్ పార్క్‌కు అదనంగా భూములు ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. ఆదివారం జానకయ్యపేటలో జరిగిన సమావేశంలో రైతులు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం 2013 భూ సేకరణ చట్టాన్ని ఉల్లంఘిస్తోందని మండిపడ్డారు. సారవంతమైన భూములను కంపెనీల కోసం తీసుకోరాదని గతంలో సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చిందని చెప్పారు. కానీ కూటమి సర్కార్ తమ పంట భూములను కంపెనీలకు కారుచౌకగా కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. బల్క్‌డ్రగ్ పార్క్ కోసమంటూ సీహెచ్ఎల్ పురంలో మరో 190 ఎకరాలు, పెదతీనార్లలో 600 ఎకరాలు తీసుకోడానికి అధికారులు గ్రామ సభలు నిర్వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు భూములు ఇవ్వడానికి నిరాకరిస్తే.. బలవంతంగా లాక్కోవడానికి ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వం వెనక్కి తగ్గకపోతే త్వరలో అన్ని గ్రామాల రైతులంతా కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఎం నేత ఎం.అప్పలరాజు, వైఎస్సార్‌సీపీ నాయకుడు శీరం నర్సింహమూర్తి, టీడీపీ నాయకుడు కురందాసు సింహాచలం, రైతులు రాందాసు అప్పలరాజు, రాందాసు నానాజీ, మామిడి బాబ్జి, దేవర సత్తిబాబు, తులసీరావు, మామిడి రమణ, మామిడి కృష్ణ,దేవర రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తెనాలిలో ఘనంగా ఆలూరి బైరాగి, శారద శతజయంతి సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ బాబు. వేదికపై యార్లగడ్డ, పెనుగొండ తదితరులు

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలిలో ఆలూరి బైరాగి, శారద(ఎస్.నటరాజన్) శత జయంతి సదస్సు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమాఖ్య మందిరంలో ఘనంగా జరిగింది. వడ్లమూడి గోపాల కృష్ణయ్య, వెంకట లక్ష్మమ్మ ఫౌండేషన్ సంయుక్త నిర్వహణలో జరిగిన కార్యక్రమానికి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ బాబు ఆర్.వడ్లమూడి అధ్యక్షత వహించారు. యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై ఆలూరి బైరాగి రచనలతో తన అనుబంధాన్ని వెల్లడించారు. బైరాగిపై రచయిత డాక్టర్ పాపినేని శివకుమార్, శారదపై 'అరసం' జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ ప్రసంగించారు. 'శారద' కుమార్తె శారద, అరసం జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు, సాహిత్య అకాడమీ ప్రొగ్రామ్ అసిస్టెంట్ చంద్రశేఖరరాజు మాట్లాడారు. ఉదయం సదస్సులో ఆలూరి బైరాగి రచనలు, సాహిత్యంపై కందిమళ్ల శివప్రసాద్, కొర్రపాటి ఆదిత్య, పేరిశెట్టి శ్రీనివాసరావు పత్రసమర్పణ చేయగా, మధ్యాహ్నం 'శారద కథాసాహిత్యం'పై కె.శరత్ చంద్ర జ్యోతిశ్రీ, చెరుకూరి సత్యనారాయణ పత్రసమర్పణ చేశారు.

కాపుల సమస్యలపై దశలవారీ ఉద్యమం

కాపు జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు చందు జనార్దన్



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాల సమస్యలపై దశలవారీగా ఉద్యమం చేపట్టనున్నట్లు కాపు జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు చందు జనార్దన్ తెలిపారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం కాపు సంఘాల జేఏసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చందు జనార్దన్ మాట్లాడుతూ కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలకు ప్రత్యేక బీసీ రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం పోరాడాలని తీర్మానించినట్లు చెప్పారు. కాపు జాతికి చెందిన మహనీయుల జయంతి, వర్ధంతులను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, కాపు కార్పొరేషన్‌కు రూ.3వేల కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మొత్తం 12 తీర్మానాలను ఆమోదించినట్లు వివరించారు.

లిక్కర్ కేసులో ఎవరినీ వదలం

ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

గుంటూరు మెడికల్: లిక్కర్ కేసుతో సంబంధం ఉన్న ఎవరినీ వదిలిపెట్టబోమని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఆయన ఆదివారం గుంటూరులో మీడియాతో మాట్లాడుతూ లిక్కర్ కేసును సిట్ దర్యాప్తు చేస్తోందని, ఇందులో ఎవరి ప్రమేయం ఉందనేది వెలుగులోకి వస్తుందని చెప్పారు. ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యులు సకాలంలో విధులకు హాజరుకాకపోతే మెమోలు జారీ చేస్తున్నామన్నారు. విదేశాల్లో వైద్య విద్య అభ్యసించినవారికి ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం త్వరలోనే న్యాయం చేస్తామని చెప్పారు.

మా సమస్యలను ఎప్పుడు పరిష్కరిస్తారు?

కేంద్ర సహాయ మంత్రిని నిలదీసిన ప్రజలు



గొడవర్రులో పర్యటిస్తున్న పెమ్మసాని

కంకిపాడు (పెనమలూరు): తమ సమస్యలను ఎప్పుడు పరిష్కరిస్తారని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను కృష్ణా జిల్లా కంకిపాడు మండలం గొడవర్రులో ప్రజలు నిలదీశారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పెనమలూరు టీడీపీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌తో కలిసి ఆదివారం గొడవర్రులో పెమ్మసాని పర్యటించారు. స్థానికులు ప్రధానంగా తాము డ్రైనేజీ సమస్య ఎదుర్కొంటున్నామని, మురుగునీరు పోయే మార్గం లేదని, వీటిని ఎప్పుడు పరిష్కరిస్తారని నిలదీశారు. పెమ్మసాని మాట్లాడుతూ ప్రాధాన్యతా క్రమంలో సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని చెప్పి అక్కడి నుంచి జారుకున్నారు.



ఆదివారం లాల్ దర్వాజాలో సింహవాహిని మహంకాళి అమ్మవారి ఆలయంలో బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఆషాఢమాసం చివరి బోనాలు కావడంతో, భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి, అమ్మవారికి బోనాలు సమర్పించారు. – ఫొటో: ఎస్.ఎస్.ఠాకూర్

అహంకారం అనర్థదాయకం

మంచిమాట



అహంకారం అంటే తానే అందరికంటే గొప్పవాడిననీ, అందరూ తనముందు అణిగిమణిగి ఉండాలని భావించడం. అహంకారం, అహం భావం రెండూ ఒకే కోవలోకి వస్తాయి. చరిత్రలో మహితమైన గుణాలతో, సాధులక్షణాలతో అలరారే వాళ్ళు ఎంతమంది ఉన్నారో, అహంకారంతో విర్రవీగేవాళ్ళు సైతం అంతకు తక్కువ మంది లేరు. ఈ అహంకారమనేది సర్వదా వదిలివేయవలసిన దుర్లక్షణం. ఒకరిమీద అహంకరించిన వ్యక్తి ఏం సాధించగలడు? అదే ఆహంకరించడం మాని, మమకారం చూపితే, ప్రపంచమే నీ సొంతమవుతుంది.

ఇతరులను తక్కువగా చూడడం, తన గురించి తాను ఎంతో గొప్పవాడినని భావించడం, తాను చేసిన తప్పులను అంగీకరించకపోవడం, ఎదుటి వారి అభిప్రాయాలకు అస్సలు విలువ ఇవ్వకపోవడం, ఎక్కువగా దంభాలు పలకడం, ఇతరులు చెప్పే మాటలను ఏమాత్రం వినకపోవడం, ఎదుటివారిని పదేపదే విమర్శించడం.. ఇవన్నీ అహంకారుల లక్షణాలు.

అహంకారం అనేది అనర్థదాయకం. అది మానవ సంబంధాలను, వ్యక్తికి ఇతరులతో ఉన్న అనుబంధాలను కూడా దెబ్బ తీస్తుంది. అంతేకాదు.. వ్యక్తిగత పతనానికీ దారి తీస్తుంది. చరిత్ర గతిలో తాము అతి గొప్పవారమని విర్రవీగిన నెపోలియన్, అలెగ్జాండర్ వంటి వారు చివరికి ఏరకంగా నాశనమయ్యారో పరికిస్తే, హద్దులు మీరిన వారి అహంకారమే దానికి కారణమని తెలుస్తుంది.

ప్రతి వ్యక్తీ విసర్జించవలసింది అహంకారం. పక్కవారిపై చూపవలసింది మమకారం. అహంకారాన్ని వీడి, ఇతరుల పట్ల మమకారాన్ని చూపించగలిగితే, ఆ లక్షణం మానవ సంబంధాలను సుధామయం చేస్తుందని అనడంలో ఎటువంటి సందేహం లేదు.


– 'అన్నమయ్య తత్వ ప్రవచన సుధాకర'
వెంకట్ గరికపాటి

అహాన్ని వీడిన మకరధ్వజుడు

అహంకారానికి మారుపేరుగా నిలిచే పాతకాలం నాటి ఒక రాజు కథను పరికిద్దాం. కుంతల దేశాన్ని రవివర్మ అనే రాజు పరిపాలిస్తూ ఉండేవాడు. ఆ రాజు మహావీరుడు. అతనికి తెలియని యుద్ధవిద్య లేదు. అయితే, అతనిలోని పెద్ద బలహీనత విపరీతమైన అహంకారం. అతని మాటే శాసనం. ఎవరు తనకు ఎదురుచెప్పినా వినేవాడు కాదు. ఈ విధంగా పరిపాలన సాగుతున్న క్రమంలో రాజుకు ఉన్నట్టుండి ఒక వింత వ్యాధి సోకింది. రాజ్యంలో ఉన్న వైద్యులెవరూ రాజుకున్న వింతరోగాన్ని తగ్గించలేకపోయారు. దానితో మహామంత్రి, ప్రధానసైన్యాధికారి, మిగిలిన వాళ్ళందరూ అన్ని రాజ్యాలూ గాలించి, ఉజ్జయినిలో మకరధ్వజుడనే ఒక గొప్ప సిద్ధవైద్యుడున్నాడనీ, అతని హస్తవాసి చాలా మంచిదని తెలుసుకున్నారు. అయితే, ఆ వైద్యుడు ఉజ్జయినిని వీడి ఎక్కడికీ రాడనీ, ఎంత పెద్దవాడైనా అక్కడే వైద్యం తీసుకోవాలని అతని సహాయకులు తెలిపారు. సైన్యాధికారి రాజు దగ్గరికి వెళ్ళి, "మహారాజా.. అపర ధన్వంతరి లాంటి ఒక వైద్యుని గురించి విన్నాం. అయితే, చికిత్స కోసం, మీరు ఆ వైద్యుడు ఉండే ఉజ్జయిని వెళ్ళవలసి ఉంటుంది" అన్నాడు. అది వినగానే రవివర్మకు ఆగ్రహం తన్నుకొచ్చింది. "నేను ఎవరనుకున్నావు. ఆ వైద్యుని దగ్గరకు వెళ్ళి యిక్కడికి రమ్మని చెప్పు. రాకపోతే బలవంతంగా తీసుకురా.." అన్నాడు. చేసేదేం లేక సైన్యాధికారి ఉజ్జయిని వెళ్ళాడు. ఆ వైద్యుని దగ్గర రోగులు తండోపతండాలుగా ఉన్నారు. వాళ్ళందరికీ ఎంతో ఓపికగా ఔషధాలను యిస్తున్నాడు మకరధ్వజుడు. అందరూ ఆ వైద్యుని దైవంలా కీర్తించడం గమనించాడు సైన్యాధికారి. కుంతలదేశపు రాజైన రవివర్మ తన రోగ నివారణకు మందులు యివ్వడం కోసం తమ రాజ్యానికి రమ్మంటున్నారని సైన్యాధికారి వైద్యునికి తెలపగా, అతనితో మకరధ్వజుడు "నాయనా.. నన్ను నమ్ముకుని రోగులు వివిధ రాజ్యాలనుంచి ఉజ్జయినికి వస్తారు. కాబట్టి వారిని వదిలి నేను ఎక్కడికీ రాలేను.." అన్నాడు. అది విని ఆగ్రహించిన సైన్యాధికారి వైద్యునిపై బలప్రయోగం చేయబోయాడు. అక్కడే ఉన్న జనులందరూ కోపగించి, సైన్యాధికారికి దేహశుద్ధి చేశారు. పలాయనం చిత్తగించి, వెంటనే కుంతల రాజ్యానికి తిరుగు పయనమయ్యాడు సైన్యాధికారి. రాజు దగ్గరికి వెళ్ళి, "మహారాజా.. మకరధ్వజుడు మహావైద్యుడు. కానీ, అసంఖ్యాకమైన రోగులను నిత్యమూ చూడాలి కాబట్టి, ఆయన ఎక్కడికీ రాలేడు. తమరు ఉజ్జయినికి వెళితే, అతి తక్కువ వ్యవధిలో తమ రోగం నయమవుతుందన్న నమ్మకం నాకు ఉంది." అన్నాడు. ఈ లోగా రాజు ఆరోగ్యం మరికొంత క్షీణించింది. ఇక, తప్పనిసరై, తన అహంకారాన్ని వదిలి, ఉజ్జయినికి వెళ్ళిన రాజుకు మకరధ్వజుడు తన నైపుణ్యంతో వైద్యం చేసి, అతని రోగాన్ని నయం చేశాడు. అమితమైన ఆనందానికి గురైన రవివర్మ, మకరధ్వజుని వైద్యశాలకు వచ్చే రోగులకు ఉపయోగపడేలా ఎన్నో హంగులు సమకూర్చడమే గాక, తన అహంకారాన్ని తగ్గించుకుని ప్రజారంజకంగా పరిపాలన కొనసాగించాడు.

మనస్సు... ఎరుక

ఆత్మదర్శిని



ఆత్మ అనేది నీ నిజతత్వమైనప్పటికీ శరీరం –మనస్సులే నేను అని భ్రమపడి మనస్సుకు వచ్చే కలలతో ప్రయాణిస్తూ నీ నిజతత్వం ఏమిటో మరచిపోయి ప్రవర్తిస్తూ ఉంటావు. కల వచ్చేటప్పుడు కల ఎంత సత్యమని అనిపిస్తుందో మనందరికీ తెలుసు. కలగంటున్నప్పుడు అదే సత్యమని నమ్ముతూ ఉంటాం. నిద్రలేవగానే అది కల అని తెలుసుకుని నవ్వుకుంటూ ఉంటాం. కలలో గెంతుతూ, అరుస్తూ, భయపడుతూ అదే నిజమనుకుంటాము. అలాగే నిజ జీవితంలో కూడా విషయాలనన్నింటినీ నిజాలనే నమ్ముతూ ఉంటాము. నిజానికి కళ్ళు తెరిచిన సమయంలో, కళ్ళు మూసుకున్న సమయంలో జరిగేదంతా కలలే. రెండూ నిజాలు కావు. బయటి వైపుకు ప్రయాణించడమే అలవాటు చేసుకున్నాం. శరీరము–మనస్సులే నేనని నమ్ముతూ ఇంద్రియాల అనుభవాలకే విపరీతమైన ప్రాముఖ్యత నిచ్చి బాహ్యంగా కలను నిర్మించుకున్నాం. అదే సత్యమని నమ్ముతున్నాం.

ప్రతి వ్యక్తి ఈ బయటి ప్రపంచాన్ని మార్చటానికి ప్రయత్నిస్తూ ఉంటారు. తన సమస్యలన్నింటికీ భార్య, భర్త, పిల్లలు, తల్లిదండ్రులు, సమాజం అనే అసత్యాలైన పాత్రలు కారణమని భావిస్తూ ఉంటారు. ప్రతి చోటా ఆత్మ చైతన్యాన్ని మరచిపోయి వ్యక్తిత్వం అనే ముసుగును తయారు చేసుకుంటారు. బయటి మార్పులు చేస్తే నీవు ఆనందంగా ఉంటావని మనస్సు ఎప్పుడూ చెప్తూ ఉంటుంది. నిజానికి మనస్సే నీ అసలైన శత్రువు, బయటి విషయాలో లేక వ్యక్తులో కావు. స్థలం, ఇల్లు, భార్య, సౌకర్యాలు మొదలైనవి మారిస్తేనే ఆనందంగా ఉంటావు అని చెప్తుంది మనస్సు. ఈ మనస్సు భ్రమలే మన దుఃఖానికి కారణం. మనకు కలిగే ప్రతి బాధకూడా నీ నిజస్థితిని మరచిపోయినప్పుడు కల్గినవే. మన దుఃఖాలన్నీ ఆ యాంత్రికతలో, నీ నిజస్థితి పట్ల ఎరుకలేని స్థితిలోనే ఉంటాయి. మనం ఎప్పుడైతే మేల్కువ స్థితిలో అంటే ఆత్మానుభవంలో ఉంటామో ఆ క్షణమే దుఃఖాలన్నీ వీడిపోతాయి. బాహ్యంగా వేటినీ మార్చవలసిన అవసరం లేదు. నేను ఆత్మను అని తెలుసుకున్న క్షణంలో ఆనందం మాత్రమే ఉంటుంది. మనస్సులేని స్థితిలో, అంటే ఆలోచనలతో విడిపడి నీవు శుద్ధ చైతన్యంగా ఉన్న స్థితిలో, గతానికి సంబంధించిన స్మృతులు, భవిష్యత్తుకు సంబంధించిన ఊహలు ఏమీ లేని స్థితిలో ఈ క్షణంలో ఉంటావు. ఈ క్షణంలో ఆత్మానుభవమే ఉంటుంది. మనస్సు అనేది దుమ్ములాంటిది. నీవు శుద్ధ చైతన్యానివి. మతం అనే ముసుగు కూడా మనసు సృష్టించినదే. నీ (ఆత్మ) ఉనికి లేని స్థితే మనస్సు.



–స్వామి మైత్రేయ
ఆధ్యాత్మిక బోధకులు

అతి సమీప బంధువు

తాత్త్వికథ



ఒక ఊర్లో గాడి తప్పిన యువకుడు ఒకడుండేవాడు. ఇతరులతో అకారణంగా గొడవ పడేవాడు. అందరినీ కొట్టి తిట్టేవాడు. వాడి అకృత్యాలకు గ్రామస్తులు ఎందరో విసిగిపోయారు. అతనికి బుద్ధి చెప్పడానికి తగిన మార్గం కానరాక సమయం కోసం ఎదురు చూస్తున్నారందరూ!

ఒకరోజు ఓ వృద్ధురాలు తన ఇంటి ముందర ఉడకబెట్టిన వడ్లను ఆరబెడుతోంది. దారిన పోతున్న ఆ యువకుడు వడ్లను తన్ని వెళ్ళిపోయాడు.

కన్నీళ్లు పెట్టుకుంటూ ఆ వృద్ధురాలు "కండ బలం కొన్నాళ్ళే. దాన్ని చూసి మురిసిపోవద్దు. అతి సమీప బంధువు వచ్చిన రోజున తెలుస్తుంది నీకు అసలు విషయం" అని తిట్టి పోసింది.

అక్కడినుంచి అయితే ఆ యువకుడు వచ్చేశాడు కానీ అతి సమీప బంధువు ఎవరో తెలుసుకోవాలనిపించింది. తనను 'ఢీ' కొట్టేంత మొనగాడు ఎవడో కళ్ళారా చూడాలనిపించింది. పక్క ఊర్లో ఉన్న తమ దాయాదుల ఇళ్లకు వెళ్ళాడు. 'నాకు అతి దగ్గర బంధువు ఎవరు' అని ఆరా తీశాడు.

దగ్గరి బంధువులు ఉన్నారు కానీ, నీతో తలపడేంత గట్టి మనుషులు ఎవ్వరూ లేరని వారు సర్ది చెప్పి పంపారు. అతడి అహం సంతోషించింది కానీ, శత్రు శేషం ఉండరాదని గట్టిగా భావించిన అతడు శపించిన వృద్ధురాలినే అడిగి తెలుసుకుందామనుకున్నాడు. ఆ వృద్ధురాలి ఇంటికి వెళ్ళాడు. అతడి రాక విషయం తెలిసి ఆమె అప్పటికే ఊరు విడిచి వెళ్ళిపోయింది.

తిన్నగా తన ఇంటికి వెళ్ళాడు. అమ్మ అన్నం తినమని పిలిచింది. వద్దన్నాడు. ఆకలి కాలేదన్నాడు. కారణమేమిటని అడిగింది. విషయం చెప్పాడు.

ఆమె చిన్నగా అతడి భుజం తట్టుతూ "ఎవ్వరికైనా అతి సమీప బంధువు మృత్యువు. అది మన నీడ లాగా మనతోనే ఉంటుంది. ఎప్పుడు మనల్ని కబళిస్తుందో మనకు తెలియదు. చనిపోయే సమయంలో మనం చేసిన పాప పుణ్యాలు గుర్తుకు వస్తాయని పెద్దలు చెబుతారు. ఆ విషయమే ఆమె నిన్ను హెచ్చరిక చేసింది" అన్నాడు.

"ఆ బంధువు ఎప్పుడు వచ్చేదీ మనకు తెలియదా? తెలిస్తే ఆ బంధువుని మూడు చెరువుల నీళ్ళు తాగించాలని ఉంది" అని గర్వంగా అన్నాడు.

ఆమె నవ్వి "ఎప్పటికీ ఎవ్వరికీ అర్థం కానిది మృత్యువు. అది ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు వెళ్తుందో తెలుసుకోవడం ఎవ్వరి తరం కాదు. వచ్చినప్పుడు తప్పించుకోవడానికి కూడా ఎవ్వరికీ సాధ్యం కాదు. అందుకే అది వచ్చేలోగా మనం మంచి పనులు చేయాలని చెబుతారు. ఒకర్ని నొప్పించే పనులు చేయవద్దని అంటారు" అని వివరించింది.

ఏ క్షణాన అయినా వచ్చే అతి సమీప బంధువు గురించి అవగాహన వచ్చింది అతడికి. క్షమాపణలు చెబుదామని ఆ వృద్ధురాలిని వెదకడం కోసం బయలుదేరాడు.

– ఆర్.సి. కృష్ణస్వామి రాజు

సాక్షి సినిమా

ఆ భవనంలో తొలి పెళ్లి మాదే



● విశాల్

తమిళ నడిగర్ సంఘం (నటీనటుల సంఘం) ఎన్నికల్లో (2015) జనరల్ సెక్రటరీగా ఎన్నికైనప్పుడు ఈ సంఘానికి భవనం కట్టించిన తర్వాతే పెళ్లి చేసుకుంటానని విశాల్ అప్పట్లో పేర్కొన్నారు. ఇంకా ఈ పదవిలో కొనసాగుతున్న ఆయన ఈ ఏడాది ఏడడుగులు వేయనున్నారు. హీరోయిన్ సాయి ధన్సిక–విశాల్ ప్రేమలో ఉన్నారు. ఈ విషయాన్ని ఆ మధ్య ఓ వేడుకలో ధన్సిక స్పష్టం చేశారు. అలాగే ఆగస్టు 29న పెళ్లి చేసుకోనున్నట్లు తెలిపారు. అయితే ఈ పెళ్లి వాయిదా పడినట్లు తెలుస్తోంది. ఎందుకంటే "నడిగర్ సంఘం భవన నిర్మాణం తుది దశకు చేరుకుంది. ఈ భవనంలోనే నా పెళ్లి జరుగుతుంది. అది ఎప్పుడు పూర్తయితే అప్పుడు మా పెళ్లి ఏర్పాటు చేసుకుంటాం. ఈ భవనంలో జరగనున్న మొదటి పెళ్లి మాదే. భవనంలో మూడో అంతస్తులో పెళ్లి మందిరాన్ని నిర్మిస్తున్నారు. మా పెళ్లి కోసం బుక్ చేసుకున్నాను" అని విశాల్ తాజాగా పేర్కొన్నారు. ఆగస్టు 29న శుభవార్త చెబుతానని కూడా అన్నారు. ఆ వార్త పెళ్లి గురించే అయ్యుంటుందని, మరో తేదీని చెబుతారనే ఊహాగానాలు నెలకొన్నాయి.

కూలీ అనేది ఓ సవాల్



● శ్రుతీహాసన్

చేతిలో పార... తీక్షణమైన చూపులతో 'కూలీ'లో శ్రుతీహాసన్ పోషించిన ప్రీతి పాత్ర లుక్‌ని విడుదల చేసినప్పుడే చర్చనీయాంశమైంది. ఈ చిత్రంలో ఆమెది నెగెటివ్ షేడ్ ఉన్న క్యారెక్టర్ అని, యాక్షన్ సన్నివేశాలు కూడా ఉంటాయనే ఊహాగానాలు నెలకొన్నాయి. అయితే తన పాత్ర గురించిన వివరాలేమీ బయటపెట్టకుండా శ్రుతీహాసన్ 'కూలీ' సినిమా గురించి కొన్ని విషయాలను పంచుకున్నారు. "కెమెరా ముందు నటీనటులకే కాదు... కెమెరా వెనక డైరెక్టర్‌కి కూడా ఈ సినిమా ఓ సవాల్. డైరెక్టర్ లోకేశ్ కనగరాజ్ అలాంటి కాన్సెప్ట్‌తో ఈ సినిమా తీశారు. లొకేషన్‌లో ప్రతి ఒక్కరూ వర్క్ మీదే ఫోకస్ పెట్టాం. సీన్స్ అన్నీ కూడా ఆ ఫోకస్‌ని డిమాండ్ చేశాయి. పైగా ఎక్కువగా నైట్ షూట్స్ చేశాం. నాకు నైట్ షూట్స్ అంటే చాలా ఇష్టం. సీన్ పర్ఫెక్ట్‌గా వచ్చేవరకూ లొకేషన్‌లో ఎవరూ నిద్రపోలేదు. ఇలా సెట్‌లో అందరూ చాలా ఉత్సాహంగా పని చేయడం అనేది అరుదుగా జరుగుతుంటుంది. మంచి కంటెంట్ ఉన్నప్పుడు ఇలా అందరూ లీనమైపోతాం. 'కూలీ' అనేది నాకు అద్భుతమైన అనుభూతిని మిగిల్చిన చిత్రం" అని శ్రుతీహాసన్ పేర్కొన్నారు. ఇక రజనీకాంత్ హీరోగా నటించిన ఈ చిత్రంలో నాగార్జున, అమిర్ ఖాన్, ఉపేంద్ర, సత్యరాజ్ తదితరులు నటించారు. ఆగస్టు 14న 'కూలీ' విడుదల కానుంది.

ఈ సినిమాకి ఆదరణ లభించడం ఆనందం

– దర్శకురాలు ప్రవీణ

"ఓ సినిమా తీసి, దాన్ని రిలీజ్ చేసి ప్రేక్షకుల దగ్గరికి తీసుకువెళ్లడం పెద్ద టాస్క్. అయితే ఈ జర్నీ ఎంత కష్టమైనా ఆడియన్స్ నుంచి మంచి ఆదరణ లభిస్తున్నందుకు సంతోషంగా ఉంది. ఒక నమ్మకం గురించిన కథ 'కొత్తపల్లిలో ఒకప్పుడు' సినిమా. లైట్ హార్టెడ్ కామెడీతో ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకు రావడం జరిగింది. ఈ సినిమాను థియేటర్స్‌లో చూడండి... మంచి అనుభూతినిస్తుంది" అని అన్నారు ప్రవీణ పరుచూరి. మనోజ్ చంద్ర, మోనికా .టి, ఉషా బోనేలా ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. రానా సమర్పణలో ప్రవీణ పరుచూరి ఈ సినిమాను స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 18న విడుదలైంది. తమ సినిమాకు ప్రేక్షకుల నుంచి సానుకూల స్పందన వస్తోందని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సందర్భంగా ఆదివారం నిర్వహించిన థ్యాంక్స్ మీట్‌లో మనోజ్ చంద్ర మాట్లాడుతూ–"ఈ సినిమాలో నేను పోషించిన రామకృష్ణ పాత్రకు ఆడియన్స్ కనెక్ట్ అయ్యారు. ఇలాంటి మరిన్ని సినిమాలకు రానాగారు సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను" అన్నారు. "చాలా మంచి సినిమా ఇది. థియేటర్స్‌లో చూసి, ఎంజాయ్ చేయండి" అన్నారు టి. మోనిక, ఉషా బోనేలా. ఈ కార్యక్రమంలో కొరియోగ్రాఫర్ మెహరా బాబా మాట్లాడారు.



● ప్రవీణ, మనోజ్ చంద్ర, ఉషా బోనేలా, మోనిక

మన చరిత్ర ఈ తరానికి తెలియాలి

– దర్శకుడు అశ్విన్ కుమార్



"మహావతార్ నరసింహ' సినిమా మన చరిత్ర. ప్రతి తరానికి మన చరిత్ర చెప్పాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా పిల్లలకి, ఈ తరం యువతకి మన చరిత్ర తెలియాలి. ఈ ఉద్దేశ్యంతోనే 'మహావతార్ సినిమాటిక్ యూనివర్స్'ను ఆరంభించాం. లైవ్ యాక్షన్ సినిమా కూడా చేయొచ్చు. కానీ ఎవరైనా హీరోగా నటిస్తే, ఆ హీరో ఇమేజ్ ఈ క్యారెక్టర్‌పై పడే అవకాశం ఉంది. అందుకే శ్రీ మహావిష్ణువు కథని చెప్పాలంటే యానిమేషన్ అనేది ఒక ఉత్తమ మాధ్యమంగా మేం భావించాం. అందుకే 'మహావతార్ సినిమాటిక్ యూనివర్స్'ను యానిమేషన్‌లో చేస్తున్నాం" అని దర్శకుడు అశ్విన్ కుమార్ అన్నారు. శ్రీ విష్ణువు దశావతారాల ఆధారంగా 'మహావతార్ సినిమాటిక్ యూనివర్స్' రూపొందుతోంది. ఈ యూనివర్స్ నుంచి తొలి భాగంగా 'మహావతార్ నరసింహ' రానుంది. అశ్విన్ కుమార్ దర్శకత్వంలో హోంబలే ఫిల్మ్స్ సమర్పణలో శిల్పా ధావన్, కుశాల్ దేశాయ్, చైతన్య దేశాయ్ నిర్మించిన 'మహావతార్ నరసింహ' ఈ నెల 25న థియేటర్స్‌లో రిలీజ్ కానుంది. తెలుగులో గీతా ఫిల్మ్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా విడుదల అవుతోంది. ఈ సందర్భంగా ఆదివారం విలేకరుల సమావేశంలో అశ్విన్ కుమార్ మాట్లాడుతూ– "శ్రీ మహావిష్ణువు దశావతారాలను బిగ్ కాన్వాస్‌లో ప్రజెంట్ చేయాలనే ఆలోచనతో 'మహావతార్ యూనివర్స్'ను మొదలు పెట్టాం. ఈ కథని మేము శాస్త్రాల నుంచే తీసుకున్నాం. ఈ సినిమా చేసేప్పుడు సృజనాత్మకంగా, ఆర్థికంగా, సాంకేతికంగా ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నాం. కోవిడ్ పరిస్థితులను ఫేస్ చేశాం. స్వామివారి ఆశీర్వాదం ఈ సినిమాపై ఉంది. వినోదంతో పాటు చరిత్ర, మన సంస్కృతి, ధర్మం... వంటి అంశాలు కూడా ఉన్నాయి. మా నెక్ట్స్ ప్రాజెక్ట్ 'మహావతార్ పరశురాం' ప్రీ ప్రొడక్షన్ దశలో ఉంది" అన్నారు. "మా యూనివర్స్ నుంచి ప్రతి రెండేళ్లకో సినిమాను రిలీజ్ చేస్తాం" అని తెలిపారు నిర్మాత శిల్పా.



● ఆనంది

ఆత్మగౌరవానికి సెల్యూట్

లెజెండరీ జానపద గాయని గరివిడి లక్ష్మి జీవిత కథ 'గరివిడి లక్ష్మి' టైటిల్‌తో ప్రేక్షకుల ముందుకు రానుంది. వెండి తెరపై గరివిడి లక్ష్మి పాత్రలో ఆనంది నటిస్తున్నారు. గౌరి నాయుడు జమ్ము దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ జరుగుతోంది. తాజాగా ఈ సినిమా గ్లింప్స్ వీడియోను రిలీజ్ చేశారు. "బుర్ర కథలు చెప్పడమే కాదు... ఓ ఉద్యమంగా మార్చిన లక్ష్మి జీవితాన్ని ఈ సినిమా చూపిస్తుంది. మన ఊరి పాటలు, అనుభూతులు, మన మూలాల నుంచి వచ్చే ఆత్మగౌరవానికి సెల్యూట్ లాంటి సినిమా ఇది" అని చిత్రబృందం పేర్కొంది.

లక్ష్మిని సన్మానించడం సముచితం

– సుమన్



● రామకృష్ణ గౌడ్, లక్ష్మి, సుమన్

"కరాటే నేర్చుకోవడం సులువైన పని కాదు. అలాగే సినిమా ఇండస్ట్రీలోకి రావాలనుకుంటే ఇక్కడి స్టంట్స్ నేర్చుకోవాలి. ఎంతో కష్టపడి మాస్టర్ లక్ష్మీ సామ్రాజ్యం కరాటే నేర్చుకున్నారు. మార్షల్ ఆర్ట్స్‌లో ప్రతిభ చాటుకుంటున్నారు. లక్ష్మికి 'తానా' (తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా) సత్కారం జరగడం సముచితం" అని సుమన్ అన్నారు. తానా నుంచి సత్కారం పొందిన ప్రముఖ కరాటే మాస్టర్ లక్ష్మీ సామ్రాజ్యంను సన్మానించారు టీఎఫ్‌సీసీ (తెలంగాణ ఫిలింఛాంబర్ ఆఫ్ కామర్స్) ఛైర్మన్ ప్రతాని రామకృష్ణ గౌడ్. ఈ సన్మాన కార్యక్రమంలో ప్రముఖ నటుడు సుమన్ ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. ఈ సందర్భంగా ఫైట్ మాస్టర్ లక్ష్మి మాట్లాడుతూ– "టీఎఫ్‌సీసీ నంది అవార్డు అందుకోవడం ఆనందంగా ఉంది" అన్నారు లక్ష్మీ సామ్రాజ్యం. "టీఎఫ్‌సీసీ కార్యాలయం కోసం స్థలం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరాం. త్వరలోనే స్థలం వస్తుంది. అందులో కరాటే అసోసియేషన్ వారికి కూడా స్థలం కేటాయిస్తాం" అని తెలిపారు రామకృష్ణ గౌడ్.

డాన్ దర్శకుడు చంద్ర బారోట్ కన్నుమూత



హిందీ సినిమాలలో కల్ట్ క్లాసిక్‌గా నిలిచిన 'డాన్' చిత్ర దర్శకుడు చంద్ర బారోట్ ముంబైలో కన్ను మూశారు. ఆయన వయసు 86. అమితాబ్ హీరోగా నటించిన 'డాన్' 1978లో విడుదలై ఘన విజయం సాధించడమే కాకుండా నేటికీ రీమేక్‌లతో ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. 'డాన్' తెలుగులో ఎన్టీఆర్ హీరోగా 'యుగంధర్'గా విడుదలైంది. ఆ తర్వాత తమిళంలో రజనీకాంత్ హీరోగా 'బిల్లా' పేరుతో రిలీజ్ అయ్యింది. అదే సినిమా తెలుగులో మళ్లీ ప్రభాస్ హీరోగా 'బిల్లా'గా వచ్చింది. హిందీలో ఫర్హాన్ అక్తర్ దర్శకత్వంలో షారుక్ హీరోగా 'డాన్, డాన్2' వచ్చాయి. ఇప్పుడు తిరిగి ఫర్హాన్ దర్శకత్వంలోనే రణ్‌వీర్ సింగ్ హీరోగా 'డాన్ 3' తయారవుతోంది. దాదాపు 50 ఏళ్ల క్రితం వచ్చిన సినిమా ఇప్పటికీ ఇలా రీమేక్‌లు కావడం చరిత్రలో అరుదు. 'డాన్'ను ఆ విధంగా తీర్చిదిద్దిన చంద్ర బారోట్ ఘనత అది.

మనోజ్ కుమార్ శిష్యుడు



● 'డాన్' సెట్స్‌లో చంద్ర, అమితాబ్

టాంజానియాలో పుట్టి పెరిగిన చంద్ర బారోట్ బాలీవుడ్ గాయని కమల్ బారోట్ సోదరుడు. టాంజానియాలో ఆర్థిక మాంద్యం వచ్చిన సమయంలో ముంబై వచ్చి, సోదరి రికమండేషన్ మీద మనోజ్ కుమార్ దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేశారు. మనోజ్ తీసిన 'పూరబ్ ఔర్ పశ్చిమ్, రోటీ కపడా ఔర్ మకాన్' సినిమాలకు దర్శకత్వ శాఖలో పని చేస్తున్నప్పుడు అమితాబ్, జీనత్ అమాన్‌లు అతనికి మంచి మిత్రులయ్యారు. 'రోటీ కపడా ఔర్ మకాన్' సినిమాకు కెమెరామేన్‌గా పని చేసిన నారిమన్ ఇరానీ సొంతంగా సినిమా తీసి తీవ్రమైన అప్పులుపాలు కావడంతో ఆయనను ఆదుకోవడానికి చంద్ర బారోట్ 'డాన్' తీశారు. పేరుకు నారిమన్ ఇరానీ నిర్మాత అయినా సినిమా అంతా దాదాపుగా ఉచితాల మీదే సాగింది. అమితాబ్, జీనత్ పారితోషికం తీసుకోలేదు. తమ దగ్గర చాలా కాలం వృథాగా పడివున్న 'డాన్' స్క్రిప్టును సలీమ్–జావెద్ తక్కువ డబ్బులకే ఇచ్చేశారు.

84 లక్షలతో తీస్తే...

'డాన్'ను ఆ రోజుల్లో 84 లక్షలతో నిర్మిస్తే నేటికీ రిలీజులు, రీ రిలీజులు, రీమేక్ రైట్స్ అన్నీ కలుపుకుని దాదాపు 300 కోట్లు సంపాదించింది. ఇందులోని డైలాగ్ 'డాన్‌కో పకడ్‌నా ముష్కిల్‌హీ నహీ నాముమ్‌కిన్ హై'... పెద్ద హిట్. సినిమా అంతా తీశాక తన గురువు మనోజ్ కుమార్‌కు 'డాన్'ను చూపిస్తే సెకండ్ హాఫ్‌లో రిలీఫ్ లేదు... ప్రేక్షకులు బయటకెళ్లి సిగరెట్ తాగే వీలుగా ఒక పాట పెట్టు అని సూచిస్తే చేరిన పాటే 'ఓ ఖైకె పాన్ బనారస్ వాలా'... ఈ పాటకు అమితాబ్ వేసిన స్టెప్స్ ప్రేక్షకులను పదేపదే థియేటర్‌కు తెప్పించి సినిమాను సూపర్ హిట్ చేసింది. దురదృష్టవశాత్తు 'డాన్' తీశాక చంద్ర బారోట్ చెప్పుకోదగ్గ సినిమాలేవీ తీయలేదు. కానీ 'డాన్' ఉన్నంత కాలం అతని పేరు ఉంటుంది.



ఆన్ సె యంగ్ 'సిక్సర్'

ఈ సీజన్‌లో తన ఆధిపత్యం కొనసాగిస్తూ దక్షిణ కొరియా బ్యాడ్మింటన్ స్టార్ ప్లేయర్, ప్రపంచ నంబర్‌వన్ ఆన్ సె యంగ్ ఆరో సింగిల్స్ టైటిల్‌ను సాధించింది. ఆదివారం టోక్యోలో ముగిసిన జపాన్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 టోర్నీలో 23 ఏళ్ల ఆన్ సె యంగ్ చాంపియన్‌గా నిలిచింది. ప్రపంచ రెండో ర్యాంకర్ వాంగ్ జి యి (చైనా)తో జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో ఆన్ సె యంగ్ 21-12, 21-10తో అలవోకగా గెలిచింది. వాంగ్ జి యిపై ఆన్ సె యంగ్‌కిది 13వ విజయం కావడం విశేషం. విజేతగా నిలిచిన ఆన్ సె యంగ్‌కు 66,500 డాలర్ల (రూ. 57 లక్షల 28 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 11,000 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఈ ఏడాది ఆన్ సె యంగ్ మొత్తం ఏడు టోర్నీల్లో పోటీపడింది. సింగపూర్ ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్లో చైనా ప్లేయర్ చెన్ యుఫె చేతిలో ఓడిన ఆన్ సె యంగ్... ఇండోనేసియా ఓపెన్-1000 టోర్నీ, ఆల్ ఇంగ్లండ్ ఓపెన్-1000 టోర్నీ, ఒర్లీయాన్స్ మాస్టర్స్ ఓపెన్-300 టోర్నీ, ఇండియా ఓపెన్-750 టోర్నీ, మలేసియా ఓపెన్-1000 టోర్నీల్లో టైటిల్స్ సాధించింది. సుదిర్మన్ కప్‌లో రన్నరప్‌గా నిలిచిన దక్షిణ కొరియా జట్టులో సభ్యురాలిగా ఉన్న ఆన్ సె యంగ్ ఈ టోర్నీలో తాను ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ గెలిచింది. ఓవరాల్‌గా ఈ ఏడాది ఆన్ సె యంగ్ 37 మ్యాచ్‌ల్లో గెలిచి, ఒక్క మ్యాచ్‌లో మాత్రమే ఓడిపోయింది.

నితీశ్ రెడ్డి అవుట్!

గాయంతో టెస్టు సిరీస్‌కు దూరం

- కోలుకోని ఆకాశ్‌దీప్, అర్ష్‌దీప్
- భారత జట్టులో అన్షుల్ కంబోజ్

మాంచెస్టర్: ఇంగ్లండ్‌తో నాలుగో టెస్టుకు ముందు భారత జట్టుకు గాయాల సమస్య ఎదురైంది. పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నితీశ్ కుమార్ రెడ్డి మోకాలి గాయంతో సిరీస్‌కు దూరమయ్యాడు. ఆదివారం జిమ్‌లో ట్రెయినింగ్ చేస్తుండగా అతను గాయపడ్డాడు. పరీక్షల అనంతరం అతని గాయం తీవ్రత తెలిసింది. సిరీస్‌లో రెండో, మూడో టెస్టు ఆడిన నితీశ్ ఆశించిన స్థాయిలో ప్రభావం చూపలేకపోయాడు. లార్డ్స్ టెస్టులో 3 వికెట్లు తీయడంతో పాటు మొత్తం 43 పరుగులు చేశాడు. తొలి టెస్టులో శార్దుల్ ఠాకూర్ బరిలోకి దిగగా, అతని వైఫల్యంతో అదే తరహా ఆల్‌రౌండర్ అయిన నితీశ్‌కు అవకాశం దక్కింది. ఇప్పుడు టీమ్ మేనేజ్‌మెంట్ ఇదే కూర్పుతో తుది జట్టును ఎంపిక చేస్తే మళ్లీ శార్దుల్ ఆడే అవకాశం ఉంది. మరోవైపు పేసర్లు ఆకాశ్‌దీప్, అర్ష్‌దీప్ సింగ్ కూడా గాయాలతో మ్యాచ్‌కు దూరమయ్యే అవకాశం ఉంది. ఆకాశ్‌దీప్ తొడ కండరాల గాయంతో బాధపడుతుండగా, అర్ష్‌దీప్ ఎడమ చేతికి గాయమైంది. రెండో టెస్టులో 10 వికెట్లతో భారత్ ఘన విజయంలో కీలక పాత్ర పోషించిన ఆకాశ్‌దీప్ లార్డ్స్ టెస్టులో విఫలమయ్యాడు. ఈ మ్యాచ్‌లో లయను అందుకోలేక ఇబ్బంది పడిన అతను నాలుగో రోజు మధ్యాహ్నమే చికిత్స కోసం మైదానం వీడాడు. బెకెన్‌హామ్‌లో జట్టు ప్రాక్టీస్‌లో పాల్గొన్నప్పుడు ఆకాశ్‌దీప్ అసలు బౌలింగ్‌కే దిగలేదు. మరోవైపు ఇంకా అరంగేట్రం చేయని అర్ష్‌దీప్ సింగ్ నాలుగో టెస్టుకు దూరం కానున్నాడు. ఆకాశ్‌దీప్ ఆడకపోతే అతని స్థానంలో అర్ష్‌దీప్ బరిలోకి దిగేవాడు. అయితే అతను కూడా అనూహ్యంగా గాయపడ్డాడు. ప్రాక్టీస్ సెషన్‌లో బౌలింగ్ చేస్తున్న సమయంలో సాయి సుదర్శన్ కొట్టిన షాట్‌ను ఫాలో త్రూలో ఆపే ప్రయత్నంలో అతని ఎడమ చేతికి గట్టి దెబ్బ తగిలింది. లెఫ్టార్మ్ పేసర్ అయిన అర్ష్‌దీప్ ఆపై చేతికి కట్టుతో వెనుదిరిగాడు. అతని చేతికి కుట్లు వేసినట్లు సమాచారం.



నితీశ్



అన్షుల్

ఇన్నింగ్స్‌లో 10 వికెట్లు...

ప్రధాన బౌలర్లు గాయాలబారిన పడటంతో ముందు జాగ్రత్తగా సెలక్టర్లు పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ అన్షుల్ కంబోజ్‌ను జట్టులోకి ఎంపిక చేశారు. ఈ సిరీస్‌కు ముందు అన్షుల్ భారత్ 'ఎ' జట్టు తరఫున రెండు అనధికారిక టెస్టులు ఆడాడు. నార్తాంప్టన్‌లో జరిగిన రెండో మ్యాచ్‌లో 4 వికెట్లు తీసిన అతను రెండో ఇన్నింగ్స్‌లో తొమ్మిదో స్థానంలో బ్యాటింగ్‌కు దిగి 51 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. హరియాణాకు చెందిన అన్షుల్ 24 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లలో 79 వికెట్లు తీసి 486 పరుగులు చేశాడు. గత రంజీ ట్రోఫీలో సీజన్‌లో కేరళతో జరిగిన మ్యాచ్‌లో ఒకే ఇన్నింగ్స్ పది వికెట్లు (10/49) పడగొట్టి సంచలనం సృష్టించిన అతను...రంజీల్లో ఈ ఘనత సాధించిన మూడో బౌలర్‌గా నిలిచాడు.



సెమీస్‌లో హంపి

'టైబ్రేక్'లో పోటీపడనున్న హారిక, దివ్య

బతూమి (జార్జియా): మహిళల ప్రపంచకప్ చెస్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్, ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి కోనేరు హంపి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. యుజిన్ సాంగ్ (చైనా)తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో హంపి 1.5-0.5తో గెలుపొందింది. శనివారం జరిగిన తొలి గేమ్‌లో నెగ్గిన హంపి... ఆదివారం జరిగిన రెండో గేమ్‌ను 53 ఎత్తుల్లో 'డ్రా' చేసుకొని సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. సెమీఫైనల్లో చైనాకే చెందిన టింగ్‌జి లెతో హంపి తలపడుతుంది. మరో క్వార్టర్ ఫైనల్లో టింగ్‌జి లె 2-0తో నానా జాగ్నిడ్జె (జార్జియా)పై గెలిచింది. భారత్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ వైశాలి పోరాటం క్వార్టర్ ఫైనల్లో ముగిసింది. జోంగి టాన్ (చైనా)తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో వైశాలి 0.5-1.5తో ఓడిపోయింది. శనివారం జరిగిన తొలి గేమ్‌ను 'డ్రా' చేసుకున్న వైశాలి... ఆదివారం జరిగిన రెండో గేమ్‌లో 88 ఎత్తుల్లో ఓటమి పాలైంది. భారత్‌కే చెందిన ద్రోణవల్లి హారిక, దివ్య దేశ్‌ముఖ్ నిర్ణీత రెండు గేమ్‌ల తర్వాత 1-1తో సమంగా నిలిచారు. దాంతో వీరిద్దరి మధ్య విజేత ఎవరో నేడు జరిగే టైబ్రేక్ గేమ్‌ల ద్వారా తేలుతుంది. వీరిద్దరి మధ్య ఆదివారం జరిగిన రెండో గేమ్ 60 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిసింది.



'యునైటెడ్ ఇన్ మాంచెస్టర్'

ఫుట్‌బాలర్లతో భారత క్రికెటర్ల సరదా ఆట





మాంచెస్టర్: భారత క్రికెట్ జట్టు ఒకవైపు నాలుగో టెస్టుకు సన్నద్ధమవుతూనే మరోవైపు విరామ సమయాన్ని సరదాగా గడుపుతోంది. తాజాగా విఖ్యాత ఫుట్‌బాల్ క్లబ్ 'మాంచెస్టర్ యునైటెడ్' ప్రాక్టీస్ గ్రౌండ్‌ను టీమిండియా ఆటగాళ్లు సందర్శించారు. ఇరు జట్లకు ప్రధాన స్పాన్సర్‌గా ఉన్న స్పోర్ట్స్‌వేర్ 'అడిడాస్' ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. క్రికెట్, ఫుట్‌బాల్ టీమ్‌ల సభ్యులు పరస్పర గౌరవాన్ని ప్రదర్శిస్తూ జెర్సీలు మార్చుకున్నారు. భారత ఆటగాళ్లతో పాటు మాంచెస్టర్ ఆటగాళ్లంతా రెండు జట్లుగా విడిపోయి ముందుగా ఫుట్‌బాల్ ఆడారు. ఆపై మాంచెస్టర్ ప్లేయర్లు క్రికెట్‌లో తమ ఆసక్తి ప్రదర్శిస్తూ బ్యాటింగ్ చేశారు. స్టార్ డిఫెండర్ హ్యారీ మేగ్వైర్‌కు సిరాజ్ బౌలింగ్ చేయగా... 'రెడ్ డెవిల్స్' టీమ్ సభ్యులు డియాలో, మేసన్ మౌంట్ తదితరులతో ఫుట్‌బాల్ ఆడేందుకు పంత్, బుమ్రా ప్రత్యేక ఆసక్తి కనబర్చారు. మాంచెస్టర్ యునైటెడ్, పోర్చుగల్ జట్లకు కెప్టెన్ అయిన బ్రూనో ఫెర్నాండెజ్‌తో భారత కెప్టెన్ శుబ్‌మన్ గిల్ కబుర్లాడాడు. మరోవైపు భారత్, మాంచెస్టర్ యునైటెడ్ హెడ్ కోచ్‌లు గంభీర్, రూబెన్ అమోరిమ్ మధ్య కూడా సుదీర్ఘ సంభాషణ చోటు చేసుకుంది. శిక్షణ, నాయకత్వం, స్టార్ ఆటగాళ్లతో జట్లను నడిపించడంవంటి అంశాలపై చివర్లో ఇరు జట్ల కోచ్‌లు తమ అభిప్రాయాలు వెల్లడించడంతో కార్యక్రమం ముగిసింది. బుధవారం నుంచి ఓల్డ్ ట్రఫోర్డ్ మైదానంలో భారత్, ఇంగ్లండ్ మధ్య నాలుగో టెస్టు మ్యాచ్ జరుగుతుంది.



ఇంగ్లండ్‌లోనే తర్వాతి మూడు డబ్ల్యూటీసీ ఫైనల్స్

సింగపూర్: వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్స్ మ్యాచ్‌ను వరుసగా ఇంగ్లండ్ గడ్డపైనే నిర్వహించడంపై అన్ని వైపుల నుంచి విమర్శలు వస్తున్నా... అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మాత్రం మరోసారి దానికే ఓటు వేసింది. వచ్చే మూడు డబ్ల్యూటీసీ ఫైనల్స్ కూడా ఇంగ్లండ్‌లోనే జరుగుతాయని ఐసీసీ ప్రకటించింది. 2027, 2029, 2031లకు సంబంధించి ఇంగ్లండ్ క్రికెట్ బోర్డుకే ఆతిథ్య హక్కులు కట్టబెడుతున్నట్లు స్పష్టం చేసింది. ఇప్పటి వరకు జరిగిన మూడు ఫైనల్స్ (2021-సౌతాంప్టన్, 2023-ఓవల్, 2025-లార్డ్స్) సమర్థ నిర్వహణే అందుకు కారణమని వెల్లడించింది. డబ్ల్యూటీసీ ఫైనల్ జరిగే జూన్ నెలలో ఇతర క్రికెట్ దేశాలతో పోలిస్తే ఒక్క ఇంగ్లండ్‌లోనే ఆటకు అంతరాయం కలిగించని, సరైన వాతావరణం ఉండటం ప్రధాన కారణం. పైగా తుది పోరులో ఎవరు తలపడినా... టెస్టు క్రికెట్ అభిమానులైన అక్కడి ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో హాజరై మ్యాచ్‌లకు ఆదరించడం కూడా ఐసీసీ నిర్ణయానికి కారణమైంది. ఐసీసీ సమావేశంలో రెండు కొత్త జట్లకు అసోసియేట్ సభ్యులుగా అవకాశం కల్పించారు. తిమోర్ లెస్టె, జాంబియా క్రికెట్ జట్లు ఇప్పుడు ఐసీసీలో భాగమయ్యాయి. దాంతో ఐసీసీ మొత్తం సభ్య దేశాల సంఖ్య 110కి చేరింది.

సుమిత్‌కు రజతం



బుడాపెస్ట్ (హంగేరి): పోలియాక్ ఇమ్రె-వర్గా యానోస్ స్మారక అంతర్జాతీయ ర్యాంకింగ్ రెజ్లింగ్ టోర్నమెంట్‌లో చివరి రోజు భారత్‌కు రెండు పతకాలు లభించాయి. పురుషుల గ్రీకో రోమన్ విభాగంలో సుమిత్ (60 కేజీలు) రజత పతకం సొంతం చేసుకోగా... అనిల్ మోర్ (55 కేజీలు) కాంస్య పతకాన్ని సాధించాడు. ఫైనల్లో సుమిత్ 0-5తో నిహత్ (అజర్‌బైజాన్) చేతిలో ఓడిపోయాడు. కాంస్య పతక బౌట్‌లో అనిల్ 7-4తో ఇఖ్తియార్ బొతిరోవ్ (ఉజ్బెకిస్తాన్)పై గెలిచాడు. ఓవరాల్‌గా ఈ టోర్నీలో భారత రెజ్లర్లు పది పతకాలు నెగ్గడం విశేషం. పురుషుల ఫ్రీస్టయిల్ విభాగంలో సుజీత్ కల్కాల్ (65 కేజీలు) స్వర్ణం, రాహుల్ (57 కేజీలు) కాంస్యం సాధించారు. మహిళల ఫ్రీస్టయిల్ విభాగంలో పారిస్ ఒలింపియన్ అంతిమ్ పంఘాల్ (53 కేజీలు), హర్షిత (72 కేజీలు) బంగారు పతకాలు నెగ్గగా... నేహా (57 కేజీలు), ప్రియ (76 కేజీలు) రజత పతకాలు, నీలం (50 కేజీలు), మనీషా (62 కేజీలు) కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

యూపీఎస్సీలో 24 పోస్టులు

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ).. శాశ్వత ప్రాతిపదికన కేంద్ర ప్రభుత్వ శాఖలలో వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 24.
- పోస్టుల వివరాలు: బోటనిస్ట్(పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ)-01, అసిస్టెంట్ డ్రగ్స్ కంట్రోలర్(ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ) (మెడికల్ డివైజెస్)-22, జూనియర్ సైంటిఫిక్ ఆఫీసర్-01(సెంట్రల్ డ్రగ్స్ టెస్టింగ్ ల్యాబొరేటరీ, హైదరాబాద్).

అర్హత

- బోటనిస్ట్: ఎంఎస్సీ(బోటనీ/హార్టికల్చర్/లైఫ్ సైన్సెస్/అగ్రికల్చర్)తో పాటు సంబంధిత విభాగాల్లో కనీసం మూడేళ్ల పరిశోధన అనుభవం అవసరం.
- అసిస్టెంట్ డ్రగ్స్ కంట్రోలర్: సంబంధిత ఇంజనీరింగ్/ఫార్మసీ/లైఫ్‌సైన్సెస్/మెడిసిన్ రంగాల్లో బ్యాచిలర్ లేదా మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
- జూనియర్ సైంటిఫిక్ ఆఫీసర్: ఎంఎస్సీ (కెమిస్ట్రీ/బయోకెమిస్ట్రీ/ఫార్మసీ/మెడిసిన్/మైక్రోబయాలజీ/బయోటెక్నాలజీ)తో పాటు పని అనుభవం అవసరం.
- వయసు: బోటనిస్ట్ అండ్ జూనియర్ సైంటిఫిక్ ఆఫీసర్‌కు 30 ఏళ్లు, అసిస్టెంట్ డ్రగ్స్ కంట్రోలర్‌కు 40 ఏళ్లు మించకూడదు.
- ఎంపిక విధానం: అర్హత, ఉద్యోగానుభవం, షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 31.07.2025
- వెబ్‌సైట్: https://upsconline.gov.in

ఓయూలో దూరవిద్య.. యూజీ, పీజీ, డిప్లొమా, సర్టిఫికేట్ కోర్సుల్లో ప్రవేశాలు

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ జి.రామ్‌రెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి దూరవిద్య విధానంలో(ఫేజ్-1) అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, డిప్లొమా, సర్టిఫికేట్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- అర్హత: కోర్సును అనుసరించి పదో తరగతి, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- ఫేజ్-1 అడ్మిషన్లకు ప్రారంభతేది: 07.07.2025
- ఫేజ్-1 అడ్మిషన్లకు చివరితేది: 15.09.2025.
- వెబ్‌సైట్: https://www.osmania.ac.in

సిడ్బీ, లక్నోలో 76 అసిస్టెంట్ మేనేజర్ పోస్టులు

లక్నోలోని స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్ఐడీబీఐ).. దేశవ్యాప్తంగా సిడ్బీ కార్యాలయాల్లో గ్రేడ్-ఎ, గ్రేడ్-బీ కేటగిరిలో అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 76.
- పోస్టుల వివరాలు: అసిస్టెంట్ మేనేజర్ గ్రేడ్-ఎ(జనరల్)-50, అసిస్టెంట్ మేనేజర్ గ్రేడ్-బి (జనరల్)-11, అసిస్టెంట్ మేనేజర్ గ్రేడ్-బి(లీగల్)-08,అసిస్టెంట్ మేనేజర్ గ్రేడ్-బి(ఐటీ)-07.
- అర్హత: కనీసం 60 శాతం మార్కులతో పోస్టును అనుసరించి ఏదైనా డిగ్రీ, పీజీ, సీఏ/సీఎస్/సీఎఫ్ఏ/సీఎంఏ లేదా ఎంబీఏ/పీజీడీఎం ఉత్తీర్ణతతో పాటు సంబంధిత పని అనుభవం ఉండాలి.
- వయసు: 14.07.2025 నాటికి గ్రేడ్-ఏ కేటగిరికి 21 నుంచి 30 ఏళ్లు, గ్రేడ్-బీ కేటగిరికి 25 నుంచి 33 ఏళ్ల మధ్య ఉండాలి.
- పే స్కేల్: నెలకు గ్రేడ్-ఏ కేటగిరికి సుమారుగా రూ.44,500 నుంచి రూ.1,00,000, గ్రేడ్-బీ కేటగిరికి సుమారుగా రూ.55,200 నుంచి రూ.1,15,000 లభిస్తుంది.
- ఎంపిక విధానం: ఫేజ్-1(ఆన్‌లైన్ ఆబ్జెక్టివ్ స్క్రీనింగ్ పరీక్ష), ఫేజ్-2(ఆన్‌లైన్ డిస్క్రిప్టివ్ అండ్ సబ్జెక్ట్ టెస్ట్), ఫేజ్-3(ఇంటర్వ్యూ), ఆన్‌లైన్ సైకోమెట్రిక్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్/ఫీజు చెల్లింపు చివరితేది: 11.08.2025.
- ఆన్‌లైన్ పరీక్ష తేది(ఫేజ్-1): 06.09.2025.
- ఆన్‌లైన్ పరీక్ష తేది(ఫేజ్-2): 04.10.2025.
- ఇంటర్వ్యూ షెడ్యూల్: నవంబర్ 2025.
- వెబ్‌సైట్: https://www.sidbi.in

ఎయిమ్స్‌ల్లో కొలువుల పిలుపు

- 3,501 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
- సీబీటీ, స్కిల్ టెస్ట్ ఆధారంగా ఎంపిక

న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్).. కామన్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ 2025కు నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిద్వారా దేశవ్యాప్తంగా ఉన్న ఎయిమ్స్‌లు, ఇతర కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో రెగ్యులర్ నాన్ ఫ్యాకల్టీ గ్రూప్ బీ, గ్రూప్ సీ పోస్టులను భర్తీ చేయనుంది. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ), స్కిల్ టెస్టుల్లో ప్రతిభ ఆధారంగా ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది. ఈ నేపథ్యంలో... ఎయిమ్స్ సీఆర్ఈ 2025తో భర్తీ చేసే పోస్టులు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం తదితర వివరాలు..

- మొత్తం పోస్టుల సంఖ్య: 3501
- పోస్టుల వివరాలు: అసిస్టెంట్ డైటీషియన్/డైటీషియన్, అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్/జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్/ఆఫీస్ అసిస్టెంట్, జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్(ఎల్‌డీసీ)/ఎల్‌డీసీ/అప్పర్ డివిజన్ క్లర్క్/సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్, అసిస్టెంట్ ఇంజనీర్(సివిల్)/జూనియర్ ఇంజనీర్(సివిల్), అసిస్టెంట్ ఇంజనీర్(ఎలక్ట్రికల్)/జూనియర్ ఇంజనీర్(ఎలక్ట్రికల్), అసిస్టెంట్ ఇంజనీర్(ఏసీ అండ్ ఆర్)/జూనియర్ ఇంజనీర్(ఏసీ అండ్ ఆర్), ఆడియాలజిస్ట్ /ఆడియాలజిస్ట్ కమ్ స్పీచ్ థెరపిస్ట్/ఆడియాలజిస్ట్ టెక్నీషియన్/ఆడియోమీటర్ టెక్నీషియన్/టెక్నికల్ అసిస్టెంట్(ఈఎన్‌టీ), ఫార్మసిస్ట్, స్టాఫ్ నర్స్, ల్యాబ్ టెక్నీషియన్, డెంటల్ టెక్నీషియన్, డేటా ఎంట్రీ ఆపరేటర్, క్యాషియర్, రేడియోగ్రాఫర్, ఈసీజీ టెక్నీషియన్, మెకానిక్ తదితరాలు.

ఎంపిక ప్రక్రియలో పాల్గొనే ఇన్‌స్టిట్యూట్స్

ఎయిమ్స్ భటిండా,ఎయిమ్స్ భోపాల్,ఎయిమ్స్ బిలాస్‌పూర్, ఎయిమ్స్ దియోగర్, ఎయిర్స్ గోరఖ్‌పూర్, ఎయిమ్స్ జమ్ము,ఎయిమ్స్ జోధ్‌పూర్, ఎయిమ్స్ మంగళగిరి, ఎయిమ్స్ నాగ్‌పూర్, ఎయిమ్స్ పాట్నా, ఎయిమ్స్ రాయ్‌బరేలీ, ఎయిమ్స్ రాయ్‌పూర్, ఎయిమ్స్ రాజ్‌కోట్, ఎయిమ్స్ రిషికేశ్, ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ), జిప్‌మర్-పుదుచ్చేరి, రిమ్స్-ఇంఫాల్, రీజనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పారామెడికల్ అండ్ నర్సింగ్ సైన్సెస్-ఐజ్వాల్, లేడీ హార్డింగ్ మెడికల్ కాలేజీ, దీనికి అనుబంధంగా ఉండే సుచేతా కృపలానీ హాస్పిటల్, కాలవతి శరణ్ చిల్డ్రన్స్ హాస్పిటల్.

అర్హతలు

పోస్టును అనుసరించి పదోతరగతి,ఇంటర్మీడియెట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీఎస్సీ, ఎమ్మెస్సీ, ఎంసీఏ, బీటెక్/ఎంటెక్, డీఎంఎల్‌టీ, బీఎంఎల్‌టీ, బీఫార్మసీ ఉత్తీర్ణులై ఉండాలి. కొన్ని పోస్టులకు సంబంధిత విభాగంలో ఉద్యోగ అనుభవం తప్పనిసరి.

వయసు

పోస్టును అనుసరించి 18 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్ల గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

ఎంపిక ప్రక్రియ

కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, స్కిల్ టెస్ట్, టైపింగ్ టెస్ట్ తదితరాల ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

రాత పరీక్ష ఇలా

- మొత్తం 400 మార్కులకు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో పరీక్ష జరుగుతుంది. ఇందులో 100 ఆబ్జెక్టివ్ తరహాలో మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఉంటాయి. వీటిల్లో 80 ప్రశ్నలు డొమైన్ నుంచి ఉంటే.. మరో 20 ప్రశ్నలు జనరల్ నాలెడ్జ్, అప్టిట్యూడ్, కంప్యూటర్ నాలెడ్జ్ నుంచి అడుగుతారు. ప్రతి సరైన సమాధానానికి నాలుగు మార్కులు లభిస్తాయి. నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 1/4 మార్కును తగ్గిస్తారు. పరీక్ష సమయం 90 నిమిషాలు. ప్రశ్న పత్రం ఇంగ్లిష్/హిందీల్లో ఉంటుంది.
- ఈ ఆన్‌లైన్ పరీక్షలో అర్హత సాధించేందుకు అన్‌రిజర్వ్‌డ్/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు కనీసం 40 శాతం, ఓబీసీలకు కనీసం 35 శాతం, ఎస్సీ/ఎస్టీలకు కనీసం 30 శాతం మార్కులు రావాలి.
- సీబీటీతోపాటు స్కిల్ టెస్ట్‌లోనూ అర్హత సాధించిన వారితో మెరిట్ జాబితా రూపొందించి ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.



ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- దరఖాస్తులకు చివరి తేది: 31.07.2025
- ఆన్‌లైన్ పరీక్ష(సీబీటీ) తేదీ: 25.08.2025, 26.08.2025
- స్కిల్ టెస్టు తేదీ: తర్వాత ప్రకటిస్తారు.
- వెబ్‌సైట్: www.aiimsexams.ac.in

కాలేజీ విద్యార్థులకు కేంద్ర స్కాలర్‌షిప్స్

- పీఎం-యూఎస్‌పీ సీఎస్ఎస్ఎస్ నోటిఫికేషన్ విడుదల

- దరఖాస్తులకు చివరి తేది: 31.10.2025

భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ.. ప్రధాన మంత్రి ఉచ్చతర్ శిక్షా ప్రోత్సాహన్ యోజన(పీఎం-యూఎస్‌పీ) కింద సెంట్రల్ సెక్టార్ స్కీమ్ ఆఫ్ స్కాలర్‌షిప్ ఫర్ కాలేజీ అండ్ యూనివర్సిటీ స్టూడెంట్స్(పీఎం-యూఎస్‌పీ సీఎస్ఎస్ఎస్)కు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ స్కాలర్‌షిప్‌లను కేంద్ర విద్యాశాఖ అందిస్తుంది. పేద కుటుంబాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులకు చేయూత ఇచ్చేందుకు ఈ స్కాలర్‌షిప్ స్కీమ్‌ను ప్రవేశపెట్టారు.

- స్కాలర్‌షిప్ స్కీమ్: సెంట్రల్ సెక్టార్ స్కీమ్ ఆఫ్ స్కాలర్‌షిప్ ఫర్ కాలేజీ అండ్ యూనివర్సిటీ స్టూడెంట్స్(పీఎం-యూఎస్‌పీ సీఎస్ఎస్ఎస్).
- మొత్తం స్కాలర్‌షిప్‌ల సంఖ్య: దేశవ్యాప్తంగా సంవత్సరానికి 82,000 మందిని ఈ స్కాలర్‌షిప్ స్కీమ్ కింద ఎంపిక చేస్తారు.
- ఎవరికి ఇస్తారు: గ్రాడ్యుయేట్/పోస్ట్‌గ్రాడ్యుయేట్, మెడికల్, ఇంజనీరింగ్ తదితర ప్రొఫెషనల్ కోర్సుల విద్యార్థులకు అందిస్తారు. మొత్త స్కాలర్‌షిప్పుల్లో 50శాతం మహిళలకు కేటాయిస్తారు. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా స్కాలర్‌షిప్ డబ్బులు విద్యార్థి ఖాతాలో జమ అవుతాయి.

స్కాలర్‌షిప్ మొత్తం ఎంత

- అండర్‌గ్రాడ్యుయేట్ స్కాలర్‌షిప్: సంవత్సరానికి రూ.12వేలు.
- పోస్ట్ గ్రాడ్యుయేట్ స్కాలర్‌షిప్: సంవత్సరానికి రూ.20వేలు
- ప్రొఫెషనల్ కోర్సులు/ఇంటిగ్రేటెడ్ కోర్సులకు: 4,5వ సంవత్సరాల్లో సంవత్సరానికి రూ.20 వేలు.

అర్హతలు

- ప్రభుత్వ గుర్తింపు పొందిన బోర్డు పరీక్షల్లో 10 +2 లేదా ఇంటర్మీడియెట్‌లో 80 పర్సంటైల్ కంటే అధికంగా స్కోర్ చేయాలి.
- విద్యార్థులు రెగ్యులర్ డిగ్రీ కోర్సులు చదువుతుండాలి(దూర విద్య విధానం కాదు).
- ఏఐసీటీఈ తదితర నియంత్రణ సంస్థల గుర్తింపు పొందిన కాలేజీ/ఇన్‌స్టిట్యూట్‌లోని కోర్సులో చేరి ఉండాలి.
- ఎలాంటి స్కాలర్‌షిప్ లేదా ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కీమ్ పొంది ఉండకూడదు.
- విద్యార్థి కుటుంబ ఆదాయం రూ.4.5 లక్షల కంటే ఎక్కువగా ఉండరాదు.
- నూతన దరఖాస్తు దారు ఆదాయ ధ్రువీకరణ పత్రం సమర్పించడం తప్పనిసరి.
- ప్రతి ఏటా స్కాలర్‌షిప్ రెన్యువల్ కోసం కనీసం 50 శాతం మార్కులు, 75 శాతం హాజరు పొందడం తప్పనిసరి.

వయసు

18 నుంచి 25 సంవత్సరాల వయసుగల విద్యార్థులకు ఈ స్కాలర్‌షిప్ స్కీమ్ వర్తిస్తుంది.

అవసరమైన ధ్రువ పత్రాలు

ఇంటర్మీడియెట్ మార్కుల మెమో, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా వివరాలు(డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్(డీబీటీ) కోసం), కాలేజీ /ఇన్‌స్టిట్యూట్‌లో అడ్మిషన్ పొందిన పత్రం ఉండాలి.



ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: అర్హత గల విద్యార్థులు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్(ఎన్ఎస్‌పీ) ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఎన్ఎస్‌పీలో నమోదు చేసుకొని, అవసరమైన పత్రాలను అప్‌లోడ్ చేసి దరఖాస్తును సమర్పించాలి. దరఖాస్తులను కాలేజ్, రాష్ట్ర నోడల్ ఏజెన్సీ ద్వారా ధ్రువీకరిస్తారు.
- దరఖాస్తులకు చివరి తేది: 31.10.2025
- వెబ్‌సైట్: https://scholarships.gov.in

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం-బయాలజీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-జనరల్ స్టడీస్-ఎకానమీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం-రీజనింగ్

స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
502	143
81,758	24,968

విదేశీ సూచీలు


సూచీ			
నాస్‌డాక్	20,896	△	10
డోజోన్స్	44,350	▽	134
ఎఫ్‌టీఎస్ఈ 100	8,992	△	19
డాక్స్	24,290	▽	81
షాంఘై	3,534	△	18
నికాయ్	39,819	▽	82

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	85.60	86.62
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	113.70	116.64
€	యూరో	ఎస్‌బీఐ	98.55	101.29
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	57.15	58.61
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.67	56.89
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	64.61	68.25
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.08	23.56
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.55	23.79
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.11	12.93

అన్‌లిస్టెడ్ షేర్లు.. చేతులు కాలతాయ్!



పేరున్న కంపెనీ ఐపీవోకు (ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్) వస్తోందంటే ఇన్వెస్టర్లలో ఉత్సాహం పెరిగిపోతుంది. అదృష్టాన్ని పరీక్షించుకుందామని పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేస్తుంటారు. ఐపీవోలో షేర్లు దక్కని వారు లిస్టింగ్ తర్వాత కొనుగోళ్లకు ఆసక్తి చూపిస్తుంటారు. ఇవన్నీ కలసి స్టాక్ వ్యాల్యుయేషన్లను అమాంతం పెంచేస్తుంటాయి. లిస్టింగ్‌లోనే లాభాలు కురుస్తుండడంతో ఐపీవోలకు ఇన్వెస్టర్ల నుంచి డిమాండ్ ఎగబాగుతోంది. కొందరు ఇన్వెస్టర్లు రిస్క్ తీసుకుని మరీ.. ఐపీవోకు రావడానికి ముందుగానే ఆయా కంపెనీల షేర్లను అన్‌లిస్టెడ్ మార్కెట్లో కొనుగోలు చేస్తున్న ధోరణి ఇటీవల విస్తరిస్తోంది. కానీ, అందరికీ ఇది అనుకూలం కాదు. రెగ్యులర్ మార్కెట్లకు మించి అన్‌లిస్టెడ్ మార్కెట్లో రెట్టింపు రిస్క్ ఎదురుకావొచ్చు. పూర్తిగా అర్థం చేసుకున్న తర్వాతే పెట్టుబడుల నిర్ణయం తీసుకోవాలన్నది నిపుణుల సూచన. – సాక్షి, బిజినెస్ డెస్క్

- అన్నీ అనుకూలిస్తేనే లాభాలు
- తేడా వస్తే తేరుకోలేనంత నష్టం
- లాభం కోసం రిస్క్ మరవొద్దు
- లిస్టింగ్ అయిన వెంటనే విక్రయించుకోలేరు
- ఆరు నెలల పాటు వేచిచూడాల్సిందే
- లావాదేవీలకు దూరంగా ఉండాలంటున్న సెబీ
- నిపుణులదీ హెచ్చరిక స్వరమే..

వన్97 కమ్యూనికేషన్స్ నుంచి స్విగ్గీ వరకు.. అంతెందుకు తాజాగా లిస్టయిన హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ సైతం అన్‌లిస్టెడ్ మార్కెట్లో మంచి డిమాండ్ పలికినవే. ముందుగా ఇన్వెస్ట్ చేసినట్టయితే లిస్టింగ్ సమయానికి మంచి లాభాలు కళ్లజూడొచ్చన్న ఉద్దేశంతో కొందరు అన్‌లిస్టెడ్ మార్కెట్లో పెట్టుబడులకు ఉత్సాహం చూపిస్తున్నారు. కానీ, అన్ని సందర్భాల్లోనూ లిస్టింగ్ సమయానికి కంపెనీల విలువలు పెరుగుతాయని కచ్చితంగా చెప్పలేం. పడిపోవడం కూడా జరగొచ్చు. ఇందుకు నిదర్శనం హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్.

చేదు అనుభవాలు..!

అన్‌లిస్టెడ్ మార్కెట్లో కోట్ అయ్యే షేర్ల ధరలు కంపెనీ వాస్తవ విలువలను ప్రతిబింబించవు. ఎందుకంటే అక్కడ షేర్ల సరఫరా పరిమితంగా ఉంటుంది. కొద్ది డిమాండ్‌కే ధరలు అమాంతం ఎగబాకొచ్చు. ఇందుకు ఎన్నో నిదర్శనాలు ఉన్నాయి. స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల్లో లిస్టెడ్ కంపెనీల విలువలు వాటి ఆర్థిక మూలాలను ప్రతిఫలిస్తుంటాయి. బుల్‌ర్యాలీలో అతిగా పెరిగినప్పటికీ తర్వాత దిద్దుబాటుతో దిగొస్తుంటాయి. రోజువారీ ట్రేడింగ్ వ్యాల్యూమ్ చెప్పుకోతగ్గ స్థాయిలో ఉంటుంది. అన్‌లిస్టెడ్ మార్కెట్ అలా కాదు. కేవలం కొద్దిపాటి సరఫరా ధరలను నిర్ణయిస్తుంటుంది. ఆ సరఫరా కూడా కొద్ది మంది బ్రోకర్ల పరిధిలోనే ఉంటే వారికి నచ్చిన విధంగా మానిప్యులేషన్ చేసే అవకాశం లేకపోలేదు. అధిక ధరల్లో కొనుగోలు చేస్తే, రాబడుల సంగతేమో కానీ, పెట్టుబడిని రాబట్టుకోవడానికే ఏళ్ల తరబడి వేచి చూడాల్సి రావచ్చు. వన్97 కమ్యూనికేషన్స్, హెచ్‌డీబీ ఫైనాన్షియల్, రిలయన్స్ రిటైల్ షేర్లు అన్‌లిస్టెడ్ మార్కెట్ ఇన్వెస్టర్లకు మిగిల్చిన చేదు అనుభవాల గురించి తప్పక తెలుసుకోవాలి.

ఎన్‌బీఎఫ్‌సీ సంస్థ హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఐపీవో ఇటీవలే ముగిసింది. ఒక్కో షేరును రూ.740కే కేటాయించింది. కానీ, ఐపీవో ముందు వరకు అన్‌లిస్టెడ్ మార్కెట్లో ఒక్కో షేరు రూ.1400 ధర పలికింది. లిస్టింగ్‌కు ఏడాది ముందు కాలంలో రూ.700–1,400 మధ్య కదలాడింది. రూ.1,400 ధరపై కొనుగోలు చేసిన వారు తాజా ఐపీవో ధర ప్రకారం 40% నష్టపోయినట్టు తెలుస్తోంది. కంపెనీ మంచి పనితీరు చూపిస్తే కొంత కాలానికి షేరు ధర కోలుకుంటుందని ఆశించొచ్చు. అన్‌లిస్టెడ్ ధర కంటే తక్కువకే ఇప్పుడు ఎక్స్ఛేంజ్‌ల్లో లభిస్తుండడాన్ని ఇన్వెస్టర్లు ఒక గుణపాఠంగా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. టాటా టెక్నాలజీస్ ఐపీవో విషయంలోనూ ఇలాంటి పరిణామమే జరిగింది. 2023 నవంబర్‌లో టాటా టెక్నాలజీస్ ఐపీవోకు వచ్చింది. ఒక్కో షేరు ధరను రూ.475–500గా ఖరారు చేసింది. కానీ, అప్పటికి అన్‌లిస్టెడ్ మార్కెట్లో ఒక్కో షేరు ధర రూ.1,010–1,100 స్థాయిలో ట్రేడయ్యింది.

పేటీఎం మాతృసంస్థ వన్97 కమ్యూనికేషన్స్ విషయంలో ఇన్వెస్టర్లకు చేదు అనుభవమే ఎదురైంది. 2021లో వన్97 కమ్యూనికేషన్స్ ఐపీవోకి రాగా.. ఒక్కో షేరును రూ.2,150కు కేటాయించింది. లిస్టింగ్ రోజే కాదు, ఆ తర్వాత ఇప్పటి వరకు ఆ ధరకే చేరుకోలేదు. ఐపీవోకి ముందు అన్‌లిస్టెడ్ మార్కెట్లో రూ.2,800 వరకు ట్రేడయ్యింది. ఇక అన్‌లిస్టెడ్ మార్కెట్లో అధిక ధర పెట్టి రిలయన్స్ రిటైల్ షేర్లను కొనుగోలు చేసిన వారికి రిలయన్స్ ఇండస్ట్రీస్ పెద్ద షాకిచ్చింది. 2023లో మైనారిటీ షేర్‌హోల్డర్ల వద్దనున్న వాటాలను ఒక్కోటీ రూ.1,362 చొప్పున కొనుగోలు చేయనున్నట్టు ప్రకటించింది. అన్‌లిస్టెడ్ మార్కెట్లో అప్పటికి ఒక్కో షేరు రూ.2,700 ధర వద్ద ట్రేడవుతోంది. దీన్ని బట్టి అన్‌లిస్టెడ్ మార్కెట్లో ధరలు సహేతుక స్థాయిలో ఉండవన్న విషయం సుస్పష్టం. అన్‌లిస్టెడ్ మార్కెట్లో ధరల ఆధారంగా కంపెనీలు ఐపీవో ధరను నిర్ణయించవని అర్థం చేసుకోవాలి. అప్పటి మార్కెట్ పరిస్థితులు, ఇన్వెస్టర్లలో ఆసక్తికి అనుగుణంగా ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్‌లు, లీడ్ మేనేజర్లు షేర్ల ధరల శ్రేణిని నిర్ణయిస్తుంటాయి. కనుక ఐపీవోకి ముందే కొనుగోలు చేయడం ద్వారా లాభం పొందుతామన్న గ్యారంటీ ఉండదని ఈ నిదర్శనాలను చూసి అర్థం చేసుకోవాలి.

అన్‌లిస్టెడ్‌లో హాట్ స్టాక్స్..

కంపెనీ	షేరు ప్రస్తుత ధర (రూ.లలో)
ఎన్ఎస్ఈ	2,125
ఎన్ఎస్‌డీఎల్	1,025
ఎన్‌సీడీఈఎక్స్	282
ఓయో	42
చెన్నై సూపర్ కింగ్స్	182
టాటా క్యాపిటల్	875
హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్	10,750
ఇన్‌క్రెడ్ హోల్డింగ్స్	172

అన్‌లిస్టెడ్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టేముందు చిక్కుల గురించి తప్పకుండా తెలుసుకోవాలి. 'అన్‌లిస్టెడ్ మార్కెట్లో షేర్ల ధరలు పారదర్శకంగా ఉండవు. సెంటిమెంట్, కంపెనీకి సంబంధించి ప్రచారం, అంతర్గత సమాచారం ఆధారంగా మానిప్యులేషన్ (కృత్రిమంగా ధరలను ప్రభావితం చేయడం)కు అవకాశం ఉంటుంది. లిక్విడిటీ మరో పెద్ద సమస్య. అవసరమైనప్పుడు సులభంగా కొనుగోలు, విక్రయం సాధ్యపడదు. లావాదేవీలను ఎక్స్ఛేంజ్ ద్వారా కాకుండా మధ్యవర్తుల సాయంతో చేయాల్సి ఉంటుంది. ఇందులో పారదర్శకత ఉండదు. పెట్టుబడి మొత్తాన్ని ముందుగానే చెల్లించినప్పటికీ షేర్లను డెలివరీ చేయకపోవచ్చు. ఇంతటితో రిస్క్‌లు ముగియలేదు. కంపెనీల విలువలను మదింపు వేయడం కూడా కష్టమే. అన్‌లిస్టెడ్ కంపెనీలు లిస్టెడ్ కంపెనీల మాదిరి కీలక సమాచారాన్ని ఎప్పటికప్పుడు వెల్లడించవు. కనుక ఆయా కంపెనీల వ్యాపారం, నిర్ణయాలకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడం కష్టం. పైగా సంబంధిత కంపెనీ ఎప్పటికీ లిస్టింగ్‌కు రాకపోతే అందులో పెట్టుబడి నిలిచిపోవచ్చు. నిధుల సమీకరణ కోసం మరిన్ని షేర్లను జారీ చేస్తూ వెళుతుంటే అప్పటికే ఉన్న షేర్ల ధరల్లో సర్దుబాటు ఉంటుంది' అని ఆనంద్‌రాఠీ షేర్స్ అండ్ స్టాక్ బ్రోకర్స్ ఫండమెంటల్ రీసెర్చ్ హెడ్ నరేంద్ర సోలంకి వివరించారు. పైగా వీటిపై సెబీ పర్యవేక్షణ ఉండదన్న విషయాన్ని గుర్తు చేశారు.

రిస్క్‌లను పరిశీలించాలి..



జెరోదా వ్యవస్థాపకుడు నితిన్ కామత్ సైతం ఎక్స్ వేదికగా ఇటీవలే దీనిపై ఇన్వెస్టర్లను హెచ్చరిస్తూ ఒక పోస్ట్ కూడా పెట్టారు. చాలా మంది రిటైల్ ఇన్వెస్టర్లు లిస్టింగ్‌తో లాభాలు పొందొచ్చన్న ధోరణితో కొనుగోలు చేస్తున్నట్టు చెప్పారు. హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఐపీవోను ప్రస్తావించారు. పారదర్శకత లేమి, తక్కువ లిక్విడిటీ (షేర్ల లభ్యత), నియంత్రణల మధ్య పనిచేయకపోవడం వల్ల రెగ్యులర్ స్టాక్ మార్కెట్‌తో పోల్చితే అన్‌లిస్టెడ్ మార్కెట్‌లో రిస్క్ ఎంతో ఎక్కువని హెచ్చరించారు. సోషల్ మీడియా ప్రచారం పట్ల జాగ్రత్తగా ఉండాలని, పెట్టుబడికి ముందు అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలని సూచించారు. స్టాక్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ సైతం ఈ విషయమై ఇన్వెస్టర్లకు పలుమార్లు హెచ్చరికలు జారీ చేయడం గమనార్హం. అన్‌లిస్టెడ్ సెక్యూరిటీలు లేదా అనధీకృత ఎలక్ట్రానిక్ ప్లాట్‌ఫామ్‌ల్లో లావాదేవీలకు దూరంగా ఉండాలని సూచించింది. ఆయా ప్లాట్‌ఫామ్‌లలో సెక్యూరిటీల లావాదేవీలకు సెబీ అనుమతి లేదని.. సెక్యూరిటీల చట్టం 1956కు విరుద్ధంగా అవి నడుస్తున్నట్టు పేర్కొంది.

విలువలు కీలకం..



రిలయన్స్ రిటైల్ ఉద్యోగులకు కేటాయించిన స్వల్ప వాటాలను వారు అన్‌లిస్టెడ్ మార్కెట్లో విక్రయించడంతో.. సరఫరా పరిమితంగా ఉండి ధర విపరీతంగా పెరిగిపోయింది. 2019లో రూ.400 వద్దనున్న షేరు 2021 నాటికే రూ.4,000కి పెరిగిపోవడం గమనార్హం. చివరికి 2023లో ఒక్కో షేరుకు రిలయన్స్ కట్టిన ధర రూ.1,362. ఆరంభంలో కొనుగోలు చేసి ఉంటే, ఈ ధరపైనా మంచి లాభమే వచ్చి ఉండేది. కంపెనీ ఆర్థిక మూలాలను అనుసరించి, సహేతుక ధరల వద్ద అన్‌లిస్టెడ్ మార్కెట్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా నష్టాన్ని నివారించొచ్చు. కానీ, అన్‌లిస్టెడ్ మార్కెట్లో డిమాండ్ లేని షేర్లే సహేతుక ధరల వద్ద లభిస్తుంటాయి. క్రేజీ షేర్లు ఎప్పుడు అసాధారణ ధరలపైనే ట్రేడవుతుంటాయి. వారీ ఎనర్జీస్ ఒక్కో షేరు ధర అన్‌లిస్టెడ్ మార్కెట్లో రూ.2,500 ఉంటే కంపెనీ ఐపీవోలో నిర్ణయించిన ధర రూ.1,500. కానీ, ఒక్కో షేరు రూ.2,500 వద్ద లిస్ట్ అయింది. ఇప్పుడు రూ.3,000కు పైనే ట్రేడవుతోంది. ఇలా ఒక్కో కంపెనీకి సంబంధించి అనుభవం వేర్వేరుగా ఉంటుంది. కనుక మంచి యాజమాన్యం, వ్యాపారపరమైన బలాలు, పటిష్టమైన ఆర్థిక మూలాలు కలిగి, ఆకర్షణీయమైన విలువల వద్ద లభిస్తేనే అన్‌లిస్టెడ్ మార్కెట్లో పెట్టుబడులను పరిశీలించొచ్చు. ఆల్టియస్ ఇన్వెస్టెక్, ఇన్‌క్రెడ్ మనీ, అన్‌లిస్టెడ్ జోన్ ఇలా పదుల సంఖ్యలో బ్రోకర్లు అన్‌లిస్టెడ్ మార్కెట్లో కీలకంగా పనిచేస్తున్నారు.

ధరల్లో అస్థిరతలు



రెగ్యులర్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల్లో రోజువారీ కొనుగోలు, విక్రయ లావాదేవీలను సులభంగా నిర్వహించుకోవచ్చు. సెబీ పర్యవేక్షణ లేని అన్‌లిస్టెడ్ మార్కెట్లో లావాదేవీల పూర్తికి కొన్ని రోజుల సమయం పడుతుంది. సంప్రదాయ స్టాక్ బ్రోకర్లు సెబీ నియంత్రణల కింద పనిచేస్తుంటారు. కనుక ముందస్తుగా చేసే చెల్లింపులకు భరోసా ఉంటుంది. అన్‌లిస్టెడ్ మార్కెట్లో కొనుగోలుకు సరిపడా మొత్తాన్ని ముందుగానే మధ్యవర్తుల ఖాతాలకు పంపాల్సి ఉంటుంది. ఆ తర్వాత వారు షేర్లను డెలివరీ చేస్తారు. షేర్లు విక్రయించాలనుకుంటే ముందుగా షేర్లను వారి ఖాతాకు బదిలీ చేయాలి. ఆ తర్వాత నగదు బదిలీ చేస్తారు. బ్రోకర్ విశ్వసనీయతపైనే లావాదేవీల సాఫల్యత ఆధారపడి ఉంటుంది. బ్రోకర్ చేతులెత్తేస్తే న్యాయపరంగా పోరాడడం మినహా మరో మార్గం ఉండదు. పైగా అమ్మకం, కొనుగోలు ధరకు మధ్య వ్యత్యాసం కనిపిస్తుంటుంది. ఈ వ్యత్యాసమే బ్రోకర్లకు ఆదాయాన్ని తెచ్చిపెడుతుంది.

ఆరు నెలలు వెయిటింగ్..



ఐపీవోకి ముందు అన్‌లిస్టెడ్ మార్కెట్లో ఇన్వెస్ట్ చేసి, లిస్టింగ్ తర్వాత విక్రయించి లాభం పోగేసుకుందామని అనుకుంటే పొరపాటే. ఎందుకంటే లిస్టింగ్ అయిన నాటి నుంచి ఆరు నెలల తర్వాతే వారు విక్రయించుకోగలరు. ఆరు నెలల లాకిన్ పీరియడ్ అమల్లో ఉంటుంది. ఐపీవోకి ముందు ఇన్వెస్ట్ చేసిన వారు అంతకాలం ఆగిన తర్వాతే సెక్యూరిటీలను విక్రయించుకోగలరు. అప్పటికి స్టాక్ ధర ఎలా ఉంటుందో ఊహించడం కష్టమే. ఓయో కంపెనీ గత రెండేళ్లుగా ఐపీవో సన్నాహాలతో ఉంది. ఎప్పటికప్పుడు ఐపీవో వాయిదా పడుతోంది. కనుక త్వరలో ఐపీవోకి వస్తే విక్రయించుకోవచ్చన్న ఆశయంతో పెట్టుబడులు పెట్టేయడం సరికాదు. డిమాండ్ ఉన్న షేర్లలో చెన్నై సూపర్ కింగ్స్ షేరు ఒకటి. కానీ ఎప్పుడు ఐపీవోకి వస్తుందో తెలియని పరిస్థితి. 'వ్యాపార పరంగా నిరూపించుకుని, స్టాక్ మార్కెట్లో సహేతుక వ్యాల్యుయేషన్ల వద్ద ఎన్నో కంపెనీలు అందుబాటులో ఉండగా, క్రేజీ వ్యాల్యుయేషన్లతో అన్‌లిస్టెడ్ మార్కెట్లో తక్కువ లిక్విడిటీతో ట్రేడ్ అవుతున్న వాటి జోలికి పోవడం ఎందుకు?' అని స్ట్రేజీ స్టార్టప్ సీఈవో మోహిత్ భండారీ ప్రశ్నించారు. ఆరంభ స్థాయి కంపెనీల్లో పెట్టుబడులు పెట్టాలనుకుంటే, అందుకు ఏంజెల్ ఇన్వెస్టింగ్ మంచి మార్గమని సూచించారు.

అపోలో హాస్పిటల్స్ | బీఎన్‌పీ పారిబా | కొనొచ్చు

స్టాక్స్ వ్యూ



ప్రస్తుత ధర: రూ. 7,306 **టార్గెట్:** రూ. 8,723

ఎందుకంటే: ఆరోగ్య పరిరక్షణా రంగ దిగ్గజం అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ (ఏపీహెచ్‌ఎస్) గతేడాది (2024–25) చివరి త్రైమాసికంలో అంచనాలకు అనుగుణంగానే నిర్వహణ లాభం (ఇబిటా) సాధించింది. జనవరి–మార్చి (క్యూ4)లో ఆసుపత్రుల విభాగం 10 శాతం, హెల్త్ కో 17 శాతం, ఏహెచ్‌ఎల్‌ఎల్ 11 శాతం చొప్పున ఆదాయంలో వృద్ధిని అందుకున్నాయి. ఆసుపత్రుల విభాగం 24.3 శాతం ఇబిటా మార్జిన్ సాధించింది. కన్సాలిడేటెడ్ ఇబిటా మార్జిన్ 13.8 శాతంగా నమోదైంది. ఈ కాలంలో భారత్, బంగ్లాదేశ్ మధ్య వివాదాల కారణంగా పేషెంట్ల పరిమాణంపై 2 శాతం ప్రభావం పడినట్లు ఏపీహెచ్‌ఎస్ పేర్కొంది. కాగా.. 2026–27కల్లా ఆసుపత్రుల విభాగం ఎకనమిక్ వేల్యూ (ఈవీ), ఇబిటా 29 రెట్లుగా అంచనాతో టార్గెట్‌ను ప్రకటించాం. కేవలం ఆసుపత్రుల విభాగంలో కార్యకలాపాలు కలిగిన ఇతర లిస్టెడ్ సంస్థల సగటు విలువతో పోలిస్తే 20 శాతం ప్రీమియంను మదింపు చేశాం. ఇతర సంస్థలు కొన్ని ప్రాంతాలకే పరిమితంకాగా.. ఏపీహెచ్‌ఎస్ దేశీయంగా ఆసుపత్రుల విభాగంలో అతిపెద్ద గ్రూప్‌గా నిలుస్తోంది. అంతేకాకుండా దేశవ్యాప్త కార్యకలాపాలు, పటిష్ట బ్రాండ్‌లను సైతం పరిగణనలోకి తీసుకున్నాం. 2027లో అపోలో హెల్త్ కంపెనీ, ఫార్మా పంపిణీ సంస్థ కీమెడ్ మధ్య విలీన ప్రణాళికలు అమలు చేయనుంది. విలీన సంస్థ ఈవీ, ఇబిటాను 2027కల్లా 15 రెట్లు విలువలో మదింపు చేశాం. లిస్టెడ్ కంపెనీ ఇంద్రప్రస్థ మెడికల్‌లో ఏపీహెచ్‌ఎస్‌కుగల వాటాను సైతం మార్కెట్ విలువరీత్యా అంచనాకు పరిగణనలోకి తీసుకున్నాం. కొత్తగా ఏర్పాటు చేసే పడకలు (సౌకర్యాలు) అంచనాకంటే ముందుగానే బ్రేక్‌ఈవెన్ సాధించవచ్చు. అయితే కొత్త సౌకర్యాల కల్పన ఆలస్యం కావడం ప్రతికూల ప్రభావం చూపవచ్చు.

ఇప్కా ల్యాబొరేటరీస్ | ఇన్‌క్రెడ్ ఈక్విటీస్ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 1,471 **టార్గెట్:** రూ. 1,720

ఎందుకంటే: ఫార్మాస్యూటికల్ దిగ్గజం ఇప్కా ల్యాబొరేటరీస్ గత ఆర్థిక సంవత్సరం (2024–25) చివరి త్రైమాసికంలో అంచనాలకు అనుగుణమైన పనితీరును ప్రదర్శించింది. అయితే మార్జిన్లు 1.3 శాతం నీరసించాయి. నిర్వహణ లాభం (ఇబిటా) అంచనాల కంటే 6 శాతం తక్కువగా నమోదైంది. దేశీ ఫార్మా బిజినెస్ క్యూ4 (జనవరి–మార్చి) ద్వారా వరుసగా 9వ క్వార్టర్‌లోనూ రెండంకెల వృద్ధిని సాధించింది. వార్షిక ప్రాతిపదికన 10.8 శాతం పురోగతిని అందుకుంది. ఇది పరిశ్రమ వృద్ధి రేటు 8 శాతానికంటే అధికమైనప్పటికీ.. మా అంచనాలు 13.9 శాతానికంటే తక్కువే. 2025కల్లా టాప్–30 మెట్రో పట్టణాలలో మార్కెట్ వాటా 37.5 శాతానికి బలపడింది. 2022లో ఇది 32.7 శాతంగా నమోదైంది. ఎగుమతుల బిజినెస్ పటిష్ట పురోగతిని సాధించింది. వార్షికంగా 10 శాతం, త్రైమాసికవారీగా (క్యూ3తో పోలిస్తే) 14 శాతం వృద్ధిని అందుకుంది. ఇక జనరిక్స్ విభాగం వార్షికంగా 7 శాతం, త్రైమాసికవారీగా 10 శాతం ఎగసింది. టెండర్ నష్టాల కారణంగా గతేడాది దక్షిణాఫ్రికా మార్కెట్‌లో కంపెనీ పలు సవాళ్లు ఎదుర్కొంది. మరోపక్క నిల్వల (ఇన్వెంటరీ) క్రమబద్ధీకరణ ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ మార్కెట్లను ప్రభావితం చేసింది. అయితే రానున్న క్వార్టర్లలో కంపెనీ రెండంకెల వృద్ధిని కొనసాగించగలదని భావిస్తున్నాం. ఇందుకు భారత్‌సహా.. విదేశీ మార్కెట్ల (ఎగుమతులు)లో పటిష్ట పనితీరు దోహదపడగలదని అంచనా వేస్తున్నాం. కీలక మెట్రో నగరాలలో మార్కెట్ వాటాను పెంచుకోవడం, నిలకడైన జనరిక్ బిజినెస్ వంటి అంశాలు సైతం ఇందుకు సహకరించనున్నాయి. కంపెనీతోపాటు.. యూనికెమ్ మార్జిన్లు మెరుగుపడే వీలుంది. ఇందుకు వ్యయాలలో పొదుపు, పుంజుకోనున్న ఏపీఐ సోర్సింగ్ జత కలవనున్నాయి.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

అవీవా భారత్ బాల వికాస్ యోజన పాలసీ



న్యూఢిల్లీ: అవీవా ఇండియా నూతనంగా అవీవా భారత్ బాల వికాస్ యోజన పేరుతో బీమా ప్లాన్‌ను ప్రవేశపెట్టింది. ఇది ఈక్విటీ మార్కెట్‌తో సంబంధం లేని, నాన్ పార్టిసిపేటింగ్ జీవిత బీమా ప్లాన్. తమ పిల్లల భవిష్యత్ భద్రతకు ఇది భరోసానిస్తుందని కంపెనీ తెలిపింది. ప్రీమియం నెలకు రూ.1,000 నుంచి మొదలవుతుంది. జీవిత బీమా రక్షణకుతోడు హామీతో కూడిన మెచ్యూరిటీ ప్రయోజనం కూడా ఇందులో భాగంగా ఉంటుంది. 3 ఏళ్ల నుంచి 50 ఏళ్ల వయసు పరిధిలోని వారు.. 12–30 ఏళ్ల కాలానికి తీసుకోవచ్చు. గరిష్ఠ కాల వ్యవధి పాలసీదారుడికి 80 ఏళ్ల వరకు ఉంటుంది. నెలవారీ, త్రైమాసికం లేదా అర్ధ సంవత్సరం లేదా ఏడాదికోసారి ప్రీమియం చెల్లింపు ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవచ్చు. గ్యారంటీడ్ సమ్ అష్యూర్డ్ పేరుతో కాల వ్యవధి ముగిసిన తర్వాత చెల్లించే ప్రయోజనం పిల్లల భవిష్యత్ అవసరాలకు ఆర్థిక భరోసానిస్తుందని కంపెనీ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ వినీత్ కపాహి తెలిపారు.

న్యూ ఫండ్ ఆఫర్స్

క్యాపిటల్ మైండ్ ఫ్లెక్సీక్యాప్ ఫండ్

క్యాపిటల్ మైండ్ మ్యూచువల్ ఫండ్ సంస్థ కొత్తగా ఫ్లెక్సీక్యాప్ ఫండ్‌ను (న్యూ ఫండ్ ఆఫర్/ఎన్ఎఫ్‌వో) ప్రారంభించింది. ఈ నెల 28 వరకు పెట్టుబడులకు అందుబాటులో ఉంటుంది. ఓపెన్ ఎండెడ్ ఫండ్ ఇది. లార్జ్‌క్యాప్, మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేస్తుంది. ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా దీర్ఘకాలంలో పెట్టుబడిని వృద్ధి చేసే లక్ష్యంతో ఇది పనిచేస్తుంది. ఈ పథకానికి ప్రామాణిక సూచీగా నిఫ్టీ 500 టీఆర్ఐ ఉంటుంది. అనూప్ విజయ్‌కుమార్ ఫండ్ మేనేజర్‌గా వ్యవహరించనున్నారు. రెగ్యులర్, డైరెక్ట్ ప్లాన్ల రూపంలో అందుబాటులో ఉంది. మార్కెట్, స్థూల ఆర్థిక అంశాలు, కంపెనీల ఆర్థిక మూలాలను అధ్యయనం చేయడం ద్వారా పెట్టుబడులు పెట్టనున్నట్టు సంస్థ తెలిపింది. ఒకే విడత పెట్టుబడికి కనీసం రూ.5,000 అవసరం. అదే సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో అయితే రూ.1,000 నుంచి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.



బంధన్ మల్టీ ఫ్యాక్టర్ ఫండ్



బంధన్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా మల్టీ ఫ్యాక్టర్ ఫండ్‌ను ప్రారంభించింది. ఒకే పెట్టుబడి శైలిపై ఆధారపడకుండా, నాలుగు విభిన్న విధానాల ఆధారంగా పనిచేస్తుంది. వాల్యూ, క్వాలిటీ, మొమెంటం, లో వొలటాలిటీ (తక్కువ అస్థిరత)ని పెట్టుబడుల విషయంలో అనుసరిస్తుంది. ఈ పథకం ఈ నెల 24 వరకు పెట్టుబడులకు అందుబాటులో ఉంటుంది. దీనికి బెంచ్ మార్క్ బీఎస్ఈ 200 టీఆర్ఐ ప్రామాణికం. రిషి శర్మ, బ్రిజేష్ షా ఫండ్ మేనేజర్లుగా వ్యవహరిస్తారు. పెట్టుబడిని 30 రోజుల్లోపు వెనక్కి తీసుకుంటే 0.50 శాతం ఎగ్జిట్ లోడ్ పడుతుంది. పెట్టుబడుల విషయంలో ఒక్కో సమయంలో ఒక్కో విధానం ఫలితమిస్తుంటుంది. అందుకే నాలుగు రకాల విధానాలను ఈ పథకంలో భాగంగా చేసినట్టు కనిపిస్తోంది. ఒకే విధానంపై ఆధారపడకుండా పెట్టుబడులను విస్తరించడం ద్వారా కాన్సంట్రేషన్ రిస్క్‌ను తగ్గించి, పోర్ట్‌ఫోలియోకు మరింత స్థిరత్వాన్ని తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు సంస్థ తెలిపింది.

రిటైర్మెంట్ పెట్టుబడులకు స్మాల్‌క్యాప్ అనుకూలమేనా?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్





మనీ మార్కెట్ ఫండ్ ఎవరికి అనుకూలం?
– స్వర్ణముఖి

మనీ మార్కెట్ ఫండ్ అన్నది డెట్ మ్యూచువల్ ఫండ్ పథకం. ఏడాది కాలంలో గడువు ముగిసే స్వల్ప కాల డెట్ ఇన్‌స్ట్రుమెంట్లు, ఇతర సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తుంది. రిస్క్‌లేని ఊహించదగిన రాబడులను ఇవి ఇవ్వగలవు. ఇవి అధిక నాణ్యత కలిగిన సాధనాల్లోనే ఇన్వెస్ట్ చేస్తాయి. కనుక మనీ మార్కెట్ మ్యూచువల్ ఫండ్స్ దాదాపు రిస్క్‌లేని, అధిక రక్షణతో కూడినవి. స్వల్పకాలానికి ఫిక్స్‌డ్ డిపాజిట్ల కంటే కాస్త అధిక రాబడులను ఇస్తాయి. ఎందుకంటే ఇవి వైవిధ్యమైన సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తుంటాయి. ఏడాది కాలానికి ఇన్వెస్ట్ చేసుకునే వారు వీటిని పరిశీలించొచ్చు. బ్యాంక్ సేవింగ్స్ ఖాతాలో డిపాజిట్లపై రాబడి కంటే అధిక రాబడిని ఇవ్వగలవు. కనుక బ్యాంక్ ఖాతాల్లో ఎక్కువ బ్యాలన్స్ ఉంచుకునే వారు ఇందులో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. మొత్తం 16 రకాల డెట్ మ్యూచువల్ ఫండ్స్ ఉండగా, లిక్విడ్ ఫండ్స్, షార్ట్ డ్యురేషన్ ఫండ్స్ అన్నవి రిటైల్ ఇన్వెస్టర్లకు అనుకూలంగా ఉంటాయి. మీ పెట్టుబడుల కాల వ్యవధి ఏడాది అయితే లిక్విడ్ ఫండ్స్ మంచివి. ఇవి తక్కువ రిస్క్ పథకాలు. అత్యవసర నిధికి వీటిని ఉపయోగించుకోవచ్చు. ఏడాదికి మించిన కాలానికి ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటే షార్ట్ డ్యురేషన్ ఫండ్‌ను ఎంపిక చేసుకోండి. ఏడాది నుంచి మూడేళ్ల కాల సాధనాల్లో ఇవి ఇన్వెస్ట్ చేస్తాయి. డెట్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడంలో ఉన్న ప్రాథమిక లక్ష్యం పెట్టుబడి పరిరక్షణతోపాటు, కొంత రాబడి కోరుకోవడం. ఈ దృష్ట్యా లిక్విడ్ ఫండ్స్, షార్ట్ డ్యురేషన్ ఫండ్స్ అనుకూలంగా ఉంటాయి.

రిటైర్మెంట్ నిధి కోసం స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చా?
– అనిరుధ్ భట్టాచార్య

దీర్ఘకాలంలో సంపద సృష్టికి స్మాల్‌క్యాప్ పథకాలను పరిశీలించొచ్చు. స్మాల్‌క్యాప్‌లో పెట్టుబడులకు దీర్ఘకాలం ఒక్కటే ప్రామాణికం కాదు. నష్టభయాన్ని, యూనిట్ల విలువ క్షీణించినా తట్టుకునే గుండె నిబ్బరం కావాలి. ఇవి నిర్ణీత సమయాల్లో (సైకిల్స్) భారీ నష్టాలకు గురవుతుంటాయి. మార్కెట్లో ఇతర విభాగాలు మంచి పనితీరు చూపిస్తూ, స్మాల్‌క్యాప్‌లో పెట్టుబడులు నష్టాలను చూపిస్తుంటే ఆందోళన చెందడం సహజం. అందుకనే మీ మొత్తం పెట్టుబడుల్లో 10–15% మించి స్మాల్‌క్యాప్ పథకాల్లో ఇన్వెస్ట్ చేసుకోకుండా ఉండడం సూచనీయం. చిన్న కంపెనీని ఎంపిక చేసుకుంటే, అది ఆ తర్వాతి కాలంలో పెద్ద కంపెనీగా మారితే, మంచి సంపద సృష్టి జరుగుతుంది. కానీ, అలా ఎంపిక చేసుకున్న ప్రతి కంపెనీ బడా కంపెనీ అవ్వాలనేమీ లేదు. సంపదను తుడిచిపెట్టేవీ ఉంటాయి. ఆటుపోట్లను తట్టుకునే బలం చిన్న కంపెనీలకు తక్కువ. లార్జ్‌క్యాప్ కంపెనీలతో పోలిస్తే మంచి వృద్ధిని చూపించగలవు. మరీ చిన్న కంపెనీలు అయితే ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్టర్లు సైతం దూరంగా ఉంటారు. స్మాల్‌క్యాప్ విభాగం పెద్దది. స్మాల్‌క్యాప్ విభాగంలో వివిధ పథకాల మధ్య ఎంతో వైవిధ్యం కనిపిస్తుంది. కనుక సిప్ ద్వారా స్మాల్‌క్యాప్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేయడం వల్ల రిస్క్ తగ్గించుకోవచ్చు. ముఖ్యంగా స్మాల్‌క్యాప్ కంపెనీలకు సంబంధించి తగినంత లిక్విడిటీ ఉండదు. చిన్న కంపెనీలు కావడంతో ఫ్రీ ఫ్లోటింగ్ ఈక్విటీ తక్కువ. దీంతో మార్కెట్ల కరెక్షన్లలో కొద్ది విక్రయాలకే ఎక్కువ నష్టపోతుంటాయి. మిడ్‌క్యాప్, లార్జ్‌క్యాప్ కంపెనీలతో పోలిస్తే స్మాల్‌క్యాప్ కంపెనీలు రిస్క్ ఎక్కువతో ఉంటాయి. చిన్న కంపెనీల్లో ఏ ధరలో ప్రవేశించారు, ఎక్కడ విక్రయించారన్నది రాబడులకు కీలకం అవుతుంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో..

ఫలితాలు, వాణిజ్య చర్చలపై ఇన్వెస్టర్ల దృష్టి	ఈ వారం 4 ఇష్యూలు..1 లిస్టింగ్

సముచీతా స్థానం



చీతాల రక్షణ కోసం కొత్త ఆవాసం

మన దేశంలో అంతరించిపోయిన చీతాలను పునరుద్ధరించడం కోసం చేపట్టిన ఆపరేషన్ చీతా ప్రాజెక్టును విజయవంతం చేయడానికి యత్నాలు జరుగుతున్నాయి. మధ్యప్రదేశ్‌లోని కునో నేషనల్ పార్క్‌లో చీతాల పునరావాసం కష్టమని తేలడంతో ప్రత్యామ్నాయంగా గుజరాత్‌లోని కచ్ జిల్లా బన్ని గడ్డి మైదానాలను ఎంపిక చేశారు. దేశంలో చీతాల సంతతి పునరుద్ధరణ కోసం 2022లో ప్రాజెక్టు చీతా ప్రారంభించారు. నమీబియా నుంచి 8, దక్షిణాఫ్రికా నుంచి 12 కలిపి మొత్తం 20 చీతాలను తీసుకువచ్చారు. వాటిని మధ్యప్రదేశ్‌లోని కునో నేషనల్ పార్క్‌లో విడతల వారీగా వదిలారు. కానీ కునో పార్కు చీతాలకు అనువైంది కాదని ఆ తర్వాత వెల్లడైంది. ఫలితంగా అవి మృత్యువాతపడడం మొదలైంది. కొన్ని చీతాలు పిల్లలు పెట్టినా చాలా వరకూ చనిపోయాయి. మొత్తం 10 చీతాలు చనిపోవడంతో ఆ ప్రాజెక్టు ప్రశ్నార్థకంగా మారింది. ఆసియాలో జీవించిన చీతాలు, ఆఫ్రికన్ అడవుల్లోని చీతాలకు చాలా వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించారు. దీనికితోడు కునో పార్కు ఆఫ్రికన్ గడ్డి మైదానాల తరహాలో లేకపోవడం, పరిమితమైన అటవీ ప్రాంతం, వాటికి అవసరమైన ఆహార జంతువుల కొరత, అడవిలో గడ్డి పరిధి ఎక్కువగా ఉండడంతో చీతాల వేగానికి ఆటంకం కలగడం, వాతావరణ మార్పులతో ఇన్‌ఫెక్షన్లు సోకడం, మానవ జోక్యం ఎక్కువ కావడం వల్ల అవి జీవించలేకపోతున్నట్లు తేలింది.

- సాక్షి, అమరావతి



బన్ని గడ్డి మైదానాలే ఎందుకంటే?

ఈ నేపథ్యంలో చీతాల సంరక్షణకు ఆఫ్రికన్ గడ్డి మైదానాల తరహా ప్రాంతం కోసం అటవీ అధికారులు అన్వేషించారు. చివరికి కచ్ ప్రాంతంలోని బన్ని గడ్డి మైదానాలు అనువుగా ఉంటాయని తేల్చారు. ఇవి భారతదేశంలో ఉన్న అతి పెద్ద గడ్డి మైదానాలు. సుమారు 2,618 చదరపు కిలోమీటర్లలో విస్తరించి ఉన్నాయి. తక్కువ పొడవు ఉండే గడ్డి, మృదువైన నేల, ఎక్కువ ఎండ, తక్కువ వర్షపాతం ఉండే ప్రాంతం. అలాగే చీతాలకు ఆహారంగా జింకలు, దుప్పులు ఇతర జంతువులు సహా అనేక జీవులు ఇక్కడ నివసిస్తున్నాయి. ఆఫ్రికాలో చీతాలు నివసించే సహజమైన గడ్డి మైదానాల మాదిరిగానే బన్ని గడ్డి భూములు ఉంటాయి. ఈ ప్రాంతంలో జన సాంద్రత కూడా తక్కువగా ఉండటం వల్ల వన్యప్రాణులు స్వేచ్ఛగా తిరిగే అవకాశం ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు.

కునో పార్కులో మిగిలిన 24 చీతాలు

ఈ నేపథ్యంలోనే చీతాలను అక్కడ ప్రవేశపెట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గుజరాత్ అటవీ శాఖ వన్యప్రాణుల ప్రధాన సంరక్షణాధికారి జైపాల్ సింగ్ మాట్లాడుతూ ఇప్పటికే బన్ని గడ్డి మైదానాల్లో 500 ఎకరాల్లో బ్రీడింగ్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీంతోపాటు చీతాలు తిరగడానికి వీలుగా వలయాకారంలో భారీ ఫెన్సింగ్ ప్రాంతాన్ని ఏర్పాటు చేస్తున్నారు. వాటికి సరిపోయే ఆహార శ్రేణిని అభివృద్ధి చేస్తున్నారు. డ్రోన్ మానిటరింగ్, సీసీ టీవీ వ్యవస్థలు, అటవీ సిబ్బందికి శిక్షణ ఇచ్చే కార్యక్రమాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం కునో పార్కులో 24 చీతాలు ఉన్నాయి. అందులో 12 పిల్లలు. మొదటి విడతగా పది చీతాలను బన్ని గడ్డి మైదానాల్లో వదలాలని భావిస్తున్నారు.

కొత్త ప్రణాళికతో ముందుకు

1952లోనే చీతాలు అధికారికంగా భారతదేశంలో అంతరించిపోయిన జాతిగా ప్రకటించారు. 70 ఏళ్ల తర్వాత 2022లో ప్రాజెక్టు చీతా ద్వారా మళ్లీ వాటిని ఆఫ్రికా దేశాల నుంచి మన దేశానికి తీసుకురాగలిగారు. అయితే ఆఫ్రికన్, ఆసియా చీతా జాతుల మధ్య ఉన్న తేడాలు, వాటి ఆవాసానికి సరైన ప్రాంతాన్ని ఎంపిక చేయకపోవడం, ప్రణాళికా లోపం వల్ల సమస్యలు ఏర్పడ్డాయి. ఈ మూడేళ్లలో ఎదురైన అనుభవాలతో ఇప్పుడు కొత్త ప్రణాళికతో ముందుకెళుతున్నారు. అందులో భాగంగానే గుజరాత్ బన్ని గడ్డి మైదానాలను ఎంపిక చేశారు.

క్లుప్తంగా...

వెబ్ ఆప్షన్లకు గడువు పొడిగింపు

సాక్షి, అమరావతి: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ (లాం–గుంటూరు)లో డిప్లొమా కోర్సులకు దరఖాస్తు చేసిన అభ్యర్థులకు వెబ్ ఆప్షన్ల గడువును ఈ నెల 25 వరకు పొడిగించినట్టు వర్సిటీ రిజిస్ట్రార్ జి.రామచంద్రరావు ఆదివారం తెలిపారు. ఈ ఏడాది తిరుపతిలోని అగ్రికల్చర్ డిప్లొమా కోర్సులో ప్రవేశానికి అనుమతి లభించిందన్నారు. తిరుపతిలో విద్యార్థులు 2025–26 సంవత్సరంలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్ నమోదు చేసుకోవడానికి అవకాశమిచ్చినట్లు పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీ యువతకు పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

సాక్షి, అమరావతి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టడీ సర్కిల్ ద్వారా పోటీ పరీక్షల కోసం నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ యువతకు ఉచిత శిక్షణ త్వరలో ప్రారంభిస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డీబీవీ స్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ, విశాఖ, తిరుపతి కేంద్రాల్లో బ్యాంకింగ్, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ), రైల్వే రిక్రూట్‌మెంట్(ఆర్ఆర్‌బీ) పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తామన్నారు.

చిరుధాన్యాల ఎగుమతుల్లో ఏపీకి ఆరో స్థానం

- తొలి రెండు స్థానాల్లో గుజరాత్, మహారాష్ట్ర
- కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ వెల్లడి

సాక్షి, అమరావతి: దేశంలో అత్యధికంగా చిరుధాన్యాలు ఎగుమతులు చేస్తున్న టాప్-10 రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ చోటు దక్కించుకుంది. 2023-24వ ఆర్థిక సంవత్సరంలో చిరుధాన్యాల ఎగుమతుల్లో గుజరాత్ తొలి స్థానంలో, మహారాష్ట్ర రెండో స్థానంలో నిలవగా.. ఏపీకి ఆరో స్థానం లభించిందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ వెల్లడించింది. అంతర్జాతీయ మిల్లెట్స్ సంవత్సరంలో భాగంగా 2023లో చిరుధాన్యాల సాగును, ఎగుమతిని ప్రోత్సహించేందుకు అనేక కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపింది. చిరుధాన్యాల ఉత్పత్తులకు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ ఉత్పాదక రాయితీ అమలు చేస్తోందని వివరించింది. చిరుధాన్యాల ఆహార ఉత్పత్తుల వినియోగాన్ని ప్రోత్సహించడంతో పాటు ఉత్పత్తుల విలువ పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపింది. 2023-24లో దేశం మొత్తం మీద రూ.489 కోట్ల విలువైన చిరుధాన్యాలను ఎగుమతి చేసినట్లు కేంద్రం వెల్లడించింది. ఏపీ రూ.24 కోట్ల విలువైన 7,329 మెట్రిక్ టన్నుల చిరుధాన్యాలను ఎగుమతి చేసిందని పేర్కొంది.

గాయత్రి వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ అడ్మిషన్లపై నిషేధం

- నేషనల్ మెడికల్ కమిషన్ నుంచి హెల్త్ వర్సిటీకి సమాచారం
- రాష్ట్రానికి తగ్గిన మరో 200 సీట్లు

సాక్షి, అమరావతి: విశాఖపట్నంలోని గాయత్రి విద్యాపరిషత్ వైద్య కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్ ప్రవేశాలపై నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) నిషేధం విధించింది. దేశవ్యాప్తంగా 9 కళాశాలల్లో ఎంబీబీఎస్ ప్రవేశాలపై బ్యాన్ విధించినట్టు కమిషన్ పేర్కొంది. వీటిలో ఏపీ నుంచి విశాఖలోని గాయత్రి, తెలంగాణ నుంచి వరంగల్‌లోని ఫాదర్ కొలంబో వైద్య కళాశాల ఉన్నట్టు వెల్లడైంది. 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం ఎన్ఎంసీ విడుదల చేసిన సీట్ మ్యాట్రిక్స్‌లో ఆయా కళాశాలల్లో సీట్లను చూపలేదు. గాయత్రి కళాశాలలో ఎంబీబీఎస్ సీట్లు 'సున్నా'గా జాబితాలో పేర్కొన్నారు. ఎన్ఎంసీ అనుమతుల కోసం కళాశాలలు అడ్డదారుల తొక్కాయన్న ఆరోపణలపై ఇటీవల సీబీఐ కేసులు నమోదు చేసింది. ఈ క్రమంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ ప్రవేశాలపై ఎన్ఎంసీ బ్యాన్ విధించినట్టు సమాచారం. గాయత్రిలో అడ్మిషన్లు బ్యాన్ చేసినట్టు ఆరోగ్య విశ్వవిద్యాలయానికి ఎన్ఎంసీ సమాచారం ఇచ్చింది. దీంతో రాష్ట్రస్థాయిలో నిర్వహించే కౌన్సెలింగ్‌లో సీట్లు భర్తీ చేయరని సమాచారం. ఈ కళాశాలలో 200 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. వీటిలో సగం సీట్లు కన్వీనర్ కోటా, మిగిలిన సగం బీ, సీ కేటగిరీల్లో సీట్లను వర్సిటీ భర్తీ చేస్తుంది. నిషేధం విధించిన నేపథ్యంలో రాష్ట్ర విద్యార్థులు ఏకంగా 200 సీట్లు కోల్పోవాల్సి వస్తోంది. ఇప్పటికే చంద్రబాబు ప్రభుత్వం తీసుకున్న కొత్త వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయంతో మన విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ పరిస్థితుల్లో మరో 200 సీట్లు తగ్గడం గమనార్హం.

మరో రెండు రోజులు వానలు

- ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశాపై ఉపరితల ఆవర్తనం
- మూడు రోజుల్లో ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం

సాక్షి, విశాఖపట్నం/వాకాడు: మరో 2 రోజుల పాటు రాష్ట్రమంతటా విస్తారంగా వర్షాలు కురిసే సూచనలున్నాయి. ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా మీదుగా పశ్చిమ మధ్య, దాన్ని ఆనుకొని ఉన్న వాయువ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఇది రానున్న రోజుల్లో బలపడి.. 24వ తేదీ సాయంత్రానికల్లా.. అల్పపీడనంగా ఏర్పడే అవకాశం ఉంది. ఇది 25 వతేదీ రాత్రి లేదా 26న ఉదయానికి మరింతగా బలపడి తీవ్ర అల్పపీడనంగా మారే సూచనలున్నాయి. దీని ప్రభావంతో రాష్ట్రమంతటా వర్షాలు విస్తారంగా పడే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ముఖ్యంగా.. దక్షిణ కోస్తాలో రానున్న రెండు రోజుల్లో అనేక చోట్ల భారీ వర్షాలు పడనున్నాయి. ఉత్తరాంధ్ర, రాయలసీమల్లోనూ తేలికపాటి వర్షాలు.. ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. సోమవారం విశాఖ, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, ఉభయ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో కొన్నిచోట్ల భారీ వర్షాలు, మిగిలిన జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు.



తీరంలో పడవను లంగరు వేస్తున్న మత్స్యకారులు

అలల తాకిడికి బోట్లు బోల్తా

ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో సముద్రంలో అలల ఉధృతి ఎక్కువగా ఉంది. అలల తాకిడి కారణంగా సముద్రంలో చేపల వేట చేస్తున్న మత్స్యకారుల బోట్లు బోల్తాపడుతున్నాయి. తిరుపతి జిల్లా వాకాడు మండలంలోని తూపిలిపాళెం, దుగ్గరాజపట్నం, అంజలాపురం, కొండూరుపాళెం, శ్రీనివాసపురం, పంబలి, ఓడపాళెం, మొనపాళెం, చినతోట, వైట్ కుప్పం, పూడికుప్పం, పూడిరాయిదొరువు, నవాబుపేట మత్స్యకార గ్రామాల సముద్ర తీరంలో అలలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయి. ఆదివారం ఆడికృత్తిక పర్వదినం కావడంతో భక్తులు భారీగా సముద్ర తీరాలకు వచ్చారు. అలల తాకిడికి స్నానాలు సజావుగా చేయలేకపోయారు. కొందరు అలల ఉధృతికి చెల్లాచెదురుగా ఎగిరి ఒడ్డుకు నెట్టుకొచ్చారు.

అట్టహాసంగా తిరుపతి ఐఐటీ ఏడో స్నాతకోత్సవం

418మందికి ఇంజినీరింగ్ డిగ్రీ పట్టాల పంపిణీ



తిరుపతి ఐఐటీ స్నాతకోత్సవంలో విద్యార్థుల కోలాహలం

ఏర్పేడు: తిరుపతి ఐఐటీలో ఆదివారం సాయంత్రం ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ కెఎన్ సత్యనారాయణ అధ్యక్షతన ఏడో స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా క్రియా యూనివర్శిటీ ఛాన్సలర్, కాగ్నిజెంట్ సహ వ్యవస్థాపకులు లక్ష్మీనారాయణన్, జేఎస్ డబ్ల్యూ ఛైర్మన్ సజ్జన్ జిందాల్ గవర్నింగ్ బాడీ ఛైర్మన్‌గా వేడుకలో పాల్గొన్నారు. స్నాతకోత్సవంలో మొత్తం 418మంది విద్యార్థులకు పట్టాలను అందించారు. అలాగే బీటెక్(సీఎస్ఈ) విద్యార్థి అరవింద్ శ్రీనివాసన్‌కు ప్రెసిడెంట్ మెడల్, బంగారు పతకం, ప్రశంసాపత్రాన్ని అందించి సత్కరించారు. బీటెక్(కెమికల్ ఇంజనీరింగ్) విద్యార్థిని మేఘవర్షిణిని గవర్నర్ పతకంతో సన్మానించారు. స్నాతకోత్సవ వేళ విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ఐఐటీ ప్రాంగణం కళకళలాడింది.

నిసార్ ఉపగ్రహ ప్రయోగానికి రంగం సిద్ధం

ఈ నెల 30న శ్రీహరికోట నుంచి ప్రయోగం

విపత్తులపై కీలక సమాచారం అందించనున్న శాటిలైట్

ఇస్రో- నాసా సంయుక్త కృషి

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో), అమెరికా నాసా సంయుక్తంగా రూపొందించిన నిసార్ (నాసా–ఇస్రో సింథటిక్ ఎపర్చర్ రాడార్-నిసార్) ఉపగ్రహాన్ని ఈ నెల 30 సాయంత్రం ప్రయోగించనున్నారు. నెల్లూరు జిల్లాలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్), శ్రీహరికోట రెండో ప్రయోగ వేదిక నుంచి జీఎస్ఎల్వీ ఎఫ్ 16 రాకెట్ ద్వారా ఈ శాటిలైట్‌ను కక్ష్యలోకి పంపేందుకు సన్నాహాలు తుది దశకు చేరుకున్నాయి. ఇస్రో శాస్త్రవేత్తలు మొదటి అసెంబ్లింగ్ బిల్డింగ్‌లో రాకెట్ అనుసంధాన పనులను వేగంగా పూర్తిచేస్తున్నారు. ప్రయోగం వాస్తవానికి జూన్‌లో జరగాల్సి ఉండగా, పీఎస్ఎల్వీ–సీ61 విఫలమైన నేపథ్యంలో ఇది వాయిదా పడింది.

ఉపగ్రహ విశేషాలు...

- **బరువు:** సుమారు 2,800 కిలోలు
- **కక్ష్య:** లోయర్ ఎర్త్ ఆర్బిట్ (ఎల్ఈఓ).
- **శ్రేణి:** సుదూర పరిశీలన ఉపగ్రహ(ఆర్ఎస్ఎస్).
- **సాంకేతికత:** డ్యూయల్ బ్యాండ్ సింథటిక్ ఎపర్చర్ రాడార్ (ఎస్ఏఆర్).
- **రాడార్లు:** ఈ ఉపగ్రహంలో ఎస్ బ్యాండ్ సింథటిక్ ఎపర్చర్ రాడార్‌ను ఇస్రో, ఎల్ బ్యాండ్ సింథటిక్ ఎపర్చర్ రాడార్‌ను నాసా రూపొందించాయి. ఈ రెండు రాడార్లు కలిసి 12 మీటర్ల వ్యాసం గల రిఫ్లెక్టర్ యాంటెన్నాను కలిగి ఉంటాయి. ప్రయోగంలో నాసా అందించిన ఇతర కీలక పరికరాలు.. ఇంజినీరింగ్ పేలోడ్స్, పేలోడ్ డేటా సబ్‌సిస్టమ్, హై-రేట్ సైన్స్ డౌన్‌లింక్ వ్యవస్థ, జీపీఎస్ రిసీవర్లు, సాలిడ్ స్టేట్ రికార్డర్లు.
- **సామర్థ్యం:** 12 రోజుల్లో భూమిని మొత్తం మ్యాప్ చేయగల సామర్థ్యం ఈ శాటిలైట్ సొంతం. బెంగళూరులోని యూఆర్ రావు స్పేస్ సెంటర్ (యూఆర్ఎస్సీ)లో శాటిలైట్ ను రూపొందించారు. ఈ ఉపగ్రహం ద్వారా భూమికి సంబంధించిన సమాచారాన్ని మొత్తంగా సేకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయి.



సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్‌లోని రెండో ప్రయోగ వేదికపై జీఎస్ఎల్వీ మార్క్-2 రాకెట్ (ఫైల్)



నాసా-ఇస్రో సింథటిక్ ఎపర్చర్ రాడార్ (నిసార్) ఉపగ్రహం

ప్రయోజనాలు...

- నిసార్ ఉపగ్రహం నుంచి పొందే అధిక రిజల్యూషన్ డేటా ద్వారా భారతదేశ తీరప్రాంతాల పర్యవేక్షణ
- డెల్టా ప్రాంతాల్లో వార్షిక భౌగోళిక మార్పుల అధ్యయనం
- సముద్రంపై మంచు కదలికల పరిశీలన
- అంటార్కిటిక్ పోలార్ స్టేషన్‌ల చుట్టూ ఉన్న సముద్రాల మీద ఉండే లక్షణాలు పరిస్థితుల పర్యవేక్షణ
- పర్యావరణ వ్యవస్థలు, వృక్ష సంపద, జీవవైవిధ్యం, భూగర్భ జలాలు, సముద్ర మట్టం పెరుగుదలసహా భూకంపాలు, సునామీలు, అగ్నిపర్వత విస్ఫోటనాలు, కొండచరియలు విరిగిపడడం వంటి ప్రకృతి విపత్తుల పర్యవేక్షణ

సాంకేతిక లోపంతో గాల్లో చక్కర్లు కొట్టిన ఇండిగో విమానం

తిరుపతి విమానాశ్రయంలో సురక్షితంగా ల్యాండింగ్

ఊపిరిపీల్చుకున్న ప్రయాణికులు



విమానాశ్రయంలో ప్రయాణికులు

రేణిగుంట: తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయంలో 221 మంది ప్రయాణికులతో టేకాఫ్ అయిన ఇండిగో విమానం కొంతసేపటికే సాంకేతిక లోపంతో గాల్లో చక్కర్లు కొట్టింది. దీంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. అధికారులు అప్రమత్తమై విమానాన్ని తిరిగి సురక్షితంగా తిరుపతి విమానాశ్రయంలో ల్యాండ్ చేశారు. ఆదివారం రాత్రి హైదరాబాద్ నుంచి 7.05 గంటలకు తిరుపతి విమానాశ్రయంలో ల్యాండ్ అయిన ఇండిగో విమానం తిరిగి 7.55 నిమిషాలకు టేకాఫ్ అయ్యింది. విమానంలో సాంకేతిక లోపం రావడంతో గాల్లోనే కొంత సమయం చక్కర్లు కొట్టింది. వెంటనే అధికారులు అప్రమత్తమయ్యారు. తిరిగి తిరుపతి విమానాశ్రయంలో సురక్షితంగా ల్యాండ్ చేశారు. ప్రయాణికులు విమానం దిగి టెర్మినల్ భవనంలోకి చేరుకున్నారు. 10 గంటల వరకు అక్కడే వేచి ఉన్నారు. దీంతో అసహనానికి గురయ్యారు. సోమవారం మరొక విమానాన్ని ఏర్పాటు చేస్తామని ఇండిగో ప్రతినిధులు ప్రయాణికులకు తెలిపినట్టు సమాచారం. తరచూ తిరుపతి విమానాశ్రయంలో విమానాలు ఆలస్యం కావడం, రద్దు అవడం పరిపాటిగా మారిందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇన్ని 'డిగ్రీ'ల్లో మార్పులా!?

- డిగ్రీ విద్యా విధానంపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి
- సింగిల్ మేజర్‌లో మార్పులను సైతం వ్యతిరేకిస్తున్న ప్రైవేటు యాజమాన్యాలు
- 21న బంద్‌కు పిలుపుతో.. కంగుతిన్న ప్రభుత్వం
- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలతో జూమ్ మీటింగ్‌లో చర్చలు
- ప్రభుత్వంతో చర్చించి డిగ్రీలో మేజర్ల విధానాన్ని మారుస్తామని హామీ
- తాత్కాలికంగా కళాశాలల బంద్ వాయిదా

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని సంప్రదాయ డిగ్రీ ప్రవేశాల పరిస్థితి డోలాయమానంలో ఉంది. ఇంటర్ ఫలితాలు వచ్చి వంద రోజులు దాటినా డిగ్రీ ప్రవేశాల్లో జాప్యం కొనసాగుతూనే ఉంది. ముఖ్యంగా డిగ్రీ విద్యా విధానంలోని మార్పులను ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు తీవ్రంగా వ్యతిరేకిస్తుండటం దీనికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఈ క్రమంలోనే సోమవారం ప్రైవేటు యాజమాన్యాలు కళాశాలల బంద్‌కు పిలుపునిచ్చాయి. దీంతో కంగుతున్న ప్రభుత్వం పరువు పోకుండా ఆదివారం ఉదయం తన పార్టీకి చెందిన ఐదుగురు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలతో ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలతో జూమ్ మీటింగ్ పెట్టించి మరీ చర్చలు నిర్వహించింది. ప్రైవేటు కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ ప్రధానంగా సింగిల్ మేజర్ డిగ్రీ స్థానంలో డ్యుయల్ మేజర్ డిగ్రీని చేర్చాల్సిందేనని డిమాండ్ చేశాయి. దీనిపై ఎమ్మెల్సీలు విద్యాశాఖ మంత్రితో చర్చించి తగిన పరిష్కారం చూపిస్తామని హామీ ఇవ్వడంతో పాటు కళాశాలల బంద్‌ను వాయిదా వేసుకోవాలని కోరినట్టు సమాచారం. దీంతో ప్రైవేటు యాజమాన్యాలు తాత్కాలికంగా బంద్‌ను వాయిదా వేసుకున్నాయి. అయితే, ప్రభుత్వం తమ ప్రధాన డిమాండ్‌ను నెరవేర్చకుంటే తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామని చెబుతున్నాయి.



మరోసారి మార్పులు తప్పవా?

గతంలోని సింగిల్ మేజర్ డిగ్రీ స్థానంలో కూటమి ప్రభుత్వం కొత్త విధానాన్ని ప్రవేశపెట్టాలని భావించింది. ఇందులో భాగంగా ప్రత్యేక కమిటీని నియమించి డ్యూయల్ మేజర్‌ను సిఫారసు చేసింది. దీని ప్రకారం ఉన్నత విద్యా మండలి కోర్సుల కన్వర్షన్‌కు నోటిఫికేషన్ కూడా ఇచ్చింది. దీనిపై నెలల తరబడి ఏటూ తేల్చని ప్రభుత్వం.. మళ్లీ స్వల్ప మార్పులతో సింగిల్ మేజర్‌ను తీసుకొస్తూ మరోసారి కోర్సుల కన్వర్షన్‌కు నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రైవేటు కళాశాలల యాజమాన్యాల ఆగ్రహానికి ఇదే కారణమైంది. ఈ క్రమంలోనే ప్రభుత్వం టీడీపీకి చెందిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలను రంగంలోకి దింపి వారిని బుజ్జగించే ప్రయత్నం చేసింది. ప్రభుత్వం 'సింగిల్ మేజర్‌ను' కొనసాగించేలా విధాన నిర్ణయాన్ని తీసుకుంది. అది కూడా కూటమి ప్రభుత్వంలో నియమించిన ఎక్స్‌పర్ట్స్ కమిటీ ఇచ్చిన డ్యూయల్ మేజర్ విధానాన్ని కాదని.. సింగిల్ మేజర్‌ను స్వల్ప మార్పులతో కొనసాగించేందుకు నిర్ణయించింది. ఇలాంటి తరుణంలో ప్రైవేటు యాజమాన్యాల ఆందోళనలను చల్లార్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. జూమ్ మీటింగ్‌లో ఎమ్మెల్సీలు ప్రైవేటు కళాశాలల అభీష్టం మేరకు ప్రభుత్వాన్ని ఒప్పిస్తామని హామీ ఇచ్చినట్టు సమాచారం. అంటే, సింగిల్ మేజర్‌లో మరోసారి మార్పులు తప్పవని సంకేతాలు ఇచ్చినట్టుగా తెలుస్తోంది.

పేట్రేగిన 'పచ్చ'మూకలు

మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నేత రమేష్‌కుమార్‌రెడ్డి రాజకీయ విమర్శలపై మంత్రి రాంప్రసాద్‌రెడ్డి బ్యాచ్ రగడ



పోలీస్‌స్టేషన్‌లోకి అనుమతించాలని ఎస్ఐ శివకుమార్‌ను కోరుతున్న మాజీ ఎమ్మెల్సీ బి. నరేష్‌కుమార్‌రెడ్డి

సాక్షి టాస్క్‌ఫోర్స్: రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నేతలే లక్ష్యంగా కక్షసాధింపు రాజకీయాలు పెచ్చుమీరిపోతున్నాయి. ఒకవైపు మద్యం కేసు పేరుతో అక్రమ కేసుల బాగోతం సాగుతుండగా.. మరోవైపు, ఏదో ఒక సాకు చూపి ఆ పార్టీ నేతలను రాజకీయంగా దెబ్బతీసేందుకు అన్నమయ్య జిల్లాలో 'పచ్చ'మూకలు రాజకీయ కక్ష సాధింపు చర్యలకు బరితెగిస్తున్నాయి. ముఖ్యమంత్రితోపాటు మంత్రి రాంప్రసాద్‌రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రమేష్‌కుమార్‌రెడ్డి విమర్శలు చేశారని ఆయనపై కేసులు పెట్టి తాజాగా రగడ సృష్టించారు. ముఖ్యంగా.. రాయచోటిలో వైఎస్సార్‌సీపీ బలంగా ఉండడాన్ని జీర్ణించుకోలేక ఆ పార్టీని దెబ్బతీసేందుకు టీడీపీ కూటమి ప్రభుత్వం అడ్డదారులు తొక్కుతోంది. ఈ నేపథ్యంలో.. రమేష్‌కుమార్‌రెడ్డి ఇటీవల తన స్థలంలో ఉన్న కంకర, ఇసుక తరలించుకుపోతున్న వ్యక్తులపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతోపాటు మంత్రి రాంప్రసాద్‌రెడ్డిపై పలు విమర్శలు చేశారు. అలాగే, వైఎస్సార్‌సీపీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని జిల్లాలోని చిన్నమండెం మండలంలో ఆదివారం రమేష్‌కుమార్ కార్యక్రమం నిర్వహించి చంద్రబాబు మ్యానిఫెస్టోపై రీకాల్ కోరారు. ఈ సందర్భంగా కూడా ఆయన చేసిన రాజకీయ విమర్శలను వ్యక్తిగత విమర్శలుగా భావిస్తూ 'పచ్చ'ముఠా సాయంత్రం పెద్దఎత్తున రగడ సృష్టించింది. ఎప్పటినుంచో ఆయన్ను దెబ్బతీయాలని చూస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి.. ఇదే అదనుగా భావించి రమేష్‌కుమార్‌పై ఫిర్యాదు చేయాలని ఆదేశించారు. అంతే.. ఆయన సోదరుడు, టీడీపీ నేత లక్ష్మీప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో వారి బ్యాచ్ ఆదివారం సాయంత్రం భారీగా వాహనాలతో వెళ్లి హంగామా సృష్టించింది. అనంతరం.. లక్కిరెడ్డిపల్లె పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసేశారు. అయితే, ఎంతమందిపై కేసు పెట్టారన్నది తెలియలేదు.

పోలీసుల అదుపులో రమేష్‌రెడ్డి..

మరోవైపు.. రాయచోటి నుంచి టీడీపీ శ్రేణులు లక్కిరెడ్డిపల్లెలోని రమేష్‌రెడ్డి ఇంటిమీదికి వెళ్తున్నారన్న ప్రచారం నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు కూడా భారీఎత్తున మాజీ ఎమ్మెల్యే రమేష్‌రెడ్డి ఇంటి వద్దకు చేరుకున్నారు. ఈలోపే స్థానిక సీఐ కొండారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు భారీఎత్తున ఆయన ఇంటి వద్దకు చేరుకుని ఆయన్ను అదుపులోకి తీసుకుని అక్కడ నుంచి తరలించారు. రమేష్‌రెడ్డి ఎంత వారిస్తున్నా వినకుండా పోలీసులు వాహనం ఎక్కించుకుని తీసుకెళ్లారు. ఇటు వైఎస్సార్‌సీపీ, అటు టీడీపీ నేతలతో కొద్దిసేపు లక్కిరెడ్డిపల్లెలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

ఎవరినీ అనుమతించొద్దని ఎస్పీ చెప్పారు..

అనంతరం.. అదుపులోకి తీసుకున్న రమేష్‌రెడ్డిని పోలీసులు రామాపురం, వీరబల్లి, సంబేపల్లె, కలకడ, కలికిరి, వాయల్పాడు మీదుగా చివరకు మదనపల్లె పోలీసుస్టేషన్‌కు తరలించారు. అయితే, మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డిని అరెస్టుచేసి మదనపల్లెకు తీసుకొచ్చారన్న సమాచారం తెలుసుకున్న మీడియా, వైఎస్సార్‌సీపీ నాయకులు స్టేషన్ వద్దకు చేరుకున్నారు. రమేష్‌రెడ్డితో మాట్లాడే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. బెంగళూరు రోడ్డు, అమ్మినేని వీధి మార్గాలను రెండువేపులా మూసేశారు. అలాగే, లోపలికి ఎవరూ రాకుండా స్టేషన్ మార్గానికి జీపు అడ్డుగా పెట్టారు. దీంతో.. వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ బి. నరేష్‌కుమార్‌రెడ్డి వన్‌టౌన్ ఎస్ఐ శివకుమార్‌తో.. తాను న్యాయవాదినని, లోనికి వెళ్లేందుకు అనుమతించాలని కోరినా పోలీసులు నిరాకరించారు. రమేష్‌రెడ్డితో ఎవరినీ కలవనీయవద్దని ఎస్పీ ఆదేశాలిచ్చారని, తామేమీ చేయలేమని పోలీసులు తెగేసి చెప్పారు. ప్రజాస్వామ్యంలో బాధితుడి తరఫున మాట్లాడేందుకు న్యాయవాదిని అనుమతించకపోవడం బాధాకరమని నరేష్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు. డీఎస్పీ మహేంద్రతో మాట్లాడేందుకు మీడియా ప్రయత్నించినా ఆయన స్పందించలేదు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు



తిరుమల: తిరుమలలోని క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూ నారాయణగిరి షెడ్ల వద్దకు చేరుకుంది. శనివారం అర్ధరాత్రి వరకు 90,011 మంది స్వామివారిని దర్శించుకోగా 33,328 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.23 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది.

బోయకొండకు పోటెత్తిన భక్తులు



చౌడేపల్లి: బోయకొండ గంగమ్మ ఆలయానికి ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వేకువ జామున 5 నుంచి సాయంత్రం 6 గంటలవరకు భక్తులతో కొండ కిక్కిరిసింది. గంగమ్మను విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహిళలు పిండి, నూనె దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. సుమారు 40 వేల మందికి పైగా అమ్మవారిని దర్శించుకున్నట్లు ఈఓ ఏకాంబరం తెలిపారు.

మావుళ్లమ్మకు సారె సమర్పణ



భీమవరం (ప్రకాశంచౌక్): పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పట్టణ ఇలవేల్పు శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారికి ఆదివారం భక్తులు సుమారు వెయ్యి కిలోల ఆషాఢ మాస సారె సమర్పించారు. పట్టణానికి చెందిన క్వీన్ కిట్టి మహిళలు 51 రకాలతో 250 కిలోల సారె, విజయవాడ, ఆకివీడు, వీరవాసరం, భీమవరానికి చెందిన భక్తులు 200, 108 కేజీల చొప్పున అమ్మవారికి సారె సమర్పించినట్లు ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ తెలిపారు.

నాగరికతకు ఎంతో దగ్గరగా ఉన్న చెంచు గిరిజనులు ఇంకా ఆదిమ సంస్కృతి, సంప్రదాయాలు పాటిస్తున్నారు. ప్రకృతితో కలసి జీవనం సాగిస్తుండటంతో వారి ఆచారాలు కూడా అంతే స్వచ్ఛంగా ఉంటున్నాయనడంలో సందేహం లేదు. ముఖ్యంగా వివాహ సమయంలో ఇప్పటికీ వరకట్నం లేకపోవడం.. యువతీ యువకుల అభిప్రాయాలకు పెద్దపీట వేయడం.. నిరాడంబరంగా తంతు ముగించడం విశేషం. ప్రకృతి ఒడిలో ఒక్కటై పచ్చని బంధానికి బలమైన పునాది వేసుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

- ఆత్మకూరురూరల్



మన 'సారా' ఒక్కటై.. అడవంతా ఆదర్శమై!

నల్లమల అడవుల్లో పాడసూడని ఆధునికత / గిరిజన సంప్రదాయాలను వీడని చెంచులు / యువతి, యువకుల ఇష్టాలే ప్రామాణికంగా పెళ్లిళ్లు / వరకట్నం ఊసులేని వివాహాలు



కాలం మారుతోంది. కొన్ని కులాలు, మతాల్లో ఆచారాలు కనుమరుగు అవుతున్నా.. ఆదిమ గిరిజనులైన చెంచులు తమదైన నాటి ఆచారాలు, సంప్రదాయాలను కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా వారి వివాహ పద్ధతి నాటి సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా జరపడం విశేషం. చెంచు గిరిజన పెద్దలు తమ పిల్లల వివాహ విషయాల్లో వారి ఇష్టాయిష్టాలకే ప్రాధాన్యతన్యత ఇస్తున్నారు. ఒకరినొకరు ఇష్ట పడి ఆ విషయాన్ని పెద్దలకు చెబితే చాలు.. వెంటనే వివాహ యత్నాలు మొదలవుతాయి. గూడెం పెద్దలతో కలిసి అబ్బాయి తల్లిదండ్రులు అమ్మాయి ఇంటికి వెళ్తారు. అబ్బాయి తరుపు వాళ్ల తీసుకు వచ్చిన ఐదు సీసాల సారాయిని వారి ఎదురుగా ఉంచితే అమ్మాయి తరుపు వారు మూడు సీసాల సారాను వరుడి వైపు వారు తెచ్చిన సారాయితో కలుపుతారు. ఇది రెండు కుటుంబాల కలయికకు, నూతన బంధానికి చిహ్నంగా భావిస్తారు. అలా ఒకటైన సారాయిని వచ్చిన పెద్దలకు తలా ఇంతా పంచుతారు. ఆ సమయంలోనే వివాహ దినాన్ని పెద్దలు నిర్ణయిస్తారు. చెంచుల వివాహాల్లో వరకట్నం అన్న సాంఘిక దురాచారం కనపడదు. కొద్దిపాటి కన్యాశుల్కం ఉంటుంది. అది కూడా పూర్వపు రోజుల్లో అయితే అణాలలో ఉండేది. ఇప్పుడిప్పుడే రూ.11 దాకా పెరిగింది. ఈ మొత్తాన్ని వివాహ సమయంలో వరుడు వధువుకు ఇవ్వాల్సి ఉంటుంది. అంతే కాకుండా పెళ్లి కూతురింటిలో జరిగే తంతుకు కావాల్సినదంతా పెళ్లి కొడుకు తీసుకు రావాల్సిందే. పెళ్లి కూతురికి రెండు చీరలు, పెళ్లి కూతురికి తల్లికి ఒక చీరను తీసుకెళ్లాలి. వధువు తల్లిదండ్రులకు ఆరోజు పెట్టే పప్పన్నం మాత్రమే ఖర్చు.

చెంచుల పురోహితుడు 'కోలగాడు'..

ఇరువురిని ఒకటి చేసి వారు దంపతులని సమాజానికి ప్రకటించే తంతే వివాహం. చెంచుల్లో వివాహం జరిపించేందుకు ప్రతి గూడెంలోనూ కోలగాడు అని పిలవబడే పురోహితుడుంటాడు. సగోత్రికులలో వివాహం నిషిద్ధమైన చెంచుల్లో పలు గోత్రనామాలు కలిగిన గుంపులుంటాయి. వాటిలో ఉత్తలూరు, పులిచర్ల, గుళ్ల, దాసరి, మాండ్ల, చిగుళ్ల, జల్లి, భూమని, కుడుముల వంటి గోత్రాలు వాటిలో కొన్ని. వీటిలోని ఉత్తలూరు గోత్రానికి చెందిన వారిలో ఒకరిని ఆయా గూడేలలో పెళ్లి తంతు జరిపే పురోహితునిగా ఎంచుకుంటారు. చెంచు పురోహితున్ని 'కోలగాడు' అని పిలుస్తారు.

ప్రకృతి ఒడిలోనే ఏకాంతం..

పెళ్లయిన వధూవరులకు అనంతరం జరిగే శోభన కార్యక్రమం నాలుగు గోడల మధ్య జరగడానికి చెంచుల ఆచారాలు అనుమతించవు. పెళ్లయిన వధూవరులు ఆహార సేకరణ కోసం అడవుల్లోకి వెళతారు. అక్కడ ప్రకృతి ప్రసాదించిన ఏకాంతం, పచ్చటి పొదరింటి శయ్యాగృహమే నూతన వధూవరులకు శోభన వేదిక అవుతుంది. నూతన వధూవరులే కాదు.. ఏ చెంచు జంటకైనా రాత్రి శృంగారం నిషిద్ధం. విహారమైనా.. ఆహార సేకరణ అయినా.. శృంగారమైనా పగటి పూటే చెంచులకు ఆనవాయితీ.

చెంచుల పెళ్లింట విశేషాలు..

- వివాహానికి ముందు రోజు సాయంత్రం పెళ్లి కూతురు ఇంటికి పెళ్లి కుమారుడు తరపు బంధువులంతా చేరుకుంటారు. పుట్ట మన్నుతో వివాహ వేదికను తయారు చేసి అక్కడ బాణాలను ఉంచుతారు. కొన్ని చోట్ల గంజి కావడి తెచ్చి వచ్చిన వారికి అందిస్తారు.
- ఆ రాత్రి వధూవరులకు నలుగు కార్యక్రమం ఉంటుంది. ఒక వైపు నలుగులు జరుగుతుంటే మరోవైపు అందరు కలసి నాట్యం చేస్తారు. ఈ నాట్యానికి చెంచులకు ఇష్టమైన తప్పెట వాదన ఉండనే ఉంటుంది.
- గూడెంలోని ఆడవారంతా తెల్లవారుజామునే వధూవరులను కోలగాడి (పురోహితుడు) సమక్షంలో స్నానాల బండ వద్దకు తీసుకెళ్తారు. పుక్కిట పట్టిన నీళ్లు కూడా ఒకరిపై మరొకరు పుక్కిలించుకుంటారు. (ఈ తంతు అంతా వధూవరుల మధ్య బిడియం తగ్గి పోవడానికే). అనంతరం కోలగాడు వధూవరులిద్దరికీ నూతన వస్త్రాలను అందించడంతో వివాహానికి సిద్ధమవుతారు.
- కోలగాడు దారంతో నూలుపోగు తయారు చేసి పసుపు కొమ్మును కట్టి మంగళసూత్రంగా త యారు చేస్తాడు. వరుడు పెద్దలందరికీ చూపు తూ అందరి చప్పట్ల మధ్య వధువు మెడలో కట్టడంతో వివాహ క్రతువు ముగుస్తుంది.
- పెళ్లి జరిగిన రోజు వధువు ఇంటిలో పెండ్లికి వచ్చిన వారికి పప్పన్నాన్ని మాత్రమమే వడ్డిస్తారు. అయితే వధూవరులు వరుడి ఇంటికి వచ్చిన రోజున మాంసాహారంతో విందు చేస్తారు. సారాయి సరే సరి. స్థోమతను బట్టి సంబరం జోరుగుంటుంది.
- పెళ్లి క్రతువును ఏమాత్రం భరించే శక్తి లేని వధూవరులను ఒక చోటకు చేర్చి కోలగాడు వారి కొంగులు ముడి వేసి వారి పెళ్లి అయ్యిందని ప్రకటించడంతో వారి వివాహ జీవితం ప్రారంభమవుతుంది.

పాత ఆచారాలు మరచిపోలేం



నాగరికతకు ఎంత దగ్గరైనా మా చెంచు వాళ్ల మాత్రం పాత పద్ధతులు ఆచారాలు వదలుకోలేదు. ఇప్పటికీ మా పెద్దోళ్లు చెప్పిన పద్ధతిలోనే పెళ్లిళ్లు చేసుకుంటున్నాం. పద్ధతులు మారిస్తే మా పెద్దోళ్లు పైనుంచి కోపగించుకుంటారనే భయమూ ఉంది. పెళ్లంటే అన్ని ఖర్చులు మగపెళ్లి వాళ్లే పెట్టుకుంటారు. ఆడపెళ్లి వాళ్లకు ఎలాంటి ఖర్చు లేదు.

– ఉత్తలూరి అంకన్న, కోలగాడు, నాగలూటి గూడెం

పిల్లల ఇష్టాలతోనే



మా గూడేల్లోకి చర్చిలు, ఆలయాలు వచ్చినా.. మా దేవుళ్లు అయిన ఈదన్న, గుగ్గిళ్ల బయ్యన్న, మంతనాలమ్మలను కొలవడంలో మాత్రం మార్పులేదు. అట్లాగే పెళ్లిళ్లు కూడా సంబరంగా జరుపుకుంటారు. పిల్లగాళ్ల ఇష్టాలతోనే పెద్దవాళ్లు జత కట్టిస్తారు.

– వెంకటేశ్వర్లు, చెంచు దేవతల పూజారి, బైర్లూటి

పెద్దింట్లమ్మకు పూజలు



కైకలూరు: అమ్మా.. పెద్దింట్లమ్మా.. నీ ఆశీస్సులు మాకు అందించమ్మా అంటూ భక్తులు అమ్మను ఆర్తితో వేడుకున్నారు. ఏలూరు జిల్లా కైకలూరు మండలం కొల్లేటికోటలో కొలువై ఉన్న అమ్మవారిని దర్శించుకునేందుకు సమీప జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. అనంతరం మొక్కులు తీర్చుకున్నారు. పవిత్ర కోనేరులో స్నానాలు ఆచరించి అమ్మకు వేడి నైవేద్యాలను సమర్పించారు.

తెలుగు గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి సిటీ: తిరుపతి జూపార్క్ రోడ్డులోని ఉదయమాణిక్యం మహాత్మా జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల బాలికల సంక్షేమ గురుకుల పాఠశాలలో తెలుగు(టీజీటీ) గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ కె.రేష్మ తెలిపారు. ఈ నెల 23వ తేదీలోపు జూపార్క్ రోడ్డు టాటా క్యాన్సర్ ఆస్పత్రికి ఎదురుగా ఉన్న పాఠశాలలో దరఖాస్తులు అందజేయాలని ఆమె పేర్కొన్నారు. అభ్యర్థులు ఏంఏ (తెలుగు), బీఈడీ కలిగి ఉండాలని, వివరాలకు 9000783185ను సంప్రదించాలని తెలిపారు.

సర్ప సంరక్షణలో క్రాంతి కిరణం

● స్నేక్ సేవియర్ సొసైటీ ద్వారా సేవలు ● పాములపై ప్రజలకు అవగాహన



కట్ల పాముతో క్రాంతి

ఫిబ్రవరి 17.. జంగారెడ్డిగూడెంలోని కిడ్స్ కాన్వెంట్‌లోకి ఏడడుగుల గోధుమ తాచు ప్రవేశించింది. పాఠశాల ఆవరణలోని చెట్టు మొదళ్లలో పాము కనిపించడంతో పాఠశాల సిబ్బంది అప్రమత్తమయ్యారు. వెంటనే స్నేక్ సేవియల్ సొసైటీ వ్యవస్థాపకుడు చదలవాడ క్రాంతికి సమాచారం ఇచ్చారు. ఆయన హుటాహుటిన ఇక్కడకు చేరుకుని చాకచక్యంగా గోధుమ తాచును పట్టుకున్నారు. అనంతరం సురక్షిత ప్రాంతానికి తరలించారు. దీంతో పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది ఊపిరిపీల్చుకున్నారు.

జూలై 1.. జంగారెడ్డిగూడెం పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలోకి కోడెనాగు ప్రవేశించింది. సంతోష్ అనే కానిస్టేబుల్ కాళ్ల మధ్యలో నుంచి పాము కార్యాలయంలోనికి రావడంతో అందరూ భయభ్రాంతులకు గురయ్యారు. విషయాన్ని స్నేక్ సేవియర్స్ సొసైటీ వ్యవస్థాపకుడు చదలవాడ క్రాంతికి సమాచారం అందించారు. వెంటనే క్రాంతి అక్కడికి వచ్చి ఎవరికీ ఎటువంటి హాని కలగకుండా పామును సురక్షితంగా పట్టుకున్నారు. అనంతరం దానిని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. దీంతో పోలీసు సిబ్బంది అందరూ ఊపిరి పీల్చుకున్నారు.


జంగారెడ్డిగూడెం : పాము కనపడగానే ఎవరికైనా వెన్నులో వణుకు పడుతుంది. దానిని చంపేయాలని చూస్తాం. అయితే ఆ యువకుడు చాక చక్యంగా దానిని పట్టుకుని సురక్షిత ప్రాంతంలో వదిలి వేస్తున్నాడు. పాము నుంచి మనిషికి, మనిషి నుంచి పాముకు రక్షణ కల్పించాలనే ఆలోచనతో స్నేక్ సేవియర్‌గా మారి సేవలందిస్తున్నాడు. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం పేరంపేటకు చెందిన చదలవాడ క్రాంతి. 15 ఏళ్లుగా పాముల సంరక్షుడిగా ఉన్నాడు. 2016లో స్నేక్ సేవియర్ సొసైటీని స్థాపించి సర్పాల సంరక్షణతో పాటు ప్రజలకు అవగాహన కలిస్తున్నాడు. పేరంపేటకు చెందిన వ్యవసాయ కూలీలైన చదలవాడ రాజారావు, వెంకాయమ్మ కుమారుడు క్రాంతికి చిన్నతనం నుంచి ప్రకృతి, వన్యప్రాణులంటే ఇష్టం. చిన్నతనంలో పొలం పనులకు వెళ్లే సమయంలో పాము పిల్లలతో ఆడుకునేవాడు. తర్వాత కాలంలో పాములపై ఆసక్తి పెంచుకున్నా డు. పాములు పట్టడంలో కేరళలో శిక్షణ ఇస్తారని మిత్రుల ద్వారా తెలుసుకున్నాడు. 2009లో కేరళలోని కొట్టాయంలో పాములు పట్టడం, సంరక్షించడంలో వావా సురేష్ వద్ద 8 నెలల కఠోర శిక్షణ పొందాడు. తర్వాత విశాఖకు చెందిన రొక్కం కిరణ్‌కుమార్ వద్ద మరికొన్ని మెళకువలు నేర్చుకున్నాడు. 2010 నుంచి 2016 వరకు విశాఖలో ప్రజలకు సేవలు అందించాడు. అనంతరం పశ్చిమగోదావరి జిల్లాకు తిరిగి వచ్చి 2016 డిసెంబర్ 31న స్నేక్ సేవియర్స్ సొసైటీ సంస్థను స్థాపించాడు. అప్పటినుంచి ఉమ్మడి పశ్చిమ గోదావరి, ఉమ్మడి తూర్పుగోదావరి, ఉమ్మడి కృష్ణా జిల్లాల్లో పాముల సంరక్షణకు కృషి చేస్తున్నాడు.

15 ఏళ్లు.. 19 వేలకు పైగా పాములు

క్రాంతి పాములు, వన్య ప్రాణుల సంరక్షణలో 15 ఏళ్లుగా తన వంతు బాధ్యత పోషిస్తున్నాడు. ఇప్పటివరకు సుమారు 19 వేలకుపైగా పాములను పట్టుకుని సురక్షితంగా అటవీ ప్రాంతాల్లో విడిచిపెట్టాడు. అలాగే స్నేక్ సేవియర్ సంస్థ ద్వారా పాముల సంరక్షణ, జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. తెలుగు రాష్ట్రాల్లో సుమారు 50కి పైగా పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించాడు. పాములు, వన్య ప్రాణులను రక్షించడం, వాటిపై ప్రజలకు అవగాహన కల్పించడమే స్నేక్ సేవియర్ సొసైటీ ముఖ్య ఉద్దేశమని క్రాంతి అంటున్నాడు. పాములకు హాని కలగకుండా చూడటమే తన లక్ష్యమని చెబుతున్నాడు.



గోధుమ తాచు పాముతో..



సరుగుడు జలపాతంలో నీటి ప్రవాహం


ఉమ్మడి విశాఖ జిల్లా విభజన తర్వాత అనేక పర్యాటక ప్రదేశాలు అటు విశాఖ, ఇటు ఏజెన్సీ ప్రాంతంలో ఉండిపోయాయి. కొత్త జిల్లా అనకాపల్లిలో మిగిలిన కొద్దిపాటి పర్యాటక ప్రాంతాల వైపు కూటమి పాలకులు కన్నెత్తి చూడటం లేదు. దాంతో పర్యాటకంగా అభివృద్ధి చెందకపోగా, అసౌకర్యాలతో సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారు. సరుగుడు జలపాతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతానన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు హామీ ఇచ్చి నెలలు గడుస్తున్నా కార్యరూపం దాల్చలేదు.

అడవి కాచిన సరుగుడు అందాలు

- టూరిస్టులను ఆకట్టుకునే సుందర జలపాతం
- పర్యాటక కేంద్రంగా మార్చుతానన్న అయ్యన్న
- నేటికీ అటువైపు చూడని వైనం
- సదుపాయాలు లేక సందర్శకుల ఇబ్బందులు
- అభివృద్ధి చేస్తే గిరిజనులకు ఉపాధి అవకాశాలు



తుప్పలతో జలపాతానికి వెళ్లే ప్రధాన రోడ్డు



జలపాతానికి వెళ్లాలంటే ఈ గెడ్డ దాటాల్సిందే..



శిథిలావస్థలో దుస్తులు మార్చుకునే షెడ్డు

నాతవరం: సరుగుడు జలపాతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తానన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు హామీ ఆచరణలో అమలు కాలేదు. గతేడాది డిసెంబరు 24న సుందరకోట, అసనగిరి గ్రామాల రోడ్డు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామసభలో సరుగుడు జలపాతంపై గిరిజనులు విన్నవించగా, దానికి స్పందించి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తానని భరోసా ఇచ్చారు. ఇప్పటికి నెలలు గడుస్తున్నా అటు వైపు కన్నెత్తి చూడలేదు.


మట్టిరోడ్డులో వెళ్లలేక ఇబ్బందులు

ఇక్కడ ఎత్తయిన రెండు కొండల మధ్యలోంచి జాలువారే జలపాతాన్ని చూసేందుకు ఉమ్మడి విశాఖ, తూర్పుగోదావరి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో సందర్శకులు వస్తుంటారు. సరదాగా కాలక్షేపం చేసేందుకు ఇక్కడ ఆహ్లాదకరమైన వాతావరణం కనువిందు చేస్తోంది. అక్కడకు వెళ్లడానికి కనీసం రోడ్డు సదుపాయం లేదు. సరుగుడు నుంచి సుందరకోట వెళ్లే వరకు మాత్రమే తారురోడ్డు నిర్మించారు. సరుగుడు, సుందరకోట గ్రామాల మధ్య అటవీ ప్రాంతంలో ఈ జలపాతం ఉంది. సుందరకోటకు వెళ్లే రోడ్డు మధ్యలో కుడి వైపు నుంచి జలపాతానికి వెళ్లాలి. అక్కడ్నుంచి గుంతలతో కూడిన మట్టిరోడ్డు కావడంతో ఏమాత్రం వర్షం పడినా బురదమయంగా మారుతోంది. మార్గం మధ్యలో గెడ్డ నీటిలో దాటుకుంటూ సందర్శకులు వెళ్తుంటారు. కొన్నిసార్లు సందర్శకులు మార్గం తెలియక తికమక పడుతుంటే, గిరిజనులు తాటిదుంగలతో ముఖద్వారం ఏర్పాటు చేశారు.

దుస్తులు మార్చుకోవాలంటే చెట్ల చాటుకు..

జలపాతం వద్ద స్నానాలు చేసి దుస్తులు మార్చుకోవడానికి నిర్మించిన షెడ్డు పూర్తిగా శిథిలమైంది. ఇదే కూలే స్థితిలో ఉంది. దాంతో చెట్లు మాటున మహిళలు దుస్తులు మార్చుకుంటున్నారు. ఆ సమయంలో ఆకతాయిలు తమ సెల్‌ఫోన్లలో చిత్రీకరించి ఎక్కడ సోషల్ మీడియాలో పోస్టు చేస్తారోనని భయపడుతున్నారు. జలపాతం దిగువ భాగంలో ప్రమాదాలు జరగకుండా ఏర్పాటు చేసిన ఐరన్ గ్రిల్స్ శిథిలమయ్యాయి. దాంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఉమ్మడి జిల్లాలో పర్యాటక శాఖ అధికారులు రూ. 10 లక్షలతో నిర్మించిన షెడ్డు నిర్వహణ లేక అధ్వానంగా దర్శనమిస్తోంది. జలపాతానికి వేలాది మంది వస్తుండగా, అక్కడ కనీసం మౌలిక సదుపాయాలు కల్పించడం లేదు. ఈ ప్రదేశాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే గిరిజనుల జీవనోపాధి మెరుగు పడుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధితోపాటు ఉపాధి అవకాశాలు



జలపాతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే మా గిరిజన గ్రామాలు బాగుపడతాయి. గిరిజనులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశిస్తున్నారు. మా ప్రాంత గిరిజనులు కోరిక మేరకు సుందరకోట సభలో నేను స్పీకరు దృష్టికి తీసుకెళ్లాను. పర్యాటక కేంద్రంగా చేస్తే అనంతగిరి, లంబసింగి మాదిరిగా సందర్శకులు వస్తారు.

– సాగిన లక్ష్మణమూర్తి, ఎంపీపీ, నాతవరం


వైష్ణోదేవి


వైష్ణోదేవి ఆలయం


మాతా వైష్ణోదేవి


హెలికాప్టర్ సర్వీస్


వైష్ణోదేవి ట్రెక్కింగ్

వైష్ణోదేవి దర్శనం హిమాలయాల వీక్షణం

వైష్ణోదేవి దర్శనం భారతీయుల కల అని చెప్పవచ్చు. హిందువులు భక్తిశ్రద్ధలతో పూజించే దైవం వైష్ణోదేవి. కశ్మీర్ వాసులు శ్రీ మాతా వైష్ణోదేవి అని పిలుచుకుంటారు. ఈ ఆలయం జమ్ము నగరానికి 40 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఐదు వేల అడుగులకు పైగా ఎత్తులో ఉన్న ఈ శక్తిపీఠాన్ని చేరడం కష్టం అని చెప్పకూడదు, బహు కష్టం అని చెప్పడమే కరెక్ట్. ఈ అమ్మవారు కొలువైన పర్వతం పేరు త్రికూట పర్వతం. ఏడాదికి దాదాపు కోటి మంది సందర్శించుకునే ఈ ఆలయానికి జీవితంలో ఒకసారైనా వెళ్లాలని ఉంటుంది. ఐఆర్‌సీటీసీ ఆ కోరికను తీరుస్తోంది.

1 రోజు

న్యూ ఢిల్లీ రైల్వేస్టేషన్‌లో రాత్రి 8.40కి ట్రెన్ నంబరు 12425 రాజధాని ఎక్స్‌ప్రెస్ బయలుదేరుతుంది. రాత్రంతా ప్రయాణం.

2 రోజు

తెల్లవారు జామున ఐదు గంటలకు రైలు జమ్ము రైల్వేస్టేషన్‌కు చేరుతుంది. టూర్ నిర్వాహకులు రైల్వే స్టేషన్‌లో రిసీవ్ చేసుకుంటారు. అక్కడి నుంచి కాట్రాకు రోడ్డు మార్గాన వెళ్లాలి. నాన్ ఏసీ వెహికల్‌లో ప్రయాణం. మార్గమధ్యంలో సరస్వతి ధామ్ చూసుకుని కాట్రాకు చేరి అక్కడ హోటల్ గదిలో చెక్ ఇన్ కావాలి. వైష్ణోదేవి దర్శనం తర్వాత తిరిగి హోటల్‌కు వెళ్లి భోజనం, విశ్రాంతి. రాత్రి బస అక్కడే.

వైష్ణోదేవి యాత్రలో తొలిమెట్టు కాట్రా

వైష్ణోదేవి దర్శనం అనుభూతి కాట్రా పట్టణం నుంచే మొదలవుతుంది. జమ్ములో రైలు దిగిన తరవాత నలభై కిలోమీటర్లు రోడ్డు మార్గాన ప్రయాణించాలి. ఈ పట్టణం సముద్రమట్టానికి 2,500 అడుగుల ఎత్తులో ఉంటుంది. బాణగంగానది ఈ పట్టణం నుంచే ప్రవహిస్తుంటుంది. ఇక్కడి ప్రజల భాష డోంగ్రీ. హిందీ, పంజాబీ, అస్సామీ, కశ్మీరీ భాషలు మాట్లాడే వాళ్లు కూడా ఉంటారు. హిందీ వచ్చిన పర్యాటకులు కూడా స్థానికులు మాట్లాడే హిందీ యాసను అందుకోవడం కష్టం. టూర్ నిర్వాహకులు, గైడ్‌లు ఇంగ్లిష్ మాట్లాడతారు, వైష్ణోదేవి దర్శనానికి వచ్చిన పర్యాటకులు కాట్రాలోని గెస్ట్‌హౌస్‌లు, హోటళ్లలో బస చేస్తారు. కాట్రా పట్టణం కేవలం వైష్ణోదేవి పర్యాటకుల ఆధారంగానే అభివృద్ధి చెందింది. ఇక్కడ ఒక వీధి మొత్తం సావనీర్ షాపులే. డ్రై ఫ్రూట్స్ దుకాణాలు, ఉన్ని దుస్తులు, లెదర్ జాకెట్‌ల షాపులకు లెక్క ఉండదు. ఇక్కడి నుంచి వైష్ణోదేవి ఆలయానికి ట్రెకింగ్ మొదలవుతుంది.



ఇన్సూరెన్స్ తప్పనిసరి!

వైష్ణోదేవి దర్శన యాత్ర ప్రమాదంతో కూడిన పర్యటన కావడంతో పర్యాటకులకు యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ తప్పనిసరి. నడవ లేని వాళ్ల కోసం ఎలక్ట్రిక్ వాహనాలు, హెలికాప్టర్ సర్వీస్ కూడా ఉంటుంది. కాట్రా నుంచి వైష్ణోదేవి మందిరానికి హెలికాప్టర్‌లో వచ్చేవాళ్ల సంఖ్య బాగా పెరుగుతోంది. దాంతో కాట్రా చుట్టుపక్కల ఎటు చూసినా హెలీపాడ్‌లు దర్శనమిస్తాయి. ఇటీవల రోప్‌వే సౌకర్యం కూడా మొదలైంది. ఇది కాట్రాకు వైష్ణోదేవి ఆలయానికి మధ్యలోనున్న భైరోనాథ్ ఆలయం నుంచి మొదలవుతుంది. వైష్ణోదేవిని దర్శించుకోవడానికి విమానంలో వచ్చే వాళ్లు జమ్ములో దిగాలి. కొన్ని రైల్ సర్వీసులు కాట్రా స్టేషన్‌కు వస్తాయి. కొన్ని రైళ్లు జమ్ము మీదుగా వెళ్తాయి. ఆ రైళ్లలో వచ్చిన వాళ్లు జమ్ము నుంచి రోడ్డు మార్గాన కాట్రాకు చేరాలి. ఈ పర్యటనలో పర్యాటకుల ప్రధాన ఉద్దేశం వైష్ణోదేవిని దర్శించుకోవడంగానే ఉంటుంది. కానీ కాట్రాలో ఉన్న 'శ్రీ మాతా వైష్ణోదేవి యూనివర్సిటీ'ని విజిట్ చేసి తీరాలి, కనీసం బయలు నుంచి అయినా చూడాలి. ఇక్కడ ఇంజనీరింగ్ కోర్సులు, ఎకనమిక్స్ వంటి సబ్జెక్టులతోపాటు బయోటెక్నాలజీ కోర్సులు కూడా ఉన్నాయి.

బాణగంగ కథనం

కాట్రా నుంచి వైష్ణోదేవి మందిరానికి చేరే దారిలో బాణగంగానది ఉందని చెప్పుకున్నాం. ఈ హిమాలయాల్లోని శివాలిక్ శ్రేణుల్లో పుట్టింది. ఈ ప్రవాహం చీనాబ్ నదిలో కలుస్తుంది. వైష్ణోదేవి తలస్నానం చేయడానికి సృష్టించిన నీటి వనరు అని చెబుతారు. పురాణ కథల ప్రకారం వైష్ణోదేవి... శ్రీరాముని భక్తురాలు. శ్రీరాముని దర్శనం కోసం ఆమె హనుమంతునితోపాటు త్రికూట పర్వతం మీదకు వెళ్తోంది. ఆ సమయంలో హనుమంతుడికి దాహమైంది. అతడి దాహం తీర్చడం కోసం వైష్ణోదేవి ఈ ప్రదేశంలో బాణం వేసిందని, ఆ బాణం తాకిడితో నీటి చెలమ ఏర్పడిందని, హనుమంతుడు దాహం తీర్చుకున్న తర్వాత వైష్ణోదేవి ఇక్కడే తలస్నానమాచరించిందని, అందుకే బాణ్‌గంగ అనే పేరు వచ్చిందని చెబుతారు. స్థానికులు బాల్‌గంగ అని కూడా పిలుస్తారు. దీనికి అర్థం వైష్ణోదేవి తలస్నానం చేసిన నది అని.

పర్యాటకులకు వైద్య సేవ

జమ్ము నుంచి కాట్రా వెళ్లే దారిలో సరస్వతి ధామ్ ఉంది. వైష్ణోదేవి దర్శనం కోసం వచ్చే యాత్రికుల సౌకర్యార్థం పని చేస్తోంది. బస, ఆహార సౌకర్యాలు మాత్రమే కాదు, ఈ పర్యటనలో గాయపడిన వారి చికిత్స ప్రధాన ఉద్దేశంగా వైష్ణోదేవి ఆలయ బోర్డు దీనిని ఏర్పాటు చేసింది.

3 రోజు

ఉదయం బ్రేక్‌ఫాస్ట్ తర్వాత లంచ్ ప్యాక్ చేసి ఇస్తారు. హోటల్ గది చెక్ అవుట్ చేసి కాట్రా నుంచి నుంచి చినాబ్ వంతెనకు బయలుదేరాలి. చినాబ్ వంతెన, పరిసరాల వీక్షణం తర్వాత జమ్ముకు ప్రయాణం. దారిలో రఘునాథ్ టెంపుల్ దర్శనం. రాత్రి ఎనిమిది గంటలకు జమ్ము రైల్వేస్టేషన్‌లో దించుతారు. జమ్ములో 12426 జమ్ము రాజధాని ఎక్స్‌ప్రెస్ ఎక్కాలి. ఆ రైలు రాత్రి 9.25గంటలకు బయలుదేరుతుంది. రాత్రంతా ప్రయాణం.

వంతెన ప్రయాణం ఆకాశ విహారం

చినాబ్ నది మీద వంతెన పూర్తయింది. నాలుగు దశాబ్దాల కిందట 1983లో శంకుస్థాపన చేసుకున్న ఈ వంతెన నిర్మాణం పూర్తి చేసుకుని గత నెలలో ప్రయాణానికి సిద్ధమైంది. చినాబ్ వంతెనను ఇంజనీరింగ్ మిరకిల్ అని చెప్పాలి. సుడిగాలులు, భూకంపాలను తట్టుకునే టెక్నాలజీతో నిర్మించారు. ఇది ప్రపంచంలో అత్యంత ఎత్తైన రైల్వే ఆర్చ్ బ్రిడ్జి. దీని ఎత్తు 1,178 అడుగులు. ఈ బ్రిడ్జి ఈఫిల్ టవర్ కంటే ఎత్తైన నిర్మాణం. ఈఫిల్ టవర్ ఎత్తు 1,083 అడుగులు మాత్రమే. ఇక చినాబ్ వంతెన పొడవు 4,314 అడుగుల పొడవు, అంటే 1315 మీటర్లన్న మాట. చినాబ్ నది రెండు కొండల మధ్య ప్రవహిస్తోంది. ఆ కొండలను కలుపుతూ నిర్మించిన వంతెన ఇది. జమ్ము- బారాముల్లా లైన్‌లో కౌరి- బక్కాల్ రైల్వే స్టేషన్‌ల మధ్య వస్తుంది. ప్రస్తుతం ఇది గొప్ప పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి చెందనుంది.


రఘునాథ్ టెంపుల్

ఇది ప్రయాణం కాదు విహారం!

ఏటా చలికాలంలో రోడ్డు మార్గం మంచుతో కప్పబడిపోతుంది. దాంతో జమ్ము- కశ్మీర్‌కి మిగిలిన దేశంతో సంబంధాలు తెగిపోతాయి. ఈ రైల్ బ్రిడ్జితో ఏడాది పొడవునా సామాన్యులు కశ్మీర్‌కు ప్రయాణం చేయగలుగుతారు. చినాబ్ నది మీద నిర్మించిన ఈ వంతెనను కేవలం రవాణా సౌకర్యంగా భావించలేం. ఇది ప్రపంచంలో మనదేశానికి ఒక రికార్డును అందించింది. మన ఇంజనీరింగ్ టెక్నాలజీని ప్రపంచానికి చాటుకోవడానికి గొప్ప ప్రతీకగా నిలుస్తోంది. అంతకంటే ఎక్కువగా పర్యాటకులు హిమాలయాలను కళ్ల నిండుగా చూసుకోవడానికి ఈ వంతెన గొప్ప అవకాశం. తల వంచి చూస్తే మౌనంగా ప్రవహిస్తున్న చినాబ్ నది, తల తిప్పి చూస్తే 360 డిగ్రీలలో ఎటు చూసినా హిమాలయ శ్రేణులతో ప్రకృతి రమణీయత కనువిందు చేస్తుంది.

ఫొటోలు తీసుకోవాలి!

ఈ టూర్‌లో ఫొటోలు తీసుకోవడానికి చక్కటి ప్రదేశం చినాబ్ వంతెన, ఆ పరిసరాలు. పర్యాటకుల్లో చాలా మంది చేసే పొరపాటు ఏమిటంటే... క్లోజప్ ఫొటోలు తీసుకుంటారు. ఆ ఫొటోలో మనుషులు ప్రముఖంగా కనిపిస్తుంటారు, నేపథ్యం సరిగ్గా కవర్ కాదు. కొన్ని లాంగ్ షాట్‌లు తీసుకోవాలి. పనోరమిక్ షాట్‌లు తీసుకుంటే ఇంటికి వచ్చిన తర్వాత వాటిని కంప్యూటర్‌లో చూసుకున్నప్పుడు మరోసారి ఆ ప్రదేశాల్లో మనో పర్యటన చేయవచ్చు. ఈ రైల్లో కొన్ని కోచ్‌లు పర్యాటకుల కోసం డిజైన్ చేసింది ఇండియన్ రైల్వే శాఖ. అందులో నుంచి హిమాలయాలను వీక్షిస్తూ ప్రయాణాన్ని ఆస్వాదించవచ్చు. అలాగే చక్కటి వ్యూ పాయింట్‌లను గుర్తించి అక్కడ రైలు కొద్దిసేపు ఆగుతుంది. మామూలు స్టిల్ ఫొటోగ్రఫీ కెమెరాలు, వీడియో కెమెరాలు, స్మార్ట్ ఫోన్‌లతో ఫొటోలు తీసుకోవడానికి ఎటువంటి అభ్యంతరమూ ఉండదు. కానీ డ్రోన్ కెమెరాలో చిత్రీకరించాలంటే పర్యాటకులు సంబంధిత అధికారులకు తమ వివరాలు సమర్పించి అనుమతి తీసుకోవాలి.

సాహసాల ముఖద్వారం

చినాబ్ రైలు వంతెన టూరిస్టులకు ఆటవిడుపు వంటిది. హిమాలయాల్లో పీర్‌పంజాల్ శ్రేణుల్లో ట్రెకింగ్, నదుల్లో రివర్ రాఫ్టింగ్, పారాగ్లైడింగ్, క్యాంపింగ్ వంటి అడ్వెంచరస్ స్పోర్ట్స్‌కి ఈ ప్రదేశం ఎంట్రీ పాయింట్. వైష్ణోదేవి దర్శనంతోపాటు భీమ్‌ఘర్ ఫోర్ట్, శివ్ ఖోరీ గుహాలయం, పాట్నీటాప్ హిల్ స్టేషన్, సనాసర్ సరస్సు, అడ్వెంచర్ పార్కులకు వెళ్లడానికి ఇది జంక్షన్ పాయింట్.


ఎప్పుడు వెళ్లాలి?

ఈ టూర్‌కి వెళ్లడానికి మార్చి నుంచి అక్టోబర్ మధ్య కాలం అనువుగా ఉంటుంది. ఈ సమయంలో ఆకాశం మబ్బుల్లేకుండా నిర్మలంగా ఉంటుంది. హిమాలయాలు చక్కగా కనిపిస్తాయి. నవంబర్ నుంచి మంచు కురవడం మొదలవుతుంది. ఈ సమయంలో రైల్లో ప్రయాణిస్తూ అద్దాల్లోంచి చూడడానికి బాగుంటుంది. కానీ పర్యటన సజావుగా సాగదు.

బంగారు మందిరం

జమ్ము నగరంలో రఘునాథ్ టెంపుల్‌ది ప్రత్యేకస్థానం. ఉత్తరాది రాష్ట్రాల్లోని పెద్ద ఆలయాల్లో ఇదొకటి. ఈ ఆలయం ఉన్న వీధి పేరు రఘునాథ్ బజార్. డోగ్రా పాలకులు కట్టించిన ఆలయం ఇది. మొదటి డోగ్రా పాలకుడు గులాబ్ సింగ్ 1835లో నిర్మాణాన్ని ప్రారంభించాడు. మహారాజా రణ్‌బీర్ సింగ్ 1857లో విగ్రహప్రతిష్ఠ చేశాడు. మిగిలిన భారతదేశంలో బ్రిటిష్ పాలన పట్ల అసహనం పెట్టుబుకుతూ సిపాయిల తిరుగుబాటు జరిగిన సంవత్సరం అది. ప్రతిష్ఠాపన తర్వాత మరో మూడేళ్ల పాటు చిన్న చిన్న నిర్మాణపనులు కొనసాగాయి. అంతకంటే ముందు 18వ శతాబ్దంలోనే కులు రాజు రాజా జగత్‌సింగ్ ఆలయ నిర్మాణం కోసం శంకుస్థాపన చేశాడని ఆ తర్వాత ఎదురైన రాజకీయ అనిశ్చితి కారణంగా నిర్మాణం ముందుకు సాగలేదని, కుల్లు రాజుకు సామంతులుగా ఉన్న డోగ్రా రాజులు స్వతంత్రత సాధించిన తర్వాత జమ్ము-కశ్మీర్ రాజ్య తొలి మహారాజు గులాబ్ సింగ్ నిర్మాణం మొదలు పెట్టాడని స్థానికులు చెబుతారు. ఈ ఆలయంలో రఘునాథుని పేరుతో పూజలందుకుంటున్న దేవుడు శ్రీరాముడు. ఆలయం లోపలి గోడలకు బంగారు తాపడం చేశారు. ఆలయంలో శ్రీరాముడు, సీత, లక్ష్మణుడివి ప్రధాన విగ్రహాలు. వీటితోపాటు అనేకమంది దేవుళ్ల దేవతల సాలగ్రామ రూపాలుంటాయి. ఆలయంలో సంస్కృత గ్రంథాల లైబ్రరీ ఉంది. అందులో ప్రాచీన చేతిరాత ప్రతులు కూడా ఉన్నాయి. వీటన్నింటినీ చూడడం ఆహ్లాదకరం మాత్రమే కాదు, అవగాహనకరం కూడా.


వైష్ణోదేవి యూనివర్సిటీ

వైష్ణోదేవి టూర్ రూట్ మ్యాప్



- 'మాత వైష్ణోదేవి విత్ చినాబ్ బ్రిడ్జి' టూర్ ప్యాకేజ్‌లో ప్రయాణం నాలుగు రోజులుంటుంది. ఇది ఢిల్లీ నుంచి మొదలయ్యే టూర్. ఇందులో వైష్ణోదేవి దర్శనంతోపాటు చినాబ్ వంతెన వీక్షణం ఉంటుంది. టూర్ కోడ్: MATA VAISHNODEVI WITH CHENAB BRIDGE EX DELHI (WEEKDAY) (NDR01C)
- **ప్యాకేజ్ ఇలా:** థర్డ్ ఏసీలో ప్రయాణం. కాట్రాలో ఏసీ హోటల్ బస. సింగిల్ ఆక్యుపెన్సీ 14,200 రూపాయలు. డబుల్ ఆక్యుపెన్సీలో ఒక్కొక్కరికి 11,555 రూపాయలు. ఢిల్లీకి వెళ్లే టికెట్‌లు, ఢిల్లీ నుంచి ఇంటికి వచ్చే టికెట్‌లు ఈ ప్యాకేజ్‌లో వర్తించవు.

4 రోజు

రైలు తెల్లవారు జామున 5.55 గంటలకు న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌కు చేరడంతో టూర్ పూర్తవుతుంది.


చినాబ్ నది


- వాకా మంజులారెడ్డి,
సాక్షి, ఫీచర్స్ ప్రతినిధి


చినాబ్ నదిపై రైల్వే వంతెన



పెట్టుబడి... నియ...గుపరచుకోండి.
- జె.ఆర్ ... రచయిత

ఫలితాలు, వాణిజ్య చర్చలపై దృష్టి



- ఇన్ఫోసిస్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్, బజాజ్ ఫైనాన్స్, అల్ట్రాటెక్ రెడీ
- రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంక్ కౌంటర్లలో సందడి
- ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లలో ట్రెండ్‌పై విశ్లేషకుల అంచనాలు

ప్రధానంగా తొలి త్రైమాసిక ఫలితాలే ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లలో ట్రెండ్‌ను నిర్దేశించనున్నట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. గత వారాంతాన పలు దిగ్గజాలు ఏప్రిల్‌–జూన్‌(క్యూ1) పనితీరు వెల్లడించడంతో ఇన్వెస్టర్లు ఈ కౌంటర్లపై దృష్టి పెట్టనున్నట్లు తెలియజేశారు. ఈ బాటలో మరిన్ని బ్లూచిప్స్ క్యూ1 ఫలితాలు వెల్లడించనున్నాయి. వివరాలు చూద్దాం..

– సాక్షి, బిజినెస్ డెస్క్

గత వారాంతాన ప్రకటించిన క్యూ1 ఫలితాలలో డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ సరికొత్త రికార్డ్‌కు తెరతీసింది. ఒక త్రైమాసికంలో కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా రూ. 26,994 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఈ బాటలో ప్రైవేట్ రంగ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్.. వాటాదారులకు సంస్థ చరిత్రలోనే తొలిసారి అదికూడా 1:1 నిష్పత్తిలో బోనస్ షేర్ల జారీని ప్రకటించింది. ఇక మరో దిగ్గజం ఐసీఐసీఐ బ్యాంక్ సైతం పటిష్ఠ ఫలితాలు సాధించింది. క్యూ1లో 16% వృద్ధితో రూ. 13,558 కోట్ల నికర లాభం ఆర్జించింది. వెరసి నేడు ఆర్‌ఐఎల్, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంక్ కౌంటర్లు సందడి యనున్నట్లు స్టాక్ నిపుణులు పేర్కొన్నారు.

బ్లూచిప్స్ రెడీ..: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) తొలి త్రైమాసిక ఫలితాల సీజన్ మరింత జోరందుకోనుంది. ఈ వారం డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్, ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్, అల్ట్రాటెక్ సిమెంట్, నెస్లే, ఎంఅండ్ఎం, ఏసీసీ, కాల్గేట్, డిక్సన్, తదితర బ్లూచిప్స్ క్యూ1 పనితీరు వెల్లడించనున్నాయి. అంతేకాకుండా ఎటర్నల్, జీల్, ఎంఫసిస్, కెనరా బ్యాంక్, ఎస్ బీఐ లైఫ్ తదితరాలు సైతం ఫలితాలు ప్రకటించనున్నాయి. దీంతో ఇన్వెస్టర్లు ఫలితాలపై అత్యధికంగా దృష్టి పెట్టనున్నట్లు స్వస్తికా ఇన్వెస్ట్‌మార్ట్ సీనియర్ సాంకేతిక నిపుణులు ప్రవేష్ గౌర్ పేర్కొన్నారు.

వాణిజ్య డీల్స్..: యూఎస్‌తో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునే బాటలో దేశీ ప్రభుత్వం ఇప్పటికే చర్చలు ప్రారంభించింది. ఈ వారం వాణిజ్య ఒప్పందం కుదిరితే సెంటిమెంటు సానుకూలంగా ప్రభావితమవుతుందని రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ ఎస్‌వీపీ అజిత్ మిశ్రా అభిప్రాయపడ్డారు. ఇది విదేశీ పెట్టుబడులపైనా ప్రభావం చూపే వీలున్నట్లు తెలియజేశారు. వడ్డీ రేట్లపై యూఎస్ కేంద్ర బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ సంకేతాలు సైతం కీలకంగా నిలవనున్నట్లు నిపుణులు పేర్కొన్నారు. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై గత వారం భారత్, యూఎస్ బృందాలు నాలుగు రోజులపాటు వాషింగ్టన్‌లో నిర్వహించిన ఐదో రౌండ్ చర్చలు పూర్తయిన సంగతి తెలిసిందే. దీంతో ఆగస్ట్ 1కల్లా తాత్కాలిక వాణిజ్య ఒప్పందం కుదిరే వీలున్నట్లు సంబంధిత వర్గాలు భావిస్తున్నాయి. ఫలితంగా యూఎస్ ప్రెసిడెంట్ ట్రంప్ విధించిన టారిఫ్‌ల ప్రభావానికి చెక్ పడవచ్చని అంచనా వేస్తున్నారు. ఇది ఇన్వెస్టర్లలో అనిశ్చితికి కారణమవుతున్నట్లు మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వెల్త్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమ్కా వివరించారు.

సాంకేతికంగా చూస్తే..
గత వారం నిఫ్టీ 25,000 మైలురాయి దిగువన 24,900కు క్షీణించింది. దీంతో సాంకేతిక నిపుణుల అంచనా ప్రకారం ఈ వారం ఆటుపోట్ల మధ్య మరింత బలహీనపడి 24,500వరకూ నీరసించే వీలుంది. అయితే మార్కెట్లు బలపడితే నిఫ్టీకి 25,250 స్థాయిలో రెసిస్టెన్స్ ఎదురుకావచ్చు.

గత వారమిలా

వరుసగా మూడో వారం దేశీ స్టాక్ మార్కెట్లు డీలా పడ్డాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 743 పాయింట్లు(0.9 శాతం) క్షీణించి 81,758 వద్ద నిలిచింది. ఎన్ఎస్ఈ ఇండెక్స్ నిఫ్టీ 181 పాయింట్లు తగ్గి 24,968 వద్ద ముగిసింది. బీఎస్ఈ మిడ్, స్మాల్‌క్యాప్ ఇండెక్సులు 1–1.5 శాతం చొప్పున నష్టపోయాయి.

ఎఫ్‌పీఐల వెనకడుగు

జులైలో రూ. 5,524 కోట్లు వెనక్కి



న్యూఢిల్లీ: విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) నగదు విభాగంలో ఈ నెలలో ఇప్పటివరకూ నికరంగా రూ. 5,524 కోట్ల పెట్టుబడులు వెనక్కి తీసుకున్నారు. దీంతో 2025 తొలి 7 నెలల్లో రూ. 83,245 కోట్ల విలువైన అమ్మకాలు చేపట్టారు. అయితే జూన్‌లో రూ. 14,590 కోట్లు, మే నెలలో రూ. 19,860 కోట్లు చొప్పున ఇన్వెస్ట్ చేశారు. ఏప్రిల్ మధ్య నుంచి అమ్మకాల బాటను వీడి రూ. 4,223 కోట్లు ఇన్వెస్ట్ చేశారు. అంతకుముందు మార్చిలో రూ. 3,973 కోట్లు, ఫిబ్రవరిలో రూ. 34,574 కోట్లు, జనవరిలో రూ. 78,027 కోట్లు చొప్పున పెట్టుబడులు ఉపసంహరించుకున్న సంగతి తెలిసిందే.

బిజినెస్ రీల్

డాక్టర్ రెడ్డీస్ ప్లాంటుకు ఫామ్ 483

జారీ చేసిన యూఎస్ఎఫ్‌డీఏ



న్యూఢిల్లీ: యూఎస్ ఎఫ్‌డీఏ 7 లోపాలను గుర్తిస్తూ (అబ్జర్వేషన్స్) ఫామ్–483ను జారీ చేసినట్లు ఫార్మా రంగ దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ తాజాగా వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం వద్ద గల ఫార్ములేషన్ల తయారీ ప్లాంటులో జీఎంపీ, ప్రీ అప్రూవల్ తనిఖీ(పీఏఐ)లు చేపట్టినట్లు పేర్కొంది. ఈ నెల 10–18 మధ్య చేపట్టిన తనిఖీలలో భాగంగా ఫామ్–483ను జారీ చేసినట్లు తెలియజేసింది. అయితే నిర్ధారిత గడువులోగా వీటిని సరిచేయనున్నట్లు తెలియజేసింది.

ఇండియా సిమెంట్స్‌కు నష్టాలు

క్యూ1లో రూ. 133 కోట్లు



చెన్నై: ఆదిత్య బిర్లా గ్రూప్ దిగ్గజం అల్ట్రాటెక్‌కు అనుబంధ సంస్థగా వ్యవహరిస్తున్న ఇండియా సిమెంట్స్ ఈ ఆర్థిక సంవత్సరం (2025–26) తొలి త్రైమాసికంలో నష్టాలలోకి ప్రవేశించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్ (క్యూ1)లో రూ. 133 కోట్ల నికర నష్టం ప్రకటించింది. గతేడాది (2024–25) ఇదే కాలంలో రూ. 58 కోట్లకుపైగా నికర లాభం ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 1,042 కోట్ల నుంచి రూ. 1,034 కోట్లకు స్వల్పంగా క్షీణించింది. ఈ కాలంలో అనుబంధ సంస్థ ఇండస్ట్రియల్ కెమికల్స్ అండ్ మోనోమర్స్ లిమిటెడ్‌లో పూర్తి వాటా విక్రయించేందుకు బోర్డు అనుమతించినట్లు ఇండియా సిమెంట్స్ వెల్లడించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్‌–నెక్ / 100కు రూ.లలో)

21-7-2025

విశాఖ	540–00
చిత్తూరు	543–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	505–00
విజయవాడ	520–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	510–00
వరంగల్	512–00
రిటైల్ ధర	5.70

ఆర్థిక సంక్షేమానికి 'కస్టమైజ్డ్' ఆరోగ్య బీమా



హిమాన్షు వాలియా
సీఎంవో, స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్



దేశీయంగా ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో నాటకీయ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. చికిత్స ఖర్చులు, తీవ్రమైన వ్యాధులు, ప్రివెంటివ్ కేర్‌పై వినియోగదారుల్లో అవగాహన పెరుగుతుండటం తదితర అంశాల వల్ల సంప్రదాయ ఆరోగ్య బీమా పాలసీల తీరుతెన్నులు మారిపోయాయి. అందరికీ ఒకే రకం పాలసీలనేవి ఇప్పటి పరిస్థితులకు అనువైన విధానంగా ఉండటం లేదు. నేటి కస్టమర్లు తమ వాస్తవిక అవసరాలు, వ్యక్తిగత వైద్య చరిత్ర, మారే జీవన దశలకు అనుగుణంగా, సమయోచితంగా, సరళంగా ఉండే పాలసీలను కోరుకుంటున్నారు. 30లలో ఉన్న ఒంటరి వర్కింగ్ ఉమన్ కావచ్చు లేదా మధుమేహం ఉన్న సీనియర్ సిటిజన్ కావచ్చు లేదా పిల్లల కోసం ప్లానింగ్ చేసుకుంటున్న యువ జంట కావచ్చు ఒక్కొక్కరి అవసరాలు ఒక్కో రకంగా ఉంటాయి. ఒకే రకమైన పాలసీ వల్ల వారి అవసరాలు తీరవు. ఇలా వినియోగదారుల మైండ్‌సెట్ మారడం వల్ల, తమకు అనువైన విధంగా మార్చుకోగలిగే మాడ్యులర్ లేదా కస్టమైజబుల్ హెల్త్ ప్లాన్లకు ఆదరణ పెరుగుతోంది. ఆరోగ్య సంరక్షణకు సంబంధించి ఇది స్మార్ట్ విధానంగా ఉంటోంది.

ఈ హెల్త్ ప్లాన్లలో ప్రత్యేకతలు..

కస్టమైజబుల్ లేదా మాడ్యులర్ హెల్త్ ప్లాన్లనేవి నిర్దిష్టమైన ఆరోగ్య సంరక్షణ అవసరాలకు తగ్గ కవరేజీని తీసుకునేలా పాలసీదారులకు వెసులుబాటు కల్పిస్తాయి. చాలా మటుకు పథకాల్లో, బేస్ హాస్పిటలైజేషన్ కవరేజీ ఉంటుంది. వ్యక్తిగత అవసరాలను బట్టి మరిన్ని ఫీచర్లను జోడించుకునేందుకు ఇవి యూజర్లకు వీలు కల్పిస్తాయి. ఉదాహరణకు, ప్రీ–సెట్ రూమ్ కేటగిరీకే పరిమితమైపోకుండా, పాలసీదారులు షేర్డ్ రూమ్‌ల నుంచి మొదలుపెట్టి ఎలాంటి పరిమితులు లేని లేదా సూట్ స్థాయి గదుల వరకు వేర్వేరు రూమ్ రెంట్ ఆప్షన్లను ఎంచుకోవచ్చు. సమ్ ఇన్సూర్డ్ రిస్టోరేషన్ అనేది మరో ప్రధాన ఫీచరు. ఒకవేళ పాలసీదారుకు, సంవత్సరం మధ్యలో కవరేజీ అయిపోతే, చాలా మటుకు ప్లాన్లు ఆటోమేటిక్‌గా బీమా మొత్తాన్ని పూర్తిగా పునరుద్ధరిస్తాయి. ఇలా ఏడాదిలో ఒకసారికి మించి పునరుద్ధరిస్తాయి. కాలక్రమేణా, సంవత్సరాల తరబడి ఎలాంటి క్లెయిమూ చేయకపోతే పర్మనెంట్ నో–క్లెయిమ్ బోనస్ ప్రయోజనం దక్కుతుంది. అదనపు పేపర్‌వర్క్ లేదా గణనీయంగా ప్రీమియంల పెరిగే ప్రసక్తి లేకుండానే సమ్ ఇన్సూర్డ్ పరిమాణం పెరిగే అవకాశం ఉంటుంది.

ఈ ప్లాన్లు పలు యాడ్–ఆన్లను అందిస్తాయి. మెటర్నిటీ కవరేజీ, క్రిటికల్ ఇల్‌నెస్ సంరక్షణ, అంబులెన్స్ సర్వీసులు, హోమ్ కేర్, ఆయుష్ చికిత్సలు, దంత సంరక్షణలాంటి అనేక ప్రయోజనాలను కల్పిస్తాయి. జీవిత దశలను బట్టి రైడర్లను తీసుకునే మాడ్యులర్ ప్లాన్లు ఆకర్షణీయమైనవిగా ఉంటాయి. యువ ప్రొఫెషనల్స్, అవసరమైతే ప్రీమియంను తగ్గించుకునేందుకు, మెటర్నిటీ ప్రయోజనాలను వదులుకుని, అధిక డిడక్టబుల్‌ని ఎంచుకోవచ్చు. పిల్లల కోసం ప్లానింగ్ చేసుకుంటున్న జంట మొదటి రోజు నుంచి మెటర్నిటీ, నవజాత శిశువు, ఓపీడీ కేర్‌ను ఎంచుకోవచ్చు. ఇలాంటి అనేకానేక అవకాశాలు ఉండటమనేది పాలసీదారులు తమ బడ్జెట్‌కు తగ్గట్లుగా ప్లాన్ చేసుకునేందుకు వీలవుతుంది. అలాగే, తమకు ప్రస్తుతం అవసరమైనది మాత్రమే తీసుకుని, తర్వాత పరిస్థితులు మారే కొద్దీ కవరేజీని పెంచుకునేందుకు ఉపయోగకరంగా ఉంటుంది.

ఎవరికి ఎక్కువ ప్రయోజనం?


20ల ఆఖర్లోను, 40ల మధ్యలోను ఉన్న వారికి, అంటే తమ కెరియర్లలో ప్రారంభ, మధ్య దశల్లో ఉన్నవారికి ఇలాంటి ప్లాన్లు ప్రయోజనకరంగా ఉంటాయి. తమ జీవన విధానం, ఫ్యామిలీ ప్లానింగ్, దీర్ఘకాలిక ఆరోగ్య లక్ష్యాల ఆధారంగా పథకాన్ని మార్చుకోగలిగే వెసులుబాటుతో తక్కువ ప్రీమియంలను లాక్ ఇన్ చేసుకునే అవకాశం పొందవచ్చు. యువ ప్రొఫెషనల్స్ చాలా తక్కువ యాడ్–ఆన్‌లు, అధిక డిడక్టబుల్స్‌ను ఎంచుకోవచ్చు. అలాగే జంటలు లేదా యువ కుటుంబాలు మెటర్నిటీకి, నవజాత శిశువు సంరక్షణ, వెల్‌నెస్ ఫీచర్లకు ప్రాధాన్యమివ్వొచ్చు. 50లకు చేరువవుతున్న వారూ బేస్ పాలసీని సమూలంగా మార్చేసుకోకుండా, క్రిటికల్ ఇల్‌నెస్ లేదా తీవ్రమైన అనారోగ్యాల నియంత్రణకు సంబంధించిన నిర్దిష్ట కవరేజీలను తీసుకోవడం ద్వారా మాడ్యులర్ ప్లాన్ల నుంచి ప్రయోజనం పొందవచ్చు.

అయితే, కస్టమైజ్ చేసుకునేటప్పుడు అన్ని వివరాలను సంపూర్ణంగా తెలుసుకోవాల్సిన బాధ్యత ఉంటుంది. కొన్ని కవరేజీలను వదిలివేయడం లేదా తక్కువ లిమిట్స్‌ను ఎంచుకోవడం (ఉదాహరణకు రూమ్ రెంట్‌కి పరిమితులు) లేదా క్రిటికల్ ఇల్‌నెస్‌ను ఎంచుకోకపోవడం లాంటి అంశాల వల్ల, వైద్యపరంగా తీవ్రమైన పరిస్థితులు ఎదురైనప్పుడు తగినంత కవరేజీ లేకుండా పోయే అవకాశం ఉంది. కో–పే పర్సంటేజీలు, ఉప–పరిమితులు, వెయిటింగ్ పీరియడ్లు, మినహాయింపులు మొదలైన ముఖ్యమైన వివరాలన్నీ పాలసీ డాక్యుమెంట్లలో ఉంటాయి. ఇవన్నీ కూడా క్లెయిమ్‌లపై గణనీయమైన ప్రభావం చూపుతాయి. అలాగే, క్లెయిమ్‌ల ప్రాసెసింగ్ లేదా ఆమోదించడానికి పట్టే సమయంపై కొన్ని యాడ్–ఆన్‌లు ప్రభావం చూపవచ్చు. కాబట్టి, పర్సనలైజ్ చేసుకునే సౌకర్యం ఉన్నప్పటికీ, పాలసీని కేవలం అఫోర్డబిలిటీ కోణంలోనే చూడకుండా అత్యవసర పరిస్థితుల్లో అర్థవంతమైన విధంగా భద్రత లభించేలా ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిశీలించుకోవడం కూడా చాలా ముఖ్యం. కస్టమైజ్ చేసుకోదగిన ప్లాన్లనేవి ప్యాసివ్ ఇన్సూరెన్స్ విధానానికి భిన్నంగా ఆరోగ్య సంరక్షణ కోసం క్రియాశీలకంగా ప్లానింగ్ చేసుకునేందుకు తోడ్పడతాయి. మరింత నియంత్రణను, మరింత విలువను, అలాగే మీ అవసరాలకు అనుగుణంగా మార్చుకునే వెసులుబాటును అందిస్తాయి. ఆరోగ్యపరమైన రిస్కులు అనూహ్యమైన విధంగా ఉంటున్న నేపథ్యంలో మాడ్యులర్ హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్లనేవి, ఆర్థిక సంక్షేమానికి సుస్థిర విధానంగా ఉపయోగపడగలవు.

ఐపీఓ స్ట్రీట్

4 ఇష్యూలు.. 1 లిస్టింగ్

ఈ వారం పబ్లిక్ ఆఫర్ల జోరు



ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లలో మరోసారి ప్రైమరీ మార్కెట్లు కళకళలాడనున్నాయి. 4 కంపెనీల పబ్లిక్ ఇష్యూలు ప్రారంభంకానుండగా.. మరోవైపు ఇప్పటికే ఐపీవో పూర్తి చేసుకున్న ఏంథమ్ బయోసైన్స్ స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్ కానుంది. గత వారం మెయిన్‌బోర్డ్‌లో ఇష్యూ పూర్తి చేసుకున్న ఏంథమ్ బయోసైన్స్ కౌంటర్‌లో నేడు(21న) ట్రేడింగ్‌కు తెరలేవనుంది. ఇష్యూ ధర రూ. 570కాగా.. 64 రెట్లు అధికంగా స్పందన లభించడం గమనార్హం! కాగా.. వర్క్‌స్పేస్ సొల్యూషన్స్ సమకూర్చే ఇండిక్యూబ్ స్పేసెస్‌తోపాటు.. డెస్క్‌టాప్, ల్యాప్‌టాప్, మొబైళ్లు తదితర ప్రొడక్టుల పునరుద్ధరణ కంపెనీ జీఎన్‌జీ ఎలక్ట్రానిక్స్ ఐపీవోలు 23న ప్రారంభంకానున్నాయి. 25న ముగియనున్న ఇష్యూల ద్వారా ఇండిక్యూబ్ రూ. 700 కోట్లు, జీఎన్‌జీ రూ. 460 కోట్లకుపైగా సమకూర్చుకునే యోచనలో ఉన్నాయి. రెండు సంస్థలు ఒకే విధంగా రూ. 225–237 ధరల శ్రేణిని ప్రకటించాయి. ఈ బాటలో ఆతిథ్య రంగ సంస్థ బ్రిగేడ్ హోటల్ వెంచర్స్ ఐపీవో 24న ప్రారంభంకానుంది. 28న ముగియనున్న పబ్లిక్ ఇష్యూ ద్వారా హోటళ్ల చైన్ సంస్థ రూ. 750 కోట్ల వరకూ సమీకరించే యోచనలో ఉంది. బెంగళూరు, చెన్నై, కొచ్చి తదితర ప్రాంతాలలో ఏర్పాటు చేసిన 9 హోటళ్ల ద్వారా 1,604 గదులను నిర్వహిస్తోంది. బంగారు ఆభరణ తయారీ సంస్థ శాంతి గోల్డ్ ఇంటర్నేషనల్ ఐపీవో 25న ప్రారంభంకానుంది. దీనిలో భాగంగా కంపెనీ 1.8 కోట్ల షేర్లు కొత్తగా జారీ చేయనుంది. ఈ రెండు సంస్థలు ధరల శ్రేణిని ప్రకటించవలసి ఉంది.

వైద్యానికి సంబంధించి మినహాయింపులు

ఈ వారం సెక్షన్ 80లో పొందుపర్చిన అంశాలు... వైద్యానికి సంబంధించిన మినహాయింపులు గురించి తెలుసుకుందాం. ముఖ్య విషయం ఏమిటంటే ఇవన్నీ కూడా కేవలం పాత పద్ధతిని అనుసరించిన వారికే మాత్రమే వర్తిస్తాయి.



కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి
కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు

80D - మెడికల్ ఇన్సూరెన్స్ ప్రీమియం

ఈ సెక్షన్ వ్యక్తులకు మాత్రమే వర్తిస్తుంది. ఒక వ్యక్తి తన కోసం, జీవిత భాగస్వామి కోసం తన మీద ఆధారపడ్డ పిల్లల కోసం చెల్లించే మెడికల్ ఇన్సూరెన్స్ ప్రీమియంకి వర్తిస్తుంది. ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.25,000 పరిమితిని మించి మినహాయింపు ఇవ్వరు. తల్లిదండ్రులు 60 సంవత్సరాల లోపు వారయితే అదనంగా రూ.25,000 వారి నిమిత్తం చెల్లించే ప్రీమియంలపై, మొత్తం మీద రూ.50,000 మినహాయింపు ఇస్తారు. కుటుంబంలో ఏ వ్యక్తి చెల్లిస్తాడో... ఆ వ్యక్తి ఇన్‌కంలోంచి మినహాయింపు ఇస్తారు. ఇతరులకు ఇవ్వరు. నగుదులో చెల్లించిన ప్రీమియంలకు మినహాయింపు దొరకదు. చెక్కు ద్వారా, డీడీ ద్వారా ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలి. వ్యక్తి, అతని తల్లిదండ్రులు.. అందరూ 60 సంవత్సరాల్లోపు ఉంటే మొత్తం రూ.50వేలు, వ్యక్తి 60 సంవత్సరాల్లోపు ఉండి, తల్లిదండ్రులు అరవై ఏళ్లు దాటిన వారు అయితే రూ.25,000 కాకుండా అదనంగా రూ.50,000 దాకా మినహాయింపు ఇస్తారు. వ్యక్తి, తల్లిదండ్రులు 60 ఏళ్లు దాటితే రూ.50వేలు + 50వేలు = మొత్తం రూ. 1,00,000 ఇస్తారు. ఇవన్నీ కాకుండా ప్రివెంటివ్ హెల్త్ చెకప్ నిమిత్తం రూ.50 వేలు ఖర్చు పెట్టొచ్చు. ఈ మేరకు నగదు చెల్లించవచ్చు. కానీ ఖర్చు మొత్తం గరిష్ఠ పరిమితికి లోబడి ఉంటుంది.

రెండవ అంశం 80DD

ఒక వ్యక్తి మీద ఆధారపడ్డ మనిషి దివ్యాంగుడైతే, అతని వైద్యం నిమిత్తం చేసిన ఖర్చులకు మినహాయింపు ఉంది. ఈ అంగవైకల్యాన్ని శాతాల్లో చెప్పాలంటే ... 40% లోపల ఉంటే రూ.75,000; 80 శాతానికిపైన ఉంటే రూ.1.25 లక్షల మినహాయింపు ఉంటుంది. వైద్య ఖర్చులే కాకుండా, ఈ వ్యక్తుల మీద చేసిన జీవిత బీమా ప్రీమియం చెల్లింపులకు కూడా వర్తిస్తుంది. వైద్య ఖర్చులు, నర్సింగ్, పునరావాస నిమిత్తం మొదలైనవి ఇందులో క్లెయిమ్ చేసుకోవచ్చు. మానసిక, చెవుడు, బుద్ధి మాంద్యం, మస్తిష్క పక్షవాతం, ఆటిజం, గుడ్డితనం, చూపుతక్కువ, లోకోమోటర్ వైకల్యం (అవయవాలు లేదా శరీరభాగాలు కదలికలకు సంబంధించింది) కుష్టు వ్యాధి మొదలైన వాటికి మినహాయింపు ఉంది. ఫారం 101A జతపరచాలి. వైద్య అధికారులు సర్టిఫై చేయాలి. ఇది కాకుండా సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాలి. అంగవైకల్యం మారుతూ ఉంటుంది. తేడాలు వస్తాయి. సర్టిఫికెట్లలో ధృవీకరించిన శాతాన్ని బట్టే మినహాయింపు ఉంటుంది. దివ్యాంగుడు ముందుగా మరణిస్తే, స్కీమ్ ద్వారా వచ్చిన మొత్తాన్ని, ఏ వ్యక్తి అకౌంటులోకి వస్తుందో, ఆ వ్యక్తి ఆదాయంలో కలుపుతారు. దివ్యాంగుడు జీవించి ఉన్నప్పుడు, 60 సంవత్సరాలు తర్వాత వచ్చే యాన్యుటీకి మినహాయింపు ఉంది. ఈ సెక్షన్‌లో మినహాయింపును తీసుకున్న వ్యక్తి, ఈ ప్రయోజనాన్ని సెక్షన్ 80U ప్రకారం పొందకూడదు.

80 DDB

దీని ప్రకారం వ్యక్తి తన కోసం లేదా తన మీద ఆధారపడిన వ్యక్తి నిర్దేశిత జబ్బుల చికిత్సకు అయిన ఖర్చు క్లెయిమ్ చేసుకోవచ్చు. గరిష్ఠ పరిమితి రూ.40 వేలు (60 ఏళ్ల లోపల) రూ.1,00,000 సీనియర్ సిటిజన్లకు తగ్గిస్తారు. 11 DD రూల్ ప్రకారం క్లెయిమ్ చెయ్యాలి. న్యూరాలజిస్ట్, అంకాలజిస్ట్, యూరాలజిస్ట్, హెమెటాలాజిస్ట్, ఇమ్యూనోలాజిస్ట్, మొదలైన స్పెషలిస్టులు ధృవీకరించాలి. పూర్తి వివరాలు ఇవ్వాలి. సంతకం కచ్చితంగా ఉండాలి. అసెస్సీతో సంబంధం లేకుండా పేషెంటు వయస్సుని బట్టి మినహాయింపు ఉంటుంది. సీనియర్ సిటిజన్లకు రూ.1 లక్ష దాకా, ఇతరులకు రూ.40,000 ఇస్తారు. ఇన్సూరెన్స్ క్లెయిమ్ వచ్చినట్లయితే ఆ విలువ మేరకు మినహాయిపు తగ్గుతుంది.


చివరిగా మరొకటి.. 80U

దీని ప్రకారం మినహాయింపు. మెడికల్ ఆథారిటీతో సర్టిఫై చేయిస్తే అంగవైకల్యం 40% దాటి ఉంటే రూ.75 వేలు, 80% దాటి ఉంటే రూ.1.25 లక్షల మినహాయింపు ఇస్తారు. ఫారం 101A ఫైల్ చేయాలి. గవర్నమెంట్ హాస్పిటల్‌లోని సివిల్ సర్జన్లు/ చీఫ్ మెడికల్ అధికారి సర్టిఫై చేయాలి. అంగవైకల్యం సర్టిఫికెట్ కొత్తది జతపర్చాలి. అంధత్వం, కుష్టు, చెవుడు, మానసిక వైకల్యం, మానసిక మాంద్యం... వీటి విషయంలోనే ఇస్తారు. డబ్బులు ఖర్చు పెట్టక్కర్లేదు. చివరగా హెచ్చరిక ఏమిటంటే.. సరైన ధృవపత్రాలుండాలి. నకిలీ డాక్టర్లు, నకిలీ పత్రాలు వద్దు. అన్నింటికి రికార్డు స్పష్టంగా ఉండాలి.

పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

దీర్ఘకాలానికి మంచి ట్రాక్ రికార్డు

హెచ్‌డీఎఫ్‌సీ ఫ్లెక్సీక్యాప్ ఫండ్



ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడుల పట్ల ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్‌కు కొంత మొత్తాన్ని కేటాయించుకోవాల్సిందే. ఎందుకంటే అన్ని రకాల మార్కెట్ విభాగాల్లోనూ పెట్టుబడులు పెట్టే స్వేచ్ఛతో ఇవి పనిచేస్తుంటాయి. స్మాల్, మిడ్, లార్జ్‌క్యాప్ కంపెనీల్లో మెరుగైన అవకాశాలను గుర్తించి ఇన్వెస్ట్ చేయడం ద్వారా దీర్ఘకాలంలో రిస్క్‌ను సమతుల్యం చేస్తూ.. మెరుగైన రాబడులను ఇచ్చే విధంగా ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్ పనిచేస్తుంటాయి. ఈ విభాగంలో దశాబ్దాలుగా పనిచేస్తూ మంచి పనితీరు చూపిస్తున్న వాటిల్లో హెచ్‌డీఎఫ్‌సీ ఫ్లెక్సీక్యాప్ ముందుంది.

రాబడులు..
గత పదేళ్ల కాల పనితీరును గమనించినట్టయితే వార్షిక రాబడి 16 శాతం చొప్పున ఉంది. ఏడేళ్లలో 20 శాతం చొప్పున రాబడులను అందించింది. ఐదేళ్లలో 30 శాతం, మూడేళ్లలో 27.43 శాతం చొప్పున పెట్టుబడులపై ప్రతిఫలాన్ని అందించింది. గత ఏడాది కాల రాబడి 8.43 శాతంగా ఉంది. 1995లో ఈ పథకం మార్కెట్లోకి వచ్చింది. అప్పటి నుంచి చూస్తే వార్షిక రాబడి 18.92 శాతం చొప్పున ఉంది. ఇన్వెస్టర్లు నేరుగా స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేసినట్టయితే.. మార్కెట్ పతనాలు, రంగాలు, కంపెనీల వారీ పరిణామాలను గమనించి సకాలంలో సరైన నిర్ణయాలు తీసుకోవడం కష్టమైన పని. మ్యూచువల్ ఫండ్స్ మేనేజర్లు ఈ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించగలరు. కనుక సంపద సమకూర్చుకోవాలని భావించే వారు ఈక్విటీ ఫండ్స్‌కు తగినంత కేటాయించుకోవడం అవసరం. సిప్ ద్వారా కనీసం రూ.100 నుంచి ఈ పథకంలో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.

పెట్టుబడుల విధానం..
చురుకైన, క్రమశిక్షణతో కూడిన పెట్టుబడుల విధానం ఈ పథకంలో గమనించొచ్చు. భవిష్యత్తులో గొప్పగా వృద్ధి చెందే బలాలున్న కంపెనీలను గుర్తించి ఇన్వెస్ట్ చేస్తుంటుంది. పోర్ట్‌ఫోలియోలో తగినంత వైవిధ్యాన్ని నిర్వహిస్తుంది. ఫ్లెక్సీక్యాప్ విభాగంలో పోటీ పథకాలతో పోల్చి చూసినప్పుడు హెచ్‌డీఎఫ్‌సీ ఫ్లెక్సీక్యాప్ ఫండ్ స్టాక్స్ నాణ్యత మెరుగ్గా ఉన్నట్టు తెలుస్తుంది. మొత్తం పోర్ట్‌ఫోలియో పీఈ 17.68గా ఉంది. సగటున కంపెనీల వార్షిక వృద్ధి 27.42 శాతం చొప్పున ఉంది. క్వాలిటీ, వ్యాల్యూ వ్యూహాలను సైతం ఈ పథకం అమలు చేస్తుంటుంది. ఫ్లెక్సీక్యాప్ విభాగంలో ఈ పథకంతోపాటు పరాగ్ పారిఖ్ ఫ్లెక్సీక్యాప్ ఫండ్ టాప్–2గా ఉన్నాయి.

పోర్ట్‌ఫోలియో..
ప్రస్తుతం ఈ పథకం నిర్వహణలో రూ.79,585 కోట్ల నిర్వహణ ఆస్తులు (ఏయూఎం) ఉన్నాయి. ఇందులో 87 శాతాన్ని ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసింది. డెట్ సాధనాల్లో 0.66 శాతం పెట్టుబడులు ఉన్నాయి. రియల్ ఎస్టేట్ సాధనాల్లోనూ 2.62 శాతం మేర పెట్టుబడులు కలిగి ఉంది. 9.72 శాతం నగదు నిల్వలు ఉన్నాయి. మార్కెట్లు దిద్దుబాటుకు లోనైతే పెట్టుబడులకు వీలుగా నగదు నిల్వలు అధికంగా నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది. ఈక్విటీ పెట్టుబడుల్లో 87 శాతం లార్జ్‌క్యాప్‌లోనే ఉండడం గమనార్హం. మిడ్ క్యాప్ స్టాక్స్‌లో 9 శాతం, స్మాల్‌క్యాప్ స్టాక్స్‌లో 3.91 శాతం చొప్పున పెట్టుబడులు కలిగి ఉంది. లార్జ్‌క్యాప్ వ్యాల్యూషన్లు సహేతుక స్థాయిలో ఉండడంతో ఎక్కువ పెట్టుబడులు ఈ విభాగంలోనే ఉన్నట్టు తెలుస్తోంది. పోర్ట్‌ఫోలియోలో మొత్తం 51 స్టాక్స్ ఉన్నాయి. అత్యధికంగా 40 శాతం వరకు బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగ కంపెనీల్లోనే ఇన్వెస్ట్ చేసింది. ఆ తర్వాత కన్జ్యూమర్ డిస్క్రీషనరీ కంపెనీలకు 16.99 శాతం, హెల్త్‌కేర్ కంపెనీలకు 8.64 శాతం, టెక్నాలజీ కంపెనీలకు 8.55 శాతం చొప్పున పెట్టుబడులు కేటాయించింది.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడుల శాతం
ఐసీఐసీఐ బ్యాంక్	9.27
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	9.05
యాక్సిస్ బ్యాంక్	7.84
ఎస్‌బీఐ లైఫ్	4.62
కోటక్ బ్యాంక్	4.49
మారుతి సుజుకీ	3.90
సిప్లా	3.78
ఎస్‌బీఐ	3.09
భారతీ ఎయిర్‌టెల్	2.78
హెచ్‌సీఎల్ టెక్	2.67

సాక్షి ప్లస్
సోమవారం । 21-7-2025



పాక్‌తో మ్యాచ్ బహిష్కరణ

- భారత లెజెండ్స్ జట్టు నిర్ణయం
- మ్యాచ్‌ను రద్దు చేసిన డబ్ల్యూసీఎల్ నిర్వాహకులు

బర్మింగ్‌హామ్: 'వరల్డ్ చాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్' (డబ్ల్యూసీఎల్) టోర్నమెంట్‌లో భాగంగా ఆదివారం పాకిస్తాన్‌తో జరగాల్సిన మ్యాచ్‌ను భారత స్టార్లు బహిష్కరించారు. జమ్మూకశ్మీర్ పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్తాన్‌తో ఏ స్థాయిలోనూ క్రికెట్ ఆడబోమని శిఖర్ ధావన్ సహా భారత ఆటగాళ్లు వెల్లడించడంతో దాయాదుల పోరును రద్దు చేయక తప్పలేదు. ఇంగ్లండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) నిర్వహిస్తున్న ఈ టోర్నీ రెండో సీజన్ పోటీలు గత నెల 18న ఎడ్జ్‌బాస్టన్ వేదికగా ప్రారంభమయ్యాయి. వచ్చేనెల 2న జరగనున్న ఫైనల్‌తో టోర్నమెంట్ ముగియనుంది. ఇందులో భారత చాంపియన్స్ జట్టుకు స్టార్ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ సారథ్యం వహిస్తున్నాడు. జట్టులో హర్భజన్ సింగ్, శిఖర్ ధావన్, ఇర్ఫాన్ పఠాన్, యూసుఫ్ పఠాన్, సురేశ్ రైనా, రాబిన్ ఉతప్ప, వరుణ్ ఆరోన్ వంటి పలువురు భారత మాజీ ప్లేయర్లు ఉన్నారు. బర్మింగ్‌హామ్ వేదికగా జరగాల్సిన భారత్, పాకిస్తాన్ మ్యాచ్ రద్దు అయినట్లు డబ్ల్యూసీఎల్ నిర్వాహకులు సామాజిక మాధ్యమాల వేదికగా వెల్లడించారు. 'పాకిస్తాన్ హాకీ జట్టు భారత్‌లో ఆడనుందనే వార్తలతో పాటు మరి కొన్ని క్రీడల్లో ఇరు దేశాల మధ్య పోటీలు జరుగుతున్న నేపథ్యంలో డబ్ల్యూసీఎల్‌లో దాయాదుల మ్యాచ్ ద్వారా కొన్ని ఆనంద క్షణాలు పంచుకోవచ్చని అనుకున్నాం. అయితే మా నిర్ణయం చాలా మందికి నచ్చలేదని అర్థమైంది. వారి మనోభావాలను దెబ్బతీయకూడదనే ఉద్దేశంతో మ్యాచ్‌ను రద్దు చేశాం. ఎవరికైన ఇబ్బంది కలిగించి ఉంటే మన్నించమని కోరుతున్నాం'అని డబ్ల్యూసీఎల్ పేర్కొంది.

పాకిస్తాన్ లెజెండ్స్ జట్టుకు షాహిద్ అఫ్రిది కెప్టెన్‌గా వ్యవహరిస్తుండగా... షోయబ్ మాలిక్, హఫీజ్, యూనిస్ ఖాన్, తన్వీర్, వహాబ్ రియాజ్, కమ్రాన్ అక్మల్ జట్టులో ఉన్నారు. మరోవైపు ఈ మ్యాచ్ ఆడకూడదని ధావన్ ఇప్పటికే సామాజిక మాధ్యమాల వేదికగా వెల్లడించాడు. టోర్నీ ఆరంభం కావడానికి ముందే పాకిస్తాన్‌తో మ్యాచ్‌లు ఆడబోనని ధావన్ స్పష్టం చేశాడు. పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రదాడి అనంతరం భారత ప్రభుత్వం 'ఆపరేషన్ సిందూర్'పేరిట ప్రత్యేక ఆపరేషన్ చేపట్టి పాక్ ఆక్రమిత కశ్మీర్‌తో పాటు... పాకిస్తాన్‌లోని ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసింది. ఎంపీలు యూసుఫ్ పఠాన్, హర్భజన్ సింగ్‌తో పాటు ఇర్ఫాన్ పఠాన్ కూడా చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో మ్యాచ్‌కు సుముఖత వ్యక్తం చేయలేదని డబ్ల్యూసీఎల్ తెలిపింది. ఎడ్జ్‌బాస్టన్‌లో జరిగిన గత ఎడిషన్ ఫైనల్లో పాకిస్తాన్ లెజెండ్స్‌పై 5 వికెట్ల తేడాతో నెగ్గిన భారత చాంపియన్స్ జట్టు తొలి టైటిల్ కైవసం చేసుకుంది.

నిశాంత్ 'హ్యాట్రిక్'



న్యూఢిల్లీ: ప్రొఫెషనల్ బాక్సింగ్ సర్క్యూట్‌లో భారత స్టార్ నిశాంత్ దేవ్ వరుసగా మూడో విజయం అందుకున్నాడు. టెక్సాస్‌లో లాక్వాన్ ఇవాన్స్ (అమెరికా)తో జరిగిన సూపర్ వెల్టర్ వెయిట్ విభాగం బౌట్‌లో నిశాంత్ టెక్నికల్ నాకౌట్ పద్ధతిలో గెలుపొందాడు. నిశాంత్ పంచ్‌ల ధాటికి ఇవాన్స్ తట్టుకోలేకపోవడంతో చివరిదైన ఆరో రౌండ్ పూర్తి కాకముందే రిఫరీ బౌట్‌ను నిలిపివేశారు. ఈ ఏడాది జనవరిలో విగిన్స్ (అమెరికా)తో, జూన్‌లో జోస్ సిల్వా (మెక్సికో)తో జరిగిన బౌట్‌లలోనూ నిశాంత్ గెలిచాడు. 2023 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో నిశాంత్ (71 కేజీలు) కాంస్య పతకం సాధించాడు. 2024 పారిస్ ఒలింపిక్స్ క్వార్టర్ ఫైనల్లో మార్కో వెర్డె (మెక్సికో) చేతిలో ఓడిపోయి కాంస్య పతకం కోల్పోయిన నిశాంత్ ఈ ఏడాదే ప్రొఫెషనల్ బాక్సర్‌గా మారాడు.

'నేను తగినవాడిని కాదనిపించింది'

టెండూల్కర్‌తో ట్రోఫీ పేరుపై అండర్సన్



లండన్: భారత్, ఇంగ్లండ్ మధ్య టెస్టు సిరీస్‌కు ఇరు దేశాల బోర్డులు కలిసి తమ దిగ్గజాలను గౌరవిస్తూ 'అండర్సన్–టెండూల్కర్ ట్రోఫీ'గా పేరు పెట్టాయి. అత్యధిక టెస్టులు ఆడిన ఆటగాళ్ల జాబితాలో సచిన్ (200), అండర్సన్ (188) తొలి రెండు స్థానాల్లో ఉండగా... ఓవరాల్‌గా అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్లలో సచిన్ అగ్ర స్థానంలో, అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లలో అండర్సన్ మూడో స్థానంలో ఉన్నారు. అయితే ట్రోఫీ కోసం సచిన్‌తో తన పేరును జత పర్చడం తనను చాలా ఆశ్చర్యపర్చిందని అండర్సన్ వ్యాఖ్యానించాడు. ఇది తాను ఊహించలేకపోయానని అతను అన్నాడు. 'నా పేరిట ఒక ట్రోఫీ ఉండటమే విశేషం అయితే సచిన్ టెండూల్కర్ లాంటి దిగ్గజంతో నా పేరు జత కట్టడం ఎంతో గొప్పగా అనిపిస్తోంది. అసలు నా పేరును సచిన్ పక్కన చూసుకుంటే అది నేనేనా అనిపించింది. సరిగ్గా చెప్పాలంటే నేను తగినవాడిని కాదనే భావన కూడా వచ్చింది. ప్రపంచ క్రికెట్ చరిత్రలోనే అత్యుత్తమ ఆటగాడైన సచిన్ అంటే ఎంతో గౌరవభావం ఉంది. చిన్నప్పుడు అభిమానిగా అతని ఆటను చూశాను. ఆపై ప్రత్యర్థిగా తలపడ్డాను. కెరీర్ ఆసాంతం అతను ఒక దేశం ఆశల భారాన్ని మోశాడు. అలాంటి వ్యక్తితో నా పేరు జత చేయడం నా అదృష్టం' అని అండర్సన్ తన మనసులో మాటను వెల్లడించాడు.



విజేత శ్రీశంకర్

పోర్చుగల్ అథ్లెటిక్స్ మీట్

న్యూఢిల్లీ: భారత లాంగ్ జంపర్ మురళీ శ్రీశంకర్ పోర్చుగల్ అథ్లెటిక్స్ మీట్‌లో టైటిల్ గెలిచాడు. గాయం నుంచి కోలుకున్నాక బరిలోకి దిగిన అంతర్జాతీయ పోటీలో శ్రీశంకర్ సత్తా చాటాడు. శ్రీశంకర్ 7.75 మీటర్ల దూరం దూకి అగ్రస్థానం దక్కించుకున్నాడు. మొత్తం ఆరు రౌండ్‌లలో రెండో ప్రయత్నంలో భారత అథ్లెట్ అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేసుకున్నాడు. 7.58 మీటర్ల దూరం నమోదు చేసుకున్నాడు. పోలాండ్‌కు చెందిన పీటర్ టర్కోస్కీ కూడా శ్రీశంకర్‌తో సమానంగా 7.75 మీటర్ల దూరం దూకాడు. అయితే ప్రపంచ అథ్లెటిక్స్ నిబంధనల ప్రకారం ఇద్దరు అథ్లెట్ల దూరం సమమైతే... వారి రెండో ఉత్తమ ప్రదర్శనను లెక్కగట్టి విజేతను తేల్చుతారు. దీని ప్రకారం శ్రీశంకర్ రెండో ఉత్తమ దూరం 7.69 మీటర్లు కాగా... పోలాండ్ లాంగ్ జంపర్‌ది 7.58 మీటర్లే కావడంతో భారత అథ్లెట్‌ను విజేతగా తేల్చారు.

గ్రూప్ టాపర్‌గా భారత్

చివరి లీగ్ మ్యాచ్‌లో హాంకాంగ్‌పై గెలుపు



- నేడు క్వార్టర్ ఫైనల్లో జపాన్‌తో 'ఢీ'
- ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

సోలో (ఇండోనేసియా): ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్ మిక్స్‌డ్ టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత్ జోరు సాగుతోంది. ఇప్పటికే క్వార్టర్ ఫైనల్ చేరిన భారత జట్టు గ్రూప్ 'డి'లో భాగంగా చివరి మ్యాచ్‌లో హాంకాంగ్‌పై విజయం సాధించింది. తద్వారా గ్రూప్‌లో అగ్రస్థానం దక్కించుకుంది. ఆదివారం జరిగిన పోరులో భారత్ 110–100 పాయింట్ల తేడాతో హాంకాంగ్‌ను ఓడించింది. ఈ మ్యాచ్‌కు ముందే హాంకాంగ్ కూడా నాకౌట్ బెర్త్ దక్కించుకుంది. మహిళల సింగిల్స్ తొలి పోరులో రుజులా రాము 11–8తో సుమ్ యూపై గెలిచి భారత జట్టుకు శుభారంభం అందించగా... భార్గవ్ రామ్–విశ్వతేజ్ జోడీ 11–5తో చెంగ్ సెయి షింగ్–డెంగ్ చీ పై జంటపై గెలిచి ఆధిక్యాన్ని మరింత పెంచింది. ఆ తర్వాత హాంకాంగ్ షట్లర్లు కాస్త ప్రతిఘటించినా... జూనియర్ మహిళల ప్రపంచ నంబర్‌వన్ తన్వీ శర్మ, రౌనక్ చౌహాన్ సహా యువ షట్లర్లు సత్తా చాటడంతో భారత జట్టు విజయం సాధించింది. సోమవారం జరగనున్న క్వార్టర్ ఫైనల్లో గ్రూప్ 'ఎ'లో రెండో స్థానంలో నిలిచిన జపాన్ జట్టుతో భారత్ తలపడనుంది. ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత్ అత్యుత్తమంగా 2011లో కాంస్య పతకం సాధించింది. ఆ తర్వాత మరెప్పుడూ పతకం గెలవలేకపోయింది. గతేడాది క్వార్టర్ ఫైనల్లో మలేసియా చేతిలో ఓడింది.

ఫైనల్లో దక్షిణాఫ్రికా


రూబిన్ హెర్మాన్

హరారే: ముక్కోణపు టి20 టోర్నమెంట్‌లో దక్షిణాఫ్రికా జట్టు రెండో విజయం నమోదు చేసుకుంది. ఆదివారం జరిగిన పోరులో దక్షిణాఫ్రికా 7 వికెట్ల తేడాతో ఆతిథ్య జింబాబ్వేను ఓడించి ఫైనల్ చేరింది. మొదట జింబాబ్వే నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 144 పరుగులు చేసింది.బెనెట్ (61; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు)... ర్యాన్ బర్ల్ (36 నాటౌట్) రాణించారు. సఫారీ బౌలర్లలో కార్బిన్ 2 వికెట్లు పడగొట్టాడు. అనంతరం దక్షిణాఫ్రికా 17.2 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 145 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రూబిన్ హెర్మాన్ (36 బంతుల్లో 63; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు), కెప్టెన్ డసెన్ (41 బంతుల్లో 52 నాటౌట్; 6 ఫోర్లు) అర్ధశతకాలు చేశారు. ఈ టోర్నీలో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన న్యూజిలాండ్ 4 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా... మూడు మ్యాచ్‌ల్లో రెండింట గెలిచిన దక్షిణాఫ్రికా 4 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. మరోవైపు జింబాబ్వే ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఓడి ఫైనల్ రేసు నుంచి తప్పుకుంది. దీంతో మరో రెండు లీగ్ మ్యాచ్‌లు మిగిలుండగానే న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా ఫైనల్‌కు అర్హత సాధించాయి.

పాకిస్తాన్‌కు బంగ్లాదేశ్ షాక్

తొలి టి20లో 7 వికెట్లతో గెలుపు



పర్వేజ్

మిర్పూర్: బౌలర్లు విజృంభించడంతో సొంతగడ్డపై పాకిస్తాన్‌తో జరిగిన తొలి టి20లో బంగ్లాదేశ్ ఘనవిజయం సాధించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఆదివారం జరిగిన తొలి పోరులో బంగ్లాదేశ్ 7 వికెట్ల తేడాతో గెలిచి 1–0తో ఆధిక్యంలో నిలిచింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ 19.3 ఓవర్లలో 110 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ ఫఖర్ జమాన్ (34 బంతుల్లో 44; 6 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్ కాగా... అబ్బాస్ అఫ్రిది (22; 3 సిక్స్‌లు), ఖుష్‌దిల్ షా (17; 1 ఫోర్, 1 సిక్స్) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. బంగ్లాదేశ్ బౌలర్ల ధాటికి మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. కెప్టెన్ సల్మాన్ ఆఘా (3)తో పాటు సయీమ్ అయూబ్ (6), హారిస్ (4), హసన్ నవాజ్ (0), మొహమ్మద్ నవాజ్ (3) పెవిలియన్‌కు వరుస కట్టారు. బంగ్లాదేశ్ బౌలర్లలో తస్కీన్ అహ్మద్ 3, ముస్తఫిజుర్ రహమాన్ 2 వికెట్లు పడగొట్టారు. ముఖ్యంగా ముస్తఫిజుర్ పాక్ బ్యాటర్లను వణికించాడు. 4 ఓవర్లలో కేవలం 6 పరుగులే ఇచ్చి 2 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. పాకిస్తాన్ ఆటగాళ్లలో ముగ్గురు రనౌట్ రూపంలో వెనుదిరిగారు. అనంతరం లక్ష్యఛేదనలో బంగ్లాదేశ్ 15.3 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 112 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' పర్వేజ్ హుసేన్ (39 బంతుల్లో 56 నాటౌట్; 3 ఫోర్లు, 5 సిక్స్‌లు) అజేయ అర్ధశతకంతో అదరగొట్టగా... తౌహిద్ హృదయ్ (37 బంతుల్లో 36; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. పాకిస్తాన్ బౌలర్లలో సల్మాన్ మీర్జా 2 వికెట్లు పడగొట్టాడు.

4 టి20 ఫార్మాట్‌లో పాకిస్తాన్‌పై బంగ్లాదేశ్ నెగ్గిన మ్యాచ్‌లు. ఇప్పటిదాకా పాక్‌తో 23 టి20 మ్యాచ్‌లు ఆడిన బంగ్లాదేశ్ నాలుగింటిలో మాత్రమే నెగ్గింది. 2015, 2016లలో మిర్పూర్‌లోనే జరిగిన మ్యాచ్‌ల్లో గెలిచిన బంగ్లాదేశ్... 2023 హాంగ్జౌ ఆసియా క్రీడల్లో చివరిసారి టి20ల్లో పాక్‌ను ఓడించింది.

'మా అంచనా తప్పింది'

లార్డ్స్‌లో ఓటమిపై స్మృతి స్పందన



లండన్: ఇంగ్లండ్‌తో జరిగిన రెండో వన్డేలో పరిస్థితులను సరిగా అంచనా వేయడంలో విఫలమయ్యాయని, అందుకే పరాజయం ఎదురైందని భారత మహిళల క్రికెట్ జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధాన అభిప్రాయపడింది. శనివారం లార్డ్స్ మైదానంలో జరిగిన ఈ పోరులో భారత్‌పై 8 వికెట్ల తేడాతో నెగ్గిన ఇంగ్లండ్ మహిళల జట్టు సిరీస్‌ను 1–1తో సమం చేసింది. వర్షం అంతరాయం కలిగించడంతో కుదించిన ఈ మ్యాచ్‌లో మన బ్యాటర్లు విఫలం కాగా, స్మృతి 42 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచింది. 'పరిస్థితులను అర్థం చేసుకోవడంలో మా బ్యాటింగ్ బృందం విఫలమైంది. కొన్ని అనవసరపు షాట్లకు ప్రయత్నించడంతో తప్పిదం జరిగింది. లార్డ్స్ మైదానంలో అలాంటి షాట్లు ఆడటం సరైంది కాదు. ముఖ్యంగా వర్షం కూడా లయ తప్పడానికి ఒక కారణం. ఇలాంటి మ్యాచ్‌లలో పదే పదే విరామాలతో ఏకాగ్రత కోల్పోతాం. టాస్ ఓడిపోవడం కూడా ప్రతికూలంగా మారుతుంది. అయినా సరే మేం మరికొంత మెరుగ్గా ఆడాల్సింది. జట్టులో చాలా మందికి ఈ మైదానంలో ఇదే తొలి మ్యాచ్. వారంతా ఉత్సాహంగా బరిలోకి దిగారు. కొన్ని జ్ఞాపకాలతో పాటు మరికొన్ని విషయాలు వారు ఇక్కడే నేర్చుకున్నారు' అని స్మృతి వ్యాఖ్యానించింది. 2017లో లార్డ్స్ మైదానంలోనే జరిగిన వన్డే వరల్డ్ కప్ ఫైనల్లో భారత్ 9 పరుగుల తేడాతో ఇంగ్లండ్ చేతిలో ఓడి రన్నరప్‌గా నిలిచింది. అయితే ఆ తర్వాత ఎంతో ఎదిగిన భారత జట్టు గత ఎనిమిదేళ్లలో తమ స్థాయిని పెంచుకుందని భారత ఓపెనర్ గుర్తు చేసుకుంది. 'ఫైనల్లో ఓడి నిరాశ చెందినా స్వదేశానికి తిరిగి వచ్చాక లభించిన ఆదరణ చూస్తే మహిళల క్రికెట్‌కు దక్కుతున్న గుర్తింపు ఏమిటో అర్థమైంది. గత ఎనిమిదేళ్లలో మేం ఏ దేశానికి వెళ్లి ఆడినా పెద్ద సంఖ్యలో అభిమానులు మ్యాచ్‌లు చూసేందుకు వస్తున్నారు. ఎన్నో ప్రశంసలతో పాటు విమర్శలు కూడా వస్తుంటాయి. ఏదైనా సరే మన మహిళల క్రికెట్‌కు లభించిన గుర్తింపుగా దీనిని చూడవచ్చు. ఇది ఎంతో మంచి విషయం' అని స్మృతి పేర్కొంది.



రహీమ్ లీగ్ చాంపియన్ శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ (టీఎఫ్‌ఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన రహీమ్ లీగ్ ఎ–డివిజన్ పోటీల్లో శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) చాంపియన్‌గా అవతరించింది. డెక్కన్ ఎరీనాలో ఆదివారం ఆర్‌టీ బాయ్స్ జట్టుతో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌ను శ్రీనిధి జట్టు 1–1తో 'డ్రా' చేసుకుంది. మొత్తం 13 మ్యాచ్‌లు ఆడిన శ్రీనిధి జట్టు 11 విజయాలు అందుకుంది. ఒక మ్యాచ్‌ను 'డ్రా' చేసుకొని, మరో మ్యాచ్‌లో ఓడిపోయి మొత్తం 34 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. 15వ నిమిషంలో ఆర్‌టీ బాయ్స్ ఖాతా తెరిచింది. 62వ నిమిషంలో సింగమాయుమ్ సాజన్ ఖాన్ గోల్‌తో శ్రీనిధి జట్టు స్కోరును 1–1తో సమం చేసింది. టోర్నీ మొత్తంలో శ్రీనిధి జట్టు 56 గోల్స్ సాధించి, కేవలం ఐదు గోల్స్‌ను సమర్పించుకుంది. తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన లీగ్‌లో శ్రీనిధి జట్టుకిది రెండో టైటిల్ కావడం విశేషం. గత ఏడాది శ్రీనిధి జట్టు బి–డివిజన్ లీగ్ విజేతగా నిలిచి ఎ–డివిజన్‌కు ప్రమోట్ అయింది. 'టైటిల్ సాధించినందుకు చాలా ఆనందంగా ఉంది. తెలంగాణలోని యువ ఆటగాళ్ల ప్రతిభకు పదునుపెట్టి మరోసారి భారత్‌లో తెలంగాణ ఫుట్‌బాల్‌కు ప్రత్యేక స్థానం అందించడమే మా లక్ష్యం' అని శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ చీఫ్ ఫుట్‌బాల్ ఆఫీసర్ ఫాబియో ఫెరీరా అన్నారు.

ఎంపీ సాగు



ఆదివారం యూపీలోని పింద్రాలో వరి నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్న సమాజ్‌వాదీ ఎంపీ ప్రియా సరోజ్

జల సంగం



భారీ వర్షాల కారణంగా గంగకు కొద్ది రోజులుగా వరద పోటెత్తుతుండటంతో ఆదివారం సాగరాన్ని తలపిస్తున్న ప్రయాగ్‌రాజ్‌లోని ప్రఖ్యాత త్రివేణి సంగమం

భాయీ చారా



ఆదివారం ప్రయాగ్‌రాజ్‌లో కన్వరియా భక్తులపై పూలవాన కురిపిస్తున్న ఓ ముస్లిం సోదరుడు

ఎమర్జెన్సీ ఎత్తేసిన రోజే నా సివిల్స్ ఇంటర్వ్యూ

విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్

న్యూఢిల్లీ: 1977 మార్చి 21.. ఇదే రోజు దేశంలో అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) ని అప్పటి ప్రభుత్వం నిలిపివేసింది. భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ఇదే రోజు సివిల్స్ ఇంటర్వ్యూకు హాజరయ్యారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా ప్రకటించారు. సివిల్ సర్వీసెస్‌లో తన ప్రవేశం జరిగిన తీరును గుర్తుచేసుకున్నారు. 1977 మార్చి 21న ఢిల్లీలో యూపీఎస్సీ ఇంటర్వ్యూకు తాను హాజరయ్యానని తెలిపారు. అంతకు ఒక రోజు ముందునుంచే ఎన్నికల ఫలితాలు రావడం మొదలైందని, అవి చూశాక ఎమర్జెన్సీ ఎత్తేస్తారన్న నమ్మకం తనకు కలిగిందని వెల్లడించారు. ఎమర్జెన్సీని ప్రజలు ఓడించారని తెలిపారు. జైశంకర్ ఆదివారం ఢిల్లీలో ఓ కార్యక్రమంలో ప్రసంగించారు. యూపీఎస్సీ పరీక్ష అంటే సామాన్య విషయం కాదని, అదొక అగ్నిపరీక్ష అని వ్యాఖ్యానించారు. ప్రపంచంలోనే అదొక విశిష్టమైన టెస్టింగ్ వ్యవస్థ అని పేర్కొన్నారు. తన ఇంటర్వ్యూ 48 నిమిషాలపాటు జరిగిందని, తన వయసు 22 ఏళ్లు అని వివరించారు.

కోమా ప్రిన్స్ కన్నుమూత

ప్రిన్స్ అల్ వలీద్ బిన్ ఖలీద్ బిన్ తలాల్. ఈ పేరు చెప్తే దాదాపు ఎవరికీ తెలీదు. కానీ 20 ఏళ్లుగా కోమాలోనే ఉంటూ 'స్లీపింగ్ ప్రిన్స్'గా పేరుతెచ్చుకున్న సౌదీ యువరాజు అంటే చాలా మంది గుర్తుపడతారు. ఘోర రోడ్డు ప్రమాదం కారణంగా తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లి రెండు దశాబ్దాలుగా అలాగే మంచానికే పరిమితమైన ఈ సౌదీ యువరాజు శాశ్వతనిద్రలోకి జారుకున్నారు. 36 ఏళ్ల వలీద్ జీవితంలో 20 ఏళ్లు కోమాలోనే గడిచిపోయాయి. ఐసీయూలో అత్యంత అధునాతన ప్రత్యేక ఏర్పాట్లు, నిరంతరం వైద్య పర్యవేక్షణ, లక్షలాది మంది సౌదీ రాజ్య మద్దతుదారుల ప్రార్థనలు ఇవేవీ ఆ యువరాజును మళ్లీ ఈలోకంలోకి మేల్కొనేలా చేయలేకపోయాయి. 16వ ఏట నుంచి కోమాలోనే ఉండిపోయిన వలీద్ జూలై 19వ తేదీన ఈ లోకం విడిచివెళ్లిపోయారని అతని తండ్రి ఖలీద్ బిన్ తలాల్ అల్ సౌద్ ప్రకటించారు.

ఎవరీ వలీద్ బిన్?

వలీద్ 1990 ఏప్రిల్ 18వ తేదీన సౌదీ రాజకుటుంబంలో జన్మించారు. యువరాజు ఖలీద్ సౌద్ పెద్ద కుమారుడే ఈ వలీద్. ఆధునిక సౌదీ అరేబియా నిర్మాత అయిన దివంగత రాజు కింగ్ అబ్దుల్ అజీజ్‌కు మునిమనవడు. 2005లో బ్రిటన్‌లోని లండన్‌కు వలీద్ విద్యాభ్యాసం కోసం వెళ్లారు. అక్కడి మిలటరీ కాలేజీలో చదువుకుంటున్న రోజుల్లో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. దీంతో మెదడుకు గాయమై అంతర్గత రక్తస్రావంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. వెంటనే వలీద్‌ను రియాద్‌లోని కింగ్ అబ్దుల్‌అజీజ్ మెడికల్ సిటీ వైద్యశాలలో చేర్పించి చికిత్స మొదలుపెట్టారు. కోమాలోకి వెళ్లడంతో ఆహారం తీసుకోవడం ఇబ్బందిగా మారడంతో ఆహార గొట్టం అమర్చారు. వెంటిలేటర్ పైనే ఉంచారు. ప్రపంచంలోని అత్యుత్తమ వైద్యులను వలీద్ కోసం రప్పించారు. ఎంతగా ప్రయత్నించినా వలీద్ తిరిగి కళ్లు తెరవలేదు. 2015లో చివరకు వైద్యులు చేతులెత్తేశారు. ఈయన తిరిగి కోలుకోవడం కల అని తేల్చేచెప్పారు. దీంతో సంవత్సరాల తరబడి కోమాలో, నిద్రలో గడిపేస్తున్న సౌదీ యువరాజుగా, స్లీపింగ్ ప్రిన్స్‌గా పేరుతెచ్చుకున్నారు. వెంటిలేటర్‌పై ఎన్నాళ్లు ఉంచినా లాభం ఉండదని అత్యావశ్యక(లైఫ్‌సపోర్ట్)



ఐసీయూ బెడ్‌పై ఉన్న తన కుమారుడు వలీద్‌తో తండ్రి ఖలీద్ తలాల్. వలీద్(ఫైల్)

పరికరాలను తొలగించి ఆయనకు ఈ బాధ నుంచి శాశ్వత విముక్తి కల్పించడమే ఉత్తమమని మెడికల్‌బోర్డ్ ఆయన తండ్రికి సూచించింది. పెద్ద కుమారుడు అంటే తండ్రికి అమితమైన ప్రేమ. అందుకే వైద్య బృందం సూచనతో ఆయన విబేధించారు. ఎన్నాళ్లయినా వేచిచూస్తానని చెప్పారు. 2019లో ఒకసారి చేతి వేళ్లు కదిలిస్తూ తలను అటూ ఇటూ తిప్పుతూ ఆయన తన కుటుంబసభ్యుల్లో కొత్త ఆశలు చిగురింపజేశారు. కానీ ఆ తర్వాత పరిస్థితిలో ఎలాంటి మార్పులేదు. కళ్లు తెరచిచూస్తాడని వాళ్లు కళ్లు కాయలు కాసేలా ఎదురుచూసినా ఫలితం శూన్యం. ''సాధారణంగా ఘోర రోడ్డు ప్రమాదాల్లో మెదడులో రక్తస్రావంతోపాటు అంతర్గత గాయాలపాలైతే 20 గంటల్లోపు ఆ వ్యక్తి చనిపోతాడు. ఆ 20 గంటల గండాన్ని ఈయన దాటారు. కానీ 20 గంటల తర్వాత శస్త్రచికిత్సల తర్వాత కోలుకోవాల్సిన వ్యక్తి ఏకంగా 20 ఏళ్లపాటు అలాగే కోమాలోనే ఉండిపోయారు''అని ఆయనకు వైద్యంచేసిన వైద్యులు వ్యాఖ్యానించారు. వలీద్ ఖననప్రక్రియను రియాద్‌లోని ప్రఖ్యాత ఇమామ్ తుర్కిబిన్ అబ్దుల్లాహ్ మసీదు ప్రాంగణంలో నిర్వహించాలని నిర్ణయించారు. - **సాక్షి, నేషనల్ డెస్క్**

ఏఏఐబీపై పూర్తి నమ్మకముంది

కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు

న్యూఢిల్లీ: అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాద ఘటనకు పైలట్‌దే తప్పిదమని చూపేందుకు అమెరికా సహా పశ్చిమదేశాల మీడియా ప్రయత్నిస్తోందని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు మరోసారి ఆరోపించారు. దేశంలో జరిగే విమాన ప్రమాదాలపై దర్యాప్తు జరిపే ప్రభుత్వ విభాగం ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో(ఏఏఐబీ)పై తనకు విశ్వాసముందని మంత్రి స్పష్టం చేశారు. బ్లాక్‌బాక్స్ నుంచి డేటాను రికవరీ చేసే విషయంలో ఏఏఐబీ ఘన విజయం సాధించిందన్నారు. పైలట్‌దే తప్పిదమంటూ వాల్‌స్ట్రీట్ జర్నల్, రాయిటర్స్ సంస్థలు పేర్కొనడంపై మంత్రి..స్వార్థపూరిత ప్రయోజనాలను ఆశించి ఇటువంటి కథనాలను ప్రచారం చేయవద్దంటూ పాశ్చాత్య మీడియా సంస్థలకు ఏఏఐబీ విజ్ఞప్తి చేసిందన్నారు. ప్రమాదంపై ఏఏఐబీ తుది నివేదిక వెలువడే వరకు నిరాధార సిద్ధాంతాలను ప్రచారం చేయవద్దని ఆయన హెచ్చరించారు. ఇలాంటి చర్యలు ఎవరికీ మంచివి కావన్నారు. చివరి నివేదిక వచ్చే వరకు వేచి చూడాలని కోరారు. ఇందుకు సమయం పడుతుందని, ఎంతో డేటాను పరిశీలించాల్సి ఉన్నందున ఏఏఐబీకి వ్యవధి ఇవ్వాలని పేర్కొన్నారు. 'గతంలో దేశంలో విమాన ప్రమాద ఘటనలు జరిగినప్పుడు బ్లాక్‌బాక్స్‌లను సేకరించి విదేశాలకు పంపించే వాళ్లం. మొట్టమొదటి సారిగా మనమే ఎయిరిండియా విమానం బ్లాక్‌బాక్స్‌ను విశ్లేషించుకుంటున్నాం'అని మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు.

పాఠశాలల్లో విద్యార్థుల ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్

రెండు నెలల తర్వాత అమల్లోకి...

న్యూఢిల్లీ: పిల్లల వయసు ఐదేళ్లు దాటిన తర్వాత ఆధార్ కార్డులో వారి బయోమెట్రిక్ వివరాలు అప్‌డేట్ చేయించడం తప్పనిసరి. చాలామంది ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా 7 కోట్ల మందికిపైగా చిన్నారుల బయోమెట్రిక్ వివరాలు అప్‌డేట్ కాలేదని భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ(యూఐడీఏఐ) సీఈఓ భువనేశ్ కుమార్ చెప్పారు. ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం.. ఏడేళ్లు దాటిన పిల్లల వివరాలు నవీకరించకపోతే వారి ఆధార్ నెంబర్ నిష్క్రియాత్మకంగా(డీయాక్టివేట్) మారుతుంది. విద్యార్థుల ఆధార్ వివరాలను వారు చదువుకుంటున్న పాఠశాలల్లో అప్‌డేట్ చేసే విధానం తీసుకురాబోతున్నట్లు భువనేశ్ కుమార్ తెలియజేశారు. రెండు నెలల తర్వాత దశలవారీగా ప్రారంభిస్తామని వెల్లడించారు. తల్లిదండ్రుల ఆమోదంతో స్కూల్‌లోనే బయోమెట్రిక్ అప్‌డేట్ పూర్తి చేసుకోవచ్చని స్పష్టంచేశారు. ప్రస్తుతం సాంకేతికతను పరీక్షిస్తున్నామని, మరో 60 రోజుల్లో సిద్ధమవుతుందని చెప్పారు. ఐదేళ్లకు, ఏడేళ్లకు అప్‌డేట్ ఉచితమే. ఏడేళ్లు దాటితే రూ.100 చెల్లించాల్సి ఉంటుంది. పాఠశాలల్లో ప్రవేశానికి, ప్రవేశ పరీక్షల రిజిస్ట్రేషన్‌కు, స్కాలర్‌షిప్‌లు పొందడానికి విద్యార్థులు ఆధార్ నెంబర్ సమర్పించడం తప్పనిసరిగా మారింది. 15 ఏళ్లు దాటిన వారికి కాలేజీల్లోనే ఆధార్ అప్‌డేట్ సౌకర్యం కల్పించే ఆలోచన ఉన్నట్లు భువనేశ్ కుమార్ తెలిపారు.

కన్వర్ యాత్రా మార్గాల్లో రోడ్డు ప్రమాదాలు

ఆరుగురి మృతి..

హరిద్వార్: ఉత్తరాఖండ్‌లో కన్వర్ యాత్ర తుది దశకు చేరుకుంటోంది. ఈ నేపథ్యంలో భక్తులు పోటెత్తుతున్నారు. హరిద్వార్‌తోపాటు ఇతర ప్రాంతాల నుంచి పవిత్ర గంగా జలాన్ని కావడిల్లో నింపుకొని స్వస్థలాలకు పయనమవుతన్నారు. ఢిల్లీ-డెహ్రాడూన్ ప్రధాన రహదారితోపాటు గంగా కెనాల్ రోడ్డులో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు కన్వర్ యాత్ర భక్తులు మరణించారు. మరో 20 మంది గాయపడ్డారు.

ఫౌజా సింగ్‌కు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

జలంధర్: ప్రపంచంలోనే అత్యంత వయోవృద్ధుడైన మారథానర్ ఫౌజా సింగ్(114)కు అధికార లాంఛనాలతో ఆదివారం ఆయన స్వగ్రామం బియాస్‌లో అంత్యక్రియలు జరిగాయి. చితికి ఫౌజా సింగ్ కుమారుడు హర్విందర్ సింగ్ నిప్పంటించారు. కార్యక్రమానికి గవర్నర్ గులాబ్ చంద్ కటారియా, సీఎం భగవంత్ సింగ్ మాన్ పలువురు మంత్రులు, ప్రముఖులు హాజరయ్యారు. ఈ నెల 14వ తేదీన జలంధర్-పఠాన్‌కోట్ హైవే నడిచి వెళ్తున్న ఆయన్ను ఎస్‌యూవీ ఢీకొంది. తీవ్రగాయాలతో ఆయన చనిపోయారు.

కర్ణాటకలో 4 వేల ఏళ్ల నాటి ఆవాస ప్రాంతం



- రాయచూర్ జిల్లా మస్కీలో బహిర్గతమైన పురాతన ప్రాంతం
- మల్లికార్జున కొండ, ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో కనుగొన్న పురాతత్వవేత్తలు

రాయచూర్: మానవాళి గతకాలపు జ్ఞాపకాలు, సంస్కృతి, సంప్రదాయాలను కళ్లకు కట్టే ప్రాచీన నాగరికత అంటే ఎంతో మందికి మక్కువ. అలాంటి 4,000 ఏళ్లనాటి భారతీయ నాగరికత తాలూకు అవశేషాలు తాజాగా కర్ణాటకలోని రాయచూర్ జిల్లాలో బయటపడ్డాయి. మస్కి పట్టణంలోని మల్లికార్జున కొండ, ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో తవ్వకాలు జరపగా ప్రాచీననాగరికతను తెలిపే రాళ్లసముదాయం బయల్పడింది. వీటితోపాటు ఆనాటి శిల్ప కళాఖండాలు లభించాయి. భారత ప్రాచీన నాగరికత పరంగా మస్కి ఎంతో కీలకమైన ప్రాంతమని మరోసారి నిరూపితమైంది. దశాబ్దాల క్రితం ఇదే మస్కి పట్టణంలో బ్రహ్మీ లిపిలో చెక్కిన అశోకుని కాలంనాటి శిలాశాసనాన్ని గుర్తించారు. ఎనిమిది లైన్ల ఆ శాసనంలో దేవనంప్రియ, ప్రియదర్శి అనే పదాలు అశోకుని మారుపేర్లు అని అప్పట్లో చర్చ జరిగింది. భారత్‌తోపాటు అమెరికా, కెనడాలకు చెందిన 20 మందితోకూడిన పురాతత్వ పరిశోధకుల బృందం ఈ తవ్వకాలను స్వయంగా పర్యవేక్షించింది. క్రీస్తు పూర్వం 11 లేదా 13వ శతాబ్దంలో ఈ ప్రాంతంలో మానవుడు నివసించినట్లు ఆధారాలబట్టితెలుస్తోందని పరిశోధనా బృందం తెలిపింది. కళాత్మకమైన వస్తువులు, మట్టి కుండలు, చిన్నపాటి ఉపకరణాలు, పరికరాలు, వంట పాత్రలు ఇక్కడి తవ్వకాల్లో లభించాయని బృందం వెల్లడించింది. అప్పటి ఆచార, సంప్రదాయాలను పాటిస్తూనే ఆనాడు అభివృద్ధి చెందిన సాంకేతికతను ఉపయోగించినట్లు ఇక్కడ లభ్యమైన వస్తువులను బట్టి తెలుస్తోంది. అమెరికాలోని స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన అధ్యాపకుడు డాక్టర్ ఆండ్రూ ఎం.బేయర్, కెనడాలోని మెక్‌గిల్ విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ పీటర్ జి.జోహాన్సెన్, భారత్‌లోని శివ్‌నాడార్ విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులు ఈ బృందంలో సభ్యులుగా ఉన్నారు. భారత పురాతత్వ విభాగం (ఏఎస్ఐ) నుంచి పూర్తిస్థాయి అనుమతులు వచ్చాక గత మూడు నెలలుగా విస్తృతస్థాయిలో పరిశీలన తర్వాత ఎంచుకున్న ప్రదేశాల్లో ఈ బృందం తవ్వకాలు మొదలెట్టి సత్ఫలితాలను సాధించింది. తొలుత 271 ప్రాంతాలను తవ్వకాల కోసం ఎంచుకున్నా తుదకు కొన్ని చోట్ల మాత్రమే తవ్వకాలు చేపట్టారు. 4,000 సంవత్సరాల క్రితం ఈ ప్రాంతంలో చాన్నాళ్లపాటు మానవుడు స్థిర నివాసం ఏర్పర్చుకుని ప్రశాంత జీవనం కొనసాగించినట్లు ఆధారాలను బట్టి తెలుస్తోందని బృందంలోని రీసెర్చర్ కాదంబి చెప్పారు. దక్షిణభారత దేశ ప్రాచీన నాగరికత ఘన చరితకు ఈ ప్రాంతం అద్దంపడుతోందని అన్నారు. తుంగభద్రకు ఉపనది అయిన మస్కీ నదీతీరంలో ఈ మస్కి పట్టణం వెలసింది. మహాసంఘ, మాసంగిపుర అనే పేర్ల నుంచి మస్కి అనే పేరు పుట్టిందని తెలుస్తోంది. 1915లో బ్రిటన్‌కు చెందిన బంగారు గనుల ఇంజనీర్ సి.బీడన్ ఈ ప్రాంతంలో కలియతిరుగుతూ ఇక్కడి కొండమీది శిలాశాసనాన్ని గుర్తించారు.

రష్యా పసిఫిక్ తీరానికి సునామీ హెచ్చరిక

మాస్కో: రష్యాలోని కంచెట్కా ద్వీపకల్పంలో ఆదివారం భారీ స్థాయిలో భూకంపాలు సంభవించడంతో ప్రభుత్వం సునామీ హెచ్చరిక జారీ చేసింది. తీర ప్రాంతాల్లోని వారంతా తీరానికి దూరంగా వెళ్లిపోవాలని పేర్కొంది. మొత్తం ఐదుసార్లు తీవ్ర భూప్రకంపనలు సంభవించగా ఇందులో అత్యంత తీవ్రత రిక్టర్ స్కేలుపై 7.4గా నమోదైందని పసిఫిక్ సునామీ హెచ్చరిక కేంద్రం(పీటీడబ్ల్యూసీ)తెలిపింది. దీని ముందు, తర్వాత రెండు డజన్ల వరకు స్వల్ప ప్రకంపనలు చోటుచేసుకున్నాయి.

3 లక్షలు దాటిన అమర్‌నాథ్ యాత్రికులు

శ్రీనగర్: వార్షిక అమర్‌నాథ్ యాత్రలో ఆదివారం వరకు 3 లక్షల మంది పాల్గొన్నారని జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా తెలిపారు. వీరు హిమాలయాల్లో కొలువైన స్ఫటిక శివలింగాన్ని దర్శించుకుని ఆశీస్సులు పొందారని ఆయన ఎక్స్‌లో వెల్లడించారు. ఆదివారం ఒక్కరోజే 16,886 మంది దర్శించుకున్నారన్నారు. దీంతో, మొత్తం తీర్థయాత్రికుల సంఖ్య 3, 03, 984కు చేరుకుందని సిన్హా వివరించారు. జూలై 3వ తేదీన మొదలైన ఈ యాత్ర 38 రోజులు కొనసాగి ఆగస్టు 9వ తేదీతో ముగియనుంది.

హాంకాంగ్, చైనాల్లో 'విఫా' విధ్వంసం

హాంకాంగ్: దక్షిణ చైనా ప్రాంతంతోపాటు హాంకాంగ్‌లో విఫా తుపాను తీవ్ర విధ్వంసం సృష్టిస్తోంది. ఆదివారం హాంకాంగ్, షెంజెన్, ఝుహై, కాసినోలకు నెలవైన మకావోల్లో విమానాల రాకపోకలు నిలిచిపోయాయి. హాంకాంగ్‌లో కనీసం 400 విమానాలు రద్దవడంతో 80 వేల మంది ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. కొన్ని హైస్పీడ్ రైళ్లు సైతం రద్దయ్యాయి. హాంకాంగ్ డిస్నీలాండ్ సహా పలు వినోద పార్కులు మూతబడ్డాయి. ఆదివారం ఉదయం హాంకాంగ్‌లో వేగంగా వీచిన గాలుల తాకిడికి 450కి పైగా చెట్లు కూలిన ఘటనలు నమోదయ్యాయని, 26 మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. చైనా దక్షిణ తీర ప్రాంతంలోని ఝుహై తదితర నగరాల్లో చెట్లు నేలమట్టమయ్యాయి. విఫా ఫిలిప్పీన్స్, తైవాన్‌లపైనా ప్రతాపం చూపించింది. వారం రోజుల్లో వియత్నాంను తాకే అవకాశముందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. దక్షిణ కొరియాలో భారీ వర్షాలు, వరదలకు సంబంధించిన ఘటనల్లో 14 మంది చనిపోగా 12 మంది గల్లంతయ్యారు.

2.31 లక్షల కుక్కకాటు ఘటనలు

- రేబిస్‌తో 19 మంది మృత్యువాత
- కర్నాటకలో 6 నెలల గణాంకాలు

బెంగళూరు: కర్నాటక వ్యాప్తంగా ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 2.31 లక్షల కుక్క కాటు ఘటనలు నమోదు కాగా, రేబిస్‌తో 19 మంది చనిపోయినట్లు అధికారులు తెలిపారు. గతేడాదితో పోలిస్తే గణనీయంగా పెరిగాయన్నారు. 2024లో రాష్ట్రంలో 3.6 లక్షల కుక్క కాటు ఘటనలు, 42 రేబిస్ మరణాలు నమోదయ్యాయని వివరించారు. అయితే, పరిస్థితి నియంత్రణలోనే ఉందని ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హర్ష్ గుప్తా అన్నారు. కచ్చితమైన గణాంకాలు అందుతున్నందున కేసుల సంఖ్యలో పెరుగుదల కనిపిస్తోందని ఆయన వివరించారు. అత్యధికంగా విజయపురలో 15, 527 కేసులు నమోదవగా యాద్‌గిర్‌లో 1,132 కేసులు మాత్రమే ఉన్నాయన్నారు. బెంగళూరు రూరల్‌లో ఒక్క రేబిస్ మరణం కూడా లేదన్నారు. కుక్కల జనాభాను నియంత్రణలోకి తేవడం, టీకా క్రమం తప్పకుండా వేయడం ద్వారా రేబిస్ కేసులను తగ్గించవచ్చని చెప్పారు.

'కోల్డ్ ప్లే' కొంపముంచింది..!

- సహోద్యోగినిని ముద్దాడుతున్నట్లుగా వీడియో లీక్
- ఆస్ట్రనామర్ సీఈవో పదవికి ఆండీ బైరన్ రాజీనామా



వాషింగ్టన్: కోల్డ్‌ప్లే రాక్ మ్యూజిక్ కార్యక్రమానికి వెళ్లిన ఐటీ కంపెనీ సీఈవో సహోద్యోగినితో సన్నిహితంగా ఉన్న వీడియో బయటకు రావడం తీవ్ర సంచలనం రేపింది. దీంతో, ఆ సీఈవో కాస్తా ఉద్యోగం పోగొట్టుకోవాల్సి వచ్చింది. సిన్సినాటికి చెందిన ఆస్ట్రనామర్ సంస్థ ఆండీ బైరన్‌కు ఎదురైన చేదు అనుభవమిది. బుధవారం మస్సాచుసెట్స్‌లోని గిల్లెట్ స్టేడియంలో జరిగిన కోల్డ్ ప్లే రాక్ బ్యాండ్ కార్యక్రమానికి ఆస్ట్రనామర్ సంస్థ సీఈవో ఆండీ బైరన్ వెళ్లారు. ఇదే కార్యక్రమానికి కంపెనీ చీఫ్ పీపుల్స్ ఆఫీసర్‌గా వ్యవహరించే క్రిస్టిన్ కబోట్ కూడా వచ్చారు. కార్యక్రమంలో జంబోట్రాన్ సాంగ్‌లో భాగంగా ప్రేక్షకుల స్పందన వీడియోను లైవ్‌లో ప్రసారం చేశారు. అందులో వీరిద్దరూ ఆలింగనం చేసుకున్నట్లు, ముద్దాడుకుంటున్నట్లుగా కనిపించింది. ఆ తర్వాత ఈ విషయం తెలిసి ఆ ఇద్దరూ ముఖం చాటేసుకున్నారు. అప్పటికే ఆన్‌లైన్‌లో వీడియోను చూసి ఆండీ బైరన్, క్రిస్టీ కబోట్‌లను గుర్తు పట్టడం, దుమారం చెలరేగడం జరిగిపోయాయి. విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న ఆస్ట్రనామర్ కంపెనీ ఆండీ బైరన్‌ను సెలవుపై పంపించి, ఈ వ్యవహారంపై విచారణ జరిపించింది. విలువలను కాపాడుకునే విషయంలో కంపెనీ రాజీపడబోమని స్పష్టం చేసింది. ఆండీ బైరన్ కంపెనీ సీఈవో పదవికి రాజీనామా చేశారని శనివారం లింక్డిన్‌లో ప్రకటించింది. ఇతడితోపాటు వీడియోలో కనిపించిన క్రిస్టిన్ కబోట్ తమ ఉద్యోగి కాదని కూడా పేర్కొంది. కాగా, మ్యూజిక్ కార్యక్రమాల నిర్వాహకులు తమ ప్రచారం కోసం హాజరైన ప్రేక్షకుల వీడియోలను రికార్డు చేస్తుంటాయి. ఇదే విషయాన్ని అక్కడి వెళ్లే వారికి ముందుగానే వివరిస్తారు. సీసీటీవీ కెమెరాలు మీ చిత్రం, వాయిస్‌లను రికార్డు చేస్తాయంటూ హెచ్చరికలను సైతం ప్రదర్శిస్తుంటాయి. రికార్డయిన వీడియో ఆ వెంటనే ఆన్‌లైన్‌లో ప్రసారమవుతుంది. ఈ ప్రమాదం తెలియని వారు లేదా తమనేం చేయలేరనో, ఎవరూ గుర్తు పట్టరనే అతి విశ్వాసంతో వ్యవహరిస్తే ఇలాంటివి జరుగుతాయని పలువురు హెచ్చరిస్తున్నారు.

నిద్రమాత్రలతో అతడికి ఏమీ కాలేదు

- ఇప్పుడిక కరెంట్ షాకివ్వక తప్పదు
- భర్త హత్యకు ప్రియుడితో మహిళ ఫోన్ చాటింగ్
- ఇద్దరినీ అరెస్ట్ చేసిన పోలీసులు



న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీకి చెందిన ఓ మహిళ భర్తను చంపేందుకు చేసిన ప్రయత్నాలు తెలిసి పోలీసులే షాకయ్యారు. ఆమె సెల్ చాటింగ్ వివరాలు పోలీసులకు దొరికాయి. అందులో ఆమె..'అతడికి ఆహారంలో చాలా నిద్రమాత్రలు కలిపి ఇచ్చాను. అయినా ఏమీ కాలేదు..బాగానే ఉన్నాడు. ఇప్పుడిక కరెంట్ షాకివ్వడమొక్కటే దారి. ఎంత సేపు షాకివ్వాలి?'అంటూ ప్రియుడిని సలహా అడిగింది. అందుకా ప్రియుడు..'ముందుగా అతడి నోటిని, రెండు చేతులను టేప్‌తో కట్టేసి, ఆ తర్వాత కరెంట్ షాకివ్వాలి'అంటూ దారి చూపడం గమనార్హం. ఢిల్లీలోని ద్వారక ప్రాంతంలోని ఉత్తమ్‌నగర్‌కు చెందిన కరణ్(36) భార్య సుష్మిత, వరుసకు మరిది అయ్యే రాహుల్‌తో అక్రమ సంబంధం సాగిస్తోంది. వీరిద్దరూ కలిసి కరణ్‌ను చంపాలని ప్లాన్లు వేస్తున్నారు. ఈనెల 13వ తేదీన మాతా రూప్‌రాణీ హాస్పిటల్ నుంచి పోలీసులకు కరణ్ అనే వ్యక్తి విద్యుత్ షాక్‌తో చనిపోయినట్లు సమాచారం అందింది. కరణ్ కుటుంబీకులు తమకు సుష్మితపై అనుమానం ఉందని, ఆమె రాహుల్‌తో సన్నిహితంగా ఉంటోందంటూ వివరించారు. పోలీసుల విచారణలో సుష్మిత దిగ్భ్రాంతికర విషయాలు వెల్లడించింది. ఈ నెల 12న రాత్రి సుష్మిత సుమారు 15 నిద్రమాత్రలను కరణ్‌కు వడ్డించిన భోజనంలో కలిపినట్లు తెలిపింది. అయినా కరణ్ చనిపోలేదని రాహుల్‌కు తెలిపింది. అతడి సలహా మేరకు విద్యుత్‌షాక్‌కు గురిచేసింది. చనిపోయాడని నిర్ధారించుకున్నాక సమీపంలోని అత్తమామల ఇంటికి వెళ్లి కరణ్ అపస్మారక స్థితిలో ఉన్నాడని తెలిపింది. అంతా కలిసి కరణ్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లారు. అతడు అప్పటికే చనిపోయాడని వైద్యులు తెలిపారు. మరణానికి కారణం కరెంట్ షాకని శవపరీక్షలో తేలింది. అదేవిధంగా, కరణ్ సోదరుడు సుష్మిత-రాహుల్‌లు ఇన్‌స్టాలో చేసిన చాటింగ్ వివరాలను పోలీసులకు అందజేశాడు.

రాష్ట్ర హోదా జమ్మూకశ్మీర్ ప్రజల హక్కు

వెంటనే హోదా పునరుద్ధరించాలి • సీఎం ఒమర్ అబ్దుల్లా డిమాండ్

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌కు వెంటనే రాష్ట్ర హోదా పునరుద్ధరించాలని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆదివారం డిమాండ్ చేశారు. రాష్ట్ర హోదా జమ్మూకశ్మీర్ ప్రజల ప్రాథమిక హక్కు అని తేల్చిచెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఇంకా జాప్యం చేయడం తగదని అన్నారు. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా కల్పిస్తామని పార్లమెంట్‌లో కేంద్ర ప్రకటించిందని, సుప్రీంకోర్టుకు సైతం తెలియజేసిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తెరపైకి తెస్తున్న 'హైబ్రిడ్ సిస్టమ్'కు తాము అంగీకరించే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా ఇచ్చి, శాంతి భద్రతలు మాత్రం కేంద్ర ప్రభుత్వ పరిధిలోనే ఉంచేలా కుట్ర జరుగుతోందని మండిపడ్డారు. ఇలాంటి ఆలోచనను ప్రజలు సహించరని హెచ్చరించారు. ఆర్టికల్ 370ని రద్దు చేసినా జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడులు ఆగలేదని ఒమర్ అబ్దుల్లా అన్నారు. పాకిస్తాన్ కుట్రల కారణంగానే ఇక్కడ దాడులు కొనసాగుతున్నాయని తేల్చిచెప్పారు. ఉగ్రవాదాన్ని అరికట్టే విషయంలో కేంద్ర ప్రభుత్వం వ్యూహం మార్చాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. జమ్మూకశ్మీర్‌కు సంబంధించి ఒక రాజ్యసభ స్థానం ఖాళీగా ఉందని, అలాగే రెండు అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహించాల్సి ఉందని ఒమర్ అబ్దుల్లా తెలిపారు. ఈ ఎన్నికల విషయంలో ఎన్నికల సంఘం జాప్యం చేస్తోందని తప్పుపట్టారు. సాధ్యమైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించాలని కోరారు.

రాజమన్నార్ కమిటీలో ఎంత మంది సభ్యులు ఉన్నారు?

కేంద్ర - రాష్ట్ర సంబంధాలు

వివాదాలు - సమీక్షా కమిషన్లు

కేంద్ర, రాష్ట్ర సంబంధాల్లో తలెత్తిన వివాదాలను పరిశీలించి, పరిష్కరించడానికి అనేక కమిటీలను, కమిషన్లను నియమించారు. ఈ కమిటీలు వాటికి నిర్దేశించిన పరిధిలో కొన్ని సిఫార్సులు చేశాయి.
వాటిలో ముఖ్యమైనవి...

పరిపాలనా సంస్కరణల సంఘం (1966)

కేంద్ర ప్రభుత్వం 1966లో ఆరుగురు సభ్యులతో మొరార్జీ దేశాయ్ అధ్యక్షతన పరిపాలనా సంస్కరణల కమిషన్‌ను నియమించింది. (మొరార్జీ దేశాయ్ రాజీనామా చేయడం వల్ల కె.హనుమంతయ్య ఈ కమిషన్‌కు చైర్మన్‌గా వ్యవహరించారు). ఈ కమిటీ కేంద్ర రాష్ట్ర సంబంధాలను సమగ్రంగా పరిశీలించింది.

కేంద్ర, రాష్ట్ర సంబంధాల కోసం ఎం.సి. సెతల్వాడ్ అధ్యక్షతన ఒక అధ్యయన బృందాన్ని కూడా నియమించారు. పరిపాలనా సంస్కరణల సంఘం తుది నివేదికను 1969లో కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. ఈ నివేదికలో 22 సిఫార్సులు చేసింది.

- ప్రకరణ 263 ప్రకారం, అంతర్రాష్ట్ర మండలిని ఏర్పాటు చేయాలి.
- ప్రజా జీవితంలో, పరిపాలనలో అనుభవం ఉన్న వ్యక్తినే గవర్నర్‌గా నియమించాలి.
- రాష్ట్రాల కోరిక మేరకే కేంద్ర బలగాలను పంపాలి.
- రాష్ట్రాలకు మరిన్ని ఆర్థిక వనరులను బదిలీ చేయాలి.

అయితే ఈ సిఫార్సులపై కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

రాజమన్నార్ కమిటీ (1969)

1969లో తమిళనాడు ప్రభుత్వం జస్టిస్ పి.వి. రాజమన్నార్ అధ్యక్షతన, ఇద్దరు సభ్యులతో కేంద్ర, రాష్ట్ర సంబంధాల పరిశీలనకు ఒక కమిటీని నియమించింది. ఇది 1971లో నివేదికను సమర్పించింది. దీనిలోని ఇతర సభ్యులు లక్ష్మణస్వామి మొదలియార్, పి. చంద్రారెడ్డి.

ఇది దేశంలో ఉన్న ఏక కేంద్ర ధోరణులకు కారణాలను గుర్తించింది. అవి

- రాజ్యాంగం కేంద్రానికి ఇచ్చిన ప్రత్యేక అధికారాలు
- కేంద్రం, రాష్ట్రంలోనూ ఏక రాజకీయ పార్టీ పాలన
- రాష్ట్రాలకు ఆర్థిక వనరులు తగినన్ని లేకపోవడం, కేంద్రం మీద ఆధారపడటం
- కేంద్ర ప్రణాళిక రచన,ప్రణాళికా సంఘం పాలన


గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
పాలిటీ

సిఫార్సులు

- రాష్ట్ర మంత్రివర్గంతో లేదా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఒక ఉన్నతాధికార సంఘంతో సంప్రదించి రాష్ట్రపతి, గవర్నర్‌ను నియమించాలి.
- రాష్ట్ర ప్రభుత్వాన్ని తొలగించి, రాష్ట్రపతి పాలన ప్రకటించే ప్రకరణ 356ను రద్దు చేయాలి.
- గవర్నర్ సంతృప్తి ఉన్నంత వరకే మంత్రివర్గ పదవుల్లో ఉండాలన్న ప్రకరణను తీసివేయాలి.
- కేంద్రంలో అధికారంలో ఉన్న రాజకీయ పార్టీ అవలంబించే ఏకపక్ష నియంతృత్వ చర్యలను నిరోధించడానికి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటానికి రాష్ట్రాలకు తగినన్ని రక్షణలను కల్పించాలి.
- ప్రధాని అధ్యక్షతన అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ఒక అంతర్రాష్ట్ర మండలిని ఏర్పాటు చేయాలి.
- రాజ్య సభలో రాష్ట్రాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలి.
- కేంద్ర మంత్రివర్గంలో రాష్ట్రాల వారీగా ప్రాతినిధ్యం ఉండాలి.
- ప్రణాళికా సంఘం ఒక శాశ్వత సంస్థగా ఉండాలి. కేంద్ర ప్రభుత్వ నియంత్రణ తగ్గాలి.
- అఖిల భారత సర్వీసులైన ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్‌లను రద్దు చేయాలి.
- అవశిష్ట అధికారాలను రాష్ట్రాలకు బదిలీ చేయాలి.

రాజమన్నార్ కమిటీ సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం ఆమోదించలేదు.

రాజమన్నార్ కమిటీ సిఫార్సులను ప్రముఖ న్యాయ శాస్త్రవేత్తలు తీవ్రంగా విమర్శించారు.



దేశంలో ఎన్నో వేర్పాటు శక్తులు తలెత్తుతుండగా జాతి నిర్మాణం, జాతి సమైక్యతా క్రమంలో విద్య, వ్యవసాయ, ఉత్పత్తి రంగాలను విస్తృతం చేసి సామాన్య మానవుని సమస్యలను తీర్చడంలో ప్రయత్నం చేయాల్సి ఉండగా ప్రాంతీయతత్వాన్ని బలోపేతం చేసే విధంగా సిఫార్సులు చేయడం అవాంఛనీయం అని పేర్కొన్నారు.

ఆనంద్‌పూర్ సాహెబ్ తీర్మానం (1973)

1973లో పంజాబ్‌లో అకాలీదళ్ పార్టీ ఆనందపూర్ అనే ప్రాంతంలో ఒక తీర్మానాన్ని చేసింది. రక్షణ, అంతర్జాతీయ సంబంధాలు, కమ్యూనికేషన్లు, కరెన్సీ మొదలైన విషయాలకే కేంద్ర ప్రభుత్వ పరిధి పరిమితం కావాలని, దేశంలో నిజమైన సమాఖ్య స్ఫూర్తి తేవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది.

పశ్చిమబెంగాల్ ప్రభుత్వ మెమొరెండం (1977)

1977లో పశ్చిమబెంగాల్ ప్రభుత్వం కేంద్ర, రాష్ట్ర సంబంధాలపై ఒక విజ్ఞాపన సమర్పించింది. అందులోని కొన్ని ముఖ్యాంశాలు.

- రాజ్యాంగంలో యూనియన్ అనే పదాన్ని తొలగించి సమాఖ్య అనే పదాన్ని చేర్చాలి.
- కొత్త రాష్ట్రాల ఏర్పాటులో రాష్ట్ర ప్రభుత్వ అభిప్రాయాలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలి.
- అఖిల భారత సర్వీసులను రద్దు చేయాలి.
- రాష్ట్రపతి పాలన, అలాగే ఆర్థిక అత్యవసర పరిస్థితి అధికారాలను తొలగించాలి.
- కేంద్ర ప్రభుత్వ అధికార పరిధిని కుదించాలి.
- రాజ్యసభకు లోక్‌సభతో సమానంగా అధికారాలు ఇవ్వాలి.
- జోనల్ కౌన్సిల్ వ్యవస్థను పునర్వ్యవస్థీకరించాలి.
- శాశ్వత ప్రాతిపదికపై అంతర్రాష్ట్ర ప్రభుత్వ మండలిని ఏర్పాటు చేయాలి.
- జాతీయాభివృద్ధి మండలి పేరును జాతీయ ఆర్థికాభివృద్ధి మండలిగా మార్చి అస్తిత్వాన్ని పరిరక్షించాలి.
- ఆర్థిక నిపుణులనే ఆర్థిక సంఘ సభ్యులుగా నియమించాలి.
- భారతదేశ సమష్టి సంస్కృతిని సంరక్షించడానికి జాతీయ కార్యక్రమాలను ప్రాంతీయ భాషల్లో ప్రసారం చేయాలి.
- అవశిష్ట అంశాలపై పన్నులు విధించే శాసన నిర్మాణ అధికారాన్ని పార్లమెంటుకు అప్పగించాలి.
- కార్పొరేషన్ పన్నుల్లో కొంత భాగాన్ని రాష్ట్రాలకు ఇవ్వాలి.
- రాష్ట్రాలతో సంప్రదించి ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసు, ఇండియన్ హెల్త్ సర్వీస్, ఇండియన్ ఎడ్యుకేషన్ సర్వీసులను ఏర్పాటు చేయాలి.
- రాష్ట్రాల అనుమతి లేకుండా కేంద్ర బలగాలను పంపొద్దు.
- ఉమ్మడి జాబితాలో చట్టాలను రూపొందించే సమయంలో కేంద్రం రాష్ట్రాలను సంప్రదించాలి.
- గవర్నర్ నియామక సమయంలో ముఖ్యమంత్రిని విధిగా సంప్రదించే విధంగా రాజ్యాంగ సవరణ చేయాలి.
- త్రిభాషా సూత్రాన్ని అమలుపరిచేందుకు గట్టి ప్రయత్నం చేయాలి.
- ఆదాయ పన్నుపై సర్వీసు చార్జీలను ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే విధించాలి.
- భాషాపరమైన అల్పసంఖ్యాక వర్గాలవారికి ప్రత్యేక కమిషన్‌ను నియమించి క్రియాత్మకం చేయాలి.
- రేడియో, టెలివిజన్‌లకు స్వయం ప్రతిపత్తి అవసరం లేదు. అయితే వాటి పని తీరును వికేంద్రీకరణ చేయాలి.
- ఆర్థిక సంఘం, ప్రణాళికా సంఘం మధ్య ప్రస్తుత విధుల విభజన హేతుబద్ధంగానే ఉంది. దాన్ని కొనసాగించాలి.
- మంత్రులపై విచారణ కమిషన్ వేసే సందర్భంలో పార్లమెంటు అనుమతి తీసుకోవాలి.
- రాష్ట్ర ఎగువసభ రద్దు లేదా ఏర్పాటు విషయంలో పార్లమెంట్ నిర్ణీత సమయంలోనే తన అభిప్రాయాన్ని తెలపాలి.

గాడ్గిల్ ఫార్ములా

సమాఖ్య విధానంలో కేంద్ర, రాష్ట్రాల మధ్య ఆర్థిక వనరుల పంపిణీ సక్రమంగా జరగాల్సిన ఆవశ్యకత ఉంది. కేంద్ర ప్రణాళికా సహాయాన్ని రాష్ట్రాలకు అందించే ప్రాతిపదికను ప్రణాళిక సంఘం మాజీ డిప్యూటీ చైర్మన్ డి.ఆర్.గాడ్గిల్ పేరుతో 1971లో ఓ ఫార్ములాను రూపొందించారు. దీన్ని 1981లో ఒకసారి, తిరిగి 1992లో మరోసారి సమీక్షించారు. డి.ఆర్.గాడ్గిల్ ఫార్ములా అనుసరించి జనాభా ఆధారంగా 60 శాతం, తలసరి ఆదాయం ఆధారంగా 25 శాతం, ఆదాయ, వ్యయాలను సరిచూసుకుని విత్తలోటు తగ్గించినందుకు 7.5 శాతం, ఇతర సమస్యల (ఎడారి ప్రాంతాలు, కొండ ప్రాంతాలు, శిశు మరణాలు, ఆరోగ్యం మొదలైనవి) ఆధారంగా 7.5 శాతం కేంద్ర ప్రభుత్వం వివిధ రాష్ట్రాలకు సహాయాన్ని అందిస్తుంది. అయితే వెనకబడ్డ, పేద రాష్ట్రాలకు ఈ ఫార్ములా అంత ఉపయోగకరంగా లేదు. విత్త రంగంలో చూపిన క్రమశిక్షణను ఈ ఫార్ములా ప్రోత్సాహపరుస్తున్నట్లుగా లేదని కొందరు విమర్శిస్తున్నారు.

సర్కారియా కమిషన్ సిఫార్సులు (1987)

1983లో కేంద్ర ప్రభుత్వం, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి ఆర్.ఎస్. సర్కారియా అధ్యక్షతన బి.శివరామన్, ఎస్.ఆర్.సేన్ సభ్యులుగా, కార్యదర్శిగా ఆర్.ఎం. సుబ్రహ్మణ్యం, రాజ్యాంగ సలహాదారుడుగా ఎల్.ఎన్.సిన్హాతో ఒక కమిషన్‌ను నియమించింది. ఈ కమిషన్ 1987 అక్టోబర్ 27న 247 సిఫార్సులతో కూడిన 1600 పేజీల నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. 1988 జనవరిలో ప్రభుత్వం సర్కారియా కమిషన్ నివేదికను విడుదల చేసింది. అందులో 230 సిఫార్సులపై కేంద్ర ప్రభుత్వం తగిన నిర్ణయాలను తీసుకుంది. మొత్తం సిఫారసుల్లో 170 సిఫార్సులను అమలు చేసింది.

ముఖ్య సిఫార్సులు

- గవర్నర్‌ల నియామకంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రులను సంప్రదించాలి.
- రాజకీయేతర రంగాలను చెందిన, వివాదాస్పదం కాని వ్యక్తులను, ప్రముఖులను మాత్రమే గవర్నర్‌లుగా నియమించాలి. రాష్ట్రేతర వ్యక్తినే గవర్నర్‌గా నియమించాలి.
- ముఖ్యమంత్రి నియామకం, రాష్ట్రమంత్రి మండలి కొనసాగింపు విషయంలో విధాన సభ మెజారిటీ సభ్యుల అభిప్రాయాలను తెలుసుకోవాలి. అరుదైన సందర్భాల్లో రాష్ట్రపతి పాలన ప్రవేశపెట్టాలి.
- అఖిల భారత సర్వీసులను మరింత బలోపేతం చేసి, మరిన్ని కొత్త సర్వీసులను ఏర్పాటు చేయాలి.
- ఆదాయ పన్నుపై సర్వీసు చార్జీలను ప్రత్యేక సందర్భాల్లోనే విధించాలి.
- భాషాపరమైన అల్పసంఖ్యాక వర్గాలవారికి ప్రత్యేక కమిషన్‌ను నియమించి క్రియాత్మకం చేయాలి.
- రేడియో, టెలివిజన్‌లకు స్వయంప్రతిపత్తి అవసరంలేదు. అయితే వాటి పనితీరును వికేంద్రీకరణ చేయాలి.
- ఆర్థికసంఘం, ప్రణాళికా సంఘం మధ్య ప్రస్తుత విధుల విభజన హేతుబద్ధంగానే ఉంది. దీనిని కొనసాగించాలి.
- మంత్రులపై విచారణ కమిషన్ వేసే సందర్భంలో పార్లమెంటు అనుమతి తీసుకోవాలి.
- రాష్ట్ర ఎగువసభ రద్దు లేదా ఏర్పాటు విషయంలో పార్లమెంటు నిర్ణీత సమయంలోనే తన అభిప్రాయాన్ని తెలపాలి.

ఎడ్గర్‌డేల్ అనుభవ శంకువులో కదలని చిత్రాల స్థానం?

మెథడాలజీ (మాదిరి ప్రశ్నలు)

1. జీవశాస్త్ర శాఖలకు సంబంధించి కిందివాటిలో సరైన జత ఏది?
   ఎ. ఏరోబయాలజీ - ప్రాథమిక శాఖ
   బి. జీవ భుగోళ శాస్త్రం - అనువర్తిత శాఖ
   సి. వ్యవసాయ శాస్త్రం - సంబంధిత శాఖ
   డి. జీవసాంకేతిక శాస్త్రం- సంబంధిత శాఖ
   1) ఎ, బి 2) బి, సి 3) సి, డి 4) ఎ, డి
2. విజ్ఞానశాస్త్రం చదివిన రాగిణి రోజూ గడపకు పసుపు పూస్తోంది. విజ్ఞానశాస్త్ర ప్రయోగాలు చేయడం వల్ల రాకేష్ నిజాయతీ అనే లక్షణాన్ని అలవరచుకున్నాడు. వీరిలో పెంపొందిన విలువలు?
   1) రాగిణి - నైతిక విలువ, రాకేష్ - సృజనాత్మక విలువ
   2) రాగిణి - సాంస్కృతిక విలువ, రాగిణి - బౌద్ధిక విలువ
   3) రాగిణి-ఉపయోగాత్మక విలువ, రాకేష్ - సాంస్కృతిక విలువ
   4) రాగిణి - సాంస్కృతిక విలువ రాకేష్ - నైతిక విలువ
3. వైద్యపరమైన ఎన్సైక్లోపీడియాలను ఎవరి కాలంలో తయారుచేశారు?
   1) అరబ్బులు 2) గ్రీకులు
   3) రోమన్లు 4) హిబ్రూలు
4. రోహన్ పుస్తకాలు చదవడం ద్వారా సేకరించిన సమాచారం ప్రకారం భవిష్యత్తులో జరిగే సంఘటనను ఊహించాడు. అతనిలో నెరవేరిన లక్ష్యం ఏది?
   1) ప్రాగుక్తీకరణ 2) బహిర్గీశనం
   3) వినియోగం 4) విశ్లేషణ
5. జానీ వాతావరణ శాఖ ఆఫీసులో ఉన్న గ్రాపులను చూసి ప్రస్తుత సంవత్సరకాలం వర్షపాతాన్ని వివరించాడు. అతడిలో ఏ లక్ష్యం సాధించినట్లుగా చెప్పవచ్చు?
   1) జ్ఞానం 2) అవగాహన
   3) వినియోగం 4) అభినందన
6. నిశితంగా పరిశీలించడం అనే లక్షణం విజ్ఞానశాస్త్ర అధ్యయనాల వల్ల వస్తుంది. ఇందు లో పరిశీలన దేనికి సంబంధించింది?
   1) అవగాహన 2) జ్ఞానం
   3) నైపుణ్యం 4) అభిరుచి
7. వివేక్ అనే విద్యార్థికి విజ్ఞానశాస్త్ర ప్రదర్శన లో పాల్గొనడం,శాస్త్రవేత్తల జీవిత చరిత్రలు చదవడం, శాస్త్ర ప్రసంగాలు వినడం అలవాట్లు ఉన్నాయి. అతడిలో సాధించిన లక్ష్యం, దానికి చెందిన రంగానికి సంబంధించి సరైన జత ఏది?
   1) జ్ఞానాత్మక రంగం - అభినందన
   2) భావావేశ రంగం - అవగాహన
   3) మానసిక చలనాత్మక రంగం- అభిరుచి
   4) భావావేశ రంగం- అభిరుచి
8. 'విద్యార్థులు ప్రయోగం చేస్తే ప్రమాదాలు జరుగుతాయి' అనే భ్రమ, భయం కల్గిన అనిల్ అనే జీవశాస్త్ర ఉపాధ్యాయుడికి అనుకూలమైన బోధనా పద్ధతి ఏది?
   1) ప్రయోగ పద్ధతి 2) ప్రదర్శనా పద్ధతి
   3) అన్వేషణ పద్ధతి 4) శాస్త్రీయ పద్ధతి
9. కృత్రిమ బోధనోపకరణాలను ఉపయోగించడం ద్వారా కాకుండా, సహజ పరిస్థితుల పరిశీలన ద్వారా జీవశాస్త్రం నేర్చుకోవాలనుకునే ఉపాధ్యాయునికి అత్యంత అనుసరణీయమైన పద్ధతి ఏది?
   1) ప్రదర్శనా పద్ధతి 2) అన్వేషణ పద్ధతి
   3) ప్రకల్పన పద్ధతి 4) ప్రయోగ పద్ధతి
10. కిందివాటిలో దేంట్లో నిగమన ఉపగమాన్ని అనుసరించినట్లుగా చెప్పవచ్చు?
    1) ముందుగా ఉదాహరణ ఇచ్చి తర్వాత సూత్రాన్ని రాబట్టడం
    2) సాధారణీకరణాలు ప్రతిపాదించడం
    3) ముందుగా సూత్రం చెప్పి తర్వాత ఉదాహరణలు చెప్పడం
    4) విద్యార్థులకు ఉదాహరణలను మాత్రమే తెలియజేయడం
11. హెర్బర్ట్ విధానంలోని దశ కానిది?
    1) హాజరు పరచడం 2) సన్నాహం
    3) సాధారణీకరణం 4) పునర్బలనం
12. యూనిట్ పథక దశల్లో ఉపసంహారక సోపానానికి సంబంధించింది ఏది?
    1) బోధనా పద్ధతి ఎంపిక
    2) ప్రేరణ కల్గించడం
    3) బోధనోపకరణాల వినియోగం
    4) మూల్యాంకన పద్ధతులు
13. ప్రతి విషయానికి ఆధారాలను చూపించమని, ఆధారాలుంటేనే నమ్ముతాను అని జీవశాస్త్ర ఉపాధ్యాయుని అడుగుతున్న 'ప్రజ్ఞ' అనే 9వ తరగతి విద్యార్థినిలో ఏ లక్ష్యం సాధించినట్లు?
    1) మొండితనం 2) అభిరుచి
    3) శాస్త్రీయ దృక్పథం 4) నైతిక విలువ
14. పాఠ్యపథక రచనలో హెర్బర్ట్ విధానం పరిమితి కానిది?
    1) ఉపాధ్యాయుని పాత్ర ఎక్కువ
    2) అన్ని సబ్జెక్టుల బోధనకు అనుకూలం
    3) జ్ఞాపకశక్తికే ప్రాధాన్యం
    4) సగటు విద్యార్థులకు మాత్రమే పనిచేస్తుంది
15. ప్రయోగశాలలో 10'×4' కొలతలతో ఉండే ది ఏది?
    1) ఉపాధ్యాయుడి ప్రదర్శనాబల్ల
    2) ప్రయోగశాల కిటికీ
    3) అక్వేరియం 4) నల్లబల్ల
16. 'సైన్స్ న్యూస్ అండ్ పేపర్' అనే గోడపత్రికను ముద్రిస్తున్న సంస్థ ఏది?
    1) మోక్షగుండం విశ్వేశ్వరయ్య మ్యూజియం
    2) NCERT
    3) విక్రం సారాభాయ్ సమాజ విజ్ఞాన కేంద్రం
    4) NCSTC
17. కిందివాటిలో ఏది ప్రత్యేక అభిరుచి సంఘం?
    1) భౌతిక శాస్త్ర సంఘం
    2) వృక్ష శాస్త్ర సంఘం
    3) వ్యవసాయ సంఘం
    4) జంతు శాస్త్ర సంఘం
18. కిందివాటిలో సరైన జత ఏది?
    ఎ. విజ్ఞానశాస్త్ర దినోత్సవం - జూన్ 5
    బి. ధరిత్రీ దినోత్సవం - ఏప్రిల్ 22
    సి. పర్యావరణ దినోత్సవం - జూన్ 5
    డి. ధరిత్రి దినోత్సవం - ఫిబ్రవరి 28
    1) ఎ, బి 2) బి, సి 3) సి, డి 4) ఎ, డి



19. విద్యార్థులకు ర్యాంకులను ఇవ్వడం దేన్ని సూచిస్తుంది?
    1) ప్రత్యక్ష మాపనం 2) సాపేక్ష మాపనం
    3) మూల్యాంకనం 4) పరోక్ష మాపనం
20. మంచి పరీక్షకు విశ్వసనీయత ఉండాలి. విశ్వసనీయత అంటే?
    1) ఒక సమాధాన పత్రాన్ని ఏ ఇద్దరు ఉపాధ్యాయులు దిద్దినా ఒకే మార్కులు రావాలి
    2) ఉపాధ్యాయుడు వ్యక్తినిష్ఠతకు ప్రాధాన్యం ఇవ్వాలి, వస్తునిష్ఠతకు కాదు
    3) పూర్తి లక్ష్యాలను పరిగణనలోకి తీసుకొని పరీక్ష నిర్వహించాలి
    4) విద్యార్థికి వేర్వేరు సమయాల్లో ఒకే పరీక్ష నిర్వహిస్తే ఒకే మార్కులు రావాలి
21. బ్లూ ప్రింట్ తయారు చేసేటప్పుడు పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశాల్లో ఉపాధ్యాయుడు కిందివాటిలో దేన్ని సరిగా అంచనా వేయలేడు?
    1) లక్ష్యాలు 2) పాఠ్యాంశ విషయం
    3) కాఠిన్యత స్థాయి 4) ప్రశ్నల రకాలు
22. జీఎంసీ బాలయోగి మ్యూజియం ఎక్కడ ఉంది?
    1) రాజమండ్రి 2) విజయవాడ
    3) ఏలూరు 4) విశాఖపట్నం
23. ఎడ్గర్‌డేల్ అనుభవ శంకువులో కదలని చిత్రాల స్థానం?
    1) పై నుంచి మూడో స్థానం
    2) కింది నుంచి 5వ స్థానం
    3) టెలివిజన్ కింద 4)చలనచిత్రాల కింద
24. ప్రత్యేక పరిస్థితుల్లో జీవించే జంతువుల గురించి అధ్యయనం చేయడానికి దోహదపడే ఉపకరణం ఏది?
    1) టెర్రేరియం 2) వివేరియం
    3) హెర్బేరియం 4) అక్వేరియం
25. కిందివాటిలో కృత్యరూప బోధనోపకరణాలేవి?
    ఎ. డయారమా బి. ఎపిడయాస్కోపు
    సి. కంప్యూటర్ డి. ఫీల్డ్ ట్రిప్
    1) ఎ, బి 2) బి, సి 3) సి, డి 4) ఎ, డి
26. కన్నింగ్ హామ్ పాఠ్య ప్రణాళికకు ఇచ్చిన నిర్వచనంలో పోలికలకు సంబంధించి సరైన జత ఏది?
    ఎ. స్టూడియో - తరగతి గది
    బి. కళాకారుడు - విద్యార్థి
    సి. అభిరుచికి అనుగుణంగా - లక్ష్యాలు నెరవేరేటట్లు
    డి. ఉపయోగించే సాధనం-పాఠ్యప్రణాళిక
    1) ఎ, బి 2) బి, సి 3) సి, డి 4) ఎ, డి
27. బ్రూబేకర్ అభిప్రాయం ప్రకారం పాఠ్య ప్రణాళిక ఎలా ఉండాలి?
    1) పాఠ్యప్రణాళిక ముందుగా చేసి అందు లో విద్యార్థిని జాగ్రత్తగా ఇమడ్చాలి
    2) పాఠ్యప్రణాళిక చేసి అందులో సిలబస్ పొందుపరచాలి
    3) ఉపాధ్యాయుడు చేయడానికి వీలుగా పాఠ్యప్రణాళిక రూపొందించాలి
    4) విద్యార్థికి అనుగుణంగా పాఠ్యప్రణాళిక తయారుచేయాలి
28. పాఠ్యపుస్తకం తయారుచేసే రచయితకు ఉండాల్సిన కనీస అర్హత?
    1) ఏ తరగతి పాఠ్యపుస్తకం తయారు చేస్తున్నాడో ఆ తరగతికి కనీసం అయిదేళ్ల బోధించిన అనుభవం ఉండాలి
    2) ఉపాధ్యాయ వృత్తిలో కనీసం 10 సంవత్సరాల అనుభవం ఉండాలి
    3) SCERTలో కనీసం 5 సంవత్సరాలు పని చేసిన అనుభవం అవసరం
    4) సర్వశిక్ష అభియాన్‌లో పనిచేసిన అనుభవంతో పాటు ఉపాధ్యాయ శిక్షణా కళాశాలలో రెండేళ్ల పని అనుభవం
29. కిందివాటిలో ఏది ప్రత్యక్ష అనుభవానికి దగ్గరగా ఉండే ఉపకరణం?
    1) రేఖీయ చిత్రం 2) రేడియో
    3) డయారమా 4) శబ్దిక చిహ్నం
30. 1959లో మొట్టమొదటి బిర్లా పారిశ్రామిక సాంకేతిక ప్రదర్శనశాలను ఎక్కడ స్థాపించారు?
    1) కోల్‌కతా 2) ముంబై
    3) అహ్మదాబాద్ 4) ఢిల్లీ
31. జీవశాస్త్ర ఉపాధ్యాయులు ఒకరు హెర్బేరియం ఉపయోగించి, మరొకరు మాతృక స్పెసిమన్‌ను ఉపయోగించి బోధించారు. వారు అందించిన అనుభవాలు వరుసగా..
    1) ప్రత్యక్ష, ప్రతినిధిత్వం
    2) ప్రతినిధిత్వం, ప్రతినిధిత్వం
    3) ప్రత్యక్ష, పరోక్ష 4) ప్రత్యక్ష, ప్రత్యక్ష
32. భావన ఏర్పడటానికి కనీసం రెండు కిందివాటిలో ఏవి కావాలి?
    1) నియమాలు 2) సిద్ధాంతాలు
    3) సత్యాలు 4) సాధారణీకరణలు
33. 'విజ్ఞానశాస్త్ర అంధయుగం'గా పేర్కొన్న శతాబ్దకాలాలు ఏవి?
    1) క్రీ.శ. 18-19 2) క్రీ.శ. 15-17
    3) క్రీ.శ. 16-18 4) క్రీ.శ. 12-14
34. ఇకో క్లబ్‌లు కిందివాటిలో దేనికి సంబంధించినవి?
    1) ఎయిడ్స్ 2) జలచరాల పరిరక్షణ
    3) పర్యావరణం
    4) అంతరించిపోతున్న జీవులు
35. కార్యాకారణ సంబంధం గుర్తించడం అనేది ఏ లక్ష్యానికి సంబంధించింది?
    1) జ్ఞానం 2) అవగాహన
    3) వినియోగం 4) నైపుణ్యం
36. అక్షయ తృతీయ రోజు బంగారం కొంటే శుభం కలుగుతుంది అని నమ్మే వ్యక్తిలో నెరవేరని లక్ష్యం ఏది?
    1) అవగాహన 2) అభిరుచి
    3) శాస్త్రీయ దృక్పథం 4) వినియోగం
37. ప్రయోగ పరికరాలు శుభ్రం చేయడం, భద్రపరచడం అనేవి మానసిక చలనాత్మక రంగ సోపానాల్లో దేనికి సంబంధించినవి?
    1) అనుకరణ 2) హస్తలాఘవం
    3) సమన్వయం 4) సహజీకరణ
38. అవగాహనలోని వివేచనం చేయడం అనే స్పష్టీకరణకు సంబంధించింది ఏది?
    1) రెండు అంశాల మధ్య భేదాలను గుర్తించడం
    2) పెద్ద అంశాన్ని చిన్న చిన్న అంశాలుగా విడగొట్టడం
    3) దశలవారీగా ఒక అంశం గురించి తెలుసుకోవడం
    4) లక్షణాల ఆధారంగా సమూహాలుగా చేయడం
39. విద్యార్థులు నమూనాలు తయారు చేయుడానికి సంబంధించి ఏ రకమైన పరీక్షలు నిర్వహించాలి?
    1) నిష్పాదన పరీక్ష 2) ప్రజ్ఞా పరీక్షలు
    3) సహజ సామర్థ్య పరీక్షలు
    4) అంచనా మాపని
40. ఉపాధ్యాయుడు ప్రొజెక్టర్‌ను ఉపయోగించి విద్యార్థులకు బోధించాడు. ఆయన ఉపయోగించిన బోధనా పద్ధతి?
    1) అన్వేషణ పద్ధతి 2) ఉపన్యాస పద్ధతి
    3) ప్రదర్శనా పద్ధతి 4) ప్రకల్పన పద్ధతి

సమాధానాలు

1) 2	2) 4	3) 1	4) 2	5) 2
6) 3	7) 4	8) 2	9) 3	10) 3
11) 4	12) 4	13) 3	14) 2	15) 4
16) 3	17) 3	18) 2	19) 2	20) 4
21) 3	22) 3	23) 1	24) 2	25) 3
26) 3	27) 4	28) 1	29) 3	30) 1
31) 2	32) 3	33) 4	34) 3	35) 2
36) 3	37) 2	38) 3	39) 1	40) 3

విద్య, ఉద్యోగ సమాచారం

ఐఎఫ్‌సీఐ, న్యూఢిల్లీలో అసోసియేట్ డైరెక్టర్ పోస్టులు

న్యూఢిల్లీలోని ఇండస్ట్రియల్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఐఎఫ్‌సీఐ).. ఒప్పంద ప్రాతిపదికన అసోసియేట్ డైరెక్టర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 03.
» అర్హత: సీఏ, బీటెక్/బీఈ, ఎంబీఏ(ఫైనాన్స్) లేదా తత్సమాన విద్యార్హతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి. వయసు: 30.06.2025 నాటికి 55 ఏళ్లు మించకూడదు.
» ఎంపిక విధానం: విద్యార్హతలు, షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఈమెయిల్ ద్వారా.
» ఈమెయిల్: contract@ifciltd.com
» దరఖాస్తులకు చివరితేది: 24.07.2025.
» వెబ్‌సైట్: https://www.ifciltd.com

నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌లో వివిధ పోస్టులు

న్యూఢిల్లీలోని నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఒప్పంద ప్రాతిపదికన కోర్టు ఆఫీసర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 02.
» పోస్టుల వివరాలు: కోర్టు ఆఫీసర్(ఇండోర్)-01, అసిస్టెంట్ రిజిస్ట్రార్(ఇండోర్)-01.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ(లా), పీజీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: 09.08.2025 నాటికి అసిస్టెంట్ రిజిస్ట్రార్‌కు 28 ఏళ్లు, కోర్టు ఆఫీసర్‌కు 25 ఏళ్లు ఉండాలి.
» వేతనం: నెలకు కోర్టు ఆఫీసర్‌కు రూ.45,000, అసిస్టెంట్ రిజిస్ట్రార్‌కు రూ.55,000.
» ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» దరఖాస్తులకు చివరితేది: 09.08.2025.
» వెబ్‌సైట్: https://nclt.gov.in

పారాదీప్ పోర్ట్ అథారిటీలో హిందీ అసిస్టెంట్ పోస్టులు

ఒడిశాలోని పారాదీప్ పోర్ట్ అథారిటీ(పీపీఏ) డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన హిందీ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 02.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. హిందీ టైపింగ్ వచ్చి ఉండాలి. మూడేళ్ల పని అనుభవం ఉండాలి.
» వయసు: 32 ఏళ్లలోపు ఉండాలి.
» వేతనం: నెలకు రూ.38,600 నుంచి 99,700.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ఆఫీస్ ఆఫ్ ది సెక్రటరీ, పారాదీప్ పోర్ట్ అథారిటీ, జగత్సింగ్‌పూర్ జిల్లా, ఒడిశా-754142 చిరునామాకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 22.07.2025.
» వెబ్‌సైట్: https://paradipport.gov.in

సురేశ్ టెండూల్కర్ కమిటీని ఎప్పుడు నియమించారు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ ఎకానమీ

ఏ దేశంలోనైతే అధిక జనాభా, పేదరికంతో బాధపడుతుంటారో ఆయా దేశాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగలేవని అర్థశాస్త్ర పితామహుడు ఆడమ్ స్మిత్ 1776లో **Wealth of Nations** గ్రంథంలో పేర్కొన్నాడు. ప్రపంచంలో రోజుకు ఒక డాలర్ కూడా ఆదాయం లభించని ప్రజానీకం సుమారు **1.2** బిలియన్లని అంచనా.

- ఎవరైతే కనీస జీవన ప్రమాణాన్ని పొందలేక పోతున్నారో వారిని పేదవారుగా పరిగణించవచ్చు. - ప్రపంచ బ్యాంకు.
- 'పేదరికం అనుభవించేవారి బాధను గుడ్డివారు కూడా చూడగలరు" - ఆర్థికవేత్త, నోబెల్ అవార్డు గ్రహీత అమర్త్యసేన్
- 'పేదరికమనే సముద్రపు దీవుల్లో మనం ఎంతమాత్రం సంతోషంగా జీవించలేం' - ఎం.ఎస్. స్వామినాథన్
- పేదరికం అత్యంత తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘన -జస్టిస్ కె.జి. బాలకృష్ణన్, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి

పోషకాహార లోపం, అనారోగ్యం, నిరక్షరాస్యత, నిరుద్యోగం వంటి మౌలిక సమస్యలతో అభివృద్ధి చెందుతున్న దేశాలు సతమతమవుతున్నాయి. ఆయా దేశాల్లో ఎంతో కొంత అభివృద్ధి జరిగినా, దాని ప్రతిఫలం మాత్రం అతి కొద్ది మందికే దక్కడం వల్ల ఆదాయ అసమానతలు అధికమవుతున్నాయి. దేశంలో భూమి, మూలధనం వంటి ఆస్తులు, ఆదాయ పంపిణీలో తీవ్రమైన అసమానతల వల్ల అధిక సంఖ్యాక ప్రజలు పేదరికానికి గురవుతున్నారు.

పేదరికాన్ని కేవలం ఆర్థికపరమైన సమస్యగానే కాకుండా సాంఘిక సమస్యగా కూడా పరిగణించాల్సి ఉంటుంది. మానవాభివృద్ధి నివేదిక ప్రకారం.. 'దీర్ఘకాలం ఆరోగ్యవంతమైన జీవితం గడిపేందుకు కావాల్సిన సౌకర్యాలు, స్వేచ్ఛ, స్వాభిమానం, ఇతరుల నుంచి గౌరవం కొరవడటమే పేదరికం'. 'అధిక పేదరికం, అధిక సంపదలు సమాజంలో వ్యక్తిత్వ వికాసానికి అడ్డంకి అవుతాయి, ప్రపంచంలో గొప్ప వ్యక్తిత్వం ఉన్న వ్యక్తులంతా మధ్య తరగతి నుంచి వచ్చినవారే. అందుకే ఆర్థిక శక్తులు సమానంగా, సంతులితంగా సమాజంలో సర్దుబాటు కావాలి' అని స్వామి వివేకానంద పేర్కొన్నారు.

పేదరికాన్ని రెండు రకాలుగా పేర్కొనొచ్చు. అవి..
1. నిరపేక్ష పేదరికం 2. సాపేక్ష పేదరికం.

1. **నిరపేక్ష పేదరికం:** దేశంలోని ప్రజలు కనీస అవసరాలు కూడా తీర్చుకోలేని, జీవనాధార వ్యయాన్ని కూడా చేయలేని పరిస్థితిని నిరపేక్ష పేదరికం అంటారు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఈ రకమైన పేదరికం ఉంటుంది.
2. **సాపేక్ష పేదరికం:** వివిధ వ్యక్తులకు లేదా గ్రూపులకు అందుబాటులో ఉన్న వనరులు, వేతనం, సంపద తదితర అంశాల ఆధారంగా దీన్ని లెక్కిస్తారు. సమాజంలో 5%. నుంచి 10% మంది సంపన్న వర్గాల ప్రజల జీవన ప్రమాణంతో పోల్చితే కింది స్థాయిలోని 5% నుంచి 10% ప్రజల జీవన ప్రమాణం తక్కువగా ఉంటుంది. సంపన్న వర్గంలోని ప్రజల ఆదాయాలతో పోల్చితే దిగువ వర్గంలోని వారి ఆదాయాలు తక్కువగా ఉన్నప్పటికీ వారు దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నవారు కాదు. అభివృద్ధి చెందిన దేశాల్లో ఈ రకమైన పేదరికం ఉంటుంది. దీన్ని లారెంజ్ వ్యతిరేక లేదా గిని గుణకం ద్వారా లెక్కిస్తారు.

భారతదేశం పేదరికం - అంచనాలు

స్వాతంత్ర్యానికి పూర్వం దాదాబాయ్ నౌరోజీ తన గ్రంథమైన "Poverty and Unbritish Rule in India" లో జైళ్లలోని ఖైదీల కనీస పౌష్టికాహారం ఆధారంగా పేదరికాన్ని అంచనా వేశారు. స్వాతంత్ర్యానంతరం అనేక మంది ఆర్థికవేత్తలు పేదరికాన్ని అంచనా వేశారు. వారిలో పి.డి. ఓఝా, దండేకర్, నీలకంఠ రాథ్, మిన్హాస్, పీకే బర్దన్, మాంటెక్‌సింగ్ ఆహ్లువాలియా, గౌరవదత్, రావెల్లిస్, లక్డవాలా (D.T. Lakdawala- Expert Group Chairman 1989) తదితరులు ముఖ్యులు.

1960 పూర్వం పేదరికానికి సంబంధించిన అంచనాల్లో వ్యత్యాసాలున్నాయి. ఆయా అంచనాలు వరుసగా.. మిన్హాస్ 37.1% , ఆహ్లువాలియా 56.5%, పీకే బర్దన్ 54% , దండేకర్, నీలకంఠ రాథ్ 40% (1968-69). ఈ వ్యత్యాసాలకు ప్రధాన కారణం వారు తీసుకున్న గణాంకాల్లో తేడా లేనప్పటికీ వారు గణించే పద్ధతుల్లో తేడా ఉండడమే.

- **పేదరిక రేఖ (Poverty Line):** ఒక వ్యక్తి జీవించడానికి కావాల్సిన కనీస జీవన వ్యయం ఆధారంగా పేదరిక రేఖను నిర్ణయిస్తారు. దీని కోసం ప్రణాళికా సంఘం 1989, సెప్టెంబర్‌లో డి.టి. లక్డవాలా అధ్యక్షతన నిపుణుల సంఘాన్ని నియమించింది. ఆ కమిటీ 1993 జూలైలో తమ నివేదికను సమర్పించింది. పౌష్టికాహార నిపుణుల సలహా మేరకు లభ్యమయ్యే కేలరీల శక్తిని బట్టి కనీస పోషకాహార స్థాయిని, గ్రామీణ ప్రాంతాల్లో 2400 కేలరీలు, పట్టణ ప్రాంతాల్లో 2100 కేలరీలను ప్రాతిపదికగా తీసుకొన్నారు.

1973-74ను ఆధార సంవత్సరంగా తీసుకొని నెలసరి తలసరి వినియోగ వ్యయాన్ని (Monthly Per Capita Consumption Expenditure - MPCE) గ్రామీణ ప్రాంతానికి రూ. 49, పట్టణ ప్రాంతానికి రూ. 56 నిర్ణయించారు. 2004-05కు గానూ గ్రామీణ ప్రాంతానికి రూ. 356.30, పట్టణ ప్రాంతానికి రూ.538.60, 2009-10 నాటికి గ్రామీణ ప్రాంతానికి (రోజుకు-రూ. 22.42) రూ. 672.80, పట్టణ ప్రాంతానికి (రోజుకు-రూ.28.65) రూ.859.60 నెలసరి తలసరి వినియోగ వ్యయాలుగా ఉన్నాయి. దీన్ని గమనిస్తే కాలానుగుణంగా నెలసరి తలసరి వినియోగ వ్యయం పెరుగుతూ వస్తున్నట్టు తెలుస్తోంది. మన దేశంలో ప్రతి ఐదేళ్లకోసారి నేషనల్ శాంపుల్ సర్వే ఆర్గనైజేషన్ Large Sample Survey ద్వారా కుటుంబం వ్యయాన్ని అంచనా వేస్తున్నారు.

నిపుణుల సంఘం 1973-74 నుంచి 1987-88 వరకు14 ఏళ్ల కాల వ్యవధిలో రూపొందించిన పేదరిక అంచనాలు కింది పట్టిక ద్వారా తెలుసుకోవచ్చు.

కింద టేబుల్‌ను పరిశీలిస్తే గ్రామీణ పేదరికం 56.4% నుంచి 39.1% నికి తగ్గగా, పట్టణ పేదరికం 49.2% నుంచి 40.1% నికి మాత్రమే తగ్గింది. 1987-88 నాటికి గ్రామీణ పేదరికం కంటే పట్టణ పేదరికమే ఎక్కువగా ఉంది. ఈ 14 ఏళ్ల కాలంలో మొత్తం పేదరికం 54.9% నుంచి 39.3% నికి తగ్గింది. అంటే పేదరికం 15.6% తగ్గగా సాలీనా ఇది 1.2% తగ్గింది.

1993లో లక్డవాలా అధ్యక్షతన పేదరికంపై నిపుణుల కమిటీని నియమించారు. ఈ కమిటీ రాష్ట్రాల మధ్య ఉండే ధరల వ్యత్యాసాన్ని బట్టి ఆయా రాష్ట్రాల ప్రత్యేక వినియోగ ధరల సూచీ ఆధారంగా పేదరికాన్ని లెక్కించాలని సూచించింది.

నేషనల్ శాంపుల్ సర్వే ఆర్గనైజేషన్.. వివిధ రౌండ్‌ల్లో ఇచ్చిన జనాభా శాతం, పేదరిక జనాభా వివరాలు..

- 50వ రౌండ్ (1993-94) పేదరికం 36% , పేదల జనాభా 32 కోట్లు
- 55వ రౌండ్ (1999-2000) పేదరికం 26%, పేదల జనాభా 26 కోట్లు
- 61వ రౌండ్ (2004-05) పేదరికం 27.5%, పేదల జనాభా 30 కోట్లు
- 66వ రౌండ్ (2009-10) పేదరికం 29.8%, పేదల జనాభా 35 కోట్లు

2004-05లో NSSO 61వ రౌండ్‌లో పేదరికాన్ని రెండు రకాలుగా లెక్కించారు. అవి..

1. **URP (Uniform Recall Period):** దీనిలో అన్ని వస్తువులపై చేసే వ్యయాన్ని 30 రోజుల రీకాల్ పద్ధతిలో తీసుకుంటారు. అంటే మొదటి నెలలో చేసిన వ్యయాన్ని ప్రతి నెలా చేస్తారని భావించి లెక్కిస్తారు.

2. **MRP (Mixed Recall Period):** ఇందులో తరచుగా కొనుగోలు చేయని వస్తువులైన వస్త్రాలు, పాదరక్షలు, మన్నిక గల వస్తువులు, విద్య, ఆరోగ్యం తదితర 5 రకాలవాటిపై చేసే వ్యయాన్ని 365 రోజులు ప్రాతిపదికపైన, మిగిలినవాటిని 30 రోజుల ప్రాతిపదికపైన పరిగణనలోకి తీసుకొని పేదరికాన్ని అంచనా వేశారు. 2004-05లో URP పద్ధతి ప్రకారం పేదరికం 27.5% కాగా, MRP పద్ధతి ప్రకారం 21.8% .

సంవత్సరం	గ్రామీణ పేదరికం మిలియన్లలో	పట్టణ పేదరికం మిలియన్లలో	మొత్తం పేదరికం మిలియన్లలో	గ్రామీణ పేదరిక శాతం	పట్టణ పేదరిక శాతం	మొత్తం పేదరిక శాతం
1973-74	261.3	60.3	321.6	56.4	49.2	54.9
1977-78	264.3	67.7	332.0	53.1	47.4	51.8
1983	251.7	75.3	327.0	45.6	42.2	44.8
1987-88	229.4	83.3	312.7	39.1	40.1	39.3



2012, మార్చి 19న ప్రణాళికా సంఘం NSSO 66వ రౌండ్ గణాంకాలను విడుదల చేసింది. పేదరిక రేఖ నిర్ధారణకు గ్రామీణ ప్రాంతంలో రూ. 672.80 నెలసరి వినియోగ వ్యయం (రోజుకు రూ. 22.40) కాగా, పట్టణ ప్రాంతంలో నెలసరి వినియోగ వ్యయం రూ. 859.60 (రోజుకు రూ.28.60)గా నిర్ణయించారు. దీని ప్రకారం 2009-10లో మన దేశంలో 29.8% జనాభా పేదరికంలో ఉంది. ఇందులో గ్రామీణ పేదరికం 33.8% కాగా, పట్టణ పేదరికం 20.9%గా నమోదైంది.

సురేశ్ టెండూల్కర్ కమిటీ

పేదరిక అంచనా పద్ధతిని సమీక్షించేందుకు నియమించిన సురేశ్ టెండూల్కర్ కమిటీ తన నివేదికను 2009లో ప్రభుత్వానికి సమర్పించింది. ఈ నివేదికలో కమిటీ పేదరిక రేఖను నిర్ణయించడానికి మన్నిక గల వస్తువులతోపాటు విద్య, ఆరోగ్యంపై చేసే వ్యయాన్ని కూడా పరిగణనలోనికి తీసుకోవాలని, పేదరిక రేఖను నిర్ణయించడానికి కేలరీల బదులు జీవన వ్యయ సూచీని ఉపయోగించాలని సిఫార్సు చేసింది. వాటితోపాటు ప్రస్తుతమున్న Uniform Recall Period బదులు Mixed Recall Period పద్ధతిని అనుసరించాలని పేర్కొంది. 2004-05గాను నెలసరి తలసరి వినియోగ వ్యయం గ్రామాల్లో రూ.446.68 కాగా, పట్టణాల్లో రూ. 578.80. దీని ప్రకారం గ్రామీణ పేదరికం 41.8%గా, పట్టణ పేదరికం 25.7%గా నమోదైంది. భారతదేశ పేదరికాన్ని 37.2%గా లెక్కించారు.

- ప్రస్తుతం ప్రణాళిక సంఘం అనుసరిస్తున్న సురేశ్ టెండూల్కర్ కమిటీ సూచించిన పేదరిక అధ్యయన పద్ధతిని సమీక్షించేందుకు 2012లో రంగరాజన్ అధ్యక్షతన కమిటీని నియమించారు. ఈ కమిటీ తన రిపోర్టులో ప్రతి పది మందిలో ముగ్గురు పేదరికంలో ఉన్నట్లు అంచనా వేసింది. దాంతోపాటు సురేశ్ టెండూల్కర్ కమిటీ నిర్ణయించిన పట్టణ రోజువారీ వినియోగ వ్యయాన్ని రూ. 33 నుంచి రూ. 47లకు, గ్రామీణ రోజువారీ వినియోగ వ్యయాన్ని రూ.27 నుంచి రూ.32 లకు పెంచింది.

- సురేశ్ టెండూల్కర్ కమిటీ ప్రకారం 2011-12 లో పేదరిక జనాభా 21.9% కాగా, రంగరాజన్ కమిటీ ప్రకారం 29.5%. రెండు కమిటీలు తీసుకున్న రోజువారీ, నెలవారీ, తలసరి వినియోగ వ్యయ వ్యత్యాసాలను ఈ కింది పట్టికలో గమనించవచ్చు.

కమిటీ	సంవత్సరం	రోజువారీ తలసరి వినియోగ వ్యయం		నెలవారీ తలసరి వినియోగ వ్యయం		సగటు కుటుంబ నెలవారీ వినియోగ వ్యయం	
		గ్రామీణ	పట్టణ	గ్రామీణ	పట్టణ	గ్రామీణ	పట్టణ
రంగరాజన్	2011-12	32.4	46.9	972	1407	4760	7035
	2009-10	26.7	39.9	801	1198	4005	5990
టెండూల్కర్	2011-12	27.2	33.3	816	1000	4080	5000
	2009-10	22.4	28.7	673	860	3365	4300

Towards which direction is A from R?

BANK EXAMS
REASONING

MODEL QUESTIONS

Directions (Q. No. 1-5): In each question below are given two statements followed by two conclusions numbered I and II. You have to take the given statements to be true even if they seem to be at variance with commonly known facts and then decide which of the given conclusions logically follows from the given statements, disregarding commonly known facts.

Give answer:
1) If only conclusion I follows
2) If only conclusion II follows
3) If either conclusion I or II follows
4) If neither conclusion I nor II follows
5) If both conclusions I and II follow

1. Statements:
All doctors are graduates.
All professors are graduates.
All engineers are graduates.
Conclusions:
I) Some professors can be doctors.
II) Some engineers may be doctors.

2. Statements:
Some cats are pens.
Some pens are big.
Some big are costly.
Conclusions:
I) No cat is costly.
II) Some big are definitely not cats.

3. Statements:
Some Benches are magazines.
All magazines are novels.
Some novels are papers.
Conclusions:
I) All benches being magazines is a possibility.
II) All papers being novels is a possibility.

4. Statements:
All cats are fans.
All fans are guns.
Some guns are hats.
Conclusions:
I) No fan is hat.
II) Some fans are hats.

5. Statements:
All tables are rats.
Some rats are chairs.
Some chairs are desks.
Conclusions:
I) Some desks are not tables.
II) All desks are tables.

Directions (Q. No. 6 - 10): Each of the questions below consists of a question and two statements marked I and II given below it. You have to decide whether the data provided in the statements are sufficient to answer the question. Read both the statements and

Give answer:
1) If the data in statement I alone are sufficient to answer the question, while the data in statement II alone are not sufficient to answer the question.
2) If the data in statements I alone are not sufficient to answer the question, while the data in statement II alone are sufficient to answer the question.
3) If the data either in statement I or in statement II alone are sufficient to answer the question.
4) If the data even in both the statements I and II together are not sufficient to answer the question.
5) If the data in both statements I and II together are needed to answer the question.

6. Towards which direction is A from R?
I) A is exactly to the south east of M.
II) R is exactly to the south of M.

7. How many daughters does A have?
I) P and Q are the only daughters of B.
II) D is brother of P and son of A.

8. Among P, Q, R, S and T sitting in a straight line facing north, who sits exactly in the middle of the line?
I) P sits third to the left of S. T is second to the left of R and an immediate neighbour of S.
II) P is second to the left of T who is second to the left of R.

9. Who amongst P, Q, R, S, T and U is the tallest?
I) P is taller that S and T but shorter than R. Q is taller than R.
II) T is taller than S. P is not the tallest.

10. Is C the grandmother of M?
I) C is the mother of D. D is the brother of M's father.
II) M is son of N, who is daughter of C.

Directions (Q. No. 11-15): Read each statement carefully and answer the following questions:

11. Which of the following expressions will be true if the expression D ≥ E > F, R ≥ B >T = D is definitely true?
1) R ≥ D 2) B ≥ D 3) F > R 4) T > F 5) R ≥ E

12. which of the symbols should be placed in the blank space from left to right respectively to complete the expression in such a manner that T > B, C > T and D > F are definitely true?
D ≤ T _ X, D _ B, C _ X, F _ B
1) <, >, < 2) >, >, <
3) =, <, > 4) =, <, <
5) >, =, <

13. Which of the following symbols should replace the question mark (?) in the given expression to make the expression A > N and K ≥ N definitely true?
A ? K ≥ L ? M ? N < O
1) <, >, = 2) >, ≥, =
3) >, ≤, ≥ 4) >, =, ≤
5) None of these

14. which of the following symbols should be placed in the blank spaces respectively from left to right to complete the given expression in such a manner that the expression B > W is definitely false and the expressions Z ≥ B and Y ≥ V are definitely true?
Z _ Y _ X ≥ W = V _ B
1) ≥, ≥, ≥ 2) ≤, ≤, ≥
3) >, ≥, > 4) ≥, =, <
5) None of these

15. In which of the following expressions is 'P > Q' not definitely true?
1) Q > C ≤ R < P
2) Q ≤ R < S ≤ P
3) P > S = T ≥ Q
4) P > S = T ≥ Q
5) None of these

Directions (Q. No. 16–20): Study the following information carefully and answer the given questions.

A word and number arrangement machine when given an input line of words and numbers rearranges them following a particular rule in each step. The following is an illustration of input and rearrangement:
Input: desk caring 32 18 today for 58 78
Step I: 18 desk caring 32 today for 58 78
Step II: 18 today desk caring 32 for 58 78
Step III: 18 today 32 desk caring for 58 78
Step IV: 18 today 32 for desk caring 58 78
Step V: 18 today 32 for 58 desk caring 78
Step VI: 18 today 32 for 58 desk 78 caring
And Step VI is the last step.

As per the rules followed in the above steps, find out in each of the following questions the appropriate Step for the given input.

16. Input: year 24 far 32 17 12 wide goal
Which of the following will be Step V of the above input?
1) 12 year 17 wide 24 goal 32 far
2) 12 year 24 wide far 32 17 goal
3) 12 year 24 far 32 17 wide goal
4) There will be no such step
5) None of these

17. Step IV of an input: 13 honk 29 father 83 76 door eye. Which of the following will be Step VI?
1) 13 honk 29 father 76 door 83 age
2) 13 honk 29 father 76 age 83 door
3) 13 honk 29 father 76 83 door age
4) 13 honk 29 father 76 eye 83 door
5) None of these

18. Step III of an input: 17 water 32 85 73 tax break home. How many more steps will be required to complete the rearrangement?
1) Five 2) Four
3) Six 4) Two
5) Three

19. Step III of an input: 37 xmas 42 61 53 violet green red. How many more steps will be required to complete the rearrangement?
1) 3 2) 4 3) 5 4) 6
5) None of these

20. Step II of an input: 28 sure 72 63 height over 42 lamp. Which of the following is definitely the input?
1) height 28 sure 72 63 over 42 lamp
2) 72 63 28 sure height over 42 lamp
3) 63 28 sure 72 height over 42 lamp
4) Cannot be determined
5) None of these

Solutions

1. As the given statements are affirmative both the positive possibilities follow. **Ans: 5**
2. As the given statements are affirmative both the negative definite conclusions don't follow. **Ans: 4**
3. As the given statements are affirmative both the positive possibilities follow. **Ans: 5**
4. Both the conclusions form a complementary pair. So, either I or II follows. **Ans: 3**
5. Both the conclusions form a complementary pair. So, either I or II follows. **Ans: 3**
6. The distance between A and M as well as between R and M is not given. Hence, we cannot find out the direction. **Ans: 4**
7. By combining both the statements, it can be concluded that A and B are married couple, and P and Q are the only daughters of A and B. **Ans: 5**
8. Either statement I or statement II is sufficient to answer the question. **Ans: 3**
P Q T S R
9. Only statement I is sufficient.
Q > R > P > S & T **Ans: 1**
10. Only statement I is sufficient. C's gender is not known in the second statement. **Ans: 1**

(11-15) Answers: 11) 4; 12) 1; 13) 2; 14) 1; 15) 1.

(16-20): The illustration clearly shows that numbers and words are arranged alternatively in such a way that numbers in ascending order and words in reverse order.

16. Input: year 24 far 32 17 12 wide goal
Step I: 12 year 24 far 32 17 wide goal
Step II: 12 year 17 24 far 32 wide goal
Step III: 12 year 17 wide 24 far 32 goal
Step IV: 12 year 17 wide 24 goal far 32
Step V: 12 year 17 wide 24 goal 32 far **Ans: 1**

17. Step IV: 13 honk 29 father 83 76 door eye
Step V: 13 honk 29 father 76 83 door eye
Step VI: 13 honk 29 father 76 eye 83 door **Ans: 4**

18. Step III: 17 water 32 85 73 tax break home
Step IV: 17 water 32 tax 85 73 break home
Step V: 17 water 32 tax 73 85 break home
Step VI: 17 water 32 tax 73 home 85 break
To complete the rearrangement there will be 3 more steps. **Ans: 5**

19. Step III: 37 xmas 42 61 53 violet green red
Step IV: 37 xmas 42 violet 61 53 green red
Step V: 37 xmas 42 violet 53 61 green red
Step VI: 37 xmas 42 violet 53 red 61 green
Hence to complete the rearrangement 3 more steps will be required. **Ans: 1**

20. Previous steps cannot be determined. **Ans: 4**